శనివారం 10-2-2018



‘ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10

సంచిక: 320

సెన్సెక్స్ 407 పాయింట్లు డౌన్



- 34,006 పాయింట్లకు సెన్సెక్స్
- 122 పాయింట్ల నష్టంతో 10,500 దిగువకు నిఫ్టీ
- మళ్లీ అమెరికా మార్కెట్లో అలజడి
- పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్

- బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

4 ఏళ్లు మౌనం.. 4 రోజులు నాటకం

టీడీపీ పోరాటం వెనుక మభ్యపెట్టే ఆరాటం

- కేంద్రంలో భాగస్వామిగా ఉండి కేంద్రంపైనే పోరాటమంటూ హంగామా
- ప్రజల్లో వ్యతిరేకతను చల్లార్చేందుకు, స్వప్రయోజనాల కోసం మాయనాటకాలు
- కేంద్ర బడ్జెట్‌ను మంత్రివర్గంలో ఆమోదించి, పార్లమెంటులో పోరాటం!
- బడ్జెట్‌పై ఇప్పటివరకూ అధికారికంగా నోరుమెదపని చంద్రబాబు
- పోరాటం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే యత్నం
- రోజురోజుకూ మహాడ్రామాలతో రక్తి కట్టిస్తున్న టీడీపీ ఎంపీలు



సాక్షి, అమరావతి

పార్లమెంటు సాక్షిగా రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి, రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డైరక్షన్‌లో టీడీపీ ఎంపీలు గత వారం రోజులుగా సాగిస్తున్న డ్రామా పతాకస్థాయికి చేరింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజునుంచీ పార్లమెంటు వెలుపలా, లోపలా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రతిపక్షాలు పిలుపునిచ్చిన బంద్‌లోనూ టీడీపీ అనుసరించిన వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజులపాటు పోరాటం చేస్తున్నామంటూ భ్రమ కల్పించడం తప్ప కేంద్రం నుంచి కనీసం ఒక్కటంటే ఒక్క హామీనైనా సాధించలేకపోవడంపై ధ్వజమెత్తుతున్నారు. దీనికి కారణం రాష్ట్ర ప్రయోజనాలపై ముందుండి

మిగతా 6వ పేజీలో ▶

పతాక స్థాయికి లీకులు

హామీల అమలుకు జైట్లీ అంగీకరించారంటూ ప్రచారం

- సభలో ఇవ్వని హామీలు ప్రైవేట్ భేటీలో ఇచ్చేశారని హడావుడి
- పోరాటం డ్రామా ఫలించక కొత్తపాట

2లో

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

- హాజరు కానున్న అగ్రనేతలు
- ప్రజా సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చ
- మూడు రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమాలు
- మహాసభల్లో నూతన కార్యవర్గం ఎన్నిక
- అరుణ పతాకాలతో ఎరుపెక్కిన భీమవరం

6లో

హోదా వద్దనటానికి మీరెవరు?



విభజన హామీలు నెరవేర్చాలంటూ శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

చట్టబద్ధమైన దాన్ని వదులుకునే హక్కు ఎవరిచ్చారు?

టీడీపీపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ ఎంపీలు

- లోక్‌సభలో కొనసాగిన వైఎస్సార్ పీపీ ఆందోళన
- వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన
- పార్లమెంట్ ఆవరణలోనూ ధర్నా
- లోక్‌సభ సమావేశాలు మార్చి 5వ తేదీకి వాయిదా

2లో





గ్రీన్‌కార్డుల్లో జాప్యానికి ముగింపు!

- డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిస్తున్న వలస విధానం అమల్లోకి వస్తే.. నిపుణులైన ఉద్యోగులకు గ్రీన్‌కార్డుల జారీలో జాప్యానికి తెరపడనుందని వైట్‌హౌస్ పేర్కొంది. ఒక్కో దేశానికి కోటా ప్రకారం గ్రీన్‌కార్డుల కేటాయింపుల్ని రద్దు చేయాలని భారతీయ హెచ్–1బీ వీసాదారులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

8లో



పాక్ ఉచ్చులో ఐఏఎఫ్ అధికారి

- అశ్లీల చిత్రాలకు బదులుగా ఐఎస్ఐకి భారత రహస్య సమాచారం చేరవేత
- అరెస్ట్ చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు.. దోషిగా తేలితే అరుణ్‌కు 14 ఏళ్ల వరకూ జైలుశిక్ష

ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్స్ లింక్!

- రాష్ట్రంలో అనుసంధాన ప్రక్రియ ప్రారంభం
- నకిలీ, డూప్లికేట్ లైసెన్స్‌లకు అడ్డుకట్ట
- సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న కేంద్ర రవాణా శాఖ



సాక్షి, అమరావతి: అన్ని రకాల వాహనాలను విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)తో అనుసంధానించే ప్రక్రియను రాష్ట్ర రవాణా శాఖ ఇప్పటికే 80 శాతం పూర్తి చేసింది. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆధార్‌తో అనుసంధానించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ అనుసంధానం ద్వారా నకిలీ డ్రైవింగ్ లైసె న్స్‌లకు చెక్ పెట్టాలని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ద్విచక్రవాహనాలు, కార్లకు

మిగతా 6వ పేజీలో ▶

హోదా వద్దనటానికి మీరెవరు?

చట్టబద్ధమైన దాన్ని వదులుకునే హక్కు ఎవరిచ్చారు? • టీడీపీపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ ఎంపీలు


సాక్షి, న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చేస్తామని రాష్ట్ర విభజన సమయంలో స్వయంగా నాటి ప్రధాని హామీ ఇస్తే.. ఇప్పుడు దాన్ని వదులుకునే హక్కు టీడీపీకి ఎవరిచ్చారని వైఎస్సార్ సీపీ ఎంపీలు ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం పార్లమెంటు ఆవరణలో పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వైఎస్ అవినాష్‌రెడ్డి, వి.విజయసాయిరెడ్డి ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. హోదా వచ్చే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

సభలో వైఎస్సార్ సీపీ ఎంపీల నిరసన..

ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, వైఎస్ అవినాష్‌రెడ్డి వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో టీడీపీ ఎంపీలు కూడా వెల్‌లో నినాదాలు చేశారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ పార్లమెంటు ఆవరణలో పోతరాజు విన్యాసాలు ప్రదర్శించి అదే వేషంతో సభలోకి రావటంతో.. 'ప్రతి రోజూ ఇలా చేయడం సరికాదు..' అంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సభ 12 గంటలకు తిరిగి ప్రారంభం కాగా వైఎస్సార్ సీపీ ఎంపీలు నిరసన కొనసాగించారు. అనంతరం 12.10 సమయంలో స్పీకర్ సభను మార్చి 5వ తేదీకి వాయిదా వేశారు.





'టీడీపీ ప్రత్యేక హోదా ఊసే మరచిపోయింది. ' ఎంత దారుణమంటే.. వాళ్ల (టీడీపీ) ఎంపీ లోక్‌సభలో మాట్లాడుతూ ప్యాకేజీ ఇస్తామంటే ప్రత్యేక హోదా వదిలేశామని అన్నారు. ప్రత్యేక హోదా వదిలేసేందుకు మీకు అధికారం ఎవరిచ్చారు? రాష్ట్ర ప్రజలు వద్దన్నారా? వీళ్లెవరు హోదా వదిలేయడానికి? ప్రత్యేక హోదా ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు. కలిసి వచ్చే అన్ని పార్టీలతో ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ పోరాడుతోంది. టీడీపీకి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నుంచి వైదొలగాలి. కేంద్రంలో భాగస్వామిగా ఉంటూ పార్లమెంటులో, బయటా ప్లకార్డులు పట్టుకుని నిరసన ఎలా తెలియజేస్తారు?'
– ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



'టీడీపీ సభ్యుల్లా మేం చిత్తశుద్ధి లేకుండా ప్రవర్తించం. నిరసన అంటే నిరసనే. నిబంధన అంటే నిబంధనే. మేం నమ్మిన సిద్ధాంతాల మేరకు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు మా పోరాటం కొనసాగుతుంది..'
–ఎంపీ విజయసాయిరెడ్డి

టీడీపీ చిత్తశుద్ధి తేటతెల్లమైంది. కేంద్రం నుంచి వైదొలగినా ప్రజలు ఆ పార్టీని నమ్మరు.
– ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి





ఏపీకి చట్టం ప్రకారం కేబీకే, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇవ్వాలి.
– ఎంపీ వరప్రసాదరావు



'ప్రత్యేక హోదా కోసం నాలుగేళ్లుగా చిత్తశుద్ధితో పోరాడుతున్నాం. మేం ఎన్నికల కోసం పోరాటం చేయడం లేదు. ప్రత్యేక హోదాపై టీడీపీ రాజీ పడి ప్యాకేజీకి ఒప్పుకొంది. ఇప్పుడు కూడా రాజీపడుతోంది..'
–ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఏమిటీ అ'న్యాయం'?

- టీడీపీ ఎంపీలు న్యాయం చేయాల్సిన స్థానంలో ఉండి న్యాయం చేయమని అనటమేంటి?
- ఏపీకి తక్షణమే హోదా ఇచ్చి హామీలు నెరవేర్చాలి
- రాజ్యసభలో ఎంపీ వి.విజయసాయిరెడ్డి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి జరగటం అసాధ్యమని వైఎస్సార్ సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతూ రాష్ట్రానికి న్యాయం చేయాల్సిన స్థానంలో ఉన్న టీడీపీ ఎంపీలే న్యాయం కావాలని డిమాండ్ చేయటం ఏమిటని నిలదీశారు. ఏపీకి తక్షణమే హోదా ప్రకటించి విభజన హామీలను నెరవేర్చాలని రాజ్యసభలో వెల్‌లో నిలబడి ప్లకార్డును ప్రదర్శించారు. తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని సభాపతి స్థానంలో ఉన్న బస్వరాజ్ పాటిల్‌ను కోరి రెండు నిమిషాలు మాట్లాడారు.

హోదా ఏపీ జీవరేఖ

'ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలులో అన్యాయం జరుగుతోంది. ప్రత్యేక హోదా నూతన ఆంధ్రప్రదేశ్‌కు జీవరేఖ. దీనికి ప్రత్యామ్నాయం లేదు. ప్రత్యేక ప్యాకేజీ.. ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం కానే కాదు. హోదా ఇవ్వనంతవరకు ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందదు. రెండో ముఖ్యవిషయం రైల్వే జోన్. రైల్వే శాఖ మంత్రి మొన్న సభలో చేసిన ప్రకటన ద్వారా తప్పుదోవ పట్టించారు. రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధిత భాగస్వాములతో చర్చించాలని చట్టంలో లేదు. రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని నిర్దిష్టంగా ఉంది. చట్టంలో స్పష్టంగా ఉన్నప్పుడు ఎందుకీ జాప్యం? ఇతర రాష్ట్రాలతో, భాగస్వాములతో చర్చిస్తామనడం సరికాదు. కడపలో సమీకృత స్టీలు ప్లాంటు, దుగరాజపట్నం పోర్టు, వైజాగ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, వైజాగ్ చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ, విజయవాడ మెట్రో రైలు, ఇలా అనేక ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. 11 జాతీయ విద్యా సంస్థలకు గాను 9 సంస్థలను తాత్కాలిక ప్రాంగణాల్లో ప్రారంభించారు. నాలుగేళ్లుగా వీటికి అరకొరగా కేటాయింపులు జరుపుతున్నారు. వీటన్నింటినీ పరిష్కరించాల్సి ఉంది..' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

'దేశంలో 49 శాతం ఉపాధిని వ్యవసాయ రంగం అందిస్తోంది. జీడీపీలో 16 శాతం వాటా వ్యవసాయ రంగానిదే. వ్యవసాయం నుంచి లభించే ఏ ఆదాయమైనా పన్ను నుంచి మినహాయించాలి' అని విజయసాయిరెడ్డి చెప్పారు.

'కేబినెట్ మంత్రి సహచర కేబినెట్ మంత్రికి సలహా ఇవ్వొచ్చు అని నిన్న రాజ్యసభ ఛైర్మన్ రూలింగ్ ఇచ్చారు. ఒక మంత్రి ఇంకొక మంత్రికి హామీ ఇవ్వవచ్చా? పైగా ఇద్దరూ సహాయ మంత్రులే అయినప్పుడు? కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయ మంత్రి ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నానని తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని ముగించారు. ఆయన ప్రభుత్వంలో భాగమా కాదా? ప్రభుత్వంలో భాగమే అయితే ఆయన్ను రాజీనామా చేయమనండి. అప్పుడు ప్రభుత్వాన్ని న్యాయం చేయాలని అడగమనండి' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

ఎన్నికల భయంతో టీడీపీ డ్రామాలు

- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ ఎంపీలు
- నాలుగేళ్లుగా విభజన హామీలపై పోరాడకుండా టీడీపీ నాటకాలు
- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకున్నా కేంద్రంలో ఎందుకు కొనసాగారు?
- హామీలు సాధించుకోకుండా అధికారాన్ని అనుభవించారు
- చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు
- టీడీపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేయాలి

సాక్షి, న్యూఢిల్లీ

కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏపీకి ఇచ్చిన హామీల అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోగా పాత పాటే పాడడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర నిరాశ చెందారని వైఎస్సార్ సీపీ ఎంపీలు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగుతున్న టీడీపీ రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసగించిందని, ఎన్నికల భయంతో ఇప్పుడు డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. శుక్రవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం వైఎస్సార్ సీపీ లోక్‌సభా పక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ అలుపెరగని పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. కేంద్రానికి ఇదే చివరి పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో కనీసం ఈ ఏడాదైనా ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ దుగరాజట్నం పోర్టు లాంటి హామీల అమలుపై స్పష్టత ఇస్తుందని ఆశించామన్నారు.

ఎన్డీఏ నుంచి తప్పకున్నా టీడీపీని విశ్వసించరు

విభజన హామీలు అమలు చేయాలని పార్లమెంట్ టీడీపీ ప్రదర్శిస్తున్న డ్రామాలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైఎస్సార్ సీపీ ఎంపీలు వ్యాఖ్యానించారు. నాలుగేళ్లుగా విభజన హామీలపై పోరాడని టీడీపీ ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడడంతో నాటకాలు ఆడుతోందని మేకపాటి విమర్శించారు. టీడీపీ నాలుగేళ్లుగా అధికారం పంచుకొని ఇప్పుడు కేంద్రం నుంచి బయటకు వచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. టీడీపీకి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ఏపీకి ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని గతంలో కేంద్రం ప్రకటన చేసిన మరుక్షణమే టీడీపీ బయటకు రావాల్సిందన్నారు. టీడీపీ నాటకాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ప్రకటించారు. హామీల సాధన కోసం నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ డ్రామాలను నమ్మరు: ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

ఏపీకి ఇచ్చిన హామీల అమలుపై 15 రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని లేదంటే వచ్చే సమావేశాల్లో రెండు గంటలపాటు చర్చకు అనుమతించాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరి కోరడం ద్వారా రాష్ట్ర ప్రయోజనాల పట్ల టీడీపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలిపోతోందని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. ప్రత్యేక హోదా ఇవ్వకున్నా కేంద్ర ప్రభుత్వంలో ఇన్నాళ్లూ ఎందుకు కొనసాగారని ప్రశ్నించారు. కేంద్రం ఎలాంటి స్పష్టత ఇవ్వకున్నా టీడీపీ సభ్యులు ఆందోళన విరమించారన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో టీడీపీ ఎంపీలు ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు.

చేతకాకపోతే కొనసాగడం ఎందుకు?

విభజన హామీలను సాధించుకోవడం చేతకాకపోతే కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా కొనసాగడం ఎందుకని ఎంపీ వరప్రసాదరావు ప్రశ్నించారు. అధికార దాహంతో నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతూ అధికారాన్ని అనుభవిస్తూ డ్రామాలు అడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమేకాకుండా విభజన హామీలను సాధించటంలో టీడీపీ దారుణంగా విఫలమైందని విమర్శించారు.

రాజ్యసభలోనూ జైట్లీ అదే పాట

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో చేసిన ప్రకటననే శుక్రవారం రాజ్యసభలో మళ్లీ చదివారు. ''రాష్ట్ర విభజన కారణంగా నూతన ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున న్యాయం చేయాల్సి ఉంది. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పలు నిబంధనలు పొందుపరిచారు. ఇందులో కొన్ని అమలయ్యాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పలు సంస్థలు ఏర్పాటుచేశాం. రాజధాని నిర్మాణానికి నిధులిచ్చాం. వెనకబడిన జిల్లాలకు నిధులు అందజేశాం. పోలవరం ప్రాజెక్టుకు నాబార్డు ద్వారా నిధులిచ్చాం. ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్లపాటు ప్రత్యేక సాయం చేయడానికి కేంద్రం అంగీకరించింది. ఎక్స్‌టెర్నల్లీ ఎయిడెడ్ ప్రోగ్రామ్(ఈఏపీ) ద్వారా నిధులు ఇవ్వాలని తొలుత నిర్ణయం జరిగింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం దీనికి ప్రత్యామ్నాయంగా మరో సూచన చేసింది. ఈ ప్రక్రియ పురోగతిలో ఉంది. రెవెన్యూ లోటుకు సంబంధించి రూ.3,979 కోట్లు ఇచ్చాం. మరికొంత ఇచ్చే అంశంపై తుది నిర్ణయానికి రావాల్సి ఉంది. దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, ప్రత్యేక రైల్వేజోన్, పారిశ్రామిక కారిడార్లు తదితర అంశాలపై ఆయా శాఖలు త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాం. ఇవన్నీ తుది దశలో ఉన్నాయి'' అని అరుణ్ జైట్లీ పునరుద్ఘాటించారు.

పతాక స్థాయికి లీకులు

- హామీల అమలుకు జైట్లీ అంగీకరించారంటూ ప్రచారం
- సభలో ఇవ్వని హామీలు ప్రైవేట్ సమావేశంలో ఇచ్చేశారని హడావుడి
- పోరాటం డ్రామా ఫలించక కొత్తపాట

సాక్షి, అమరావతి

తెలుగుదేశం పార్టీ లీకుల డ్రామా శుక్రవారం రాత్రి పతాక స్థాయికి చేరింది. పార్లమెంట్ వాయిదా పడిన తర్వాత జరిగిన ఒక సమావేశంలో విభజన హామీలన్నింటినీ అమలు చేసేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అంగీకరించారంటూ ఆ పార్టీ కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. అయితే ప్రధాని మోదీ, జైట్లీ రెండుసార్లు పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాల్లో ఎక్కడా విభజన హామీలు అమలు చేస్తామని చెప్పలేదు. జైట్లీ పార్లమెంట్‌లో రెండుసార్లు మాట్లాడినప్పుడు ఇవ్వని హామీలను సభ వాయిదా పడిన తర్వాత జరిగిన సాధారణ సమావేశంలో ఇచ్చేసినట్లు శుక్రవారం అర్ధరాత్రి టీడీపీ అనుకూల మీడియాలో ఊదరగొట్టారు. పోరాటం పేరుతో పార్లమెంట్‌లో ఎంత హడావుడి చేసినా అదంతా డ్రామాయేనని పసిగట్టిన కేంద్రం టీడీపీని పట్టించుకోలేదు. ఏపీకి సాయం చేస్తున్నామనడమే తప్ప కొత్తగా జైట్లీ ఏమీ చెప్పలేదు. ఈ నేపథ్యంలో తమ డ్రామా విఫలమైందని గ్రహించిన చంద్రబాబు శుక్రవారం రాత్రి మరో నాటకానికి తెరలేపారు.

ఇవీ లీకులు...

విభజన హామీలన్నీ అమలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని టీడీపీ నేతలు లీకులు వదిలారు. రాజ్యసభ వాయిదా పడిన తర్వాత కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పియూష్ గోయల్, అమిత్‌షాలు సుజనా చౌదరితో అత్యవసరంగా సమావేశమై, టీడీపీ చేసిన అన్ని డిమాండ్లను ఒప్పుకున్నట్లు లీకులిచ్చారు. రెవెన్యూ లోటు (2014–15లో పది నెలలకు) భర్తీకి, ప్రత్యేక ప్యాకేజీ నిధులన్నింటినీ ఒకేసారి ఇచ్చేందుకు, ఈఏపీ నిధులు సర్దుబాటు చేసేందుకు అంగీకరించినట్లు ప్రచారం చేశారు. దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి ఇస్రో అభ్యంతరం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మరోచోట నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చినట్లు, పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 12 శాతం నుంచి సాధ్యమైనంత ఐఆర్ తగ్గించుకోవాలని చమురు సంస్థలకు ఆదేశాలు జారీ చేయడానికి అంగీకరించినట్లు ప్రచారం మొదలుపెట్టారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వేజోన్ ఏర్పాటుపైనా ప్రకటన చేస్తామని, రాజధాని అమరావతి నిర్మాణానికి చేసిన ఖర్చుల వివరాలు పంపితే వెంటనే నిధులు విడుదల చేస్తామని జైట్లీ చెప్పినట్లు వల్లెవేశారు. అయితే పార్లమెంట్‌లో ఇవ్వని హామీలను ప్రైవేట్ సమావేశంలో జైట్లీ ఒప్పుకున్నారని ప్రచారం చేయడంపై టీడీపీ వర్గాలే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. నాలుగేళ్లుగా ఇవ్వని వాటిని రాత్రికి రాత్రి, అదీ మోదీ విదేశాలకు వెళ్లిన సమయంలో ఇచ్చేందుకు జైట్లీ సాహసిస్తారా? అని వ్యాఖ్యానిస్తున్నాయి.

నిధులు వస్తేనే ప్రజలు నమ్ముతారు: సీఎం రమేష్

అరుణ్ జైట్లీ, అమిత్‌షా, పీయూష్ గోయల్‌తో చర్చించామన్న టీడీపీ ఎంపీ సీఎం రమేష్ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ... పలు అంశాలపై చర్చలు జరిగినా నిధులు వచ్చేంత వరకూ నమ్మకం లేదన్నారు. అవి వచ్చినప్పుడే ప్రజలు నమ్ముతారని చెప్పారు. అప్పటివరకూ వేచి చూడాల్సి ఉందన్నారు.

టీడీపీ మంత్రులకు క్యాబినెట్ అంశాలు తెలియవా?

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శ



రాజంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై టీడీపీ డ్రామా ఆడుతోందని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ జిల్లా రాజంపేటలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం కేబినెట్ ఆమోదంతోనే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతుందని.. మరి కేంద్ర కేబినెట్‌లో సభ్యులుగా ఉన్న టీడీపీ మంత్రులకు బడ్జెట్ అంశాలు అప్పుడు తెలియవా అని మిథున్‌రెడ్డి ప్రశ్నించారు. టీడీపీ ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజంపేట ఆర్‌యూబీ నిర్మాణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వడంలో జాప్యం చేస్తోందని.. అవసరమైతే తన నిధుల నుంచి కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ఎంపీని కలిసిన సీపీఐ జిల్లా కార్యదర్శి: ఆకేపాటి స్వగృహంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య ఎంపీ మిథున్‌రెడ్డితో భేటి అయ్యారు. జిల్లాలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కథానిలయం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కమ్యూనిస్టు నేత తరిమల నాగిరెడ్డి పుస్తకాన్ని ఎంపీకి బహూకరించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి మహేశ్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'విద్యుత్' దోపిడీ!

- ప్రజా సంపదను లూటీ చేస్తున్నారు
- ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ బూటకం
- ధ్వజమెత్తిన ప్రజా, కార్మిక సంఘాలు

తిరుపతి రూరల్: ప్రభుత్వ పెద్దల అవినీతివల్ల రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ విధ్వంసమవుతోందని.. వేల కోట్ల ప్రజాధనం లూటీ అవుతోందని పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తారు. ప్రజా సంపదను కాపాడాల్సిన విద్యుత్ నియంత్రణ మండలి.. అక్రమాలను సమర్థించడం దారుణమని మండిపడ్డారు. తిరుపతిలోని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) కార్యాలయంలో శుక్రవారం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో 2018–19 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సప్లయ్ వ్యాపారం నిమిత్తం వార్షిక ఆర్థిక ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిస్కం ప్రతిపాదించిన టారీఫ్‌లపై ప్రజా, కార్మిక సంఘాలు మండిపడ్డాయి. 'బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ వద్దు' అంటూ నినాదించాయి. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించినట్లు రూ.7,982 కోట్ల లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పకపోవడంపై కార్మిక సంఘాలు అనుమానం వ్యక్తంచేశాయి. విద్యుత్ చార్జీలను పెంచబోమని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ లోటును భరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నా ఒక్కో యూనిట్ రూ.2.75కు విక్రయిస్తూ, హిందూజా సంస్థ నుంచి రూ.3.83 ఎందుకు కొనాల్సి వస్తోందని ప్రశ్నించారు.



శుక్రవారం తిరుపతిలో ప్రజాభిప్రాయసేకరణలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

వినియోగదారుల సంక్షేమానికే ప్రాధాన్యత: ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ మాట్లాడుతూ, వినియోగదారుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. డిస్కం చైర్మన్, ఎండీ ఎంఎం నాయక్ ఆర్థిక ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మండలి సభ్యులు డాక్టర్ రఘు, రామ్మోహన్, డిస్కం డైరెక్టర్ పుల్లారెడ్డి, తిరుపతి జోన్ చీఫ్ ఇంజినీరు నందకుమార్, చీఫ్ జనరల్ మేనేజర్లు నరసింహులు, సంతోషరావు, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

జైట్లీ, అమిత్ షాతో వెంకయ్య భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో దాదాపు రెండున్నర గంటలపాటు సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని వెంకయ్య చాంబర్‌లో ఈ భేటీ జరిగింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఆర్థిక సాయంపైనే చర్చించినట్లు సమాచారం. కేంద్ర మంత్రి సుజనా చౌదరి కూడా ఈ సమావేశంలో కొంతసేపు పాల్గొన్నారు. విభజన హామీల అమలు, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై ఏపీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంకయ్య ఈ భేటీ నిర్వహించి, పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రూ.11 లక్షల పరిహారం

- పరువు నష్టం దావా కేసులో 'అనంత' కోర్టు తీర్పు
- ఎల్.నారాయణ చౌదరికి రూ.10 లక్షలు, ఆంధ్రజ్యోతికి రూ.లక్ష జరిమానా



ప్రకాష్‌రెడ్డి

అనంతపురం: తన పరువుకు భంగం కలిగేలా మాట్లాడిన టీడీపీ నాయకుడు ఎల్.నారాయణచౌదరి, వార్తను ప్రచురించిన ఆంధ్రజ్యోతి దినపత్రికపై వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వేసిన పరువు నష్టం కేసులో బాధితునికి రూ.11 లక్షల పరిహారం చెల్లించాలని అనంతపురం జిల్లా కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. ప్రకాష్‌రెడ్డి తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ఎస్కే నరేంద్రరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 'పరిటాల పేరు ఉచ్ఛరించడానికి కూడా మీకు అర్హత లేదు' అనే శీర్షికతో 'కారుబాంబు కేసులో 27 మంది హత్యకు కారణమైన మీది ఎలాంటి చరిత్రో ప్రజలకు తెలుసు' అని టీడీపీ నాయకులు ఎల్.నారాయణ చౌదరి చేసిన వ్యాఖ్యలతో ఆంధ్రజ్యోతి దినపత్రిక 2001 ఫిబ్రవరి 28న వార్త ప్రచురించింది. దీనిపై తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. నారాయణచౌదరి పైన, ప్రచురించిన ఆంధ్రజ్యోతి పత్రికపైన 2001లో జిల్లా కోర్టులో రూ.50 లక్షలకు పరువునష్టం దావా వేశారు. 1998లో హైదరాబాద్‌లో కారుబాంబు ఘటన జరిగింది. ఈ కేసులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిలపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కేసు నమోదు చేశారు. కేసు విచారించిన ప్రత్యేక కోర్టు 2000 జనవరి 12న వీరిని నిర్దోషులుగా తేల్చింది. తన కుటుంబ పరువు ప్రతిష్టలకు భంగం కలిగేలా ఎల్.నారాయణ చౌదరి మాట్లాడారని దావాలో ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. కేసు విచారణ అనంతరం బాధితుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎల్.నారాయణచౌదరి రూ.10 లక్షలు, ఆంధ్రజ్యోతి దినపత్రిక రూ.లక్ష చెల్లించాలని జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి తీర్పు చెప్పారు. అది కూడా 2001 నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని స్పష్టం చేసినట్లు న్యాయవాది వెల్లడించారు.

వర్సిటీ పోస్టుల భర్తీకి
ఏపీపీఎస్సీతో ఒప్పందం



సుధాకర్‌బాబుతో ఒప్పందం కుదుర్చుకుంటున్న వైవీఎస్‌టీ సాయి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి సంబంధించి పలు విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు (ఏపీపీఎస్సీ) మధ్య శుక్రవారం ఒప్పందం జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో రాయలసీమ, ద్రవిడ, కృష్ణదేవరాయ వర్సిటీల రిజిస్ట్రార్లు, ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వర్సిటీలకు కూడా ఏపీపీఎస్సీ సేవలందించేలా ఇటీవలే ప్రభుత్వం అసెంబ్లీలో చట్టసవరణ చేసింది. ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ విజయరాజు, వైస్ చైర్మన్ నరసింహారావు, కార్యదర్శి ప్రొఫెసర్ వరదరాజన్, ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లు సుధాకర్‌బాబు, అమరేందర్, తిరుమలరావు పాల్గొన్నారు.

ముగ్గురిని మింగిన ఈత సరదా

నూజెండ్ల: ఈత సరదా ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలిగొంది. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఉప్పలపాడు గుండ్లకమ్మ నదిలో ఈత కోసం దిగి వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. వినుకొండ మండలం చాట్రగడ్డపాడుకు చెందిన తమ్మిశెట్టికోటయ్య (17), ఏనుగుపాలెంకుచెందిన సయ్యద్ నాగూర్‌వలి (17) శావల్యాపురం మండలం కనమర్లపూడికి చెందిన కొక్కెర నాగేశ్వరరావు (17)తో పాటు నూజెండ్ల మండలం ఉప్పలపాడుకు చెందిన ముక్కమళ్ల అనీశ్వరరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం గుండ్లకమ్మ నదిలో ఈత వేసేందుకు దిగారు. నదిలో లోతు తెలియక మునిగి పోయి ముగ్గురు మృతిచెందగా, అనీశ్వరరెడ్డిని స్థానికుడు రక్షించాడు.

మానవీయ కోణంలో ఆలోచించాలి

పోలవరం పరిహారం చెల్లింపుపై సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: సాగునీటి ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులవుతున్న ప్రతి బాధితునికి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల్లో కొంత మందికి పరిహారం చెల్లించి కొంత మందికి చెల్లించకపోవడంపై గతంలో ఆదేశాలు ఇచ్చిన మానవ హక్కుల కమిషన్ వాటి అమలు పర్యవేక్షణ నిలపుదల చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని జస్టిస్ ఏకె. సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్ బెంచ్ విచారించింది. సుప్రీం కోర్టులో కూడా పోలవరంపై కేసులు న్నాయంటూ ఆదేశాల అమలు పర్యవేక్షణను నిలుపుదల చేయడం సరికాదని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ వాదించారు. ఐక్యరాజ్య సమితి మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వాసితులకు అన్ని ప్రయోజనాలు అందాలని బెంచ్ అభిప్రాయపడింది.

సాక్షి

శనివారం, ఫిబ్రవరి, 10

అంతరిక్షంలో కొత్త పుంతలు

'ఎల్లుండి ఏం తమాషా జరుగుతుందో/ ఎవ్వడూ చెప్పలేడంటే నమ్మండి/ చెబితే మాత్రం నమ్మకండి' అంటాడు మహాకవి శ్రీశ్రీ తన 'శరశ్చంద్రిక' కవితలో. అరవై య్యేళ్ల క్రితం సైన్స్ ఫిక్షన్ రచయితల ఊహకందని విషయాలు సైతం వాస్తవ రూపం దాల్చే రోజులొచ్చేశాయి. ప్రపంచ చరిత్రలో ఇంతవరకూ ప్రయోగించిన రాకెట్లన్నిటినీ తలదన్నే అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ' బుధవారం నిప్పులు చిమ్ముకుంటూ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. 23 అంతస్తుల భవంతికి సమానమైన ఎత్తున్న ఈ రాకెట్‌కు 27 ఇంజిన్లు అమర్చి మండించడం ద్వారా ఈ అనూహ్య ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. అది తీసుకెళ్లిన టెస్లా సంస్థ ఎలక్ట్రిక్ కారు ఇప్పుడు అంగారకుడి కక్ష్యకు ఆవలనున్న గ్రహ శకలాల మధ్య తిరుగాడుతోంది. అచ్చం వ్యోమగామి పోలికతో రూపొందించిన బొమ్మ డ్రైవర్ సీటులో కూర్చుని ఉండగా, అంతరిక్ష అద్భుతాలను గానం చేస్తూ డేవిడ్ బోవీ 1972లో విడుదల చేసిన గీతమొకటి ఆ కారులో శ్రావ్యంగా వినిపించే ఏర్పాటు చేశారు. ఆ కారులోని మూడు కెమెరాలు తమ కళ్లముందున్న దృశ్యాలను ఎప్పటికప్పుడు భూమ్మీదకు పంపే సదుపాయమూ ఉంది. అంగారకుడి కక్ష్యలో అది తిరుగాడాలని శాస్త్రవేత్తలు భావించినా అనుకోని రీతిలో అది ఆ కక్ష్యను దాటిపోయింది. అంగారకుడే వారి లక్ష్యం గనుక ఆ కారు రంగును కూడా ఎర్రగానే ఉంచారు. దాని ఖరీదు 2 లక్షల డాలర్లు(సుమారు రూ. కోటీ 29 లక్షలు).

అది భయమో, విస్మయమో...ఆకాశంలో నిరంతరం జ్వలించే బంతిలా కనబడే అంగారకుడంటే మానవాళికి ఆదినుంచీ ప్రత్యేక ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే అంగారకుడి చుట్టూ అనేక ఊహలల్లింది. అంగారక గ్రహంపై మనుషుల్ని పోలిన జీవరాశి ఉన్నట్టు, వారు భూమ్మీద దండయాత్ర చేసేందుకు వచ్చినట్టు హెచ్‌జీ వెల్స్ 1906లో వెలువరించిన 'వార్ ఆఫ్ ది వర్ల్డ్స్' నవల చిత్రించింది. కుజుడి ఉపరితలంపై ఉన్న ఇనుము ఆక్సైడ్ రూపంలో ఉన్న కారణంగా ఆ గ్రహం ఎర్రెర్రగా కనబడుతున్నదని శాస్త్రవేత్తలు తేల్చారు. ఆ గ్రహాన్ని చేరుకోవాలని, అక్కడున్నదేమిటో తెలుసుకోవాలని, ముఖ్యంగా ఆవాసానికి అది అనువుగా ఉంటుందో, లేదో తేల్చాలని ఆసక్తి ఉన్నవారికి కొదవలేదు. శాస్త్రవేత్తలు సైతం అలాంటి కలలు సాకారమయ్యేందుకు అనువైన పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ప్రఖ్యాత సైన్స్ ఫిక్షన్ రచయిత ఆర్థర్ సి. క్లార్క్ అన్నట్టు ఈ విశాల విశ్వంలో రెండే రెండు సంభావ్యతలుంటాయి. అవి–మానవాళి ఒంటరైనా కావాలి లేదా కాకపోవాలి. ఈ రెండూ ప్రమాదకరమైనవేనంటాడు క్లార్క్. ఎందుకంటే ఒంటరితనం ఎటూ భయానకం. మరెవరో ఉన్నారనుకున్నా వారెలాంటివారో తెలియనంతకాలమూ అది కూడా భీతిగొల్పేదే. ఎవరిలోనూ కలవలేని అశక్తత ఉన్న వ్యక్తి సైతం సమూహంలో ఒంటరిగా ఉండాలనుకుంటాడు తప్ప అందరూ నశించి తానొక్కడే మిగిలిపోవాలనుకోడు. మనిషిలో అంతర్లీనంగా ఉండే ఈ తత్వమే అన్వేషణలకు పురుడుపోసింది. కాలం గడుస్తున్నకొద్దీ ఆ అన్వేషణాక్రమం ఎన్నో నేర్పుతున్నది.

మనుషుల్ని 'బహుళ గ్రహ' జీవులుగా మార్చాలని స్పేస్ ఎక్స్ 2002 నుంచీ కలలుగంటోంది. అందుకవసరమైన సాంకేతికతను అభివృద్ధి పరిచే క్రమంలో అది తలమునకలై ఉంది. అందులో ఇప్పుడు జరిగిన ఫాల్కన్ హెవీ రాకెట్ ప్రయోగం మొట్టమొదటిది. వాస్తవానికి ఈ ప్రయోగం 2011లో జరపాలని సంకల్పించారు. అప్పటినుంచి అది వాయిదాలు పడుతోంది. 2016లో ఫ్లారిడాలోని ప్రయోగ వేదికపై ఫాల్కన్ 9 రాకెట్ పేలి 20 కోట్ల డాలర్ల వ్యయంతో నిర్మించిన ఉపగ్రహం క్షణాల్లో బూడిదైంది. తాను ప్రయోగించబోయే ఫాల్కన్ హెవీకి కూడా అలాంటి పరిస్థితే ఎదురుకావొచ్చునని, తానైతే దేనికైనా సిద్ధంగా ఉన్నానని అప్పట్లోనే మస్క్ ప్రకటించాడు. విఫలమై ప్రమాదం సంభవిస్తే అందుకు కారణాలేమిటో పరిశోధించి, అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుని ఈ పనిలో ముందుకెళ్తామని కూడా చెప్పాడు. భూగోళంపై ఈ మూల నుంచి ఆ మూలకెళ్లి తిరిగి స్వస్థలానికెలా చేరుకుంటున్నామో అదే రీతిలో ఏ గ్రహానికైనా వెళ్లొచ్చే రోజులు రావాలన్నది, అది కూడా చౌకగా ఉండాలన్నది ఎలన్ మస్క్ కాంక్ష. అందుకే ఈ ప్రయో గంలో మూడు బూస్టర్లను పంపి అవి తిరిగి భూమిని చేరుకునే ఏర్పాటు చేశారు. అయితే రెండు బూస్టర్లు అనుకున్నట్టే విజయవంతంగా వెనక్కు వచ్చినా మూడోది మాత్రం మధ్యలోనే కాలిపోయింది. ఈ రెండు బూస్టర్లూ మరో ప్రయోగానికి ఉపయోగపడతాయి. ఎలన్ మస్క్ 2002లో తొలిసారి తన పథకమేమిటో చెప్పినప్పుడు అందరూ వింతగా చూశారు. కానీ తాజా విజయంతో ఆయన సంస్థ ప్రపంచంలోనే ఇప్పుడు అగ్రగామి ప్రైవేటు అంతరిక్ష వాణిజ్య సంస్థగా అవతరించింది.

ఇంత ఆర్భాటం లేదుగానీ... గత నెల 21న 'హ్యూమానిటీ స్టార్' పేరిట కాంతులీనే బంతిలా ఉండే ఉపగ్రహాన్ని చడీచప్పుడూ లేకుండా ప్రయోగించారు. విజయవంతమైన తర్వాతే దాన్ని ప్రకటించారు. ఇప్పుడది 90 నిమిషాలకొకసారి భూమిని చుట్టివస్తుంది. భూగోళంలో ఏ మూలనున్నవారికైనా స్పష్టంగా కనబడుతుంది. దాని గమనాన్ని తెలుసుకోవడానికి అదే పేరుతో ఒక వెబ్‌సైట్ ఏర్పాటుచేశారు. మానవాళి తన గురించి, తన చర్యల గురించి, వాటికుండే పర్యవసానాల గురించి అవలోకనం చేసుకుని తీరుతెన్నులను మార్చుకుంటుందన్న ఆశతో దీన్ని రూపొందించానని రాకెట్‌లాబ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పీటర్ బెక్ చెబుతున్నాడు. అయితే ఆశయాలు ఎంత ఉన్నతంగా ఉన్నా, ప్రతీకలెంత ప్రభావవంతమైనవైనా ఇప్పటికే వ్యర్థాలతో అస్తవ్యస్థంగా తయారైన అంతరిక్షం భవిష్యత్తులో మరింత కంగాళీగా మారడానికి తప్ప ఈ ప్రయోగాల వల్ల ఉపయోగమే లేదని నిట్టూర్చే నిరాశావాదులున్నారు. ఏదేమైనా స్పేస్ ఎక్స్, రాకెట్‌లాబ్ సంస్థలు అంతరిక్ష ప్రయోగాలను ఒక కొత్త దశకు తీసుకుపోయాయి. ఈ ప్రయోగాలు అంతిమంగా మానవాళి శ్రేయస్సుకే తోడ్పడాలి. ప్రభుత్వాలకైనా, ప్రైవేటు సంస్థలకైనా అదే గీటురాయి కావాలి.



అంతరిక్ష ప్రయోగాల అంతిమ సారాంశం ఏక గ్రహ జీవుల నుంచి బహుళ గ్రహ జీవుల వైపు మనిషి పరివర్తనే.

– డేవిడ్ గ్రిన్‌స్పూన్
అమెరికన్ ఖగోళ జీవశాస్త్రజ్ఞుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి బ.దశమి సా.4.20 వరకు
తదుపరి ఏకాదశి, నక్షత్రం జ్యేష్ఠ రా.9.30 వరకు, తదుపరి మూల
వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.6.33 నుంచి 8.02 వరకు
అమృతఘడియలు ఉ.11.50 నుంచి 12.34 వరకు.

సూర్యోదయం	: 6.34	10.30 వరకు
సూర్యాస్తమయం	: 5.55	యమగండం:
రాహుకాలం:		ప.1.30 నుంచి
ఉ.9.00 నుంచి		3.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	: 5.31	మగ్రీబ్	: 6.16
జొహర్	: 12.30	ఇషా	: 7.29
అసర్	: 4.39		

విజేతలను వెంటాడే భయం



శేఖర్ గుప్తా

ఈసారి క్లీన్‌స్వీప్‌లు అసాధ్యమని బీజేపీ నేతలకు తెలుసు. ఆఖరికి గుజరాత్‌లో కూడా కొన్ని స్థానాలు నష్టపోవచ్చు. మోదీ మళ్లీ ప్రధాని అభ్యర్థిగా ముందుకు రావడం వల్ల గుజరాతీయులు తమ అశాంతిని మరిచిపోయి ఓట్లు వేసినప్పటికీ సీట్లు తగ్గుతాయి. ఆ కోణం నుంచి ఇప్పుడు ఇండియా మ్యాప్‌ను పరిశీలిస్తే 272 ప్లస్ స్థానాలు రావడం గగన మన్న సంగతి తెలుస్తుంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర (శివసేన దూరం కావడంతో), ఉత్తరప్రదేశ్‌లలో కూడా బీజేపీ సీట్లు కోల్పోతుంది.

ప్రధాని నరేంద్ర మోదీ హావభావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం వృథా ప్రయాస. ప్రజల ముందుకు వచ్చినప్పుడు ఆయన ఒక పరిపూర్ణ కళాకారుడు. కేవలం సౌజ్ఞలు చేస్తూ, వాటి మధ్య మాటతో చెప్పనివి, ప్రదర్శించనవి అనేకం మన ముందు ఆవిష్కరిస్తారు. ఆలోచనలలో వాస్తవంగా ఏముందో దానిని కూడా మోసం చేసి వచ్చిన అంశాలు ఏమిటో కూడా తెలియకుండా మాట్లాడడంలో చాలా తర్ఫీదు పొందినవారాయన. ఆయన నిరంతర ప్రచార యుద్ధ సంరంభంలో కనిించే రాజకీయనాయకుడు. ఒక అవిశ్రాంత ప్రచారకుడు. తన ప్రచారంతోనే 2014 ఎన్నికలలో ఘన విజయం సాధించిన నేపథ్యంలో, అలాంటి ఒక కొత్త ప్రచార సంరంభానికి ఆయన సిద్ధమవుతున్నట్టు కనిపిస్తుంది.

ఈ వారంలోనే పార్లమెంట్ ఉభయ సభలలో మోదీ ఇచ్చిన రెండు ఉపన్యాసాలను ఆత్రంగా చదివిన వారి కోసమే ఈ చిన్న హెచ్చరిక. అందులోని కొన్ని అంశాలను మీరు కూడా క్షుణ్ణంగా పరిశీలించాలి. ఆయన నుదిటి మీది ముడతలు చాల లోతైనవని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రతిపక్షానికి సంబంధించి ఆ ముడతలు మరింత ఆగ్రహాన్ని, చిరాకును ప్రదర్శిస్తాయి. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, చాలాకాలం తరువాత ఇప్పుడు కాంగ్రెస్ ప్రధానంగా ఆయన తలపులను గట్టిగా తట్టింది. ఇంకోమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆయన గుబులు పడవలసిన విషయమైంది. లోక్‌సభలో ప్రధాని చేసిన ప్రసంగంలో కనీసం పన్నెండు పర్యాయాలు కాంగ్రెస్ పేరు ప్రస్తావించారని మా లెక్కలో తేలింది. అంటే 48 మంది సభ్యులు ఉన్న ఆ పార్టీ ఎంపీలు ప్రతి నలుగురిలో ఒకరికి ఆ ప్రస్తావన వర్తిస్తుంది.

కాంగ్రెస్ గురించి ప్రస్తావించడం ఒక్కటే కాదు. నెహ్రూతో ఆరంభించి 'రాజవంశం' పేరుతో కూడా ప్రధాని పలుమార్లు ఆ కుటుంబం గురించి ప్రస్తావించారు. నెహ్రూతో పాటు, ఆయన వారసులందరి పాపాల గురించి మోదీ గుర్తు చేశారు. కశ్మీర్ అంశంలో నెహ్రూ పాపం, అత్యవసర పరిస్థితి విధింపు ఘనతలో ఆయన కుమార్తె ఇందిర చేసిన పాపం, 1984 నాటి సిక్కుల ఊచకోత పాపంలో ఇందిర కుమారుడు రాజీవ్‌గాంధీ వాటా, ఆంధ్రప్రదేశ్‌ను తొందరపాటుతో అనాలోచితంగా విభజించారంటూ ఆ పాపాన్ని సోనియా గాంధీకి, ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను బహిరంగంగా చింపిన పాపం సోనియా కుమారుడు రాహుల్‌కు ప్రధాని ఆపాదించారు. ఇది రాజ వంశంలోని ఐదు తరాల వారిని రాజకీయంగా నిందితులుగా నిలబెట్టడానికి ఉద్దేశించిన బలమైన ఆరోపణల పత్రమే. కానీ తన ప్రభుత్వం గురించి మాట్లాడడానికి మాత్రం ఆయన చాలా తక్కువ సమయం మిగుల్చుకున్నారు. ఈ ఉపన్యాసాన్ని సంప్రదాయ పంథాలో విశ్లేషిస్తే, ప్రధాని మాటలు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాధినేత మీద ఒక ప్రతిపక్ష నేత చేసిన విమర్శను స్ఫురింపచేస్తాయి. లేదా అధికారంలో ఉన్న నాయకుడు తనకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయన్న వాస్తవాన్ని గమనించి, మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆశతో, ఒక దుర్బల స్థితిలో చేస్తున్న ఉపన్యాసంలా కూడా అనిపిస్తుంది. ఇదంతా చూస్తే ప్రధాని మోదీ కాంగ్రెస్‌కు అవసరానికి మించిన ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తుంది. నిజానికి మోదీ ఉపన్యాసాన్ని సంప్రదాయ పద్ధతిలో వివరించడం సాధ్యం కాదు. ఆయన గురించి తెలిసిన వారు లేదా ఆయనతో కలసి పనిచేసినవారు మీకు ఒకటే చెబుతారు. విపక్షాన్ని తేలిక తీసుకోవడం తమ ఇంటా వంటా లేదనే వారు చెబుతారు. కాబట్టి మోదీ నిరంతరం ప్రచార యుద్ధ సంరంభంలో ఉంటారనడమే నిజం. అది నిజం కాకపోతే మొత్తం 19 రాష్ట్రాలలో మోదీ సొంత పార్టీ ప్రభుత్వాలు,

జాతిహితం



లేదా ఇతర పార్టీలతో కలసి బీజేపీ సంకీర్ణాలు ఏర్పడడం ఎలా సాధ్యమయ్యేది.

మళ్లీ సంప్రదాయబద్ధమైన తర్కంతో ఆలోచిస్తే 48 మంది సభ్యులు మాత్రమే ఉన్న కాంగ్రెస్ పార్టీ గురించి తన ఉపన్యాసంలో ప్రధాని అన్ని సార్లు ప్రస్తావించడంలోని సహేతుకతని కూడా గ్రహించవచ్చు. 2019 పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని ఏ మేరకు చూపుతుందో గానీ, ఈ సంవత్సరం జరిగే ప్రతి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి గట్టి సవాలే. ఇందులో త్రిపురను మాత్రం మినహాయించవచ్చు. కాంగ్రెస్ రెండు రాష్ట్రాలలో–కర్ణాటక, మేఘాలయలలో అధికారంలో ఉంది. అయితే ఉప ఎన్నికల ఫలితాలను బట్టి రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఈసారి తమకు అవకాశం ఉండవచ్చునని నమ్ముతున్నది. 2018 సంవత్సరంలో జరిగే ఆ ఏడు లేదా ఎనిమిది మినీ ఎన్నికలే 2019 నాటి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు సంకేతించేవిగా ఉంటాయని మోదీకి తెలుసు. ఒకవేళ కాంగ్రెస్ కర్ణాటకలో విజయం సాధిస్తే, ఈ సంవత్సరాతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీకి వాలుగాలి వీస్తుంది. ఆ మూడింటిలో రెండు గెలిచినా, 2019 ఎన్నికలలో బీజేపీ దూకుడుకు కాంగ్రెస్ కళ్లెం వేయగలుగుతుంది. అదే కర్ణాటకలో బీజేపీ కనుక విజయం సాధిస్తే పరిస్థితులు మారిపోతాయి. గుజరాత్ మిగిల్చిన గందరగోళం, రాజస్తాన్ ఉప ఎన్నికలలో తగిలిన ఎదురుదెబ్బ గురించి కూడా అంతా మరిచిపోతారు.

ఇక, మోదీ అంటే కోచ్ సలహా మేరకు ఒక దశ తరువాత ఒక దశ మెలకువలు నేర్చుకునే వినయశీలి అయిన బ్యాట్స్‌మెన్ కాదు. బ్యాట్స్‌మెన్‌కు తన కోసమే విసిరే ఒకే బాల్ మీద దృష్టి పెడితే సరిపోతుంది. తరువాత వచ్చే బంతి గురించి అప్పటికి ఆ బ్యాట్స్‌మెన్‌కు ఎలాంటి ఆలోచన ఉండదు. అయితే పిచ్‌తోను, వాతావరణంతోను, అంపైర్‌తోను కూడా ఏకకాలంలో ఆడుకునే క్రీడాకారుడు మోదీ. మోదీ రాజకీయ విధానం కూడా మధ్యయుగాల నాటి గెలుపు తరహాలో విజయ ఫలితమంతా విజేతకే దక్కాలన్న తీరులో ఉంటుంది. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో పాకిస్తాన్‌తో కలసి మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో ఒక ముస్లిం ముఖ్యమంత్రిని ప్రతిష్ఠించడానికి చేతులు కలిపారని ఆరోపించడం ఇలాంటిదే. మోదీ శైలి లేదా మోదీ–అమిత్‌షా శైలి పూర్తిగా రాజకీయ మయమే. వాళ్లు కేవలం విజయాన్ని మాత్రమే కోరుకోరు. ప్రతిపక్షాన్ని ధ్వంసం చేసి, శంకరగిరి మన్యాలు పట్టించాలని కోరుకుంటారు. ఇందులో ఏది ఆమోదనీయమో, దానిని ఆ పార్టీ స్వీకరిస్తుంది. కానీ నేటి పరిస్థితి ఆరుమాసాల క్రితం వంటిది కాదు. గుజరాత్ ఎన్నికలలో ఆశించనదాని కంటే చాలా తక్కువ ఫలితం దక్కడం, రాజస్థాన్ ఉప ఎన్నికల ఓటమిలో కనిపించిన ఓట్ల భారీ తేడా బీజేపీని బాగా ఇరకాటంలో పడవేసే సంకేతాలు. ఇవి కాకుండా వేరే అంశాలు కూడా ఉన్నాయి. ఈ సుదీర్ఘ ఆరుమాసాల కాలంలో రాహుల్ గాంధీ తన దృష్టిని కేంద్రీకరించారు. తన పార్టీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల జనాభాను కూడా తన వైపు ఆకర్షింపచేసుకున్నారు. కానీ ప్రస్తుతం ఇతర విపక్షాలు కాంగ్రెస్ ఛత్రం కిందకు రావడానికి నిరాసక్తంగా ఉన్నాయి. ఒకవేళ కర్ణాటకను కాంగ్రెస్ నిలబెట్టుకోగలిగితే మళ్లీ ఈ పరిస్థితి కూడా మారిపోతుంది. మోదీ, అమిత్‌షా ఎన్నికల ప్రచారకులు, రాజకీయవేత్తలు మాత్రమే కాదు, ఎన్నికల నిర్వహణలో ఎన్నో మెలకువలు తెలిసిన నిపుణులు. 2014 లోక్‌సభలో కాంగ్రెస్‌కు వచ్చిన 44 స్థానాలను చూసి వారు ఆచితూచి మాత్రమే తృప్తి పొందుతున్నారు. ఆ ఎన్నికలలో బీజేపీ 17 కోట్ల ఓట్లు సాధించింది. 11 కోట్ల ఓట్లు సాధించుకున్నా కూడా కాంగ్రెస్ దారుణమైన ఫలితాలను దక్కించుకుంది. నిజం చెప్పాలంటే ఇప్పుడు వచ్చిన కొన్ని అంచనాల ప్రకారం 2019 ఎన్నికలలో విజయం సాధించడానికి అవకాశం ఉన్న కూటమి మిగా ఎన్డీయేనే ముందంజలో ఉంది. అయితే కాంగ్రెస్ ఓట్లు కనుక గత ఎన్నికలలో వచ్చిన 11 కోట్లను మించి 13 కోట్లకు చేరితే అప్పుడు ఎన్డీయే పరిస్థితి వేరే విధంగా ఉంటుంది. అది జరగకూడదనే మోదీ, అమిత్‌షా పోరాడుతున్నారు.


భారతదేశంలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాని పరిస్థితి ఎదురవుతున్నప్పటి నుంచి (1984) ఏర్పడుతున్న సంకీర్ణాలలో ఒక తర్కాన్ని నేను గమనిస్తున్నాను. అది టెన్నిస్‌లో చెప్పే బెస్ట్ ఆఫ్ నైన్ సెట్స్ తర్కం. తొమ్మిది రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాజకీయాల తలరాతలను మారుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ (2014లో తెలంగాణ సహా), మధ్యప్రదేశ్, బిహార్, రాజస్తాన్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాజకీయ క్రీడలో టెన్నిస్ ఆటలో వలెనే తొమ్మిది సెట్లు. ఈ తొమ్మిదింటిలో ఏ ఐదు రాష్ట్రాలలో ఏ రాజకీయ పార్టీ లేదా సంకీర్ణం ఆధిక్యం చూపగలిగితే అదే దేశాన్ని ఏలగలుగుతుందన్నదే నా వాదన. ఈ అన్ని రాష్ట్రాలలో కలిపి 351 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అయితే ఒక పార్టీ అందులో 200 స్థానాలు గెలిస్తే చాలు. చిన్నా చితకా పార్టీలను చేర్చుకోగలిగితే 272 స్థానాల వరకు సాధించవచ్చు. కానీ 2014 ఎన్నికలలో మోదీ, షా ఇలాంటి విశ్లేషణకు కాలం చెల్లిందని నిరూపించారు. వారు కేవలం 272 స్థానాలు మాత్రమే కాదు, 282 స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సీట్లు అప్పుడు ఎలా వచ్చాయో గమనిస్తే, ఇప్పుడు బీజేపీ నేతల కలతకు కారణం తెలుస్తుంది. అప్పుడు 282 స్థానాలు వచ్చాయంటే మధ్యప్రదేశ్‌లో రెండు మినహా మిగిలిన అన్ని సీట్లు, రాజస్తాన్‌లో మొత్తం సీట్లు వచ్చాయి. మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను 42 దక్కాయి. ఉత్తరప్రదేశ్‌లో 80కి 70 స్థానాలు, బిహార్‌లో 40 స్థానాలకు గాను 31 స్థానాలు లభించాయి. గుజరాత్‌లో అన్ని సీట్లు బీజేపీ గెలిచింది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్ వంటి చిన్న చిన్న రాష్ట్రాల స్థానాలు మొత్తం బీజేపీకి వచ్చాయి. అయితే ఈసారి క్లీన్‌స్వీప్‌లు అసాధ్యమని బీజేపీ నేతలకు తెలుసు. ఆఖరికి గుజరాత్‌లో కూడా కొన్ని స్థానాలు నష్టపోవచ్చు. మోదీ మళ్లీ ప్రధాని అభ్యర్థిగా ముందుకు రావడం వల్ల గుజరాతీయులు తమ అశాంతిని మరిచిపోయి ఓట్లు వేసినప్పటికీ సీట్లు తగ్గుతాయి. ఆ కోణం నుంచి ఇప్పుడు ఇండియా మ్యాప్‌ను పరిశీలిస్తే 272 ప్లస్ స్థానాలు రావడం గగనమన్న సంగతి తెలుస్తుంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర (శివసేన దూరం కావడంతో), ఉత్తరప్రదేశ్‌లలో కూడా బీజేపీ సీట్లు కోల్పోతుంది. అయినప్పటికీ తక్కువ మెజారిటి సాధించిన బీజేపీ నేతృత్వంలోనే ఎన్డీయేకే అధికారం రావచ్చునని చెప్పవచ్చు. అలాగే ఇప్పటికి కాంగ్రెస్‌ను అధికార పీఠం మీద చూసే అవకాశం కనిపించడం లేదు కాబట్టి ఆ పార్టీని మన్నించమని కోరాలి. ఆరుమాసాల క్రితం కనిపించిన చిత్రం ప్రకారం తక్కువ మెజారిటీ సీట్ల బీజేపీ నాయకత్వంలోనే ఎన్డీయే వస్తుంది. అదొక అస్పష్ట చిత్రం. కానీ ఇప్పుడు అదే స్పష్టమైన చిత్రం.

వ్యాసకర్త దప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

సంకుచిత దృక్పథమే సమస్య

విభజన వాగ్దానాల అమలులో కేంద్ర ప్రభుత్వ చర్యలు మరీ అంత గొప్పగా లేకపోయినా తీసివేసే స్థాయిలో మాత్రం లేవు. కానీ రాష్ట్ర ప్రభుత్వం చాలా అంశాల్లో సంకుచిత దృక్పథంతో వ్యవహరిస్తూ ఉండటమే అన్ని అనర్థాలకు కారణమవుతోంది.

అభిప్రాయం



ఐవైఆర్ కృష్ణారావు

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర విభజనను అనుసరించి కేటాయింపుల విషయంలో ప్రభుత్వ నిరసనలు మొదలైనాయి. కేంద్ర ప్రభుత్వంపై కత్తులు దూయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైందని, ఒక ప్రధానమైన నిర్ణయం తీసుకోబోతున్నారని ప్రచారం జరిగింది. తీరా సమావేశం మొదలయ్యే సమయానికి కేంద్ర హోం శాఖ మంత్రి ఫోన్లో మాట్లాడారని తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వాయిదావేసిందని చెప్పుకొచ్చారు. నడుస్తున్న ఈ డ్రామాను చూసినవారంతా బడ్జెట్ సమయంలో జరిగే షరా మామూలు కార్యక్రమంగా కొట్టి పారేశారు.

రాష్ట్ర విభజన అంశాలను దానిపై చేసిన వాగ్దానాలు వాటి అమలును గురించి పరిశీలించాలంటే విభజన చట్టంలోని అంశాలను, విభజన సందర్భంలో పార్లమెంట్లో చేసిన వాగ్దానాలను, 2014వ సంవత్సరం ఎన్నికల ముందు చేసిన రాజకీయ వాగ్దానాలను పరిశీలించాలి.

విభజన చట్టంలో వాగ్దానాలు పొందుపరిచిన సెక్షన్లలో 46వ సెక్షన్ ఒకటి. ఈ సెక్షన్‌కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఏపీ రాష్ట్ర ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని తగువిధంగా గ్రాంట్స్ ఇవ్వడానికి అవకాశం ఉన్నది. అదేవిధంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేయడానికి కూడా సదుపాయం ఉన్నది. దీనికనుగుణంగా కేంద్రం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడమే కాకుండా విడుదల చేసింది కూడా. ఏపీకి గ్రాంటులు ఇవ్వాలనే నిబంధనకు అనుగుణంగా 2014–15 సంవత్సరానికి రూ. 3,950 కోట్ల రూపాయలు రెవెన్యూ లోటు భర్తీకి ఇవ్వడమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ఏడాది రెవెన్యూ లోటు కింద 16 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఈ 16 వేల కోట్ల రెవెన్యూ లోటుకు హేతుబద్ధత లేదు. కాబట్టి ఈ మొత్తం పూర్తిగా వచ్చే అవకాశాలు తక్కువ.

ఇక సెక్షన్ 90 కింద కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. దీనికి అనుగుణంగానే పోలవరం నిర్మాణానికి ఏజెన్సీని ఒకదాన్ని ఏర్పాటు చేసింది. కాని రాష్ట్రప్రభుత్వం పట్టుబట్టి ఈ ప్రాజెక్టు తానే కడతానని తీసుకుంది. ఇప్పుడు కాంట్రాక్టర్ బాగా లేడనే అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఈ ప్రాజెక్టు పైన గత నాలుగేళ్లలో దాదాపు వందసార్లు ముఖ్యమంత్రి తన స్థాయిలో సమీక్షించటం లేదా క్షేత్ర పరిశీలన చేశారు. మరి కాంట్రాక్టర్ బాగా లేడనే విషయం ఇన్నాళ్ల నుంచి వారి దృష్టికి రాకపోవడం నమ్మశక్యం కావడం లేదు. ఏదేమైనా పోలవరానికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయడమైనది. సరైన వినియోగ నివేదికలను సమర్పించి తిరిగి నిధులు రాబట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. ఈనాడు పోలవరం సమస్య నిధుల సమస్య కాదు.. కాంట్రాక్టర్ సమస్యగా, నిర్మాణ సమస్యగా మిగిలిపోయింది.

ఇక చట్టంలోని 93వ సెక్షన్ ప్రకారం 13వ షెడ్యూల్లో విద్యాపరమైన సంస్థల గురించి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సంస్థల గురించి పేర్కొన్నారు. దీనిలో విద్యాపరమైన సంస్థలను అతి తక్కువ కాలంలో చాలావరకు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి అవసరమైన భూమిని అతి తక్కువ కాలంలో కేటాయించింది. విభజన చట్టంలో పేర్కొన్న ప్రాజెక్టులలో విమానాశ్రయాల ఆధునీకరణ మొదలయినది. విశాఖపట్నం–చెన్నై పారిశ్రామిక కారిడార్ నాకు తెలిసినంతవరకు టెండర్ల స్థాయిలో ఉన్నది. విద్యాపరమైన సంస్థలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. కేంద్రం కూడా రైల్వేజోన్ లాంటి ప్రధాన అంశాలపై నాన్చకుండా అంగీకరిస్తే ఈ అంశాలపై ప్రజావ్యతిరేకత తగ్గుతుంది.

ఇంకొక ముఖ్యమైన సెక్షన్ 94. ఈ సెక్షన్ కింద ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాల్లో పన్ను రాయితీలు కల్పించడం, కొత్త రాజధాని ప్రాథమిక సౌకర్యాల కోసం తగిన నిధులు సమకూర్చడం పొందుపర్చారు. రాజధానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ. 2,500 కోట్లు మంజూరు చేసింది. కాని రాష్ట్ర ప్రభుత్వం శాశ్వతమైన భవన నిర్మాణాలను ఇంకా మొదలుపెట్టలేదు. ఇచ్చిన వాగ్దానాల్లో చాలా ప్రధానమైనది పారిశ్రామికాభివృద్ధి కోసం పన్ను రాయితీలు. ఈ రాయితీలను హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఇచ్చిన విధంగా ఇవ్వాలనేది ఆంధ్రరాష్ట్ర అభ్యర్థన. ఇది చాలా ప్రధానమైన వాగ్దానం. దీని అమలుకు ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఉంది.




ప్రత్యేక హోదా అంశం విభజన చట్టంలో పేర్కొనలేదు. పార్లమెంట్లో ఆనాటి ప్రధానమంత్రి చేసిన వాగ్దానాన్ని అనుసరించి ప్రత్యేక హోదా కోసం మనం అడుగుతున్నాం. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించడం, రాష్ట్ర ప్రభుత్వం ఒప్పేసుకోవడం జరిగిపోయాయి. అందువల్ల ఈనాడు ప్రత్యేక హోదా గురించి అడిగే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కోల్పోయింది. ప్రతిపక్ష నాయకుడు మాత్రమే ఈ అంశంపై గట్టిగా పట్టుబడుతున్నారు. హోదా కింద గానీ ప్యాకేజీ కింద గానీ రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్‌గా వస్తాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్స్ రూపంలో వచ్చిన మొత్తాన్ని రాజధాని ప్రాంతంలోనే ఖర్చు చేయడానికి సుముఖత చూపిస్తోంది. ఇప్పటికీ ఈ ప్యాకేజీ కింద రాజధాని ప్రాంతానికి మాత్రమే ప్రపంచబ్యాంకు నుంచి రూ. 2,000 కోట్లు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ. 2,000 కోట్లు తేవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిధుల పంపిణీ విషయంలో సంకుచిత దృక్పథంతో వ్యవహరిస్తున్నది.

మొత్తంమీద విభజన వాగ్దానాల అమలులో కేంద్ర ప్రభుత్వం చర్యలు మరీ అంత గొప్పగా లేకపోయినా తీసివేసే స్థాయిలో మాత్రం లేవు. సెప్టెంబర్ 4, 2014 నాడు రాష్ట్ర సీఎం విజయవాడ పరిసరాలలో రాజధాని ఏర్పాటును ప్రకటిస్తూ వివిధ ప్రాంతాల అభివృద్ధికి చేసిన వాగ్దానాలు వాటి అమలుతో పోలిస్తే గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తుంది. శాసనసభలో ఆ రోజు ప్రకటించిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. కానీ ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి తెలియజేయడంలో ఏపీ బీజేపీ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. చంద్రబాబు మాత్రం చాలా తెలివిగా తన కత్తికి రెండువైపులా పదునున్నదని నిరూపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధాలు కొనసాగిస్తూ తన ప్రయోజనాలను సఫలీకృతం చేసుకుంటూ మరో వైపు ప్రజల ఆగ్రహాన్ని విభజన వాగ్దానాల అమలు సరిగా జరగలేదని కేంద్ర ప్రభుత్వం వైపు మళ్లిస్తున్నారు. ఆ విధంగా భవిష్యత్తులో కేంద్రంతో తెగదెంపులు చేసుకోవాలన్నా కావలసిన వాతావరణాన్ని సృష్టించుకుంటున్నారు. ఎటొచ్చీ ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పడంలో రాష్ట్ర బీజేపీ శాఖ అసమర్థత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. దీనికి కారణం పార్టీలో కొనసాగుతూనే టీడీపీకి అనుకూలంగా ఉంటున్న రాష్ట్ర బీజేపీలోని విభీషణులేనా అన్న అనుమానం ప్రజలకు రాకమానదు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

కళ్లు తెరవరా నరుడా!

రాజకీయ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో బీజేపీని కాదని ఒంటరి పోరుకి దిగుదామంటే చంద్రబాబుకు ధైర్యం బొత్తిగా చాలడం లేదు.



శ్రీరమణ

మొన్న మోదీ పార్లమెంట్ ప్రసంగం దారితప్పిన చిరుతపులి పరుగులా సాగింది. మొదటి పానిపట్టు యుద్ధం గురించి, గజనీ మహమ్మద్ దండయాత్రల గురించి, పాకిస్తాన్ విభజన గురించి, ఆత్మప్రబోధం గురించి, యుగాలుగా తెలుగుజాతికి జరిగిన అన్యాయాల గురించి అనర్గళంగా మాట్లాడారు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. పొడిగింపుగా ఇప్పుడు నేను సైతం తెలుగుజాతికి నావంతు అన్యాయం చేస్తాననే ధ్వని ఉంది ఆ ప్రసంగంలో.

కిందటి ఎన్నికల్లో చంద్రబాబు, మోదీ కలసి నడిచారు. వస్తే చూద్దాంలే అన్నట్టు మోదీ బోలెడు వాగ్దానాలు చేశారు. ఢిల్లీకి దీటుగా కాపిటల్ కడదామన్నారు. ఈ మాటకి నామాలవాడు సాక్షి. అందుకే నామం పెట్టారనే మాట వాడుకలో ఉంది. చంద్రబాబు మునుపటిలాగే, అంటే వాజ్‌పేయి హయాంలో లాగే ఇటు రాష్ట్రాన్ని అటు కేంద్రాన్ని దున్ని పడెయ్యవచ్చని ఊహించారని, మోదీ దగ్గర పప్పులుడకడం లేదని బీజేపీ వర్గాలు వ్యాఖ్యానిస్తుంటాయ్. గడచిన మూడేళ్లలో చంద్రబాబుకి ప్రధాని బొమ్మలు చూపించారు. మొన్న ఆఖరి బడ్జెట్ కూడా వచ్చాక బాబుకి అర్థమైంది. ఇన్నాళ్లూ ఎండమావి వెనకాల దాహం తీర్చుకోడానికి ఆ విధంగా ముందుకు పోతూ ఉన్నామని టీడీపీ నేతకి అర్థమైంది.

అక్షర తూణీరం



'కళ్లు తెరవరా నరుడా' అని వాళ్లు వీళ్లు ముందునించే హెచ్చరిస్తుంటే, ''మీకు తెలియదు. కేంద్రంలో సయోధ్యగా లేకపోతే పనులు సాగవ్. ప్రాజెక్టులు రావు. ఎయిమ్స్ నుంచి 'జడ్' డూమ్స్ దాకా ఏవీ రావు'' అని సర్వజ్ఞుడిలా వాదించారు. తీరా ఇప్పుడు కథ అడ్డం తిరిగింది.

చివరి బడ్జెట్‌లో కూడా ఆంధ్రప్రదేశ్‌ని ఏ మాత్రం పట్టించుకోలేదు. మిత్రపక్షమన్న ఆధికృత అసలే లేదు. పోనీ మహా కాపిటల్ అంటే చంద్రబాబు సొంత సరదా అనుకుందాం. పోలవరం అందరిదీ కదా. రైల్వేజోన్‌కి ఏమొచ్చింది? చంద్రబాబు వచ్చే ఎన్నికలకి పోలవరం ట్రంప్‌కార్డ్‌గా వాడదామనుకుని కొండంత ఆశ పెట్టుకున్నారు. ఇప్పుడది పూర్తవడానికి ఇంకా మూడేళ్లు కనీసం పడుతుంది– అదీ కేంద్ర నిధులు వడివడిగా అందితే. అందుకని చంద్రబాబు లౌక్యం వీడకుండానే నిరసనగళం విప్పారు. అయినా కదలిక లేదు. మోదీ నాడి మన నేతకి అంతు చిక్కడం లేదు. ఈ సందర్భంలో సమీకరణాలు మారుతున్నాయి. అన్యాయం, అన్యాయం అంటూ అందరూ ఉద్యమానికి నడుం బిగిస్తున్నారు. ''ఇది చినికి చినికి గాలివాన అయితే, వైఎస్సార్‌సీపీ లేదా ఇతర కూటములు పోరుకి నాయకత్వం వహిస్తే...'' ఇంకా ఇలాంటి కొన్ని పీడ కలలు బాబుని వేధిస్తున్నాయ్. పోనీ బీజేపీని కాదని ఒంటరి పోరుకి దిగుదామంటే ధైర్యం బొత్తిగా చాలడం లేదు. ఎందుకంటే ఎన్నడూ స్వశక్తితో గెలిచిన వైనం ఆయనకు లేదు. మోదీ బుజ్జగింపుల బేరానికి రాకపోతే, చంద్రబాబు ''మోదీ వ్యతిరేక కూటమికి'' సారథ్యం వహిస్తారని విశ్లేషకులు అంటున్నారు. పవర్ లేమితో నకనకలాడుతున్నవారు, మోదీ హవా లేని దక్షిణాదివారు ఏకమైతే, కుర్చీ నాలుగు కోళ్లలో మూడు సాధ్యం. ఆ ఒక్క కోడు చంద్రబాబు ఏదో రకంగా సాధిస్తాడని నమ్మకం. వ్యతిరేక పరిస్థితుల్ని అనుకూలంగా మలచుకోవటంలో ఆయన దిట్ట!

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

నా గొంతు నొక్కేయాలనుకుంటున్నారు

- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజం
- చిక్కంలో వారు వేసే 'పచ్చ'గడ్డి నేను తినడం లేదు
- అమిత్ షా నన్ను మందలించారనడం అవాస్తవం
- ప్రాణం ఉన్నంత వరకూ పార్టీ కోసం కృషి చేస్తా



సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో తన గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. ఆయన శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. ''కొన్ని శక్తులు నా గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నాయి. చిక్కంలో వారు వేసే 'పచ్చ'గడ్డి నేను తినడం లేదు. ప్రాణం ఉన్నంత వరకూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తా. అమిత్ షా నన్ను మందలించారంటూ కొన్ని పత్రికల్లో తప్పుడు వార్తలు రాస్తున్నారు. నాపై రాతలు రాసేవారు బాగా డిప్రెషన్‌లో ఉన్నట్లున్నారు'' అని వీర్రాజు అన్నారు.

ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు?

''రాజకీయాల్లోకి వచ్చే ముందు రెండు, నాలుగు ఎకరాలు మాత్రమే ఉన్న నేతలు తర్వాత రూ.వేల కోట్లు ఎలా సంపాదిస్తున్నారు? ఇలా చేస్తూ ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు? సీఎం ఒక్కడినే ఉద్దేశించి నేను మాట్లాడ్డం లేదు. అవినీతికి వ్యతిరేకంగా, అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుంది'' సోము వీర్రాజు స్పష్టం చేశారు.

నిధులకు, బడ్జెట్‌కు సంబంధం లేదు

''రాజధాని అమరావతి డిజైన్లు ఇప్పటికీ ఖరారు కాలేదు. రాజధాని డిజైన్లు, డీపీఆర్ లేకుండానే కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చింది. అమరావతిని హెరిటేజ్ నగరంగా గుర్తించి మరో రూ.500 కోట్లు ఇచ్చింది. ఈ నిధులను ఏం చేశారో చెప్పాలి. 2014లో అంచనాలు పెరగక ముందు పోలవరం ప్రాజెక్టు విలువ రూ.4500 కోట్లు. ఈ నిధులను ఇప్పటికే కేంద్రం ఇచ్చింది. నిధులు ఇవ్వడానికి, బడ్జెట్‌కు సంబంధం లేదు. దేశంలో అర్బన్ హౌసింగ్ కింద అన్ని రాష్ట్రాలకు కేంద్రం 10 లక్షల ఇళ్లు ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కు 6 లక్షల ఇళ్లు ఇచ్చింది. తెలంగాణలో ఇంటి నిర్మాణానికి చదరపు గజం ధర రూ.1,200 కాగా, ఏపీలో రూ.2,200. ఇదీ ఇక్కడి ప్రభుత్వం చేస్తున్న నిర్వాకం'' అని వీర్రాజు ధ్వజమెత్తారు.

రాజధానిలో ఎంతమేర భవనాలు కట్టారో చెప్పాలి

బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ డిమాండ్

సాక్షి, రాజమహేంద్రవరం: ''రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లు ఇచ్చింది. ఆ నిధులతో కోటి చదరపు గజాల విస్తీర్ణంలో భవనాలు కట్టొచ్చు. ఇప్పటి వరకు ఎంతమేర కట్టారో టీడీపీ నేతలు సమాధానం చెప్పాలి'' బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన నిధులను సరైన రీతిలో ఖర్చు చేయకుండా కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ అసత్య ప్రచారం చేయడం తగదని అన్నారు. విభజన హామీలను కేంద్రం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ విషయంలో బీజేపీ ఎవరికీ సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వ్యాపారవేత్తగా రాజకీయాల్లోకి వచ్చిన టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఆలోచనా పరిధి ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం చూసేలా ఉందని విమర్శించారు. ప్రత్యేక హోదాతో వచ్చే రాయితీల వల్ల వ్యాపారవేత్తలకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుందన్నారు.

యువ శాస్త్రవేత్తలు పరిశోధనను ఆలస్యం చేయకూడదు

స్పెయిన్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జౌమ్ అంగ్వేరా

బెంగళూరు: యువ శాస్త్రవేత్తలు పరిశోధనను ఆలస్యం చేయకూడదని స్పెయిన్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, బార్సిలోనా వర్సిటీ ప్రొఫెసర్ డా.జౌమ్ అంగ్వేరా సూచించారు. శుక్రవారం ఆయన బెంగళూరులోని రెవా యూనివర్సిటీలో జరిగిన 'సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్సెస్ ఇన్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ అండ్ కమ్యూనికేషన్స్(ఐసీఏఈసీసీ 2018)' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, పరిశ్రమల్లో జరిగే కార్యకలాపాలకు పరిశోధనలే వెన్నెముకగా ఉంటాయని తెలిపారు. ఐఈఈఈ బెంగళూరు విభాగ చైర్మన్ సుధీంద్ర కౌశిక్, రెవా వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు. నేడు(శనివారం) కార్యక్రమానికి ఆఖరిరోజు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది ప్రతిభావంతులైన స్కాలర్లు తమ ఆలోచనలను పంచుకోనున్నారు.

కాంట్రాక్ట్ వ్యవసాయంతో రైతులకు మేలు

నీతిఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్

సాక్షి, అమరావతి: పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమవుతుంటే.. దీనికి కాంట్రాక్ట్ వ్యవసాయం పరిష్కారమని నీతిఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ తెలిపారు. ఈ విధానంలో ముందుగానే కార్పొరేట్ సంస్థలు కొనుగోలు ధరను నిర్ణయిస్తాయని, దీనికి నచ్చిన రైతులే పంటలు వేస్తారు కాబట్టి ఎలాంటి నష్టం ఉండదని ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గినా కాంట్రాక్టర్లు ఒప్పంద ధరనే చెల్లిస్తారన్నారు. రెండు రోజులపాటు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో సాగవుతున్న సహజ వ్యవసాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవసాయం లేదా రైతులంతా ఒక సంఘంగా ఏర్పడినప్పుడు మాత్రమే ఈ ధరల హెచ్చుతగ్గులను తట్టుకోగలమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనమైతే ఆ నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తున్నాయన్నారు.

ఆర్టీసీ ఆస్తుల పంపిణీ తేలేనా?

నేడు హైదరాబాద్‌లో షిలాభిడే కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఆస్తుల పంపిణీపై కీలక సమావేశం నేడు(శనివారం) హైదరాబాద్‌లో జరగనుంది. షెడ్యూల్ 9, 10 సంస్థల్లో ఆస్తుల పంపిణీ కమిటీకి చైర్మన్‌గా ఉన్న షిలాభిడే ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులతో భేటీ కానున్నారు. 14 ఆస్తుల్లో వాటా దక్కాల్సిందేనని ఏపీఎస్‌ఆర్టీసీ గతం నుంచి పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. అయితే టీఎస్‌ఆర్టీసీ మాత్రం బస్‌భవన్ ఒక్కటే ఉమ్మడి ఆస్తి అని స్పష్టం చేసింది. ఆస్తుల పంపిణీపై గతేడాది జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు విభేదించుకున్నారు. టీఎస్‌ఆర్టీసీ అధికారులు బోర్డు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. బస్‌భవన్ బుక్ వాల్యూ ప్రకారం ఏపీఎస్‌ఆర్టీసీకి ఆస్తి దక్కుతుందని టీఎస్‌ఆర్టీసీ స్పష్టం చేయడంతో అప్పట్లోనే ఏపీఎస్‌ఆర్టీసీ షిలాభిడే కమిటీకి ఫిర్యాదు చేసింది. రెండు రాష్ట్రాల ఆర్టీసీలు పరిపాలన పరంగా విడిపోయినప్పటికీ, సాంకేతికంగా ఇంకా విభజన జరగలేదు. ఈ భేటీలోనైనా ఆస్తుల పంపిణీ కొలిక్కి వస్తాయని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

4 ఏళ్లు మౌనం.. 4 రోజుల నాటకం

▶ మొదటి పేజీ తరువాయి

పోరాడాల్సిన ప్రభుత్వం, తన రాజకీయ అవసరాలకోసం కేవలం ప్రజల దృష్టిని మరల్చేందుకు, అనుకూల మీడియా సహాయంతో పార్లమెంటు సాక్షిగా ప్రజల కళ్లకు గంతలు కడుతూ సాగిస్తున్న కపట నాటకం శుక్రవారం పార్లమెంటు వాయిదా తర్వాత పతాకస్థాయికి చేరుకుంది. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభలో శుక్రవారం చేసిన ప్రకటనలో సైతం రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్కటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత టీడీపీ ఎంపీలు ఆయనతో భేటీ జరిపి, రాష్ట్ర విభజన చట్టంలోని అన్ని అంశాలపై 'అభయం' లభించినట్లూ, కేంద్రం దిగివచ్చినట్లూ తమ అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేసుకోవడాన్ని చూసి రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారు. పార్లమెంటులో గట్టిగా తన మిత్రపక్షాన్ని నిలదీయకుండా.. ప్రధాని, ఆర్థికమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో అడ్డుతగలకుండా సహకరిస్తూ.. పార్లమెంటు వెలుపల మాత్రం ఏదో పోరాటం చేస్తున్నామన్న భ్రమ కల్పించడం తప్ప సాధించిందేమీ లేదంటూ విమర్శిస్తున్నారు. ప్రధాని ప్రసంగంలో కానీ, ఆర్థికమంత్రి ప్రసంగంలోకానీ హామీలేమీ పొందకుండా, ప్రధాని విదేశీ పర్యటనకు బయల్దేరిన తర్వాత అన్నింటికీ హామీలు లభించాయని లీకులివ్వడం మోసపూరిత డ్రామాకు పరాకాష్టగా భావిస్తున్నారు.

మనమే ఎక్కువ సాధించాం



- ఏ రాష్ట్రానికైనా ఇంతకన్నా ఎక్కువ వచ్చాయా?
- ఆధారాలుంటే రండి.. చెప్పండి
- ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సవాల్
- ప్రత్యేక హోదాతో సమానమైనవన్నీ వచ్చాయి
- ప్యాకేజీకి చట్టబద్ధతకు ప్రయత్నిస్తున్నాం

బడ్జెట్‌కు ఆమోదం తెలిపి నిరసనలా?

నిజానికి నాలుగేళ్లుగా టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగానే ఉంది. ఆ పార్టీ ఎంపీలు మంత్రులుగా కొనసాగుతూనే ఉన్నారు. బడ్జెట్‌ను కేబినెట్‌లో ఆమోదించాకే పార్లమెంటులో ప్రవేశపెడతారు. అంటే నాలుగేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని టీడీపీ కేంద్రమంత్రులకు స్పష్టంగా తెలుసు. అయినా వారు దానిపై ఏనాడూ పెదవి విప్పిన దాఖలాల్లేవు. కేబినెట్ సమావేశంలో తమ అసమ్మతిని తెలిపినట్లు వార్తల్లేవు. తాజా బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు దాన్ని కేంద్ర మంత్రివర్గంలో ఆమోదించారు. నిజంగా రాష్ట్ర ప్రయోజనాలే భావించి ఉంటే మంత్రివర్గ సమావేశంలోనే బడ్జెట్‌ను ఎందుకు వ్యతిరేకించలేదనే దానికి టీడీపీ నేతలు సమాధానం చెప్పడంలేదు. ప్రతి చిన్న విషయానికి మీడియా సమావేశం పెట్టి గంటల కొద్దీ మాట్లాడే చంద్రబాబు బడ్జెట్‌పై ఇప్పటివరకూ నేరుగా స్పందించలేదు. నాలుగేళ్లుగా కేంద్రాన్ని ఆకాశానికెత్తేస్తున్న ముఖ్యమంత్రి ఇపుడే ఏదో అన్యాయం జరుగుతున్నట్లు, కేంద్రం సహాయం చేయడం లేదన్నట్లు మాట్లాడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం ఏమీ చేయకపోయినా నాలుగేళ్లుగా ఎందుకు పొగుడుతున్నారు..? రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి కేంద్రానికి ఎందుకు సాగిలబడ్డారు..? అని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తీవ్ర అన్యాయానికి గురై రాష్ట్రప్రజలు తీవ్ర అసంతృప్తి జ్వాలల్లో రగిలిపోతుంటే ఇక తమ నాటకాలు సాగేటట్లు లేవని గ్రహించి పార్లమెంటు లోపల, వెలుపల జరుగుతున్న ఆందోళనల్లో టీడీపీ పాలుపంచుకుంటోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలు, ప్రజలు చేస్తున్న ఆందోళనల క్రెడిట్‌ను కూడా టీడీపీకి ఆపాదించేందుకు అనుకూల మీడియా ఆపసోపాలు పడుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ప్రయోజనాలను చంద్రబాబు ఢిల్లీలో తాకట్టు పెట్టారని వారు విమర్శిస్తున్నారు. నాలుగేళ్లుగా కేంద్రంలో భాగస్వాములుగా ఉంటూ, కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే ప్రశంసిస్తూ, కేంద్ర పెద్దల మెప్పు కోసం పాకులాడిన చంద్రబాబు ఉన్నట్టుండి రూటు మార్చేయడం వెనుక రాజకీయ, స్వప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

బంద్‌లోనూ గందరగోళం సృష్టించే యత్నం

బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా వామపక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే దాన్లోనూ చొరబడి ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు టీడీపీ ప్రయత్నించింది. కేంద్రంలో భాగస్వామిగా ఉండి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే తప్పని విమర్శలు రావడంతో... పార్లమెంటులో ఆందోళన చేస్తున్న తమ ఎంపీలకు మద్దతు పేరుతో ప్రదర్శనలు నిర్వహించి అనుకూల మీడియాలో తనకు అనుకూలంగా ప్రచారాన్ని హోరెత్తించింది. నిజానికి గత ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసి... కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి సమాధానం చెప్పాల్సివుంది. నాలుగేళ్లుగా రాష్ట్రానికి ఏం సాధించారో ప్రజలకు వివరించాల్సివుంది. కానీ వాటిపై నోరు మెదపకుండా రాజకీయ అవసరాలే ప్రధానమనుకుని పార్లమెంటులో హడావుడి చేసింది. పోరాటమంటూనే ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగాల సమయంలో మిన్నకుండిపోయారు. సాక్షాత్తూ కేంద్రమంత్రి సుజనా చౌదరి బల్లలు చరిచి ఆమోదం తెలిపారు. పార్లమెంటులో టీడీపీ నాలుగురోజుల పోరాటంలో వారు ఎక్కడా ప్రత్యేక హోదా ప్రస్తావనే చేయకపోవడం ఆ పార్టీ వైఖరికి నిదర్శనంగా నిలుస్తోంది. అందుకే కేంద్రంలో ఉంటూ కేంద్రాన్నే నిలదీస్తున్నట్లు హంగామా సృష్టిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మీడియాలో హడావుడి చేయడం, తామేదో చేశామని చెప్పుకోవడానికి తప్ప ఈ పోరాటం డ్రామా ఎందుకూ పనికి రాలేదని టీడీపీ వర్గాలే మదనపడుతున్నాయి.

పోరాడాల్సింది మరిచి విమర్శలా?

ఒకవైపు ప్రజల్ని మభ్యపెట్టేందుకు పార్లమెంటు లోపలా, బయటా నానా హంగామా సృష్టించడంతోపాటు... విభజన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వైఎస్సార్‌సీపీపై అడుగడుగునా బురదజల్లే ప్రయత్నం చేయడంపై ఆ పార్టీ వర్గాలు టీడీపీపై మండిపడుతున్నాయి. విభజన చట్టంలోని హామీలు, ప్రత్యేకహోదా కోసం ప్రతిపక్షంగా తమ పార్టీ నాలుగేళ్లుగా సాగిస్తున్న అలుపెరుగని పోరాటం వల్లే హోదా కాంక్ష ప్రజల్లో సజీవంగా ఉందని చెబుతున్నారు. ప్రత్యేకహోదాకోసం, హామీల అమలుకోసంతమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హోదా కోసం రాష్ట్రం నలుమూలలా నిర్వహించినటువంటి యువభేరి సదస్సులు, ధర్నాలు, నిరసన దీక్షలు.. ప్రధాని, రాష్ట్రపతి, వివిధ కేంద్రమంత్రులను, వివిధ రాజకీయ పక్షాలను కలిసిన విషయాన్ని వారు ఉదహరిస్తున్నారు. మరోవైపు ముందుండి పోరాడాల్సిన చంద్రబాబు లేని ప్యాకేజీ కోసం ప్రత్యేక హోదా డిమాండ్‌ను నీరుగార్చడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. వీటినుంచి తప్పించుకోవడానికే టీడీపీ జగన్‌పై కేసులున్నాయంటూ తాజాగా విమర్శించి పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తోందని విమర్శిస్తున్నారు. ఆ కేసులన్నీ గతంలో కాంగ్రెస్‌తో కలిసి టీడీపీ పెట్టిన కేసులు కావా? అని ప్రశ్నిస్తున్నారు. బొగ్గు నుంచి ఇసుక వరకు, పంచభూతాలను వదలకుండా రూ.3.75 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ టీడీపీ ప్రభుత్వం, తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే కొత్తగా నాటకాలాడుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఒకరు మండిపడ్డారు. నాలుగేళ్లుగా తాత్కాలిక కట్టడాలు, గ్రాఫిక్స్‌ల పేరుతో కాలం గడిపిన టీడీపీ ప్రభుత్వం వచ్చే ఎన్నికల కోసమే ఇప్పుడు డ్రామాలాడుతోందని అయన ధ్వజమెత్తారు.

ప్రత్యేక హోదాపై సీఎం రాజీ

ఎన్నికలకు ముందు, అధికార పీఠమెక్కాక ప్రత్యేక హోదా వల్లే ఏపీ అభివృద్ధి సాధ్యమని చెప్పిన చంద్రబాబు... ప్రత్యేక హోదా వచ్చేస్తుందంటూ మొదటి రెండేళ్లూ కాలం గడిపేశారు. ఆ తర్వాత హోదా ఇచ్చేది లేదని కేంద్రం తేల్చిచెప్పినా రాజీపడిపోయారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలనే ప్రత్యేక సహాయంగా ప్రకటించినా నోరు విప్పలేదు. అర్ధరాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జైట్లీ ప్రకటనను స్వాగతించారు. దాన్నే ప్రత్యేక ప్యాకేజీగా ప్రజలను నమ్మించేందుకు నానా ప్రయత్నాలు చేశారు. ప్రత్యేక హోదా కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తినా ఖాతరు చేయలేదు. హోదా సంజీవిని కాదని వ్యాఖ్యానించారు. ప్రత్యేక ప్యాకేజీలోని అంశాలను అమలు చేయాలని కూడా అడిగిన దాఖలాలు లేవు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి అయితే కేంద్రం ఇవ్వాల్సినవన్నీ ఇచ్చేసిందని, ఇంతకుమించి ఎవరూ ఇవ్వలేరని, అడిగే హక్కు మనకు లేదని ప్రకటించడం గమనార్హం.

మనమే ఎక్కువ సాధించాం ఇది 'బాబు' మాట

10.9.2016	హోదాకు సమానంగా కేంద్రం ఇస్తామంటున్న నిధులు తీసుకోవద్దా? ప్రతిపక్షం చేస్తున్న బంద్‌కు సహకరించవద్దని ప్రజలను కోరుతున్నా.
11.9.2016	కేంద్రం చెప్పినదానికన్నా అదనంగా ఏం వస్తాయో చెప్పండి. హోదా ఇచ్చినా ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి లేదు. పరిశ్రమలు రావాలంటున్నారు.. వస్తున్న వాటిని వ్యతిరేకిస్తున్నారు.
20.6.2016	నిధులు వద్దంటే ఎలా? ప్యాకేజీ మించి హోదాతో వచ్చేదేంటి? కేంద్రం నుంచి అన్ని నిధులూ రాబడతా. . 2018 కల్లా పోలవరం పూర్తి చేస్తా.
29.10.2016	ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినందుకు, పోలవరం ప్రాజెక్టుని సాకారం చేస్తున్నందుకు జైట్లీకి కృతజ్ఞతలు
26.1.2017	మనమే ఎక్కువ సాధించాం.. ఏ రాష్ట్రానికైనా ఇంతకన్నా ఎక్కువ వచ్చాయా? ఆధారాలుంటే చెప్పండి. ప్రత్యేక హోదాతో సమానమైనవన్నీ వచ్చాయి.
16.3.2017	సయోధ్యతోనే సాధ్యమైంది. సంప్రదింపుల ఫలితంగానే ప్రత్యేకసాయానికి కేంద్ర ఆమోదం. రావాల్సినవన్నీ సాధించుకుంటున్నాం.
17.3.2017	మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు.. ప్యాకేజీకి అధికారికంగా ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు. ఈ మేరకు అసెంబ్లీ తీర్మానం చేస్తున్నాం.

ప్రజాసంకల్ప యాత్ర 83వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 8 గంటలకు దుండిగం క్రాస్ రోడ్డు నుంచి

ముఖ్యాంశాలు

- కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలోని దుండిగం, ఐతంపాడు క్రాస్, మనుబోలుపాడు, లింగాలపాడు క్రాస్, బోడుగుడిపాడులో కొనసాగనున్న యాత్ర
- మనుబోలుపాడు, బోడగుడిపాడులో దివంగత వైఎస్సార్ విగ్రహాలు, పార్టీ జెండా ఆవిష్కరణ
- బోడగుడిపాడులో బహిరంగ సభ

ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్స్ లింక్!

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి ఒకే డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా కేంద్రం చర్యలు తీసుకోనుంది. డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆధార్‌తో లింక్ చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. త్వరలో ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తామని, దీంతో నకిలీ, డూప్లికేట్ లైసెన్స్‌లను గుర్తించవచ్చని పేర్కొంది. ప్రస్తుతం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను మరో రాష్ట్రంలో సీజ్ చేస్తే, ఆ వ్యక్తి తన లైసెన్స్ పోయిందంటూ సొంత రాష్ట్రంలో దరఖాస్తు చేసుకుని మళ్లీ లైసెన్స్ పొందుతున్నాడు. ఆధార్‌తో అనుసంధానం వల్ల ఇకపై ఇలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

ఏపీలో అనుసంధానం ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్సులను ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. రవాణా శాఖ వెబ్‌సైట్‌లో ఫార్మాట్‌ను అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల డ్రైవింగ్ లైసెన్సులున్నాయి. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, రోడ్డు ప్రమాదాల్లో పట్టుబడితే వాహనదారుడి లైసెన్స్‌ను మూడు నెలల నుంచి ఆరు నెలల దాకా సస్పెండ్ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు రవాణా శాఖ చెబుతోంది. సస్పెండ్ చేసిన లైసెన్స్‌లను సైతం ఆధార్‌తో లింక్ చేయనున్నారు. దీంతో వాహనదారుడు మళ్లీ దరఖాస్తు చేసుకుని కొత్త లైసెన్స్ పొందడానికి అవకాశం ఉండదు. ఏపీలో డ్రైవింగ్ లైసెన్స్‌ల సస్పెన్షన్లు, ఆధార్‌తో అనుసంధానం వివరాలను రహదారి భద్రతపై ఏర్పాటైన సుప్రీంకోర్టు కమిటీకి రవాణా శాఖ తెలియజేసింది.

మీ గొప్పల వల్లే తిప్పలు

- పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ధ్వజం
- టీడీపీ వ్యవహార శైలి ఢిల్లీలో నవ్వులపాలు
- హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ పోరాడితే టీడీపీ అవహేళన చేసింది
- బీజేపీతో కాపురం చేస్తున్నారు.. ఒక్క బిడ్డనైనా కనలేకపోయారు
- చంద్రబాబు మితిమీరిన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం
- రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయన్నది మీరే కదా
- బాబు చెబుతున్న అబద్ధాలతో రాష్ట్రానికి తీరని అన్యాయం
- వృద్ధి రేటుపై చంద్రబాబువన్నీ తప్పుడు మాటలే



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న గొప్పల వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని, ఆయన తన ఆడంబరాలతో ప్రజలను నిండా ముంచుతున్నారని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు పాలనే రాష్ట్రానికి సగం అరిష్టమని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాటం విషయంలోనూ చంద్రబాబు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''కేంద్రంపై పోరాటం చేయాలంటూ దుబాయ్‌లో ఉన్న చంద్రబాబు సూచించారట! మరోవైపు కేంద్ర మంత్రి సుజనా చౌదరి బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని 15 రోజుల్లో పరిష్కరించాలని లోక్‌సభలో అన్నారు. చంద్రబాబు ఒకలా, సుజనా చౌదరి మరోలా మాట్లాడడం ఏమిటి? ఇది చాలదన్నట్లు ఢిల్లీలో ఒకరేమో ఛర్నాకోలతో కొట్టుకుంటారు, ఓ ఎమ్మెల్యే గుండు గీయించుకుని డ్రామాలు ఆడుతారు. టీడీపీ వ్యవహారం ఢిల్లీలో నవ్వుల పాలవుతోంది. విభజన చట్టంలో పొందుపర్చిన హామీలన్నీ అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ తొలి నుంచీ పోరాడుతోంది. కానీ, టీడీపీ గతంలో మా పార్టీ పలుమార్లు అవహేళన చేస్తూ మాట్లాడింది'' అని బుగ్గన పేర్కొన్నారు.

హామీలన్నీ అమలు చేయాల్సిందే

''విభజన సందర్భంగా రాష్ట్రానికి పదేళ్ల పాటు ఇస్తామన్న ప్రత్యేక హోదాను ఇచ్చి తీరాలి. పోలవరం ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలి. విశాఖపట్నానికి రైల్వే జోన్ ఇవ్వాలి. కడపలో స్టీల్ ఫ్లాంట్ నెలకొల్పాలి. చట్టంలోని 46వ సెక్షన్‌లో ఉన్న 2, 3 అంశాల ప్రకారం, 94వ సెక్షన్‌లో ఉన్న 2, 3 అంశాల ప్రకారం వెనుకబడిన రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతానికి పరిశ్రమలు రావడానికి కేంద్రం పెట్టుబడులు పెట్టాలి. పెట్రో కెమికల్ కాంప్లెక్స్, దుగరాజపట్నం ఓడరేవు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలి. అలాగే 13వ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో విద్యాసంస్థలను స్థాపించాలి'' రాజేంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మీ సంకీర్ణ కాపురానికి ప్రతిఫలం ఏంటి?

సంకీర్ణ ధర్మమని, సహకారమని చెబుతున్న చంద్రబాబు నాలుగేళ్లుగా బీజేపీతో కాపురం చేస్తున్నారు. మంచి పిల్లలను కంటారని రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూశారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. వీరిద్దరూ కాపురం చేస్తున్నారు గానీ నిత్యం కొట్లాడుకుంటూనే ఉన్నారు. బీజేపీ–టీడీపీ కాపురం ద్వారా పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, విభజన చట్టంలోని హామీల అమలును పిల్లల రూపంలో కనలేక పోయారు. టీడీపీ వాళ్లు బీజేపీతో కలహాల కాపురం చేస్తారే గానీ ప్రభుత్వం నుంచి బయటకు మాత్రం రారు'' అని రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

బాబువి అవకాశవాద రాజకీయాలు

''చంద్రబాబు మితిమీరిన అవకాశవాది. 1985 నుంచీ వామపక్షాలు, బీజేపీ వంటి పార్టీలతో జతకడుతూ విడిపోతూ వచ్చారు. 1985లో టీడీపీ వామపక్షాలు, బీజేపీతో జతకట్టింది. 1999 వచ్చే నాటికి బీజేపీ కలయికతో అధికారంలోకి వచ్చింది. 2004 ఎన్నికల్లో ఓటమి పాలైన తరువాత బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. ఇక ఎప్పుడూ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని చంద్రబాబు అన్నారు. 2009లో టీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి ఎన్నికలకు వెళ్లారు. మళ్లీ 2014లో బీజేపీ, జనసేనతో జతకలిసి ఎన్నికల్లో పోటీ చేశారు. ఇన్ని రకాలుగా పొత్తులు కుదుర్చుకున్న చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఈ చరిత్ర అంతా తెలియదు'' అని బుగ్గన చెప్పారు.

వృద్ధిరేటుపై లేని గొప్పలెందుకు?

''ఆర్థిక వృద్ధిరేటులో ప్రపంచంలో, దేశంలో తామే నెంబర్ వన్ అని చంద్రబాబు లేని గొప్పలు ఎందుకు చెప్పుకుంటున్నారు? జాతీయ స్థూల వృద్ధి రేటు 6 నుంచి 7 శాతంగా ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో వృద్ధి రేటు 11, 12 శాతం ఉన్నట్లుగా చంద్రబాబు చెప్పుకుంటున్నారు. ఏపీలో భారీ వృద్ధిరేటు ఉంటే రెవెన్యూ లోటు ఎందుకు ఏర్పడింది? అని ప్రశ్నిస్తే.. చేపల ఉత్పత్తి పెరిగినందువల్ల మంచి వృద్ధి రేటు వచ్చిందని చంద్రబాబు విచిత్రమైన సమాధానాలు చెబుతున్నారు. వాస్తవానికి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ(ఎంపెడా) లెక్కల ప్రకారం చేపల ఉత్పత్తి 40 నుంచి 30 శాతానికి తగ్గింది. చంద్రబాబు మాత్రం పెరిగిందంటున్నారు'' అని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దుయ్యబట్టారు.

బాహుబలి సెట్టింగ్‌లేనా?

''అప్పటి యూపీఏ ప్రభుత్వం, ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ అంగీకారంతోనే రాష్ట్ర విభజన జరిగింది. అందుకే విభజన చట్టంలోని హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఉంది. చంద్రబాబు తన అనుకూల మీడియాలో తనకు ఇష్టం వచ్చినట్లుగా ప్రచారం చేయించుకుంటున్నారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై దుబాయ్ నుంచి చంద్రబాబు మాత్రమే గట్టిగా పోరాడుతున్నారని ఆయన అనుకూల మీడియా ప్రసారం చేస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని వైఎస్సార్‌సీపీ గట్టిగా పోరాటం చేస్తే, ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ చాలని చెప్పింది చంద్రబాబే. రాజధాని విషయంలో చంద్రబాబు ఇప్పటికీ ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయారు. న్యూయార్క్, సింగపూర్ అన్నారు. చివరకు బాహుబలి సెట్టింగ్‌ల వద్దకు వచ్చారు'' అని బుగ్గన ధ్వజమెత్తారు.

అంతా బాగుంటే ఎవరైనా సాయం చేస్తారా?

''భాగస్వామ్య సదస్సుల ద్వారా రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయనడం శుద్ధ అబద్ధం. నిజంగా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు యువతకు ఉద్యోగాలు ఎందుకు రాలేదు? వస్తే గతేడాది అక్టోబర్ నాటికి డీఐపీపీ లెక్కల ప్రకారం.. రాష్ట్రానికి రూ.4,300 కోట్ల పెట్టుబడులే వచ్చాయి. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలను అందరూ నమ్మే అవకాశం ఉంది. దానివల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది. అంతా బాగున్న రాష్ట్రానికి ఇక మేం సాయం చేసేదేమిటనే అభిప్రాయానికి వస్తారు. చంద్రబాబు తప్పుడు మాటల వల్ల 15వ ఆర్థిక సంఘం కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది'' అని బుగ్గన ఆందోళన వ్యక్తం చేశారు.

జనాన్ని మభ్యపెడుతున్నారు

''ఇప్పటి వరకూ ఈ రాష్ట్రానికి చంద్రబాబే ఇబ్బంది అనుకుంటే, ఇప్పుడు ఆయన కుమారుడు కూడా విచిత్రమైన ప్రకటనలు చేస్తున్నారు. అమెరికాలో కూడా టీడీపీయే అధికారంలోకి వస్తుందని లోకేశ్ చేసిన ప్రకటన నవ్వులపాలవుతోంది. వాస్తవానికి చంద్రబాబు పరిపాలనే రాష్ట్రానికి సగం అరిష్టం. కొత్త ఇంగ్లీషు పదాలను ఉచ్చరిస్తూ జనాన్ని మభ్యపెడుతున్నారు. ప్రతిపక్షం సహకరించడం లేదని చంద్రబాబు చెప్పడం దారుణం. మాకు సహకరించండి అని చంద్రబాబు ఏనాడూ ప్రతిపక్షాన్ని కోరలేదు. 1952 నుంచి 1956 వరకూ బెంగళూరులో అప్పటి ముఖ్యమంత్రులు కేసీరెడ్డి, హనుమంతయ్యా వంటి వారు దేశంలోనే అందమైన విధాన సౌధను నిర్మించారు. కానీ, ఆంధ్రప్రదేశ్ నాలుగేళ్లయినా డిజైన్లే పూర్తి కాలేదు'' అని రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు.

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు





ప్రకాశంచౌక్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

సాక్షి, అమరావతి: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) 25వ రాష్ట్ర మహాసభలకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం ముస్తాబైంది. శనివారం నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలు జరగనున్నాయి. వచ్చే మూడేళ్ల కాలానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని, కార్యాచరణను నేతలు రూపొందించనున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏయే శక్తులతో కలవాలో, ఏయే వర్గాలతో విభేదించాలో నిర్ణయించనున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడంతో సీపీఎం మహాసభ ముగుస్తుంది. గడచిన నాలుగేళ్లుగా లెఫ్ట్ పార్టీలు ప్రత్యేకించి సీపీఎం అటు దేశంలో, ఇటు రాష్ట్రంలోనూ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో పూర్వవైభవం సాధించాలని పార్టీ నాయకత్వం తహతహలాడుతోంది.

ప్రజా సమస్యలపై పోరుబాట: సాంకేతికంగా ఇది సీపీఎం 25వ రాష్ట్ర మహాసభ అయినప్పటికీ రాష్ట్ర విభజన అనంతరం జరుగుతున్న రెండో మహాసభ. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం లేనప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను తారుమారు చేయగలిగిన సత్తా సీపీఎంకు ఉంది. ఓట్లు, సీట్లుతో నిమిత్తం లేకుండా ఇటీవలి కాలంలో పలు సామాజికాంశాలపై నిరంతర పోరాటాలు సాగిస్తోంది. పోలవరం, వంశధార ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్య, తుందుర్రు మెగా ఆక్వా ఫుడ్ పార్క్, గరగపర్రు దళితుల సమస్య, విద్య, వైద్యం, పర్యావరణం తదితర అంశాలపై ఉద్యమిస్తోంది. 2015లో పార్టీ మహాసభ తీసుకున్న నిర్ణయం మేరకు లాల్–నీల్ జెండాలను (వామపక్ష శక్తులు, దళితులను) ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ దిశగా విశాల ప్రాతిపదికన వేదికలు ఏర్పాటు చేసేందుకు నడుం కట్టింది. బీజేపీని ఓడించడం, కాంగ్రెస్‌ను ఒంటరి చేయడం, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేసుకోవడం, ప్రజా సమస్యలపై చట్ట సభల లోపల, బయట లౌకిక ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోరాడాలన్నది సీపీఎం విధానం.

పూర్తయిన ఏర్పాట్లు: మూడు రోజుల సీపీఎం మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భీమవరంలో వీధులన్నీ అరుణ పతాకాలతో నిండిపోయాయి. మహాసభలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరవుతున్నారు. సౌహార్ద్ర ప్రతినిధిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందేశం ఇస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు మహాసభ లాంఛనంగా ప్రారంభమవుతుంది.

పొత్తులపై సమయం వచ్చినప్పుడు ఆలోచిస్తాం

– పి.మధు



భీమవరం టౌన్: వచ్చే ఎన్నికల్లో పొత్తులపై సమయం వచ్చినప్పుడు ఆలోచిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు స్పష్టం చేశారు. ముందు ప్రజా సమస్యలపై ఉద్యమాలు, ఆ తర్వాతే పొత్తులపై ఆలోచనలు అని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం భీమవరంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న సీపీఎం 25వ రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన వైద్య, విద్యా సంస్థలు, రైల్వే జోన్‌పై కేంద్రం నాటకాలాడుతోందని విమర్శించారు. ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీ కావాలన్న సీఎం చంద్రబాబు కేంద్ర బడ్జెట్‌ను చూశాక ఏం సమాధానం చెబుతారని పి.మధు ప్రశ్నించారు.

రాజ్యసభ ఎన్నికలపై ఈసీ నిఘా!

- కేంద్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి వినతి
- అక్రమ కేసులతో మా ఎమ్మెల్యేలను అరెస్టులు చేయాలని చూస్తున్నారు
- అధికార పార్టీ అక్రమాలను నిరోధించండి
- ఉన్నతాధికారులు సతీష్ చంద్ర, డీజీ వెంకటేశ్వరరావు టీడీపీ తొత్తుల్లా వ్యవహరిస్తున్నారు



శుక్రవారం ఢిల్లీలో సీఈసీ రావత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ వి. విజయసాయిరెడ్డి

> టీడీపీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ మా పార్టీ ఎమ్మెల్యేలతో బేరసారాలు నడుపుతున్నారు. అధికార పార్టీకి చెందిన మరో నలుగురు నేతల వివరాలు కూడా త్వరలోనే వెల్లడిస్తాం

> పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ చేస్తున్న కాలయాపన గురించి ఈసీకి వివరించాం

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని, తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేస్తోందని వైఎస్సార్‌సీపీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీన్ని అడ్డుకునేందుకు రాజ్యసభ ఎన్నికలపై నిఘా ఏర్పాటు చేసి పరిశీలకులను పంపాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ఒ.పి. రావత్‌ను వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి కోరారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఢిల్లీలో ఒ.పి.రావత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు హైదరాబాద్‌లో నిర్వహించండి: 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన టీడీపీ.. రాజ్యసభ ఎన్నికల్లో నెగ్గేందుకు మరో నలుగురిని కొనుగోలు చేసేందుకు బేరసారాలు చేస్తోందని విజయసాయిరెడ్డి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 25 కోట్ల వరకు ఆఫర్ చేస్తున్న విషయాన్ని ఈసీ దృష్టికి తెచ్చారు. ప్రలోభాలు, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఎన్నికలను అమరావతిలో కాకుండా హైదరాబాద్‌లో చేపట్టాలని కోరారు.

మా ఎమ్మెల్యేల అరెస్టుకు కుట్ర: రాజ్యసభ ఎన్నికల్లో విపక్ష ఎమ్మెల్యేలు ఓటు హక్కు వినియోగించుకోకుండా తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేసేందుకు టీడీపీ కుట్ర చేస్తోందని ఈసీ దృష్టికి తెచ్చారు. ఎన్నికల తేదీకి పది రోజులు ముందు నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ఎలాంటి అరెస్టులు చేయకుండా ఏపీ పోలీసులను ఆదేశించాలని కోరారు. పరిశీలకులను పంపి ఎన్నికలపై ఎప్పటికప్పుడు ఈసీకి వివరాలు అందేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాబు అవినీతి పాలనపై నమ్మకం లేదు: చంద్రబాబు అక్రమంగా సంపాదించిన రూ. 1.50 లక్షల కోట్లను విదేశాలకు హవాలా మార్గంలో తరలించారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. బాబు అవినీతి పాలనపై నమ్మకం లేకనే రాజ్యసభ ఎన్నికలు హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరుతున్నట్టు చెప్పారు. బాబు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయారని గుర్తు చేశారు. రాజ్యసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తాము చేసిన విజ్ఞప్తులపై రావత్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఉద్యోగాలు వదిలి టీడీపీలో చేరండి..: అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తీరుపై విజయసాయిరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఐఏఎస్ అధికారి సతీష్ చంద్ర, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ వెంకటేశ్వరరావు టీడీపీ తొత్తులుగా పని చేస్తున్నారని విమర్శించారు. ఈ అధికారులు టీడీపీ కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేలతో బేరసారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయాలపై వారికి ఆసక్తి ఉంటే ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేస్తే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఈ విషయాలను కూడా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు.

ఈ ఏడాది శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబరు 13–21వరకు వార్షిక, అక్టోబరు 10–18వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- వైభవంగా నిర్వహిస్తాం: టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



గరుడవాహన సేవలో అశేష జనవాహిని, ఇన్‌సెట్‌లో గరుడ వాహనంపై స్వామివారు (ఫైల్)

సాక్షి, తిరుమల: అధిక మాసం సందర్భంగా ఈ ఏడాది తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 13 నుండి 21 వరకు వార్షిక, అక్టోబరు 10 నుండి 18వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు పూటకో వాహనంలో, వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేయనున్నారు.

రెండు బ్రహ్మోత్సవాలెందుకు?

వేంకటాచల క్షేత్రంలో వెలసిన శ్రీనివాసుడు బ్రహ్మదేవుడిని పిలిచి జగత్కల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. ఆ ప్రకారం బ్రహ్మదేవుడు శ్రవణా నక్షత్రం నాటికి పూర్తయ్యే విధంగా తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారట. తొలిసారిగా బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాలను నిర్వహించడంవల్ల అవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధిపొందాయి.

– దసరా నవరాత్రులు, కన్యామాసం (అశ్వయుజం)లో వేంకటేశ్వరుడు అర్చామూర్తిగా ఆవిర్భవించిన శ్రవణ నక్షత్రం శుభ ముహూర్తాన చక్రస్నానం నాటికి తొమ్మిది రోజుల ముందు ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించటం అనాదిగా వస్తున్న ఆచారం.

– సూర్యచంద్ర మాసాల్లో ఏర్పడే వ్యత్యాసంవల్ల ప్రతీ మూడేళ్లకోసారి అధిక మాసం వస్తుంది. ఇందులో భాగంగా కన్యామాసం (అధిక భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవం, దసరా నవరాత్రులలో (అశ్వయుజం)లో నవరాత్రి బ్రహ్మోత్సవం నిర్వహించడం కూడా సంప్రదాయం.

రెండు బ్రహ్మోత్సవాల్లో వ్యత్యాసం?

– వార్షిక బ్రహ్మోత్సవాల్లో వైఖానస ఆగమోక్తంగా వైదిక ఉపచారాల ప్రకారం ధ్వజస్థంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురువేయటం (ధ్వజారోహణం), బలి ఆచారాలు, మహారథోత్సవం, శ్రవణా నక్షత్రంలో చక్రస్నానం, ధ్వజావరోహణం వంటివి నిర్వహిస్తారు.

– నవరాత్రి ఉత్సవాల్లో మాత్రం వైదిక ఆచారాలు (ధ్వజారోహణం, ధ్వజావరోహణం) లేకుండా ఆగమోక్తంగా ఉత్సవాలను అలంకారప్రాయంగా నిర్వహిస్తారు. ఎనిమిదో రోజు స్వర్ణరథంపై స్వామివారిని ఊరేగిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో జాతీయ స్థాయి కళా బృందాలు

శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం, ఈసారి ఉత్సవాల్లో జాతీయ స్థాయి కళారూపాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. స్వామివారి వైభవాన్ని బ్రహ్మోత్సవాల్లో చాటుతాం

– అనిల్‌కుమార్ సింఘాల్, ఈవో, టీటీడీ

వార్షిక బ్రహ్మోత్సవాలు

తేది	ఉదయం	రాత్రి
13-09-2018	ధ్వజారోహణం	సా.6గం.లకు పెద్ద శేషవాహనం
14-09-2018	చిన్నశేషవాహనం	హంసవాహనం
15-09-2018	సింహవాహనం	ముత్యపుపందిరి వాహనం
16-09-2018	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
17-09-2018	మోహినీ అవతారం	గరుడ వాహనం
18-09-2018	హనుమంత వాహనం,	సా. స్వర్ణ రథోత్సవం; రా. గజవాహనం
19-09-2018	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
20-09-2018	రథోత్సవం	అశ్వ వాహనం
21-09-2018	చక్రస్నానం	ధ్వజావరోహణం

నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తేది	ఉదయం	రాత్రి
10-10-2018	బంగారు తిరుచ్చి	పెద్ద శేషవాహనం
11-10-2018	చిన్నశేష వాహనం	హంసవాహనం
12-10-2018	సింహవాహనం	ముత్యపుపందిరి వాహనం
13-10-2018	కల్పవృక్షవాహనం	సర్వభూపాల వాహనం
14-10-2018	మోహినీ అవతారం	గరుడ వాహనం
15-10-2018	హనుమంత వాహనం,	సా.పుష్పక విమానం; రా. గజవాహనం
16-10-2018	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
17-10-2018	స్వర్ణరథోత్సవం	అశ్వ వాహనం
18-10-2018	చక్రస్నానం	బంగారు తిరుచ్చి



స్వామివారి ధ్వజారోహణం

వేడుకగా సర్వేశ్వరుని ధ్వజారోహణం

శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సర్వేశ్వరుని ధ్వజారోహణం వేడుకగా నిర్వహించారు. దేవస్థానంలో స్వామివారి సన్నిధిలో ఉన్న స్వర్ణ ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ముందుగా దేవస్థానం నుంచి పూజా సామగ్రిని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. తర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతోపాటు పంచమూర్తులను, త్రిశూలాన్ని విశేషంగా అలంకరించి ధ్వజస్తంభం వద్దకు చేర్చారు. ధ్వజానికి నాలుగువైపులా పంచమూర్తులను ఉంచారు. అనంతరం కలశస్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరిపించాలని దేవతామూర్తులను ఆహ్వానించారు. ఉదయం, రాత్రి పట్టణ పురవీధుల్లో పంచమూర్తుల ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో భ్రమరాంబ, ఈఈ వెంకటనారాయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ నవీన్‌రావుకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈవో కేఎస్.శ్రీనివాసరాజు

సాక్షి, తిరుమల: ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్ రావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము అభిషేకసేవలో జస్టిస్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత వకుళ మాతను దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, తిరుమల జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు లడ్డూప్రసాదాలు అందజేశారు. వీరి వెంట తిరుమల ప్రోటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ఉన్నారు.

నాలుగేళ్లలో రూ.45,120 కోట్ల వడ్డీలేని రుణాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగేళ్లలో రూ.45,120 కోట్లను డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలుగా ఇచ్చినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. 'డ్వాక్రా మహిళల బతుకు దయనీయం' అనే శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గత ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాల పట్ల చూపిన నిర్లక్ష్యం కారణంగా బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు అందక అధిక వడ్డీకి వ్యాపారస్తుల నుంచి అప్పులు తీసుకొని తిరిగి చెల్లించలేక వారి కుటుంబ ఆదాయం తగ్గిందన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు డ్వాక్రా సంఘాలకు, బ్యాంకుల లింకేజీ రుణాలు, స్త్రీనిధి బ్యాంకు ద్వారా వడ్డీలేని రుణాలు రూ.45,120 కోట్లు ఇవ్వడం వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలిపారు.

ప్రత్యేక హోదాకు మద్దతు: రాహుల్ గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి/బళ్లారి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు విభజన చట్టంలోని ఇతర హామీల అమలు కోసం తమ పార్టీ మద్దతు ఇస్తుందని, ఏపీకి న్యాయం జరిగే వరకు అన్ని పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించుకోనేందుకు రాష్ట్రానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీ ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎంపీలు కేవీపీ రామచంద్రారావు, టి.సుబ్బిరామిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ఇతర కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నిరసన చేపట్టారు.

నేడు కర్ణాటకకు రాహుల్

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేటి(శనివారం) నుంచి నాలుగు రోజుల పాటు కర్ణాటక ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బళ్లారి, రాయచూరు, కొప్పళ, యాదగిరి, బీదర్, కలబురిగి, గుల్బర్గా జిల్లాల్లో పలు ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించనున్నారు. శనివారం మధ్యాహ్నం రాహుల్ బళ్లారి జిల్లా హొసపేటకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసే ఎస్టీల సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం కర్ణాటకలో ప్రముఖ మఠాల్లో ఒకటైన గవిసిద్దేశ్వర స్వామి మఠం సందర్శిస్తారు. 11న కొప్పళ, 12న రాయచూరు జిల్లాల్లో పర్యటించి పలు ప్రార్థనా మందిరాలను సందర్శిస్తారు.

మయూర వాహనంపై మల్లికార్జునుడు

- టీటీడీ, కాణిపాకం తరపున మల్లన్నకు పట్టువస్త్రాలు
- రేపటి నుంచి 16 వరకు అలంకార దర్శనం
- రూ.15లక్షల బకాయిలు టీటీడీ తరపున చెల్లింపు



మయూర వాహనసేవలను నిర్వహిస్తున్న ప్రధానార్చకులు

శ్రీశైలం: కర్నూలు జిల్లా శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం రాత్రి శ్రీ భ్రమరాంబ సమేతుడైన మల్లికార్జునుడు మయూర వాహనాన్ని అధిష్టించి ప్రధాన మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చాడు. మహాశివరాత్రి పర్వదినానికి మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ఇప్పటికే రెండు లక్షలకు పైగా భక్తులు శ్రీశైలానికి చేరుకున్నట్లు అంచనా. కాగా.. అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మయూర వాహనంపై ఉంచి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

పట్టు వస్త్రాల సమర్పణ

కాగా, శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవ కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరపున ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, ఓఎస్‌డీ శేషాద్రి పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే, కాణిపాకం వరసిద్ధి వినాయకుని తరపున ఆ దేవస్థానం ఈఓ పూర్ణచంద్రారావు పట్టువస్త్రాలు అందజేశారు. ఇదిలా ఉంటే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆదివారం నుంచి ఈ నెల 16 వరకు మల్లన్న అలంకార దర్శనాన్ని ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి 7.30 గంటల వరకు మాత్రమే స్పర్శ దర్శనం ఉంటుంది. సాధారణ, శివదీక్షా భక్తులతో పాటూ వీఐపీలు మొదలైన వారందరికీ 11 నుంచి 16 వరకు మల్లన్న సర్వదర్శనం మాత్రమే ఉంటుంది. కాగా, శ్రీ భ్రమరాంబదేవి సువర్ణ గర్భాలయ పనులకు సంబంధించిన రూ.15 లక్షల బకాయిలను టీటీడీ దేవస్థానం తరపున చెల్లించి మాఫీ చేస్తున్నట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం తెలిపారు. స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం శ్రీశైల దేవస్థానం ఈఓ భరత్‌గుప్త శ్రీశైలం అభివృద్ధికి టీటీడీ సహకారం కోరారు. దేవస్థానానికి బంగారు గోపుర పనులకు సంబంధించిన బకాయి ఉందని తెలియ జేయగా.. టీటీడీ తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈఓ హామీ ఇచ్చారు.

పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వినతి
- ఫాతిమా విద్యార్థుల సమస్యపై మంత్రి నడ్డాతోనూ భేటీ



ఫాతిమా విద్యార్థుల సమస్యపై ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. పోలవరం అంశంపై నితిన్ గడ్కరీతో శుక్రవారం ఆయన భేటీ అయి వినతిపత్రం ఇచ్చారు. అందులోని అంశాలు.. 'కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నప్పుడు 90 : 10 నిష్పత్తిలో నిధులు వస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా సంతోషించారు. ఆ తర్వాత మీరు 100 శాతం వ్యయం భరిస్తామని చెప్పడం సంతోషం కలిగించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తగిన నైపుణ్యం, అనుభవం, ప్రణాళికలేని కారణంగా జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రాజెక్టును 2018లోగా పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పుడు 2019కి పెంచారు. పైగా పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను మళ్లించారని వార్తలు వస్తున్నాయి. కొత్త కాంట్రాక్టర్ పాత ధరలకే పనులు చేస్తామని రాగా.. మరి ఏపీ ప్రభుత్వం కొత్తగా అంచనాలు సవరిస్తూ రూ. 58,000 కోట్లకు ఎందుకు పెంచి మీకు సమర్పించినట్టు? సవరించిన అంచనాలకు ప్రాతిపదిక ఏమిటో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. పోలవరంపై రోజుకో తీరు ప్రకటన వెలువడుతోంది. వీటన్నింటిపై మీరు ఒక శ్వేతపత్రం విడుదల చేయాలి'.. అని వైవీ సుబ్బారెడ్డి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.

'ఫాతిమా' సమస్యపై సంప్రదింపులు

ఇదిలా ఉంటే, ఫాతిమా కళాశాల విద్యార్థుల సమస్యపై మరోసారి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అంశంపై అటార్నీ జనరల్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్టు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి తెలిపారు. ఫాతిమా కళాశాల విద్యార్థులకు న్యాయం చేయాలని మరోసారి ఆయన శుక్రవారం జేపీ నడ్డాను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో 6 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయని, ఒక్కో కళాశాలలో 17 సప్లిమెంటరీ సీట్లను సృష్టించి వీరికి సీట్లు కేటాయించాలని కోరారు.

రైల్వే బోర్డు చైర్మన్‌తో వెలగపల్లి భేటీ

కాగా, తిరుపతి ఎంపీ వెలగపల్లి వరప్రసాద రావు రైల్వే బోర్డు చైర్మన్ అశ్వనీ లోహానీతో శుక్రవారం భేటీ అయ్యారు. తిరుపతిలో రెండు, సూళ్లూరుపేటలో ఒక సబ్ వేల నిర్మాణంపై విన్నవించారు. తిరుపతిలోని రాయలచెరువు వద్ద, వెంకటేశ్వర థియేటర్ వద్ద సబ్‌వేల నిర్మాణానికి చైర్మన్ సమ్మతించారని, ఇందుకు రైల్వేశాఖ టెండర్లు పిలిచిందని వెలగపల్లి అనంతరం ఒక ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేటలో సబ్‌వేను త్వరగా నిర్మించేందుకు చైర్మన్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

చిరుత దాడిలో బాలుడి మృతి

టీ.నగర్(చెన్నై): చిరుతదాడిలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన తమిళనాడులోని వాల్‌పారై సమీపంలో జరిగింది. తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూరు జిల్లా వాల్‌పారై సమీపంలోని నడుమలై ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ముత్తలికి ఇద్దరు పిల్లలు. రెండో కుమారుడు సైదులు(4) అంగన్‌వాడీలో చదువుతున్నాడు. సైదుల్ గురువారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ చిరుత బాలుడిని లాక్కెళ్లింది. గమనించిన స్థానికులు చిరుత కోసం గాలించినా కనిపించలేదు. సంఘటన జరిగిన ప్రాంతం నుంచి కిలోమీటరు దూరంలో బాలుని తల, మొండెం విడివిడిగా లభించాయి.



ఓట్ల తొలగింపుపై ఎన్నికల అధికారి సిసోడియాకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అంబటి రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రావి వెంకటరమణ తదితరులు

వైఎస్సార్‌సీపీ ఓట్లు గల్లంతు

ఓట్ల తొలగింపుపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన నేతలు

సాక్షి, హైదరాబాద్: ఏపీలో వైఎస్సార్‌సీపీ ఓట్లు గల్లంతు అవుతున్నాయని ఆ పార్టీ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వారు శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్నికల అధికారి సిసోడియాను నేతలు కలిసి ఏపీ ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు చేశారు. తాను గుంటూరు జిల్లా, నరసరావుపేటలోని 150 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటర్ గా ఉండేవాడినని, ప్రస్తుతం తన ఓటు 162 పోలింగ్ బూత్‌లోకి మారిందని గోపిరెడ్డి తెలిపారు. ఇలా నరసరావుపేటలో 21 వేలకు పైగా ఓటర్లను సర్వే పేరుతో ఇష్టారీతిన ఇతర బూత్‌లకు మార్చారని విమర్శించారు.

సత్తెనపల్లిలో అక్రమంగా ఓట్ల తొలగింపు

సత్తెనపల్లిలో ప్రతి నాలుగు ఓట్లలో ఒక ఓటు తొలగించారని అంబటి రాంబాబు మండిపడ్డారు. టౌన్‌లో 43 వేల ఓట్లు ఉండగా, వెరిఫికేషన్ పేరుతో 9,632 కోట్లు తొలగించారని తెలిపారు. తన ఓటు, తన భార్య ఓటు, ఇద్దరు పిల్లల ఓట్లు తీసేశారని, ఇదేమి న్యాయమని మండిపడ్డారు. నిబంధల ప్రకారం ఓటు తొలిగించే ముందు ఓటరుకు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని, కానీ అలాంటి పద్ధతిని పాటించలేదని వాపోయారు. ఎమ్మెల్యే కోడెల శివప్రసాదరావు, సత్తెనపల్లి వీఆర్వో, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కలిసి కుట్ర పూరితంగా తమ ఓట్లు తొలగించారని ఆరోపించారు. దీనిపై తాను కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని, ఆయన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. గతంలో పట్టణంలో 44,107 ఓట్లు ఉండగా ప్రస్తుతం 34,475 ఓట్లు మాత్రమే ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఓ వర్గం వారి ఓట్లనే టార్గెట్ చేసి తొలగించారని ఆరోపించారు. పట్టణంలోని పోలేరమ్మ వీధి ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కాపు వర్గానికి చెందిన 50 మందికి పైగా ఓట్లను తొలగించారని తెలిపారు. రాజుపాలెం, నకరికల్లు, సత్తెనపల్లి రూరల్ మండలాల్లో కూడా ఇదే పరిస్థితిలో ఓట్లు గల్లంతయ్యాయని చెప్పారు. వినుకొండ నియోజవర్గంలో కొత్తగా ఓటర్లు నమోదు చేసుకొన్న వారి దరఖాస్తులు పరిశీలించకుండానే పక్కన వేస్తున్నారని ఆరోపించారు. గల్లంతైన ఓట్లపై విచారణ జరిపించి న్యాయం చేయాలని ఎన్నికల అధికారిని కోరారు.

ఇక ఒకే టైమ్!

- రూ.100 కోట్లతో త్వరలో ప్రాజెక్టు ప్రారంభం
- బ్యాంకింగ్, టెలికాం, రైల్వేల్లో కీలక మార్పులకు అవకాశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ఒకే ప్రామాణిక సమయాన్ని అమల్లోకి తేవడానికి కేంద్రం త్వరలో కొత్త ప్రాజెక్టును ప్రారంభించనుంది. ఇందుకోసం రూ.100 కోట్లు వెచ్చించనున్నట్లు సమాచారం. ఇది ఆచరణకు నోచుకుంటే ఒకే ప్రామాణిక సమయంతో పాటు మరింత కచ్చితత్వంతో కూడిన సమయ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. దీని వల్ల బ్యాంకింగ్, టెలికాం, వాతావరణ అంచనా, విపత్తు నిర్వహణ, రైల్వే ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ తదితర రంగాల్లో ఏకరూపత రావడంతో పాటు పలు ఇతర కీలక మార్పులు చోటుచేసుకుంటాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐదు ప్రాంతీయ రెఫరెన్స్ స్టాండర్డ్స్ లేబొరేటరీ(ఆర్ఆర్ఎస్ఎల్)ల మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు అలాంటివి మరో రెండింటిని నెలకొల్పుతారు. అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, ఫరీదాబాద్, గువాహటిల్లో ఉన్న ల్యాబ్‌ల బలోపేతానికి నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ(ఎన్‌పీఎల్) సాయం తీసుకుంటారు.



జాతీయ భద్రతకే..: దేశవ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్‌లు, కంప్యూటర్లను ఒకే జాతీయ గడియారంతో అనుసంధానించడం తప్పనిసరని వినియోగదారుల వ్యవహారాల శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వేర్వేరు రంగాల్లో వేర్వేరు ప్రామాణిక సమయాలు అమల్లో ఉండటం వల్ల సైబర్ నేరాల విచారణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వ్యూహాత్మక ప్రణాళికలు, జాతీయ భద్రత నిమిత్తం ఈ మేరకు మార్పులు జరగాలని అన్నారు. ఒకే ప్రామాణిక సమయంతో మొబైల్ ఫోన్ బిల్లులు కూడా తగ్గుతాయని ఆ శాఖ కార్యదర్శి అవినాశ్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదించిన రూ.100 కోట్లలో ఈ ఏడాది బడ్జెట్‌లోనే రూ.20 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. టెలికాం, ఇంటర్నెట్ సేవలందిస్తున్న సంస్థలు ఒకే ప్రామాణిక సమయాన్ని పాటించడం లేదని సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శుల బృందం లోగడే తేల్చింది.

'నీతి' ఆరోగ్య సూచీలో కేరళ టాప్

8, 11 స్థానాల్లో ఏపీ, తెలంగాణ.. చివరి స్థానంలో యూపీ



నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ వెల్లడించిన ఆరోగ్య సూచీలో కేరళ మొదటి స్థానంలో నిలిచింది. వైద్యసదుపాయాలు, శిశు మరణాల రేటు, ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు, సంపూర్ణ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం అమలు, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు వంటి వివిధ అంశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. 'ఆరోగ్యవంతమైన రాష్ట్రాలు, ప్రగతిశీల భారతం: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ర్యాంకుల రిపోర్టు' పేరుతో నీతి ఆయోగ్–ప్రపంచబ్యాంకు సంయుక్తంగా రూపొందించిన ఈ జాబితాను శుక్రవారం విడుదల చేశారు. గుజరాత్ నాలుగో స్థానంలో ఉంది. గతంతో పోలిస్తే ఇటీవల వైద్యప్రమాణాలు మెరుగుపరుచుకున్నప్పటికీ ఉత్తరప్రదేశ్ అట్టడుగు స్థానంలో నిలిచింది. జాబితాలో దారుణమైన పనితీరును కనబరిచిన రాష్ట్రాలుగా రాజస్తాన్, బిహార్, ఒడిశా నిలిచాయి. ఏపీ 8వ స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే మెరుగైన వైద్యవసతులు కల్పిస్తున్న జాబితాలో జార్ఖండ్, జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్ తొలిమూడు స్థానాల్లో ఉన్నాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాలను మరింత ప్రోత్సహిస్తామని.. ఈ జాబితా విడుదల సందర్భంగా నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ పేర్కొన్నారు. జాబితాలో తొలిస్థానంలో నిలవటం.. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని కేరళ ఆరోగ్య మంత్రి కేకే శైలజ వెల్లడించారు.

తొలి మూడు	తుది మూడు
కేరళ	బిహార్
పంజాబ్	రాజస్తాన్
తమిళనాడు	ఉత్తరప్రదేశ్

ఉత్తరాఖండ్‌లో సినిమా షూటింగ్ ఉచితం


డెహ్రాడూన్: సినిమా నిర్మాతలు, దర్శకులకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇకపై ఉత్తరాఖండ్‌లో ఉచితంగా సినిమా షూటింగ్‌లు జరుపుకోవచ్చని ఆ రాష్ట్ర సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ చెప్పారు. సినిమా షూటింగ్‌లకు ఉత్తరాఖండ్‌ను కేంద్రస్థానంగా మార్చడంలో భాగంగా చిత్రీకరణ ఫీజును రద్దుచేశామన్నారు. తెహ్రీ పట్టణంలో శుక్రవారం షాహిద్ కపూర్ నటిస్తున్న 'బిజ్లీ గుల్ మీటర్ చాలూ' చిత్రం ముహూర్తపు సన్నివేశానికి రావత్ క్లాప్ కొట్టారు. ప్రకృతి సౌందర్యంతో అలరారే ఉత్తరాఖండ్ సినిమాల చిత్రీకరణకు అద్భుతమైన చోటని రావత్ వ్యాఖ్యానించారు.

తుపాకీకి తుపాకీతోనే సమాధానం: యోగి



గోరఖ్‌పూర్: హింసకు పాల్పడే వారికి అదే రీతిలో సమాధానం చెప్పాలని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. యూపీలో ఇటీవల ఎన్‌కౌంటర్లు పెరగాయనే విమర్శలపై ఆయన ఇలా స్పందించారు. 'అందరికీ భద్రత కల్పించడం ప్రభుత్వం కనీస బాధ్యత. సమాజంలో ప్రశాంతతను చెదరగొడుతూ తుపాకీని నమ్మే వారికి తుపాకీ భాషలోనే సమాధానం చెప్పాలి. ఈ విషయంలో ఆందోళన చెందనక్కర్లేదని అధికారులకు చెప్పాను' అని యోగి అన్నారు. అంతకు ముందు లక్నోలో విలేకర్లలో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా వారు అమర్యాద, పరుషంగా వ్యవహరించారన్నారు.

జస్టిస్ లోయా మృతిపై సిట్ విచారణ జరపండి



న్యూఢిల్లీ: సీబీఐ జడ్జి బీహెచ్ లోయా మృతిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ బృందంతో విచారణ జరిపించాలని ప్రతిపక్ష ఎంపీలు రాష్ట్రపతి కోవింద్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ నేతృత్వంలో విపక్ష పార్టీలకు చెందిన ఎంపీల బృందం రాష్ట్రపతిని కలసి వినతిపత్రం అందచేసింది. 'ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థిస్తున్నాం. సీబీఐ, ఎన్ఐఏలపై మాకు విశ్వాసం లేదు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఎంపికచేసిన స్వతంత్ర అధికారుల బృందంతో దర్యాప్తు చేయించాలని మేం కోరుతున్నాం' అని పేర్కొన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలకు చెందిన 114 మంది ఎంపీలు వినతిపత్రంపై సంతకాలు చేశారు.

బ్రిటిషర్లు కట్టిన బ్రిడ్జీలే నయం..!

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం తర్వాత కట్టిన రైల్వే వంతెనలతో పోలిస్తే బ్రిటిష్ హయాంలో కట్టిన కొన్ని వంతెనలే పటిష్ట స్థితిలో ఉన్నాయని ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) అభిప్రాయపడింది. 'భారతీయ రైల్వేల్లో వంతెనల నిర్వహణ' పేరిట రూపొందించిన నివేదికను కాంగ్రెస్ నేత ఖర్గే నేతృత్వంలోని పీఏసీ పార్లమెంటులో ప్రవేశపెట్టింది. రైల్వే వంతెనల నిర్మాణం నాసిరకంగా ఉండటానికి అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని నివేదికలో తెలిపింది. వంతెనల నిర్మాణంలో రైల్వే శాఖ అలసత్వం ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని వ్యాఖ్యానించింది. 3,979 రైల్వే వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వగా, 2015 నాటికి కేవలం 710 బ్రిడ్జీలే పూర్తికావడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

బీజేపీని గెలిపించింది మందిర నిర్మాణానికే

ఔరంగాబాద్: అయోధ్యలో రామ మందిర నిర్మాణానికే ప్రజలు బీజేపీకి అధికారం అప్పగించారని, ట్రిపుల్ తలాక్‌పై చట్టాలు చేయడానికి కాదని విశ్వ హిందూ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తొగాడియా వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వంపై పరోక్ష విమర్శలు చేసిన తొగాడియా..రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా చట్టం చేయాలన్నారు. 'ప్రజలు మీకు ట్రిపుల్ తలాక్‌పై చట్టాలు చేయడానికి ఓట్లేయలేదు. రామ మందిర నిర్మాణం కోసమే పట్టం గట్టారు' అని ఔరంగాబాద్‌లో అన్నారు. ట్రిపుల్ తలాక్‌పై చట్టం చేయడం, చేయకపోవడం ప్రభుత్వ ఇష్టమని, కానీ రామ మందిర నిర్మాణానికి మాత్రం చట్టం రూపొందించాలన్నారు.

నీట్ ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి మే 6న నిర్వహించబోయే నీట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మార్చి 9 రాత్రి 11.50 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సీబీఎస్ఈ ప్రకటించింది. మార్చి 10 రాత్రి 11.50 గంటల లోపు ఫీజు చెల్లించవచ్చు. అసోం, మేఘాలయ, కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తప్ప మిగిలిన వారంతా దరఖాస్తు సమయంలో తప్పనిసరిగా ఆధార్ సంఖ్య వెల్లడించాలి. www. cbseneet. nic. in వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తులు పంపాలి.

మళ్లీ జైట్'లై' అన్న రాహుల్

న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పందంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని లక్ష్యంగా చేసుకున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ఆయన పేరు విరుపులతో ట్వీట్ చేశారు. 'డియర్ మిస్టర్ జైట్లై(Jaitlie)..రక్షణ కొనుగోళ్ల వివరాలను యూపీఏ బహిర్గతం చేయలేదన్నారు కదా..మీవి అబద్ధాలని నిరూపించేందుకు అప్పుడు పార్లమెంట్‌లో మేము ఇచ్చిన వివరణలు ఇవిగో' అని పేర్కొన్నారు. ఆ ట్వీట్‌ను పోస్ట్ చేసే ముందు స్పెల్లింగ్ చెక్ చేసుకున్నారా? అని విలేకర్లు అడగ్గా...నేను స్పెల్లింగ్ చెక్ చేసుకోవాలా? అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు.

పంటల ఎమ్మెస్పీ సూత్రమిదే!

- మద్దతు ధర నిర్ణయించిన విధానాన్ని రాజ్యసభకు తెలిపిన జైట్లీ
- 2014 ఎన్నికల మేనిఫెస్టో ప్రకారమే మద్దతు ధర
- యూపీఏ హయాంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమని విమర్శ
- మార్చి 5కు ఉభయసభలు వాయిదా



రాజ్యసభలో మాట్లాడుతున్న మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించటంలో అనుసరించనున్న సూత్రాన్ని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. బడ్జెట్‌లో 2019 ఖరీఫ్ సీజన్‌లో పంట ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్ల మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 'వాస్తవ ఉత్పత్తి వ్యయం, రైతు కుటుంబసభ్యుల శ్రమ వ్యయాన్ని కలపగా వచ్చిన మొత్తానికి 50 శాతం అదనంగా చేర్చి మద్దతు ధరగా నిర్ణయించాం' అని జైట్లీ వెల్లడించారు. మద్దతు ధరపై అనుసరించిన విధానాన్ని వెల్లడించాలంటూ.. విపక్షాలు, వ్యవసాయ నిపుణులు డిమాండ్ చేసిన నేపథ్యంలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాజ్యసభలో శుక్రవారం జైట్లీ ఈ ప్రకటన చేశారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి గోధుమ, వరి పంటలనే (రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై అందించేందుకు) సేకరిస్తున్నప్పటికీ.. 23 వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించింది. ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించినప్పటికీ.. రైతులకు చేరటం లేదని జైట్లీ అంగీకరించారు. 'రైతులకు ఎంఎస్పీ చేరాలనే లక్ష్యంతోనే బడ్జెట్‌లో ప్రతిపాదనలిచ్చాం. అన్ని పంటలకు ఒకే విధానాన్ని అమల్లోకి తీసుకున్నాం. సాగుకు అయిన వ్యయం (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, నీటిపారుదల ఖర్చులు, చెల్లించిన కూలీలు.. ఇతరత్రా), రైతు కుటుంబసభ్యుల శ్రమకు విలువకట్టిన మొత్తాన్ని కలుపుకుని దీనికి ఒకటిన్నర రెట్ల మద్దతు ధర నిర్ణయించాం' అని జైట్లీ వెల్లడించారు.

భయంకరమైన డాక్టర్ చేతుల్లో..

యూపీఏ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ పదేళ్లపాటు 'భయంకరమైన డాక్టర్' చేతిలో ఉందని జైట్లీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను చేర్చారని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరంపై తీవ్ర విమర్శలు చేశారు. నిర్మాణాత్మక సంస్కరణల కారణంగా 2014 నుంచి భారత ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందని జైట్లీ పేర్కొన్నారు. యూపీఏ హయాంలో జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు, కరెంట్ అకౌంట్ డెఫిసిట్‌లను సభకు వెల్లడించారు. ప్రస్తుత వివరాలను అందించిన మార్పును సభ్యులు అర్థం చేసుకోవాలన్నారు. కాగా, కేంద్ర బడ్జెట్ ప్రజలను మోసం చేసేదిగా ఉందని.. తృణమూల్, ఎస్పీ, సీపీఐ, ఎన్సీపీ, ఆప్ సభ్యులు మండిపడ్డారు. ఫేకూ ఫెడరలిజం (అవాస్తవ సమాఖ్య వ్యవస్థ), అహంకారాన్ని ఎన్డీయే ప్రదర్శిస్తోందని విమర్శించారు.

పార్లమెంటు వాయిదా

తీవ్రమైన నిరసనలు, సభ్యుల ఆందోళనల మధ్య పార్లమెంటు ఉభయసభలు మార్చి 5కు వాయిదా పడ్డాయి. శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సాయంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. అటు రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు వివరాలు వెల్లడించాలంటూ కాంగ్రెస్ ఎంపీలు కూడా వెల్‌లోకి దూసుకెళ్లటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. నిరసనల మధ్యే కాసేపు సభను నడిపించిన స్పీకర్ సుమిత్ర మహాజన్.. కాసేపటి తర్వాత మార్చి 5కు సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి అర్ధభాగం ముగిసింది. అటు రాజ్యసభలోనూ బడ్జెట్‌పై చర్చ జరగకుండా ఏపీ ఎంపీలు అడ్డుకున్నారు. వెల్‌లోనే బైఠాయించారు. అయితే ఏపీ ఎంపీలను బయటకు పంపి బడ్జెట్‌పై చర్చ, జీరో అవర్‌ను నిర్వహించాలని తృణమూల్, కాంగ్రెస్ ఎంపీలు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడును కోరారు. అయినా నిరసనలు ఆగకపోవటంతో వెంకయ్య సభను రెండుసార్లు వాయిదా వేశారు. బడ్జెట్‌పై చర్చ జరిగాక రాజ్యసభ మార్చి 5కు వాయిదా పడింది.

సీఏసీపీ సూచనల ప్రకారమే!

ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు, ధరలు కమిషన్ (సీఏసీపీ) సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం ఎంఎస్పీని నిర్ణయిస్తుంది. ఈ సంస్థ మూడు సూత్రాలను ప్రభుత్వానికి సూచించింది. ఏ2 (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు, ఇంధనం, నీటిపారుదల తదితర ఖర్చులు కలుపుకుని), ఏ2+ఎఫ్ఎల్ (ఏ2కు పంట ఉత్పత్తిలో పనిచేసినందుకు గానూ రైతు కుటుంబీకుల శ్రమను కలుపుకోవాలి), సీ2 (పై రెండు కలుపుకుని, పంట కోసం తన ఆస్తులు, బంగారం మొదలైనవి తాకట్టుపెట్టి తెచ్చిన మొత్తానికి వడ్డీ కలుపుకుని) అని మూడు వేర్వేరు విధానాలను ప్రతిపాదించింది. 2006లో వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ వ్యవసాయ కమిషన్ కూడా పంట వ్యయానికి (ఏ2+ఎఫ్ఎల్) 50 శాతం ఎక్కువ మద్దతు ధర సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీకూడా పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అధిక మద్దతు ధర చెల్లిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది.

పశ్చిమాసియాతో బంధం కీలకం

జోర్డాన్ రాజుతో ప్రధాని మోదీ భేటీ



జోర్డాన్ రాజుతో ప్రధాని మోదీ ఆలింగనం

న్యూఢిల్లీ/రమల్లా/ అమాన్: నాలుగు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం జోర్డాన్ చేరుకున్నారు. జోర్డాన్ రాజధాని అమాన్‌లో మోదీకి ఆ దేశ ప్రధాని హని అల్– ముల్కి ఘన స్వాగతం పలికి, ఆయన్ను రాజప్రాసాదానికి తీసుకెళ్లారు. అక్కడ మోదీకి రాజు అబ్దుల్లా–2 సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చలు జరిపారు. రాజు అబ్దుల్లా–2తో చర్చలు ఫలప్రదంగా ముగిశాయని తర్వాత మోదీ అన్నారు. భారత విదేశీ సంబంధాల్లో పశ్చిమాసియాకు కీలక స్థానం ఉందని తెలిపారు. శనివారం పాలస్తీనా వెళ్లనున్న మోదీ ఆ దేశ ప్రధాని మహ్మద్ అబ్బాస్‌తో భేటీ అవుతారు. భారత్ ప్రధాని ఒకరు పాలస్తీనాలో పర్యటించటం ఇదే ప్రథమం. అక్కడి నుంచి యూఏఈ వెళతారు. ఆ దేశ పాలకుడు, ప్రధానితో పాటు, అక్కడి భారతీయ వాణిజ్యవేత్తలతో సమావేశమవుతారు. ఇంధన భద్రత, మౌలికరంగాల్లో యూఏఈ సుమారు 11 మిలియన్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆదివారం దుబాయ్‌లో నిర్మించిన హిందూ దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో పాల్గొని కీలక ఉపన్యాసం చేస్తారు. అక్కడి నుంచి పర్యటనలో చివరిగా ఒమన్ చేరుకుంటారు. ఒమన్ సుల్తాన్‌తో పాటు ముఖ్యనేతలతో పాటు అక్కడి ముఖ్య వ్యాపారవేత్తలతో భేటీ అయి పలు వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంటారు.

భారత్ పాత్ర కీలకం: అబ్బాస్

పశ్చిమాసియా శాంతి చర్చల్లో భారత్ కీలక పాత్ర పోషించాలని పాలస్తీనా ప్రధాని మహ్మద్ అబ్బాస్ ఆకాంక్షించారు. ప్రధాని మోదీ చారిత్రక పర్యటన సందర్భంగా ఈ విషయమై చర్చిస్తామని వివరించారు. ఇజ్రాయెల్‌తో తుది ఒప్పందం కుదిరేలా అన్ని వర్గాలతో కలిపి ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలనే విషయంపైనా మోదీతో మాట్లాడుతానన్నారు.

బడ్జెట్‌ను ప్రజలకు వివరించండి!

కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న పేదలు, రైతుల అనుకూల సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఎంపీలకు మోదీ సూచించారు. క్షేత్రస్థాయిలో ఈ పథకాలను వివరించటంలో ఎంపీలు ప్రయత్నంపైనే వచ్చే ఎన్నికల్లో పార్టీ ప్రదర్శన ఆధారపడి ఉంటుందన్నారు. శుక్రవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నేతలనుద్దేశించి మోదీ మాట్లాడారు. బూత్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు వివరించాలని.. వీటిని మరింత విస్తృతం చేసేందుకు ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీలకు సూచించారు.

చారిత్రక కరచాలనం



ప్యాంగ్‌చాంగ్: బద్ధ శత్రువులైన ఉభయ కొరియా దేశాల మధ్య సామరస్యం, సౌభ్రాభృత్వం వెల్లివిరిశాయి. దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో శుక్రవారం వింటర్ ఒలంపిక్స్ ప్రారంభ వేడుకల కార్యక్రమం ఇందుకు వేదికైంది. దక్షిణ కొరియా, ఉత్తర కొరియా క్రీడాకారుల బృందాలు కలసి ఒకే జెండా కింద పరేడ్‌లో పాల్గొన్నాయి. అథ్లెట్ల పరేడ్ జరుగుతున్నప్పుడు, వీఐపీ గ్యాలరీలోకి అడుగుపెడుతున్నప్పుడు దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే–ఇన్ .. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ చెల్లి కిమ్ యో జోంగ్‌తో రెండుసార్లు కరచాలనం చేశారు. ఎన్ని విభేదాలున్నా శాంతి, సామరస్యంతో కలసి మెలసి జీవించేలా ఉభయ కొరియాలు స్ఫూర్తినిస్తున్నాయని ఒలంపిక్ కమిటీ చైర్మన్ థామస్ బాచ్ వ్యాఖ్యానించారు.

పాక్ ఉచ్చులో ఐఏఎఫ్ అధికారి



అరుణ్ మర్వాహా

- అశ్లీల చిత్రాలకు బదులుగా ఐఎస్ఐకి భారత రహస్య సమాచారం చేరవేత
- అరెస్ట్ చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు

న్యూఢిల్లీ: భారత వాయుసేన(ఐఏఎఫ్) గ్రూప్ కెప్టెన్ అరుణ్ మర్వాహా(51)ను గూఢచర్యం ఆరోపణల కింద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫేస్‌బుక్‌లో అందమైన అమ్మాయిల ముసుగు(హనీట్రాప్)లో పరిచయమైన ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లకు అరుణ్ రహస్య సమాచారాన్ని చేరవేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో నిందితుడిపై అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 3, 5 కింద కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఐఏఎఫ్ ప్రధాన కార్యాలయంలో పారా జంపింగ్‌తో పాటు గరుడ కమెండోలకు అరుణ్ శిక్షకుడిగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌లో ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు మోడల్స్‌గా అరుణ్‌కు ఫేస్‌బుక్‌లో పరిచయమైనట్లు పేర్కొన్నారు. వీరిద్దరూ అరుణ్‌తో వాట్సాప్‌లో తరచుగా సంభాషించేవారనీ, రొమాంటిక్ సందేశాలను పంపేవారని తెలిపారు. కొద్దిరోజుల తర్వాత నిందితుడికి ఐఎస్ఐ ఏజెంట్లు అమ్మాయిల అశ్లీల చిత్రాలు పంపేవారనీ, ఇందుకు ప్రతిగా ఐఏఎఫ్‌కు చెందిన రహస్య సమాచారాన్ని అందజేయాల్సిందిగా కోరేవారని వెల్లడించారు. వీరి వలలో చిక్కుకున్న అరుణ్ సైబర్ విభాగం, అంతరిక్ష రంగంతో పాటు 'గగన్ శక్తి' వంటి ఐఏఎఫ్ ప్రత్యేక ఆపరేషన్లకు సంబంధించిన రహస్య పత్రాలను వాట్సాప్ ద్వారా ఐఎస్ఐకి చేరవేశాడని పేర్కొన్నారు. అరుణ్ ప్రవర్తనపై అనుమానమొచ్చిన ఓ ఐఏఎఫ్ ఉన్నతాధికారి అంతర్గత విచారణకు ఆదేశించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. దీంతో జనవరి 31న అరుణ్‌ను ఐఏఎఫ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ అదుపులోకి తీసుకుందని తెలిపారు. దాదాపు 10 రోజుల విచారణ అనంతరం అరుణ్‌ను ఇక్కడి పటియాలా కోర్టుకు బుధవారం తరలించగా.. న్యాయస్థానం ఐదు రోజుల పోలీస్ కస్టడీకి అప్పగించిందని వెల్లడించారు. అరుణ్ ఫోన్‌ను ఇప్పటికే ఫోరెన్సిక్ పరీక్షలకు పంపామనీ, ఈ కుట్రలో నిందితుడితో పాటు మరెవరైనా ఉన్నారా? అన్న విషయమై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో దోషిగా తేలితే అరుణ్‌కు 14 ఏళ్ల వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

'మాల్దీవుల'పై మోదీ మంతనాలు

ట్రంప్‌తో చర్చల్లో అఫ్గాన్, రోహింగ్యా సమస్యలు



వాషింగ్టన్: మాల్దీవుల అంతర్గత సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో చర్చలు జరిపారు. ఇరువురి నేతల మధ్య అఫ్గానిస్తాన్, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రతా పరిస్థితి, రోహింగ్యాల అంశాలూ ప్రస్తావనకు వచ్చినట్లు వైట్‌హౌజ్ తెలిపింది. మాల్దీవుల్లో అత్యయిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేసిన ట్రంప్, మోదీ..అక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థల పునరుద్ధరణ, పౌర హక్కుల పరిరక్షణ ప్రాధాన్యతపై చర్చించారని శ్వేతసౌధం పేర్కొంది. ట్రంప్ దక్షిణాసియా విధానానికి అనుగుణంగా అఫ్గానిస్తాన్‌లో శాంతి, స్థిరత్వం సాధించేందుకు కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. మయన్మార్ నుంచి బంగ్లాదేశ్ వలసొచ్చిన రోహింగ్యా ముస్లింల దుస్థితిపై చర్చించారు. ఉత్తరకొరియా అణు పరీక్షల అంశమూ చర్చకొచ్చింది. ఏప్రిల్‌లో జరగాల్సిన ఇరుదేశాల రక్షణ, విదేశాంగ మంత్రుల స్థాయి సమావేశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత్‌తో మరో సమస్య కాకూడదు: చైనా

మాల్దీవుల సంక్షోభ పరిష్కారానికి భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని చైనా పేర్కొంది. భారత్‌తో తమ సంబంధాల్లో ఈ వ్యవహారం మరో సమస్యగా మారాలని కోరుకోవడం లేదని స్పష్టం చేసింది.మాల్దీవుల సార్వభౌమత్వాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించి తదనుగుణంగా మసలుకోవాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ శుక్రవారం సూచించారు. మాల్దీవుల్లో మోహరించడానికి భారత బలగాలు సిద్ధంగా ఉన్నాయన్న వార్తలపై స్పందిస్తూ..ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చకపోవడం అంతర్జాతీయ సంబంధాల్లో ముఖ్య సూత్రమని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, మాల్దీవుల్లో పరిస్థితి మరింత క్షీణించే అవకాశాలున్నాయని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.

గ్రీన్‌కార్డుల్లో జాప్యానికి ముగింపు!



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిస్తోన్న వలస విధానం అమల్లోకి వస్తే.. నిపుణులైన ఉద్యోగులకు గ్రీన్‌కార్డుల జారీలో జాప్యానికి తెరపడనుందని వైట్‌హౌస్ పేర్కొంది. ఒక్కో దేశానికి కోటా ప్రకారం గ్రీన్‌కార్డుల కేటాయింపుల్ని రద్దు చేయాలని భారతీయ హెచ్–1బీ వీసాదారులు డిమాండ్ చేస్తోన్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది. గత వారం రోజులుగా భారత్‌కు చెందిన నిపుణులైన ఉద్యోగులు అమెరికాలోని పలు ప్రాంతాల నుంచి వాషింగ్టన్ చేరుకుని.. ప్రస్తుత వలస విధానంలో మార్పు తీసుకురావాలని కోరుతూ ట్రంప్ యంత్రాంగం, అమెరికన్ కాంగ్రెస్ సభ్యులపై ఒత్తిడి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా అనుసరిస్తోన్న వలస విధానం వల్ల హెచ్–1బీ వీసాపై అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయ– అమెరికన్లు ఎక్కువగా నష్టపోతున్నారు. గ్రీన్‌కార్డు కోసం వారు గరిష్టంగా 70 ఏళ్లు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 'ప్రతిభ ఆధారిత వలస విధానానికే ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. దీంతో అత్యుత్తమ నిపుణులైన ఉద్యోగుల్ని ఆకర్షించవచ్చు. అందుకనుగుణంగా వీసా లాటరీ విధానానికి స్వస్తి చెప్పేలా ట్రంప్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది' అని వైట్‌హౌస్ డిప్యూటీ మీడియా కార్యదర్శి రాజ్ షా చెప్పారు. 'వీసా లాటరీ విధానానికి ముగింపు పలికే సమయం దగ్గరపడింది. మెరుగైన వలస విధానాన్ని రూపొందించడంతో పాటు అమెరికన్ల భద్రతకు కాంగ్రెస్ కృషిచేయాల్సిన అవసరముంది' అని ట్వీటర్‌లో ట్రంప్ అన్నారు.

కంది రైతుకు కన్నీరే!



సాక్షి, అమరావతి బ్యూరో: "పై ఫొటోలోని వ్యక్తి పేరు వై. చిరంజీవి. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలానికి చెందిన రైతు. ఇతను 11.50 ఎకరాల్లో కంది పంటను సాగుచేశాడు. పంట వేసిన ప్రారంభంలో అధిక వర్షాల నేపథ్యంలో ఎకరాకు 10 క్వింటాళ్ల పైగా దిగుబడి వస్తుందని ఆశించారు. చివరిలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, వైరస్ సోకడంతో రెండుసార్లు పురుగు మందులు సైతం పిచికారి చేశారు. అయితే, చివరకు పంట దిగుబడి కేవలం ఎకరాకు 3.5 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనికితోడు ధర క్వింటా రూ.3800కు పడిపోయాయి. కనీసం పెట్టుబడి కూడ రాక అల్లాడిపోతున్నారు''

- రాష్ట్రవ్యాప్తంగా 2.75 లక్షల హెక్టార్లలో సాగు
- గత ఏడాదితో పోలిస్తే ఎకరాకు 2–3 క్వింటాళ్లు తగ్గిన దిగుబడి
- క్వింటాలు రూ.3800కు పడిపోయిన ధరలు
- ఇంకా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న రైతులు

..ఇలా రాష్ట్రంలో 2.75లక్షల హెక్టార్లలో కంది పంట సాగుచేసిన వేలాది మంది రైతులు కుదేలయ్యారు. ప్రధానంగా అనంతపురం జిల్లాలో 73వేల హెక్టార్లు, కర్నూలులో 64 వేల హెక్టార్లు, ప్రకాశంలో 86 వేల హెక్టార్లు, గుంటూరులో 26 వేల హెక్టార్లలో కంది పంట సాగైంది. ఎకరాకు 3–4 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఆరుగాలం శ్రమించి తీరా పంట మార్కెట్‌కు తీసుకొచ్చేసరికి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అనంతపురం, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో రైతులు అష్టకష్టాలు పడి పంటను సాగుచేశారు. తీరా నూర్పిడి సమయానికి వచ్చేసరికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.5,450 ఉంటే, ప్రస్తుతం అది రూ.3,800–రూ.4,000లోపు పడిపోయింది. అసలే పంట దిగుబడులు తగ్గి అల్లాడుతున్న రైతులకు, తగ్గిన ధరలు మరింత కృంగదీశాయి. కనీసం పంట పెట్టుబడులు కూడా వచ్చే అవకాశంలేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఏడాది వ్యాపారులు కంది పంటను పెద్దఎత్తున కొనుగోలు చేయడంతోపాటు ధరలు పెద్దగా పెరగకపోవడంతో, ప్రస్తుతం వారు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో మార్కెట్లో కందుల ధరలు పతనమవ్వడంతో రైతులు చెబుతున్నారు.



గుంటూరు జిల్లాలో పంట కోత ప్రయోగాలు చేస్తున్న రైతులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం..

రాష్ట్రంలో కంది రైతులు ఇబ్బంది పడకుండా, 80 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నాం. అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలో ఎక్కువ సంఖ్యలో వీటిని తెరుస్తున్నాం. సోమవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకొంటున్నాం. కంది మద్దతు ధర క్వింటాలు రూ.5450 కాబట్టి, ఆ ధరకు కొనుగోలు చేస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్



విభజన హామీలు నెరవేర్చాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయంలో ఉద్యోగుల ర్యాలీ

విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలని డిమాండ్

సాక్షి, అమరావతి: విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలంటూ శుక్రవారం భోజన విరామ సమయంలో సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయం మూడో బ్లాకు నుంచి ఒకటో బ్లాకు వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, రాష్ట్రానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. విభజన హామీల కోసం పార్లమెంటులో ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కేంద్రం దిగి రాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

సాక్షి అమరావతి బ్యూరో: పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిలోని వీఐటీలో విటోపియా–2018 కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గంటా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా సంవత్సరంలో వెయిటేజీ కల్పించే విషయం తమ ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించి దేశంలోనే వీఐటీ క్యాంపస్ మొదటి స్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీఐటీ చాన్సలర్ జి.విశ్వనాథన్, వీఐటీ ఏపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఈడీ డాక్టర్ సంధ్యారెడ్డి, వీసీ డాక్టర్ సుభకరణ్, రిజిస్ట్రార్ సీఎల్వీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి జలసంరక్షణ ఉత్సవాలు

జూన్ లో నీటి సంఘాలకు ఎన్నికలు

సాక్షి, అమరావతి: 'నీరు–ప్రగతి' జలసంరక్షణ రెండో విడత కార్యక్రమం ఈ నెల 12 నుంచి జూన్ 7 వరకు నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన నీరు–ప్రగతి పనులను సమీక్షించారు. వచ్చే ఏడాదికి రూపొందించిన పనుల ప్రణాళికపైన, జల సంరక్షణ కార్యక్రమంలో చేపట్టే పనులపై చర్చించారు. నీటి సంఘాల భాగస్వామ్యంతో జల సంరక్షణ ఉద్యమంలో చేపట్టే చెరువుల మరమ్మతులు, కాలువల్లో పూడిక తొలగింపు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాంటూర్ కందకాలు, రాక్ ఫిల్ డ్యామ్స్, అటవీ సరిహద్దు కందకాలు, ఇతర జల సంరక్షణ నిర్మాణాలపై చర్చించారు. జూన్ లో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరులు, గ్రామీణాభివృద్ధి, భూగర్భ జలాలు, అటవీ, ఆంధ్రప్రదేశ్ శాటిలైట్ అప్లికేషన్ సెంటర్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, గ్రామీణ నీటిసరఫరా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయేషా కేసులో కీలక సమాచారం కోర్టులో దాఖలు

విజయవాడ లీగల్: ఆయేషా మీరా హత్య కేసులో కీలక సమాచారాన్ని సిట్ బృందం నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసును పునర్విచారించమని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా సిట్ అధికారులు గత వారం రోజులుగా ఇబ్రహీం పట్నంలో గతంలో ఆయేషా మీరా ఉన్న శ్రీదుర్గ లేడీస్ హాస్టల్ (ఘటనా స్థలి)ను సందర్శించారు. కేసులోని పలు అంశాలను, ఆధారాలను కోర్టులో శుక్రవారం దాఖలు చేశారు.

బహిర్గతం చేయలేం: డీఎస్పీ

కోర్టు బయట మీడియాతో మాట్లాడిన డీఎస్పీ హైమావతి ఆయేషా హత్య కేసు పునర్విచారణకు సంబంధించి ఘటనాస్థలంలో వారం రోజులుగా విచారించామని అదే సమాచారాన్ని కోర్టులో దాఖలు చేశామన్నారు. ఏం దాఖలు చేశారో చెప్పమని అడిగిన మీడియా ప్రతినిధులతో కేసు విచారణకు సంబంధించిన అంశాలను బహిర్గతం చేయకూడదన్నారు.

ప్రవాసాంధ్రులను పట్టించుకోని ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్

కడప కార్పొరేషన్: కువైట్‌లో ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఐలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ కువైట్‌లో ఉండే ప్రవాసాంధ్రులకు ఆకామా, పాస్‌పోర్టు, చిన్న చిన్న కేసులున్నవారు వాళ్ల దేశానికి వెళ్లిపోవచ్చని కువైట్ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని, 2018 జనవరి 29 నుంచి ఫిబ్రవరి 22 వరకు దీనికి గడువు విధించిందన్నారు. కువైట్ ప్రభుత్వ లెక్కల ప్రకారం 32 వేల మంది భారతీయులు అక్కడ ఉన్నారని, వారిలో 9 వేల మంది తెలుగువారు ఉన్నారన్నారు. కువైట్ ప్రభుత్వం కల్పించిన కానూన్‌లో స్వదేశానికి రావడానికి 3వేల మంది తెలుగువారు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వేలమంది భారతీయులు రాయబార కార్యాలయం వద్ద బారులు తీరి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్సీ తెలుగు (ఏపీఎన్‌ఆర్‌టీ) ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు, ఉపాధి కోల్పోయి వచ్చేవారి కోసం రూ.50లక్షల నిధి ఏర్పాటు చేసినట్లు ప్రకటించిందన్నారు. కానీ ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ సహకారం లేక వేలమంది తెలుగువారు రావడానికి డబ్బుల్లేక కువైట్‌లోనే మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందుల్లో ఉన్న తెలుగువారిని ఆదుకోవడానికి కువైట్‌లో వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు సాయం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎటువంటి సాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి అనేక సంవత్సరాల తర్వాత కువైట్ ప్రకటించిన ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అక్కడ ఇబ్బందులు పడుతున్న తెలుగువారందరినీ రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు బాబు, డిష్ జిలాన్, అన్సర్‌బాషా, అఫాన్ బాషా, బాబూ రాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తదితరులు

ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు

వైఎస్సార్‌సీపీ నేత మోపిదేవి వెంకటరమణ

సాక్షి ప్రతినిధి శ్రీకాకుళం/విశాఖ సిటీ: మత్స్యకారుల ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వైఎస్సార్‌సీపీ నేత మోపిదేవి వెంకటరమణ శుక్రవారం విశాఖపట్నంలో హెచ్చరించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ఈ నెల 5న దహనమైన మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. పక్కనే రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులను పరామర్శించారు. రెండు నెలల నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మత్స్యకారులు శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. మత్స్యకారులకు ఎస్టీ రిజర్వేషన్ల డిమాండ్ దీర్ఘకాలంగా ఉందని చెప్పారు. 1972లోనే అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంట్ ఆమోదానికి పంపినా సాంకేతిక కారణాల వల్ల బిల్లు నిలిచిపోయిందన్నారు. అధికారంలోకి వస్తే మత్స్యకారుల్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇదే డిమాండ్‌పై మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోగా వారిని అవమానించేలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. తమ సమస్యను విన్నవించుకోవడానికి వచ్చిన మత్స్యకారులను తాటతీస్తానంటూ సీఎం అవమానకరంగా మాట్లాడటం చూస్తుంటే వారిపై ఆయనకున్న ప్రేమ ఎలాంటిదో తెలుస్తుందన్నారు. ఉద్యమాన్ని చూసి ఓర్వలేని ప్రభుత్వం శ్రీకాకుళంలో గిరిజనులతో దాడి చేయించిందని విమర్శించారు. ఈ దాడి వెనుక మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళానికి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేల హస్తం ఉందని ఆరోపించారు. రెండు నెలలుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం తరఫున డిమాండ్లపై చర్చించేందుకు ఏ ఒక్కరూ రాలేదనీ, అదే వేరే సామాజికవర్గం ఆందోళన చేపడితే నాలుగైదు రోజుల్లోనే చర్చలు జరుగుతాయని తెలిపారు. మత్స్యకారులు చేస్తున్న పోరాటంపై ఈ ప్రాంతంలో గెలిచిన ప్రజాప్రతినిధులకు చలనం లేదని విమర్శించారు. త్వరలోనే మత్స్యకార సంఘాల పెద్దలతో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం మెడలు వంచి మత్స్యకారుల దగ్గరకు వచ్చేలా శాంతియుత పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్‌ను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్చలకు రావాలని, లేకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చి రానున్న రోజుల్లో ప్రభుత్వ పునాదులు కదిలిపోతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు తమ్మినేని సీతారాం, పార్టీ నాయకులు అంధవరపు సూరిబాబు, ఎన్ని ధనంజయ్, టి.కామేశ్వరి, మత్స్యకార సంఘ నాయకులు చీకటి దానయ్య, మైలపల్లి పోలీసు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ఇటీవల దహనమైన మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మోపిదేవి, తమ్మినేని

వైభవంగా గుణదలమాత మహోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బిషప్ తెలగతోటి రాజారావు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడలో గుణదల మేరీమాత మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు బిషప్ గ్రాసీ హైస్కూల్ రోడ్డులోని ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ జోసఫ్ రాజారావు, వికార్ జనరల్ ఫాదర్ యం.గాబ్రియేలు, మోన్‌సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టార్ యేలేటి విలియం జయరాజు గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. దేవుని రక్షణ ప్రణాళికను కొనసాగించడానికి మరియమాత ప్రభువును ఈ లోకానికి పంపించినట్లు చెప్పారు. గుణదలమాత పుణ్యక్షేత్రం అద్భుతాల నిలయంగా విరాజిల్లుతోందని పేర్కొన్నారు. మోన్‌సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. మహోత్సవాల ప్రారంభం సందర్భంగా సిల్వర్ జూబిలేరియన్ ఫాదర్స్ సమష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా గురువులు కేథలిక్ క్రైస్తవులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

జీవ వైవిధ్య చట్టం అమలుకు టీఎస్‌జీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య చట్టం అమలు కోసం ప్రభుత్వం సాంకేతిక సహాయ బృందాలు (టెక్నికల్ సపోర్టు గ్రూపు – టీఎస్‌జీ) సభ్యులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. 13 జిల్లాల్లోనూ టీఎస్‌జీ సభ్యులుగా ఎవరెవరు ఉండాలి? అనే అంశంపై మార్గదర్శకాలతో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ శుక్రవారం జీవో జారీ చేసింది. జిల్లాలోని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసరును జిల్లా నోడల్ అధికారిగా రాష్ట్ర అటవీదళాల అధిపతి నియమిస్తారు. టీఎస్‌జీలో సభ్యులుగా ఉండేందుకు జిల్లాలో పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులను ఆయా శాఖలు నామినేట్ చేయాల్సి ఉంటుంది. వీరితో పాటు బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా దక్కన్ రీజియన్ సెంటర్ (హైదరాబాద్) ప్రతినిధి, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించిన ఫ్రెష్ వాటర్ రీజనల్ సెంటర్ (హైదరాబాద్)ప్రతినిధులు ఇందులో సభ్యులుగా ఉంటారు. జిల్లా కలెక్టర్లు స్వచ్ఛంద సంస్థల నుంచి ఇద్దరిని సభ్యులుగా నియమిస్తారు. ఈ కమిటీలు జీవవైవిధ్య నిర్వహణ కమిటీలకు ఆయా జిల్లాల్లో సాంకేతిక సహకారం అందించాల్సి ఉంటుంది.

గిరిజన విద్యార్థులకు వారి భాషలోనే పాఠ్య బోధన

ఎస్‌ఎస్‌ఏ ఎస్పీడీ జి.శ్రీనివాస్

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో డ్రాపవుట్లు తగ్గించేందుకు గిరిజన భాషల్లోనే పాఠ్యపుస్తకాలు రూపొందించి విద్యా బోధన చేస్తామని సర్వశిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. గిరిజనుల స్థానిక భాషలు, మాండలికాల్లో చదువు చెప్పడం ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షితులయ్యేలా చేయాలన్నది లక్ష్యమన్నారు. ఎస్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో జరిగిన ఒక రోజు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు స్వీకరించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను బాల కార్మికులు లేని రాష్ట్రంగా మార్చడమే ధ్యేయంగా పెట్టుకున్నామని చెప్పారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలను బడికి పంపని వారిపై కేసులు పెట్టే అవకాశం ఉన్నా ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తెలిపారు. మరో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బడికెళ్లని పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చేందుకు ఎస్‌ఎస్‌ఏ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ వలస వెళ్తున్న పిల్లల కోసం ప్రత్యేక విద్యా శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. వృత్తి విద్యాకోర్సులను ప్రోత్సహించడం ద్వారా మధ్యలో బడిమానేసే పిల్లల సంఖ్యను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

ఇక చకచకా రిజిస్ట్రేషన్లు!

- కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు
- సర్వర్ సామర్థ్యం పెంపు.. టీసీఎస్ స్థానంలో కొత్త సంస్థకు బాధ్యతలు

సాక్షి, అమరావతి: స్థిరాస్తుల అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్షులు గంటల తరబడి నిరీక్షించే బాధ లేకుండా చకచకా రిజిస్ట్రేషన్లు పూర్తిచేసే దిశగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలకు ఉపక్రమించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చాలా వరకూ కాలం చెల్లిన కంప్యూటర్లు, స్కానర్లు ఉన్నాయి. సర్వర్ సామర్థ్యం కూడా తక్కువ కావడంతో స్కానింగ్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలంటే ఎక్కువ సమయం పడుతోంది. తరచూ సర్వర్ మొరాయిస్తోంది. కంప్యూటర్లు, స్కానర్లదీ అదే పరిస్థితి. ఈ పరిస్థితిని మార్చడంలో భాగంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నింటికీ కొత్త కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు సమకూర్చాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) ప్రాజెక్టుకు అవసరమైన కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాల కొనుగోలుతోపాటు అయిదేళ్లపాటు వీటి నిర్వహణ బాధ్యతలను గతంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) నిర్వహించింది. ఈ ఒప్పందం ఏడాది కిందటే ముగిసినప్పటికీ ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలవలేదు. సర్వర్, డేటా నిర్వహణ కాంట్రాక్టు గడువును మాత్రం టీసీఎస్‌కు మరో ఏడాది పొడిగించింది. ఇప్పుడు ఇది కూడా ముగిసింది. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్డ్ సర్వర్ నిర్వహణ, సామగ్రి సరఫరా(ప్రొక్యూర్‌మెంట్)కు టెండర్లు పిలిచి సాంకేతిక అర్హతలు ఉన్న రెండు సంస్థలను ఎంపిక చేసింది. కంప్యూటర్లు, ఇతర సామగ్రి కొనుగోలు, అయిదేళ్లపాటు కార్డ్ సర్వర్ నిర్వహణకు రూ. 80 కోట్లు వ్యయమవుతుందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అంచనా వేసింది. దీనినే బేసిక్ ప్రైస్‌గా పెట్టి ఇ–టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించింది.

అనుమతిలేని పురుగు మందుల్ని వాడనివ్వొద్దు

వ్యవసాయశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

సాక్షి, అమరావతి: కలుపు నివారణకు అనుమతి లేని క్రిమిసంహారక మందులను వినియోగించకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్లైఫొస్టేట్ (ఎస్ఎల్ ఐపీఏ సాల్ట్ 20.2, 41, 54 శాతం), గ్లైఫొస్టేట్ అమోనియం సాల్ట్ 5 శాతం, 71 శాతం వంటి క్రిమిసంహారక మందులను జూన్ నుంచి నవంబర్ మధ్యకాలంలో సాగుచేసే ఏ పంటల్లోనూ వినియోగించకుండా చూడాలని ఆదేశించింది. గ్లైఫొస్టేట్ రసాయనాలకు కేంద్ర క్రిమిసంహారక మందుల సంస్థ, రిజిస్ట్రేషన్ కమిటీ (సీఐబీ, ఆర్‌సీ) అనుమతి లేదని పేర్కొంది. పంటలు సాగు చేయని ప్రాంతాల్లో మాత్రం అనుమతి ఉన్న మందులను డిసెంబర్ నుంచి మే నెల మధ్యలో వినియోగించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని పురుగు మందుల డీలర్లు అందరూ ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని విక్రయాలు చేయాలని, మోతాదుకు మించి అమ్మిన వారిపై చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.

15.. 15.. 70

- వైద్య విద్య డిగ్రీ సీట్ల భర్తీ అంశం కొలిక్కి
- నేషనల్ పూల్‌లోకి 15 శాతం సీట్లు
- ఉమ్మడి రాష్ట్ర కోటా 15 శాతం యథాతథం
- 70 శాతం సీట్లు స్థానికులతోనే భర్తీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య డిగ్రీ సీట్ల భర్తీ అంశం కొలిక్కి వచ్చింది. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ డిగ్రీ కోర్సుల సీట్ల భర్తీలో నేషనల్ పూల్‌లో చేరితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి కోటా ఉంటుందా లేదా అనే సందేహాలకు తెర పడింది. నేషనల్ పూల్‌లో చేరినా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి కోటా కొనసాగనుంది. పూర్తి పరిశీలన అనంతరం తెలంగాణ న్యాయ శాఖ ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. మన రాష్ట్రం నేషనల్ పూల్‌లో చేరినా ఉమ్మడి రాష్ట్రాల కోటా కొనసాగాలని స్పష్టం చేసింది. వైద్య విద్య సీట్ల భర్తీ అంశంలో నేషనల్ పూల్‌లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ), నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) ఆమోదం తెలిపాయి. 2018–19 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ పూల్ విధానం అమలు కానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అధికారికంగా వెల్లడించాయి. కాళోజీ నారాయణరావు వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి నేషనల్ పూల్ అమలు విషయాన్ని 'సాక్షి ప్రతినిధి'తో ధ్రువీకరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో నేషనల్ పూల్‌తోపాటు తెలుగు రాష్ట్రాల కోటా సైతం ఉంటుందని పేర్కొన్నారు.

» నేషనల్ పూల్ పరిధిలో ప్రస్తుతం 4,157 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న జమ్మూకశ్మీర్ మినహా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వంటి వైద్య విద్య డిగ్రీ సీట్లను నీట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తారు. తెలంగాణ, ఏపీ తాజాగా నేషనల్ పూల్‌లో చేరాయి. 2018–19 నుంచి కొత్త విధానం అమలవుతుంది.

» తెలంగాణలో 3,200 ఎంబీబీఎస్, 1,140 బీడీఎస్ సీట్లు ఉన్నాయి. నేషనల్ పూల్ అమలు చేస్తుండటంతో 2018–19 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణలోని మొత్తం ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో 70 శాతం స్థానికులకే కేటాయిస్తారు. 15 శాతం సీట్లు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కోటాగా ఉంటాయి. మరో 15 శాతం సీట్లు నేషనల్ పూల్ కోటాలో ఉంటాయి.

» ఏపీ పునర్విభజన సమయంలో విద్యా సంస్థలకు పదేళ్లపాటు(2024 వరకు) ఉమ్మడి కౌన్సెలింగ్ నిబంధన అమలులోకి వచ్చింది. తెలంగాణ, ఏపీలోని విద్యా సంస్థల్లోని సీట్లలో 15 శాతం కోటాను మెరిట్ ప్రాతిపదికన పదేళ్లపాటు పరస్పరం కేటాయించుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. 15 శాతం సీట్లలో మెరిట్ కోటా కింద ఏపీ వారు పోటీ పడతారు. ఏపీలోనూ ఇదే విధానం అమలవుతోంది. ఆ రాష్ట్రంలోని 15 శాతం సీట్లకు తెలంగాణ విద్యార్థులు మెరిట్ ప్రాదిపదికన దక్కించుకునే అవకాశం ఉంటుంది.

» అలాగే మరో 15 శాతం సీట్లు నేషనల్ పూల్‌లోకి వెళ్తాయి. అన్ని రాష్ట్రాల్లోని అభ్యర్థులు మెరిట్ ప్రాతిపదికన నేషనల్ పూల్‌లోని సీట్లను పొందే పరిస్థితి ఉంటుంది. మన రాష్ట్రంలోని విద్యార్థులు సైతం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని 15 శాతం సీట్లను మెరిట్ ప్రాదిపదికన పొందే అవకాశం ఉంటుంది.

ఒకేసారి అన్ని పోస్టుల భర్తీ ఎందుకు?

- రెండు డీఎస్సీలకు వీలుగా పోస్టులను తగ్గించేందుకు సర్కారు యోచన
- పోస్టులు తగ్గిపోతే అవకాశం రాదేమోనని అభ్యర్థుల ఆందోళన
- ఇతర జిల్లాల్లోనూ ఓపెన్ కేటగిరీలో అవకాశం కల్పించాలని విన్నపం

సాక్షి, అమరావతి: లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది డిసెంబర్ 15న నోటిఫికేషన్ వెలువరిస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించినా ఇప్పటివరకు ఆ జాడ లేదు. పోస్టుల సంఖ్యపై ఇప్పటికీ తుది నిర్ణయానికి రాలేదు. దాదాపు 14 వేల పోస్టుల వరకు భర్తీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలకు అదనంగా మరో 3600 పోస్టుల వరకు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. ఆ ఫైలు ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉంది. మరోవైపు అభ్యర్థులు వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. పోటీ ఎక్కువగా ఉన్నందున పోస్టు వస్తుందో, రాదో అనే ఆందోళనతో ఉన్నారు. వీరు ప్రభుత్వం తీరు చూసి మరింత బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం అదనపు పోస్టులకు ఆమోదం తెలపకపోవడమే కాకుండా డీఎస్సీలో 14 వేల పోస్టులకు ఒకేసారి నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వడమంటూ మెలికపెడుతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఏటా డీఎస్సీ వేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో 10,313 పోస్టులతో ఒకే ఒక్క డీఎస్సీని నిర్వహించింది. ఇప్పుడు 14 వేల పోస్టులకు ఒకేసారి డీఎస్సీ పెట్టే బదులు పోస్టులను తగ్గించి రెండు డీఎస్సీలు వేస్తే బాగుంటుందన్న ఆలోచనలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అసలు ఖాళీలే లేవని పేర్కొంటూ వచ్చిన ప్రభుత్వం 9,800 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి రాతపూర్వకంగా తెలిపింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 2017, మే 2018, డిసెంబర్ 2018 వరకు ఉన్న/ఉండే ఖాళీలను పరిగణనలోకి తీసుకొని దాదాపు 12,500 వరకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. వీటికి మరిన్ని పోస్టులు కలపాలని నిర్ణయించినా ఇప్పటివరకు ప్రభుత్వ ఆమోదం రాలేదు. తమ జిల్లాల్లో ఎన్ని ఖాళీలు ఉంటాయో తెలియక అభ్యర్థులు తికమకపడుతున్నారు. తమ జిల్లాలో ఎక్కువ ఖాళీలు లేకపోతే, పక్క జిల్లాకు వెళ్లి స్థానికేతర అభ్యర్థిగా పరీక్ష రాయడానికి వీలున్నా రెండూ ఒకేసారి రాయడం కష్టం. ఏదో ఒక జిల్లాకే పరిమితం కావాలి. ఆ స్థానికేతర జిల్లాలో పోటీ తీవ్రంగా ఉంటే 20 శాతం కోటాలో అవకాశాలు మరింత సన్నగిల్లిపోతాయి.



ఇతర జిల్లాల్లోని ఓపెన్ కేటగిరీకి అర్హత కల్పించాలి

పరీక్ష ఎక్కడ రాసినా ఇతర జిల్లాల పోస్టుల్లో ఓపెన్ కేటగిరీ కోటాకు అర్హత కల్పిస్తే బాగుంటుందని అభ్యర్థులు కోరుతున్నారు. అక్కడ ఏ అభ్యర్థి అయినా తన సొంత జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసి తీవ్ర పోటీ వల్ల ఉద్యోగం సాధించనట్లయితే ఇతర జిల్లాల్లో అతడి మార్కులను బట్టి 20 శాతం కోటాలో స్థానికేతరుడిగా పరిగణించి అవకాశం కల్పిస్తున్నారు. ఇలాంటి విధానం రాష్ట్రంలో లేనందువల్ల 2014 డీఎస్సీలో చాలామంది మెరిట్ అభ్యర్థులు కొద్ది తేడాతో ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయారు. ఉదాహరణకు పశ్చిమగోదావరికి చెందిన ఒక అభ్యర్థిని 136 మార్కులు సాధించి ఉద్యోగం పొందలేకపోయారు. కానీ విశాఖ, చిత్తూరుల్లో ఆమె కంటే తక్కువ మార్కులు వచ్చినవారు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందారు. కాబట్టి సొంత జిల్లాలో పరీక్ష రాసినా మార్కులను బట్టి ఇతర జిల్లాల్లోని ఓపెన్ కేటగిరీలో కూడా పోస్టులు కేటాయించాలని అభ్యర్థులు కోరుతున్నారు.



జస్టిస్ రామసుబ్రమణియన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో పద్మ. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జీలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను శుక్రవారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎవీ.శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరీ, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో పద్మ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

బీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: నాగార్జున వర్సిటీ పరిధిలో గతేడాది జూలైలో నిర్వహించిన బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేశామని సీఈ షేక్ రెహ్మాన్ తెలిపారు. విద్యార్థులు రీవాల్యుయేషన్ దరఖాస్తులను సంబంధిత కళాశాలల్లో సమర్పించటానికి ఈనెల 17 ఆఖరు తేదీగా నిర్ణయించామని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో పేపర్‌కు 970 రూపాయలుగా నిర్ణయించామని తెలిపారు.

నీట్ దరఖాస్తు గడువు మార్చి 9 వరకు

సాక్షి, అమరావతి: నేషనల్ ఎలిజిబుల్ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)–2018 పరీక్ష దరఖాస్తుకు మార్చి 9 వరకు గడువుగా నిర్ణయించారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌సీ) నీట్ అడ్మిషన్ నోటీసును జారీ చేసింది. ఈ ఏడాది మే 6న (ఆదివారం) నిర్వహించే ఈ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 8 నుంచి మార్చి 9 వరకు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ విద్యార్థులు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.750 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

చంద్రబాబు ఎవరి పక్షమో తేల్చుకోవాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏజే స్టాలిన్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/అల్లిపురం (విశాఖ దక్షిణం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల పక్షమో? ప్రధాని నరేంద్ర మోదీ పక్షమో తేల్చుకోవాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్‌తో కలసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నిజాలు మాట్లాడట్లేదని ముప్పాళ్ల అన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చకుండా ప్రజల్ని మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీలపై సీఎం చంద్రబాబు అఖిలపక్ష కమిటీ వేయాలన్నారు. ఏపీ ఎంపీలు మార్చి 5న పార్లమెంట్‌ను స్తంభింపజేయాలన్నారు.

18న రౌండ్ టేబుల్ సమావేశం: రామకృష్ణ

విశాఖపట్నం రైల్వే జోన్, ఏపీకీ ప్రత్యేక హోదా తదితర సమస్యలపై చర్చించేందుకు బీజేపీ, టీడీపీ సహా అన్ని రాజకీయ పార్టీలతో ఈ నెల 18న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. పాడేరులో జరుగుతున్న విశాఖ జిల్లా సీపీఐ మహాసభల్లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల నిమిత్తం రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబును కూడా ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కూచిపూడి నాట్యాచార్యుడు పసుమర్తి సీతారామయ్య కన్నుమూత



విశాఖ కల్చరల్: కూచిపూడి నృత్య సంప్రదాయానికి వన్నెతెచ్చిన ప్రముఖ నాట్యాచార్యుడు పసుమర్తి సీతారామయ్య గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 95 సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కృష్ణాజిల్లా కూచిపూడిలో పుట్టిన సీతారామయ్య 1963లో విశాఖ వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. విశాఖ నాట్యకళా రంగానికి కూచిపూడి నృత్యంలో తొలి అడుగులు నేర్పిన మహనీయుడిగా ఖ్యాతి గడించారు. వందలాదిమందిని నాట్య కళాకారులుగా, ఆచార్యులుగా తీర్చిదిద్దిన సీతారామయ్య చివరి శ్వాస వరకు తన శిక్షణా కార్యక్రమాల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఢిల్లీకి చెందిన స్వప్న సుందరి సీతారామయ్య శిష్యురాలే. హార్మోనియం వాయిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. పేద విద్యార్థులకు అన్నంపెట్టి ఆదరించి మరీ నాట్య విద్యను నేర్పిన గొప్ప నాట్యగురువు సీతారామయ్య. విశాఖ వచ్చిన తొలినాళ్లలో ఆయన ఆంధ్ర విశ్వకళాపరిషత్తు పాఠశాలల్లో కూచిపూడి అధ్యాపకుడిగా పనిచేశారు. ఏయూ లలిత కళల విభాగంలో కూచిపూడి నాట్యాచార్యుడిగా సేవలందించారు. ఆయన కుమారుడు పసుమర్తి వెంకటరమణ ప్రస్తుతం ఆయన నెలకొల్పిన నాట్య శిక్షణా గురుకులాన్ని కొనసాగిస్తున్నారు. సీతారామయ్య మృతి పట్ల పలువురు కళాకారులు, కళాభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మరణ వార్త వినగానే ఆయన శిష్యులు ఆయన ఇంటికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

- భార్యను చంపి తానూ ఆత్మహత్య చేసుకునేందుకు యత్నం
- చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

పాడేరు రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తి సైకోగా మారి కట్టుకున్న భార్యను చంపడానికి ప్రయత్నించి.. తానూ ఆత్మహత్య చేసుకోబోయాడు. ఇద్దరినీ సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. విశాఖ జిల్లా పాడేరు మండలంలోని దేవపురం పంచాయతీ డి.కొత్తూరుకు చెందిన ధారపల్లి భీమేశ్వరరావు(32) మానసిక పరిస్థితి ఏడాదిగా సక్రమంగా లేదు. అప్పటికప్పుడు సైకోగా మారిపోతుంటాడు. వారం రోజుల క్రితం గ్రామ శివారులో ఉన్న చింతచెట్టు ఎక్కి చింతపండును సేకరిస్తూ కాలుజారి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు పాడేరు ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. గ్రామానికి వెళ్లేందుకు వాహనం అందుబాటులో లేకపోవడంతో పాడేరులోని లోచలిపుట్టులో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా సైకోగా మారి టైలర్ ఉపయోగించే పెద్ద కత్తెరతో పొడిచి భార్యను చంపబోయాడు. బంధువులు అడ్డుకోవడంతో ఆమెను వదిలేసి తాను అదే కత్తెరతో పీక కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరాడు. బంధువులు ఇద్దరినీ రాత్రి 9.30 గంటలకు పాడేరు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న భీమేశ్వరరావును విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. భార్య మణి పాడేరు ఆస్పత్రిలో వైద్యం పొందుతోంది.

ఐఏఎస్ అధికారి సంతకం ఫోర్జరీ

- ప్రైవేట్ కంపెనీ పేరుతో రూ.7.7 కోట్లకు రిలీజ్ ఆర్డర్
- బ్యాంకు అధికారి అనుమానంతో ఆగిన నగదు చెల్లింపు
- సీఎం చంద్రబాబు సహా ప్రముఖులతో నిందితుడి ‘చెట్టపట్టాల్’



సీఎం చంద్రబాబుతో నిందితుడు చంద్రశేఖర్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రి నారా లోకేశ్.. ఇలా పలువురు ప్రముఖులతో దిగిన ఫొటోలు.. కాస్త మాటకారితనం.. ఇవే పెట్టుబడిగా ఓ మోసగాడు భారీ చీటింగ్‌కు ప్రయత్నించాడు. తెలంగాణ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావు పేరిట లెటర్ హెడ్ సృష్టించి ఆయన సంతకం ఫోర్జరీ చేశాడు. వీటి ఆధారంగా ఓ ప్రైవేట్ కంపెనీకి రూ.7.7 కోట్ల చెల్లింపునకు రిలీజ్ ఆర్డర్ ఇచ్చాడు. ఆఖరి నిమిషంలో చెల్లింపు ఆగిపోగా.. నిందితుడిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నడకుదురుకు చెందిన కనుకుటూరి రామకృష్ణ చంద్రశేఖర్ కాకినాడలో బీఫార్మసీ చదివాడు. విద్యార్థి దశ నుంచే తరచు రాజకీయపార్టీల సభలకు వెళ్లేవాడు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలకు దగ్గరయ్యాడు. ప్రధానంగా ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప వెంటే తిరుగుతూ ఆయనకు స్పీచ్‌లు రాసిచ్చేవాడు. ఫొటోలు దిగి వాటిని ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో పోస్ట్ చేసుకుంటూ తనకు ప్రముఖులతో పరిచయాలు న్నాయంటూ ప్రచారం చేసుకునేవాడు. కొన్నాళ్ల క్రితం చంద్రశేఖర్‌కు తార్నాకలోని పల్స్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ కె.సురేష్‌బాబుతో పరిచయమైంది. సురేష్‌బాబు తమ కంపెనీలో లైజనింగ్ ఆఫీసర్/మేనేజింగ్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌కు ఉద్యోగమిచ్చాడు. ప్రభుత్వ విభాగాల నుంచి త్వరగా పనులు పూర్తి చేసుకురావడానికి రూ.12.75 లక్షలు చెల్లించాడు. సురేష్‌బాబును పూర్తిగా నమ్మించడానికి చంద్రశేఖర్ ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చినట్లు రూ.7.77 కోట్లకు మొబిలైజేషన్ ఆర్డర్ రూపొందించాడు. అలానే తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఈఎస్‌ఐ విభాగం నుంచి మరో రూ.9 కోట్లకు ఉత్తర్వులు సృష్టించాడు. తెలంగాణ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న రామకృష్ణారావు పేరు, ఆయన లెటర్ హెడ్ తదితరాలు సృష్టించాడు.

హోదా తప్పుగా ఉండటంతో..

సీనియర్ ఐఏఎస్ రామకృష్ణారావు సంతకం ఫోర్జరీ చేస్తూ పల్స్ ఫార్మా కంపెనీ పేరిట రూ.7.72 కోట్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్ రిలీజ్ ఆర్డర్ రూపొందించాడు. దీన్ని అందుకున్న పల్స్ సంస్థ మల్లాపూర్‌లోని ఆంధ్రాబ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. అక్కడి అధికారులు వెరిఫికేషన్ కోసం ఈ లెటర్స్‌ను సచివాలయంలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ బ్రాంచ్‌కు పంపారు. ఐఏఎస్ అధికారి రామకృష్ణారావు ప్రస్తుత హోదా ప్రిన్సిపల్ సెక్రటరీ. అయితే ఈ లెటర్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అని ఉండటంతో బ్యాంకు ఏజీఎంకు అనుమానం వచ్చింది. నివృత్తి చేసుకోవడానికి ఆయన నేరుగా రామకృష్ణారావుతో మాట్లాడటంతో అసలు మోసం బయటపడింది.

ఏపీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా రాజేంద్రకుమార్

ముగ్గురు ఐపీఎస్‌లకు ఏడీజీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరెటరీ(ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా డాక్టర్ రాజేంద్రకుమార్ సరిన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్లపాటు ఏపీఎఫ్ఎస్ఎల్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తారు. రాజేంద్రకుమార్‌కు నెలకు రూ.80 వేల వేతనం, వసతి, ప్రయివేటు వాహన సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, 1993 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఐపీఎస్‌లకు అడిషనల్ డైరెక్టర్ జనరల్(ఏడీజీ)లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ సీఐడీ ఐజీపీలుగా పనిచేస్తున్న అమిత్‌గార్గ్, పీవీ సునీల్‌కుమార్‌లకు ఏడీజీలుగా పదోన్నతి కల్పించారు. పట్నా ఎస్ఐబీలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏపీ క్యాడర్‌కు చెందిన మహేష్‌దీక్షిత్‌కు కూడా ఏపీ ప్రభుత్వం ఏడీజీగా పదోన్నతి కల్పించింది. అనంతపురంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి.సూర్యనారాయణకు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మరొక ఉత్తర్వు జారీ చేసింది.



హైదరాబాద్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి రాజ్‌భవన్ డిజైన్ల గురించి వివరిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్



తాత్కాలిక హైకోర్టు కోసం వెటర్నరీ వర్సిటీ భవనాల ప్లాన్లను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

రాజ్‌భవన్ ఆకృతులు పరిశీలించిన గవర్నర్

సాక్షి, అమరావతి/విజయవాడ: అమరావతిలో నిర్మించనున్న రాజ్‌భవన్ ఆకృతులను గవర్నర్ నరసింహన్ శుక్రవారం పరిశీలించారు. హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసిన సీఆర్‌డీఏ కమిషనర్ సీహెచ్ శ్రీధర్ రాజ్‌భవన్ ఆకృతులను చూపించారు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్‌గా ఉన్న నరసింహన్ ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. అమరావతిలో కట్టబోయే రాజ్‌భవన్ కాంప్లెక్స్ నిర్మాణ ఆకృతులను గవర్నర్ పరిశీలనకు తీసుకెళ్లినట్టు సీఆర్‌డీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

తాత్కాలిక హైకోర్టు భవనాల కోసం అన్వేషణ

ఆంధ్రప్రదేశ్‌లో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేయడానికి నియమితులైన న్యాయమూర్తుల బృందం శుక్రవారం కృష్ణా జిల్లాలోని గన్నవరం వెటర్నరీ యూనివర్సిటీ భవనాలను పరిశీలించింది. భవనాల ప్లాన్లను తిలకించింది. గన్నవరంలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుచేయటానికి సాధ్యాసాధ్యాలను న్యాయమూర్తులు అధ్యయనం చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం, జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ పి.సత్యనారాయణమూర్తి, జస్టిస్ టి.సునీల్‌చౌదరి కృష్ణా జిల్లాలో మూడు రోజులు పర్యటనకు శుక్రవారం విచ్చేశారు. మొదటి రోజు పర్యటనలో భాగంగా గన్నవరంలో భవనాలను చూశారు. ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కాలేజీ భవనాలు, నాగార్జున యూనివర్సిటీ భవనాలను కూడా పరిశీలిస్తారని సమాచారం. గన్నవరం విమానాశ్రయంలో జిల్లా జడ్జిలు వై.లక్ష్మణరావు, రవీంద్రబాబు, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు.

ఆలయాలకు ఆస్తులు రాసిచ్చిన భక్తుడు

- విరాళమిచ్చిన స్థలంలో ఆయన వారసుల నిర్మాణాలు
- స్థానికుల ఫిర్యాదుతో దేవాదాయ శాఖ అధికారుల పరిశీలన



మామిడి కొండయ్యకు చెందిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

యలమంచిలి: నాలుగు దేవాలయాలకు తన ఆస్తులు చెందాలంటూ విశాఖ జిల్లా యలమంచిలికి చెందిన ఓ వ్యక్తి వీలునామా రాయగా.. వాటిలో ఆయన వారసులు నిర్మాణాలు చేపడుతున్నట్టు ఫిర్యాదు రావడంతో అధికారులు శుక్రవారం వీలునామాలోని ఆస్తులను పరిశీలించారు. యలమంచిలి కొత్తపేట వీధికి చెందిన మామిడి కొండయ్య అనే వ్యక్తి తన ఆస్తులను దేవాలయాలకు చెందాలంటూ 2006లో వీలునామా రాసి మరణించారు. ఆయనకు కొత్తపేటలో 400 గజాల ఇంటిస్థలం, ఒక డాబాతోపాటు ఎస్.రాయవరం మండలం ఉప్పలం గ్రామంలో సర్వే నంబర్ 381లో ఎకరా 80 సెంట్లు పొలం, యలమంచిలి పోస్టాఫీసులో రూ.2 లక్షల 50 వేలు, సెంట్రల్‌బ్యాంకులోని రూ.4 లక్షల డిపాజిట్లు ఉన్నాయి. ఆయన వీటిని భద్రాచలం శ్రీసీతారాములు, సింహాచలం అప్పన్నస్వామి, తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి, అన్నవరం సత్యన్నారాయణస్వామి దేవాలయాలకు నాలుగు సమాన వాటాలుగా చెందాలని వీలునామా రాశారు. అయితే వీలునామాలో పేర్కొన్న స్థలంలో ఆయన వారసులు నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేయడంతో భద్రాచలం దేవస్థానం సూపరింటెండెంట్ భవానీ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరావు, యలమంచిలి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టరు వసంతకుమార్, ఏఈవో గంగారావు తదితరులు కొత్తపేట వీధిలోని ఇంటిస్థలం, ఇంటిని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఉప్పలంలోని పొలాన్ని పరిశీలించారు. ఈ ఆస్తులను దాత మామిడి కొండయ్య మృతి చెందడానికి ముందు పక్కాగా వీలునామా రాసినట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ ఆస్తులపై కోర్టులో కేసు నడుస్తున్నట్లు స్థానికులు చెప్పారు. కాగా, ఈ ఆస్తిలో కొంత తమకు చెందుతుందని కోర్టును ఆశ్రయించామని మామిడికొండయ్య కోడలు సరస్వతి, మనమడు మామిడి శ్రీను విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఈ డాబాలో తామే నివాసముంటున్నట్టు వారు అధికారులకు చెప్పారు.

ప్రాచీన వైద్యాన్ని భావితరాలకు అందించాలి



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ తపన్‌కుమార్ ముఖర్జీ

- సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ తపన్‌కుమార్ ముఖర్జీ
- ఏఎన్‌యూలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఎంతో విశిష్టత ఉన్న భారతీయ ప్రాచీన వైద్య విధానాలను పరిరక్షించి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ తపన్‌కుమార్ ముఖర్జీ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ‘బయోడైవర్సిటీ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్ అండ్ ఆర్చిడ్స్ : ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్’ అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తపన్‌కుమార్ ముఖర్జీ మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వైద్యంలో ఆయుర్వేదం, సిద్ధ, యునాని వంటి వాటికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రాచీన వైద్య విధానాలు వందల సంవత్సరాల పాటు వ్యాధి నివారణకు ఉపయోగపడ్డాయన్నారు. కనుమరుగవుతున్న మన ప్రాచీన వైద్య విధానాల్లో వ్యాధి నివారణ పద్ధతులను సంరక్షించేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానం, జానపద వైద్య విధానాల్లోని డాక్యుమెంటేషన్‌ను వివిధ దేశాలు వాడుకుని లబ్ధిపొందాలని చూస్తున్నాయని, నిమ్మ, వేప వంటి వాటికి పాశ్చాత్య దేశాలు పేటెంట్ హక్కు పొందేందుకు ప్రయత్నించాయని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితి రాకుండా నివారించేందుకు భారత ప్రభుత్వం ట్రెడిషినల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ’(టీకేడీఎల్)ను ఏర్పాటు చేయాలన్నారు. సదస్సులో ఏఎన్‌యూ వీసీ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ ప్లాంట్స్ భారతీయ వైద్య విధానంలో భాగమన్నారు. వృక్షశాస్త్ర నిపుణులు డిక్టర్ హెన్రిక్(డెన్మార్క్), తనాకా, మియామోటో(జపాన్), ప్రొఫెసర్ హుడా, ప్రొఫెసర్ హుస్సేన్ (బంగ్లాదేశ్), ప్రొఫెసర్ లాంగ్ (చైనా), ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ పి.శంకరపిచ్చయ్య, సదస్సు డైరెక్టర్ డాక్టర్ జి.రోశయ్య, సెక్రటరీ డాక్టర్ ఎస్.ఎం ఖాశిం ప్రసంగించారు. అనంతరం సావనీర్‌ను వీసీ, అతిథులు ఆవిష్కరించారు. బోటనీ విభాగ విశ్రాంత అధ్యాపకుడు ప్రొఫెసర్ కేఆర్ రామ్మోహనరావును వీసీ సన్మానించారు. సదస్సులో వర్సిటీకి చెందిన బోటనీ, మైక్రోబయాలజీ విభాగ అధ్యాపకులు, పలు దేశాలకు చెందిన వృక్షశాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

బాలికపై సామూహిక లైంగికదాడి

గుంటూరులో నలుగురు యువకుల దారుణం • ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

గుంటూరు ఈస్ట్: నిరుపేద కుటుంబాలకు చెందిన మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులు 10 రోజుల క్రితం ఓ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రి హైదరాబాద్‌లో ఉండటం, నిందితులను కాపాడేందుకు ఓ పెద్ద మనిషి మభ్యపెట్టిన కారణంగా బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది. గుంటూరు లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కాలనీకి చెందిన 8వ తరగతి చదివే 13 సంవత్సరాల బాలిక జనవరి 28వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి సమీపంలోని చిల్లర కొట్టుకు వెళ్లింది. బాలికకు పరిచయస్తుడైన 23 ఏళ్ల వ్యక్తి ఆటోలో వచ్చి ఐస్‌క్రీమ్ పార్లర్‌కు వెళదామంటూ బాలికను ఆటో ఎక్కమన్నాడు. బాలిక నిరాకరించడంతో చేయి పట్టుకుని బలవంతంగా ఆటో ఎక్కించాడు. అతను తెలిసిన వ్యక్తి అవడంతో కొంతసేపు బాలిక ప్రతిఘటించలేదు. అయితే ఆటో కొంత దూరం వెళ్లిన తర్వాత మరో ముగ్గురు ఎక్కారు. ఆటోను బాలికకు తెలియని ప్రాంతాల వైపునకు తీసుకెళ్తుండటంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆటోను నగరంపాలెంలో పాడుబడ్డ స్థితిలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లోకి తీసుకెళ్లి అత్యంత కిరాతకంగా అత్యాచారానికి పాల్పడ్డారు. అక్కడి నుంచి సంపత్‌నగర్ కొబ్బరి తోటల్లోకి తీసుకెళ్లి రెండోసారి లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితులు బాలికను తీవ్రంగా కొట్టి ఆమె పట్ల నీచంగా ప్రవర్తించారు. రాత్రి 12 గంటల సమయంలో బాలికను ఆర్టీసీ బస్టాండు సమీపంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. నిందితులు బాలిక బంధువులకు ఫోన్ చేసి బస్టాండ్ సమీపంలో ఆమె ఒంటరిగా కనిపించినట్లు చెప్పారు. బాలిక తండ్రి ఊళ్లో లేని కారణంగా బంధువులు ఆమెను ఇంటికి చేర్చారు. 4 రోజుల అనంతరం తండ్రి ఇంటికి చేరుకుని బాలికను విచారించగా నిందితుల దుర్మార్గం బయటపడింది. అయితే స్థానిక పెద్ద ఒకరు బాలిక తల్లిదండ్రులను సంప్రదించి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పరువు పోతుందని పోలీసులే ఇక్కడకు వచ్చి చర్యలు తీసుకునేలా తాను ప్రయత్నిస్తానని నమ్మించాడు. అయితే ఆ పెద్ద మనిషి నిందితుల తరపునే వ్యవహరిస్తున్నాడని గుర్తించి బాలిక తండ్రి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు నిర్భయ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సమాచారం. నిందితులు గతంలోనూ ఇద్దరు మైనర్ బాలికలపై లైంగిక దాడి చేసి పెద్దల పంచాయితీతో బయటపడ్డట్లు స్థానికులు చెబుతున్నారు.

కృష్ణా జిల్లాలో యోగ పరిశోధన కేంద్రం

సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో యోగా, నేచురోపతి కేంద్ర పరిశోధన సంస్థ ఏర్పాటు కోసం ఆయుష్ కమిషనర్‌కు ప్రభుత్వం 25 ఎకరాలను కేటాయించింది. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కాకానిలో జేఎన్‌టీయూకే ఏర్పాటు చేయనున్న ఇంజినీరింగ్ కళాశాలకు 85.94 ఎకరాలను కేటాయించింది. మరికొన్ని జిల్లాల్లో ఏపీఐఐసీ)కి పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ శుక్రవారం వేర్వేరు జీవోలు జారీ చేశారు.

బోర్డులకే సర్వాధికారాలు?

- ప్రాజెక్టులపై కృష్ణా, గోదావరి బోర్డుల పెత్తనానికి కేంద్రం ఓకే!
- ప్రాజెక్టుల నియంత్రణపై కేంద్ర జలవనరులశాఖ సమావేశం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీ బేసిన్లలోని ప్రాజెక్టులపై పెత్తనాన్ని పూర్తిగా ఆయా బోర్డులకే కట్టబెట్టే అంశంపై కేంద్ర జలవనరులశాఖ సానుకూల నిర్ణయం చేసినట్లుగా తెలిసింది. దశలవారీగా, ప్రాజెక్టుల పరిధిలోని డ్యామ్‌లు, రిజర్వాయర్లు, కాల్వలు, పవర్‌హౌజ్‌లను బోర్డు నియంత్రణలో ఉంచేలా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లుగా సమాచారం. ఆయా ప్రాజెక్టుల పరిధిలోని అధికారులు కూడా బోర్డుల పరిధిలోనే ఉండేలా చేస్తున్నట్లు తెలుస్తోంది. కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రాజెక్టుల పరిధి, నియంత్రణ అంశాలపై శుక్రవారం కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి ఉపేంద్ర ప్రసాద్ సింగ్ అధ్యక్షతన ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. సమావేశానికి గోదావరి బోర్డు చైర్మన్ హెచ్‌కే సాహూ, కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి పరమేశంతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. నదీ బేసిన్ల పరిధిలోని సమస్యలను బోర్డు అధికారులు వివరించారు. కృష్ణాజలాల వినియోగంలో తెలుగు రాష్ట్రాల వైఖరిపై కృష్ణా బోర్డు అధికారులు మరోమారు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. కేటాయింపులకు సంబంధించి తాము వెలువరించిన ఆదేశాలకు ఇరురాష్ట్రాలు కట్టుబడి ఉండట్లేదని, పైగా అధిక వినియోగంపై ఒక రాష్ట్రం మరో రాష్ట్రంపై ఫిర్యాదు చేస్తోందని తప్పుబట్టారు. అధిక వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని ఇరురాష్ట్రాలను కోరినా పట్టించుకోవట్లేదని వివరించారు.

విద్యాశాఖ సమావేశాలకు వెళ్లొద్దు

- మున్సిపల్ టీచర్లకు మున్సిపల్ శాఖ ఆదేశాలు
- బోధన కార్యక్రమాల్లోనూ అదే తీరు

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలోని వివిధ విభాగాల కింద ఉన్న పాఠశాలల్లో కార్యక్రమాల అమలు అటు విద్యా శాఖకు, ఇటు ఇతర శాఖలకు మధ్య వివాదంగా మారుతోంది. తమ పరిధిలోని స్కూళ్లలో పనిచేసే సిబ్బంది తమ మాట ప్రకారమే నడుచుకోవాలని ఆయా శాఖలు ఉత్తర్వులు జారీ చేస్తున్నాయి. విద్యా వ్యవహారాలకు సంబంధించి విద్యా శాఖ ఉత్తర్వులు ఇస్తుండగా వాటికి హాజరుకారాదని ఆయా శాఖలు చెబుతుండడంతో గందరగోళం ఏర్పడుతోంది. కొన్ని శాఖలు మౌఖికంగా ఇలా చెబుతుండగా మున్సిపల్ శాఖ ఏకంగా అంతర్గత సర్క్యులర్లను జారీ చేసింది. తమ అనుమతి లేనిదే మున్సిపల్ స్కూళ్ల సిబ్బంది విద్యా శాఖ నిర్వహించే కార్యక్రమాలకు వెళ్లరాదని స్పష్టం చేసింది.

అకడమిక్‌పైనా మున్సిపల్ శాఖ ముద్ర

పాఠశాలలు ఏ విభాగం పరిధిలో ఉన్నా వాటికి సంబంధించిన సిలబస్, పాఠ్యప్రణాళికను విద్యాశాఖ నిబంధనల మేరకే నిర్వహించాల్సి ఉంటుంది. అయితే మున్సిపల్ శాఖ మాత్రం దీనికి భిన్నంగా నడుస్తోంది. నారాయణ విద్యా సంస్థల అధిపతి పి.నారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండడంతో మున్సిపాల్టీల పరిధిలోని స్కూళ్లన్నిటిలో ‘నారాయణ’ మోడల్‌లో ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించారు. దీంతో జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం నిర్వహించాల్సిన కార్యక్రమాల కన్నా ఈ ఫౌండేషన్ కోర్సులకే మున్సిపల్ పాఠశాలల్లో పెద్దపీట వేస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత నింపే విధంగా జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) నిబంధనల ప్రకారం ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించే ప్రణాళికను ఈ స్కూళ్లు పాటించడం లేదు. పరీక్షల విధానాన్ని కూడా నారాయణ స్కూళ్లలో మాదిరి చేపట్టేలా మున్సిపల్ శాఖ ఉత్తర్వులు ఇవ్వడంతో ఈ స్కూళ్ల సిబ్బంది వాటినే పాటిస్తున్నారు. ఇటీవల విద్యా వ్యవహారాలపై వివిధ శిక్షణ తరగతులు, సమీక్షలు, ఇతర కార్యక్రమాలకు మున్సిపల్ టీచర్లు హాజరవ్వగా అన్ని మున్సిపాల్టీలకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా విద్యా శాఖ కార్యక్రమాలకు ఏ ఒక్క టీచర్ వెళ్లడానికి వీల్లేదని, అలా వెళ్లే వారిపై చర్యలు చేపట్టాలని సూచించారు.

తెలుగు మాధ్యమానికి మంగళం

రాష్ట్రంలో స్కూళ్లలో పాఠ్యబోధన ఏ భాషలో జరగాలనే అంశంపై విద్యా శాఖ పరిధిలో నిర్ణయం తీసుకుంటారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో తెలుగు మాధ్యమంలోనే బోధన సాగుతోంది. జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం కూడా ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మాతృభాషలోనే బోధన చేపట్టాలనే నిబంధన ఉంది. విద్యా శాఖ ఉత్తర్వులు కూడా అదేవిధంగా ఉన్నాయి. అయితే మున్సిపల్ శాఖ ఇంతకు ముందు ఆ శాఖ స్కూళ్లలో 1 నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమమే పెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరకు ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమంలోనూ బోధన ఉంటుందని పాఠ్యపుస్తకాలు కూడా పంపిణీ చేయించారు. అయితే వాస్తవంలో మాత్రం తెలుగు మాధ్యమాన్ని క్రమేణా తగ్గిస్తూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహించేలా మున్సిపల్ శాఖ కార్యక్రమాలు అమలు చేయిస్తోంది.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

రైల్వేలో 62,907 గ్రేడ్ - 4 పోస్టులు


దేశంలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు (ఆర్ఆర్‌బీలు) 62,907 గ్రేడ్ -4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశాయి. **అర్హత:** కొన్నింటికి పదోతరగతి, మిగతా వాటికి పదో తరగతితోపాటు ఐటిఐ ఉత్తీర్ణత. ఈ పోస్టుల్లో ట్రాక్‌మెన్, గేట్‌మెన్, స్విచ్‌మెన్, ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ సిగ్నల్/ టెలి కమ్యూనికేషన్ విభాగాల్లో హెల్పర్స్, పోర్టర్ ఖాళీలు ఉన్నాయి. **వయసు:** 2018 జూలై 1 నాటికి 18 నుంచి 31 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వేషన్ అభ్యర్థులకు నిబంధనల మేరకు సడలింపులు ఉంటాయి. ఉద్యోగాలకు ఎంపికైన వారు నెలకు రూ. 18 వేల వేతనంతో పాటు అలవెన్సులు పొందుతారు. **దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 10 నుంచి మార్చి 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** http://rrbsecunderabad.nic.in

జాబ్ ఇన్ఫో

కొలువుదీర్చే వ్యూహం!

ఏఎల్‌పీ, టెక్నీషియన్..

ఇండియన్ రైల్వేలో కెరీర్‌ను సుస్థిరం చేసుకునే దిశగా ఆలోచిస్తున్న వారికి ఓ మంచి అవకాశం. దేశ వ్యాప్తంగా 26,502 అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్‌పీ), టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతితో పాటు ఐటీఐ/ట్రేడ్ అప్రెంటీస్‌షిప్/ఇంజనీరింగ్ డిప్లొమా/ఇంజనీరింగ్ డిగ్రీ/ఇంటర్మీడియెట్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) అర్హతతో ఈ ఉద్యోగాలను చేజిక్కించుకోవచ్చు. ఈ నేపథ్యంలో పరీక్ష విధానం, అందులో విజయానికి సూచనలు..



పరీక్ష విధానం

- ఏఎల్‌పీ/టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడిగా రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుంది. ఏఎల్‌పీ పోస్టుకు పోటీపడుతూ, రెండో దశ సీబీటీలో అర్హత సాధించిన వారికి అదనంగా కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏటీ) నిర్వహిస్తారు.
- తొలిదశ సీబీటీ ప్రశ్నపత్రంలో 75 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి గంట. మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; జనరల్ సైన్స్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. తొలిదశలో అర్హత సాధించిన వారికి రెండోదశ సీబీటీ నిర్వహిస్తారు.
- రెండోదశ పరీక్షలో పార్ట్-ఏ (100 ప్రశ్నలు, 90 నిమిషాలు), పార్ట్-బీ (75 ప్రశ్నలు, 60 నిమిషాలు) ఉంటాయి.
- పార్ట్-ఏలో మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-బీ (అర్హత పరీక్ష మాత్రమే)లో సంబంధిత ట్రేడ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు.

జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్

- రోజూ తనచుట్టూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ, ఎకనామిక్స్, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించిన ముఖ్యాంశాలను తెలుసుకోవాలి. భారత జాతీయోద్యమంలోని ముఖ్య పరిణామాలపై అవగాహన అవసరం. పాలిటీలో రాజ్యాంగం ముఖ్యాంశాలపై దృష్టిసారించాలి.
- కరెంట్ అఫైర్స్‌లో జాతీయ, అంతర్జాతీయ ముఖ్య సంఘటనలను తెలుసుకోవాలి. సదస్సులు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలు, అంతరిక్ష ప్రయోగాలు, పుస్తకాలు-రచయితలు, అవార్డులు తదితరాలపై దృష్టిసారించాలి. దినపత్రికలను చదువుతూ ముఖ్య సంఘటనలను ప్రత్యేకంగా నోట్స్‌లో పొందుపరచుకోవడం మంచిది.

బేసిక్ సైన్స్, ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ డ్రాయింగ్ (ప్రొజెక్షన్స్, వ్యూస్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, లైన్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రిప్రెజెంటేషన్స్), యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్ వెయిట్ అండ్ డెన్సిటీ; వర్క్ పవర్ అండ్ ఎనర్జీ; స్పీడ్ అండ్ వెలాసిటీ; హీట్ అండ్ టెంపరేచర్; బేసిక్ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

సన్నద్ధత

మ్యాథమెటిక్స్

- మ్యాథమెటిక్స్ సిలబస్‌లో నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్; రేషియో అండ్ ప్రపోర్షన్; పర్సంటేజెస్, మెన్సురేషన్; టైం అండ్ వర్క్; టైం అండ్ డిస్టెన్స్; ఇంట్రస్ట్; ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్ తదితర అంశాలున్నాయి.
- తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లో ఉన్న సిలబస్‌లోని అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఉదాహరణ, అభ్యాసాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయాలి.
- ఆర్.ఎస్.అగర్వాల్, అరిహంత్ పుస్తకాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. మ్యాథ్స్‌లో అధిక మార్కుల సాధనకు ప్రాక్టీస్‌కు మించిన మార్గం లేదని గుర్తించాలి.

Ex:

A person scores 45% of the total marks in the exam and still fails by 40 marks. The passing percentage of the exam is 55 %. What is the maximum marks of the exam?

1) 300   2) 350   3) 400   4) 500

Ans: 3

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

- సిలబస్‌లో అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, సఫీషియెన్సీ; కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్; సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్; అనలిటికల్ రీజనింగ్; క్లాసిఫికేషన్; డైరెక్షన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- బ్యాంకు, ఎస్ఎస్‌సీ తదితర పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించి, ఈ విభాగం నుంచి వాటిలో ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో అర్థం చేసుకోవాలి. ఆపై ప్రామాణిక పుస్తకాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. తార్కిక సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఇందులో ప్రశ్నలుంటాయి. షార్ట్‌కట్స్ ద్వారా త్వరగా సమాధానాలు గుర్తించేలా రోజూ 20-30 ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

Ex:

A and B are sisters, R and S are brothers. A's daughter is R's sister. What is B's relation to S?

1) Mother   2) Grandmother
3) Sister   4) Aunt

Ans: 4

జనరల్ సైన్స్

- పదో తరగతి స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రిపరేషన్‌కు ఎన్‌సీఈఆర్‌టీ/ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఉపయోగించుకోవాలి.
- ఫిజిక్స్‌లో యూనిట్స్, ఫోర్స్, ప్రెజర్; మెకానిక్స్, సౌండ్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులు, సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలి.
- కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, యాసిడ్స్, బేసెస్, సాల్ట్స్; మెటల్స్ అండ్ నాన్ మెటల్స్; కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.
- లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి హ్యూమన్ బాడీ, విటమిన్లు, న్యూట్రిషన్, నెర్వస్ సిస్టమ్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు, పర్యావరణం తదితర అంశాలను అధ్యయనం చేయాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి రోజువారీ జీవితంలోని అనువర్తనాలు, స్పేస్ సైన్స్, కంప్యూటర్స్ తదితరాలపై అవగాహన తప్పనిసరి.

Ex:

Which of the following bones is not found in human leg?

1) Tibia   2) Humerus
3) Femur   4) Fibula

Ans: 2

టిప్స్

- సిలబస్‌ను అనుసరించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించుకోవాలి. రోజుకు 8-10 గంటలను ప్రిపరేషన్‌కు కేటాయించాలి. అన్ని సబ్జెక్టులను చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంలో ముఖ్యమైన అంశాలు, సూత్రాలను ప్రత్యేకంగా నోట్ చేసుకోవాలి. వీటిని ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలి.
- ఒక్కో అంశానికి సంబంధించి 100-200 ప్రశ్నలు ప్రాక్టీస్ చేయడం మంచిది.
- ప్రిపరేషన్ సమయంలో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు స్నేహితులు, ఫ్యాకల్టీ సహాయంతో నివృత్తి చేసుకోవాలి.
- మోడల్ పేపర్లు, పాత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలకు నిర్దేశిత సమయంలో సమాధానాలు గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి.



- డా. జి.రమణ
డైరెక్టర్, సాయిమేధ ఇన్‌స్టిట్యూషన్స్.

బులెటిన్ బోర్డ్

ట్రిపుల్ ఐటీ - హైదరాబాద్‌లో యూజీ-2018 ప్రవేశాలు

ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- హైదరాబాద్.. 2018-19 సంవత్సరానికి బీటెక్ ప్రోగ్రామ్ ప్రవేశ ప్రక్రియ ప్రారంభించింది. ఈ ఏడాది ప్రవేశ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది. నాలుగు విధానాల్లో విద్యార్థులను ఎంపిక చేయనుంది. వివరాలు..

1) **జేఈఈ విధానం:** జేఈఈ మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా బీటెక్ (ఈసీఈ), బీటెక్ (సీఎస్ఈ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కల్పించనుంది.

2) **యూజీఈఈ:** రీసెర్చ్ ఆధారిత డ్యూయల్ డిగ్రీ ఔత్సాహికుల కోసం అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. ఇందులో ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితా రూపొందిస్తుంది. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఇన్ఫర్మాటిక్స్, సైన్స్ ఒలింపియాడ్/మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్, పానినియన్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్‌లలో ఏదో ఒక ఒలింపియాడ్‌లో పాల్గొన్న విద్యార్థులు.. నేరుగా డ్యూయల్ డిగ్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఎలాంటి రాత పరీక్ష ఉండదు. కానీ, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

3) **కొత్తగా ఎస్‌సీఏ:** ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో ఈ ఏడాది కొత్తగా అమలు చేస్తున్న విధానం.. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్. ఉడాన్ పథకంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, అదే విధంగా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతూ రెండో ఏడాది పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్దేశించి ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్‌సీఏ ద్వారా 20 సీట్ల వరకు అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం రాత పరీక్ష, తర్వాత ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

4) **డీఏఎస్ఏ:** డైరెక్ట్ అడ్మిషన్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్. ఈ విధానంలో ప్రవాస భారతీయ విద్యార్థులు, విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పిస్తారు. అయితే వీరు శాట్‌లో నిర్దేశిత స్కోర్ సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య తేదీలు

- **యూజీఈఈ, ఎస్‌సీఏ దరఖాస్తు:** ఫిబ్రవరి 5, 2018- మార్చి 15, 2018.
- **యూజీఈఈ, ఎస్‌సీఏ అభ్యర్థులకు పరీక్ష తేదీ:** ఏప్రిల్ 18, 2018
- **ఫలితాల వెల్లడి:** మే మొదటి వారం.
- **ఇంటర్వ్యూ:** జూన్ మొదటి వారం.
- **జేఈఈ ఉత్తీర్ణులకు దరఖాస్తుల లభ్యత:** ఏప్రిల్ మొదటి వారం.
- **డీఏఎస్ఏ విద్యార్థులకు దరఖాస్తుల లభ్యత:** మార్చి మొదటి వారం.
- **వెబ్‌సైట్:** www.iiit.ac.in/admissions/undergraduate

మే 6న నీట్ ప్రవేశ పరీక్ష

వైద్య విద్య (ఎంబీబీఎస్/బీడీఎస్)లో ప్రవేశాలకు జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్ఈఈటీ: నీట్)-2018 ప్రవేశ పరీక్ష మే 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ప్రకటన విడుదల చేసింది. మార్చి 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. జమ్మూకశ్మీర్, అసోం, మేఘాలయ అభ్యర్థులు మినహా మిగిలిన వారందరూ దరఖాస్తు సమయంలో తమ ఆధార్ నంబరు తప్పనిసరిగా నమోదు చేయాలి. దరఖాస్తు రుసుం రూ.1,000 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.750). 2018, మార్చి 10 రాత్రి 11 గంటల 50 నిమిషాల వరకు ఫీజు చెల్లించవచ్చు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ అండ్ జువాలజీ)/బయోటెక్నాలజీ సబ్జెక్టులుగా కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీకి 40 శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. అలాగే ఈ సబ్జెక్టుల్లో ఒక్కోదాంట్లోనూ కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీకి 40 శాతం) మార్కులు వచ్చి ఉండాలి. కోర్సుల్లో ప్రవేశ సమయం నాటికి లేదా 2018, డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ప్రవేశ పరీక్ష తేదీ నాటికి గరిష్ట వయసు 25 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. పూర్తి వివరాలకు **వెబ్‌సైట్:** cbseneet.nic.in

మంగళగిరి ఎయిమ్స్‌లో 52 ఖాళీలు

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్: ఎయిమ్స్)లో 52 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఈ నోటిఫికేషన్‌ను ఎయిమ్స్ మంగళగిరికి మానిటరింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తున్న పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మెర్) విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-8; అడిషనల్ ప్రొఫెసర్-4; అసోసియేట్ ప్రొఫెసర్-4; అసిస్టెంట్ ప్రొఫెసర్-16; సీనియర్ రెసిడెంట్-12; ట్యూటర్/డిమానిస్ట్రేటర్-8.
- **వేతనశ్రేణి:** ప్రొఫెసర్-రూ.1,59,100; అడిషనల్ ప్రొఫెసర్-రూ.1,39,600; అసోసియేట్ ప్రొఫెసర్-రూ.1,31,400; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.1,01,500; సీనియర్ రెసిడెంట్-రూ.67,700; ట్యూటర్/డిమానిస్ట్రేటర్-రూ.56,100. దీంతోపాటు నిబంధనల మేర ఇతర అలవెన్సులు.
- **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ఎండీ/ఎంసీహెచ్/ఎంఎస్/డీఎన్‌బీ/ఎంఎస్సీ/పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితర అర్హతలు ఉండాలి.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు; అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు; సీనియర్ రెసిడెంట్‌కు 33 ఏళ్లు; ట్యూటర్/డిమానిస్ట్రేటర్‌కు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** సీనియర్ రెసిడెంట్, ట్యూటర్/డిమానిస్ట్రేటర్ పోస్టులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ. మిగిలిన పోస్టులకు ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.500; ఎస్సీ/ఎస్టీ-రూ.250. దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు డీడీ జతచేసి కవరులో ఉంచి 'ది డైరెక్టర్, జిప్‌మెర్, అడ్మిన్-1 (రిక్రూట్‌మెంట్ సెల్), ధన్వంతరి నగర్, పుదుచ్చేరి-605006' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.jipmer.puducherry.gov.in

Govt launches Start-up-India ranking framework

Current Affairs

INTERNATIONAL

Bermuda becomes the first country to abolish same-sex marriage

Bermuda has officially moved to abolish same-sex marriage less than a year after bringing in a law to legalise it. Just six months after legalising same-sex marriage, Bermuda announced it would be rolling back the law and replacing it with an alternative. A bill to introduce domestic partnerships was approved without amendment last year and replaces same-sex marriage with the partnerships. It was signed into law by the Governor of Bermuda, John Rankin. The Domestic Partnership Act 2017 replaces same-sex marriage with domestic partnerships.

IWAI and world Bank agreement

Inland Waterways Authority of India (IWAI) has signed an agreement with the World Bank for Jal Marg Vikas Project (JMVP) to enhance navigation on National Waterway-1 from Varanasi to Haldia. The signing of the pact comes after Cabinet approved the implementation of 800 million US dollar JMVP for capacity augmentation of navigation on National Waterway-1, River Ganga, from Varanasi to Haldia. The JMVP, which is expected to be completed by March, 2023, is being implemented with the financial and technical support of the World Bank.

NATIONAL

Google and NCERT join hands to teach students digital safety

Google and NCERT on 6th February signed a pact to integrate a course on 'Digital Citizenship and Safety' in information and communication technology curriculum.The National Council of Educational Research and Training (NCERT) has curriculum on IT and communication technologies embedded in teachers training programme.The curriculum developed by NCERT in collaboration with Google will be used to train students from Class I - Class XII across 1.4 million schools in India where they will learn how to become good and responsible digital citizens.The curriculum is spread into four themes - being smart, being safe, being a digital citizen and being future ready.



ECONOMY

India-US trade estimated to touch $140 bn in 2017, says USISPF survey

Trade between India and the US is estimated to have jumped substantially from $118 billion in 2016 to $140 billion in 2017, according to an advocacy group that aims to promote bilateral trade. In 2016, India was the ninth largest trading partner of the US and one of the major countries with which America has had trade deficit of more than $30 billion. This is expected to continue in 2017 as well, an issue which has repeatedly been raised by President Donald Trump and his top officials in their interaction with their Indian counterpart. According to US India Strategic and Partnership Forum (USISPF) in 2017 India's trade (with the US) has gone up from $118 billion (the previous year) to $140.

Govt launches Start-up-India ranking framework

The government on 6th February launched the Start-up-India ranking framework to help the Startup India initiative to drive economic growth of the country. Three new tools, namely the State and Union Territory Startup Ranking Framework, the Compendium of Good Practices for Promoting Startups in India and the Startup India Kit were launched by Commerce and Industry Minister Suresh Prabhu.

Centre releases Rs. 65,000 cr under SC special assistance plan

The Centre has released Rs. 65,000 crore to States and Union Territories under the special assistance to Scheduled Castes Sub-Plan till January end of the current fiscal, Union Minister Thaawarchand Gehlot said on 6th February.The amount is more than 80 per cent of the total allocation of Rs. 80,000 crore made under the Special Central Assistance to SC Sub Plan for 2017-18.

Cabinet approves implementation of PMRF scheme

Union Cabinet has approved implementation of Prime Minister's Research Fellows (PMRF) scheme at a total cost of 1,650 crore rupees for a period of seven years beginning 2018-19. The scheme was announced in the Union Budget for 2018-19. Under this scheme, the best students who have completed or are in the final year of B.Tech or Integrated M.Tech or M.Sc. in Science and Technology streams from IISc or IITs or NITs or IISERs or IIITs will be offered direct admission in PhD programme in the IITs or IISc.

SCIENCE AND TECHNOLOGY

China successfully launches first seismo-electromagnetic satellite

China on 2nd February successfully launched its first seismo-electromagnetic satellite to study seismic precursors, which might help it establish a ground-space earthquake monitoring and forecasting network in the future. Known as Zhangheng 1 in Chinese, it will help scientists monitor the electromagnetic field, ionospheric plasma and high-energy particles for an expected mission life of five years. Zhangheng 1 will record electromagnetic data associated with earthquakes above 6 magnitude in China and those above 7 magnitude around the world, in a bid to identify patterns in the electromagnetic disturbances in the near-Earth environment.

India test fires Agni-1 missile

India on 6th February successfully test-fired its short-range nuclear capable ballistic missile Agni-1 with a strike range of over 700 km from a test range off the Odisha coast. The indigenously developed surface-to-surface missile was launched as a part of a periodic training activity by the Strategic Forces Command of the Army to consolidate operational readiness. Weighing around 12 tonnes, the 15-metre-long Agni-I can carry payloads up to 1,000 kg and is capable of hitting a target beyond 700 km. The missile is also capable of carrying nuclear warheads.

SPORTS

India lifts U-19 World Cup trophy

India has won ICC Under-19 World Cup for the record fourth time. In the final India defeated Australia by eight wickets at bay oval at Mount Maunganui in New Zealand. Manjot Kalra of India was adjudged Man of the Match and Shubman Gill Man of the Series.

Jhulan Goswami takes 200 ODI Wickets

Indian women's cricket team pacer Jhulan Goswami become the first woman in the world to take 200 wickets in ODI cricket. Goswami achieved the feat playing in her 166th ODI against South Africa.

AWARDS

Shantaram: Mumbai International Film Festival committee has decided to bestow V. Shantaram lifetime achievement Award to veteran film producer and director Shyam Benegal.

PERSONS IN NEWS

Narendra Modi: External Affairs Minister Sushma Swaraj launched a book 'Exam Warriors' in New Delhi penned by Prime Minister Narendra Modi. The book aims to instill confidence in the students and prepare them to face the difficult moments during examinations and life.

Nicos Anastasiades: Cyprus President Nicos Anastasiades won re-election for a second term.The official final result after a second round run-off put the conservative incumbent on 55.99 percent of the vote, ahead of Communist-backed Stavros Malas on 44 per cent.



Rajendra Sharma
Current Affairs Faculty,
Hyderabad.

సాక్షి బిజినెస్
శనివారం 10-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
407 ▼	122 ▼
34,006	10,455

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,763	▼ 14
డోజోన్స్	23,779	▼ 82
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,092	▼ 78
డాక్స్	12,107	▼ 153
షాంఘై	3,131	▼ 131
నికాయ్	21,383	▼ 508

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	58.58	67.93
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	81.63	94.68
€	యూరో	థామస్‌కుక్	71.80	83.26
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	53.71	62.30
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	45.57	52.73
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	43.97	52.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.57	18.46
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.94	18.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.20	11.67

ఎస్‌బీఐపై 'మొండి'బండ!

క్యూ3లో నికర నష్టం రూ.1,887 కోట్లు

- క్రితం ఏడాది ఇదే కాలంలో రూ. 2,152 కోట్ల నికర లాభం
- మొండి బకాయిలకు కేటాయింపులు భారీగా పెరగడమే కారణం...
- స్థూల ఎన్‌పీఏలు 7.23 శాతం నుంచి 10.35 శాతానికి...
- వడ్డీయేతర ఆదాయం 30 శాతం డౌన్....



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ అగ్రగామి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు మొండిబకాయిలు షాక్ ఇచ్చాయి. 2018–19 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (అక్టోబర్–డిసెంబర్, క్యూ3) అత్యంత నిరుత్సాహకరమైన ఫలితాలను ప్రకటించింది. అనుబంధ సంస్థలన్నిటితో కలిపి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఎస్‌బీఐ రూ.1,887 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఎస్‌బీఐ రూ.2,152 కోట్ల నికర లాభాన్ని ఆర్జించడం గమనార్హం. ప్రధానంగా అధిక మొండిబకాయిలతో కేటాయింపులు పెరిగిపోవడం, వడ్డీయేతర ఆదాయం పడిపోవడం వంటివి లాభాల్లోనుంచి నష్టాల్లోకి జారిపోవడానికి కారణమయ్యాయి. ఎస్‌బీఐ 17 ఏళ్ల తర్వాత మళ్లీ తొలిసారిగా క్యూ3లో నికర నష్టాన్ని ప్రకటించడం మొండిబకాయిల తీవ్రతకు నిదర్శనం. మార్కెట్ వర్గాలు ఎస్‌బీఐ క్యూ3లో రూ.2,507 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయొచ్చని అంచనా వేశాయి. కాగా, క్యూ3లో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.74,191 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది క్యూ3లో ఆదాయం రూ.75,537 కోట్లతో పోలిస్తే 1.79 శాతం తగ్గింది. కాగా, కొత్త చైర్మన్ రజనీష్ కుమార్ హయాంలో తొలి ఆర్థిక ఫలితాలు ఇవే కావడం గమనార్హం.

స్టాండెలోన్ ప్రాతిపదికన చూస్తే...

ఒక్క బ్యాంకింగ్ కార్యకలాపాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే (స్టాండెలోన్ ప్రాతిపదికన) ఎస్‌బీఐ క్యూ3లో రూ.2,416 కోట్ల నికర నష్టాన్ని చవి చూసింది. క్రితం ఏడాది క్యూ3లో బ్యాంక్ స్టాండెలోన్‌గా రూ.2,610 కోట్ల నికర లాభాన్ని ఆర్జించటం గమనార్హం. మొత్తం ఆదాయం రూ.53,587 కోట్ల నుంచి రూ.62,887 కోట్లకు పెరిగింది. 17.3 శాతం వృద్ధి నమోదయింది.

మొండిబకాయిలు పైపైకి...

ఎస్‌బీఐ మొండిబకాయిలు (ఎన్‌పీఏ) క్యూ3లో భారీగా పెరిగాయి. బ్యాంక్ మొత్తం రుణాల్లో స్థూల ఎన్‌పీఏలు 2017 డిసెంబర్ నాటికి (క్యూ3) 10.35 శాతానికి చేరి రూ.1,99,141 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది క్యూ3 చివరికి స్థూల ఎన్‌పీఏలు 7.23 శాతం (రూ.1,08,172 కోట్లు) మాత్రమే. కాగా, ఈ ఏడాది రెండో త్రైమాసికంతో పోలిస్తే (9.83 శాతం) సీక్వెన్షియల్‌గా కూడా స్థూల ఎన్‌పీఏలు పెరగడం గమనార్హం. నికర ఎన్‌పీఏలు సైతం గతేడాది క్యూ3లో 4.24 శాతం (రూ.61,430 కోట్లు) నుంచి ఈ ఏడాది క్యూ3లో 5.61 శాతానికి (రూ.1,02,370 కోట్లు) ఎగబాకాయి. ఈ ఏడాది క్యూ2లో నికర ఎన్‌పీఏలు 5.43 శాతంగా ఉన్నాయి.

కేటాయింపులు 145 శాతం అప్...

మొండిబకాయిలకు కేటాయింపులు(ప్రొవిజనింగ్) డిసెంబర్ క్వార్టర్‌లో (క్యూ3) ఏకంగా 145 శాతం ఎగబాకి రూ.7,244 కోట్ల నుంచి రూ.17,760 కోట్లకు పెరిగాయి. క్యూ2లో ఈ పెరుగుదల 6.2 శాతం మాత్రమే. ఇందులో రూ.6,000 కోట్ల ప్రొవిజన్స్ పాత వాటికి సంబంధించి తాజాగా చేయడం వల్ల పెరిగినవే. కాగా, క్యూ3లో కొత్తగా రూ.25,830 కోట్ల రుణాలు మొండిబకాయిలుగా మారాయి. ఇందులో కార్పొరేట్ కంపెనీలకు చెందినవి రూ.21,823 కోట్లు (విద్యుత్ రంగం రూ.14,422 కోట్లు) ఉన్నాయి. కాగా, ఎన్‌పీఏగా మారే అవకాశం ఉన్న జాబితాలో (వాచ్‌లిస్ట్) రూ.10,834 కోట్ల రుణాలున్నాయి. దివాలా కేసుల్లో చిక్కుకున్న కంపెనీల మొండిబకాయిలకు (40 ఖాతాలకు చెందిన రూ.78,000 కోట్లు) సంబంధించి 60 శాతం మేర కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ తెలిపింది.



"క్యూ3 ఆర్థిక ఫలితాలు కచ్చితంగా నిరుత్సాహపరిచేవే. క్యూ4లో కూడా మొండిబకాయిలకు సంబంధించి కొన్ని ఇబ్బందులు తప్పవు. అయితే, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సానుకూల వాతావరణం ఉంటుందని భావిస్తున్నా. కాగా, ఆర్‌బీఐ మదింపులో బయటపడిన మొండిబకాయిల్లో 90 శాతాన్ని ఇప్పటికే ఎన్‌పీఏలుగా గుర్తించాం. ఇందులో దాదాపు రూ.10,000 కోట్లు విద్యుత్ రంగానికి చెందినవే. రానున్న కాలంలో ఈ రంగానికి చెందిన రుణాల్లో మరిన్ని ఎన్‌పీఏలుగా మారే అవకాశాలున్నాయి. గడచిన 9 నెలల కాలంలో కొత్తగా మొండిబకాయిలుగా మారిన రుణాలు తగ్గుముఖం పట్టాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో(2018–19)లో వీటిని 2 శాతం లోపునకే పరిమితం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం."

– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్

ఎన్‌పీఏల్లో భారీ తేడాలు...

గడచిన ఆర్థిక సంవత్సరంలో (2016–17) ఎస్‌బీఐ భారీ మొత్తంలో ఎన్‌పీఏలను తక్కువగా చూపించినట్లు ఆర్‌బీఐ తనిఖీల్లో బయటపడింది. 2017 మార్చినాటికి ఎస్‌బీఐ స్థూల ఎన్‌పీఏలను రూ.1,12,342 కోట్లుగా ప్రకటించింది. అయితే, ఆర్‌బీఐ మదింపులో మాత్రం ఇవి రూ.1,35,582 కోట్లుగా లెక్కతేలాయి. అదే విధంగా నికర ఎన్‌పీఏలు కూడా ఆర్‌బీఐ రూ.75,796 కోట్లుగా లెక్కతేల్చగా, ఎస్‌బీఐ మాత్రం రూ.58,277 కోట్లుగా చూపింది. ప్రొవిజనింగ్(కేటాయింపులు) కూడా రూ.5,720 కోట్ల మేర ఎస్‌బీఐ తగ్గించింది. వీటన్నింటినీ తాజాగా మొండిబకాయిలుగా చూపడంతోపాటు తగిన కేటాయింపులు కూడా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో గతేడాది నికర లాభాన్ని తొలుత ప్రకటించిన రూ.10,484 కోట్ల నుంచి రూ.6,743 కోట్లకు సవరించడం విశేషం.

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలివీ...

- క్యూ3లో నికర వడ్డీ ఆదాయం 5.17% వృద్ధితో రూ.18,688 కోట్లకు పెరిగింది.
- క్యూ3లో వడ్డీయేతర ఆదాయం 29.75 శాతం దిగజారి రూ.11,507 కోట్ల నుంచి రూ.8,084 కోట్లకు పడిపోయింది. ప్రధానంగా ట్రెజరీ కార్యకలాపాల్లో నష్టాలు (మార్క్–టు–మార్కెట్) దీనికి కారణంగా నిలిచాయి.
- ఫీజుల రూపంలో ఆదాయం 5.71 శాతం పెరుగుదలతో రూ.4,710 కోట్ల నుంచి రూ.4,979 కోట్లకు చేరింది.
- ఫీజులు కాకుండా ఇతర ఆదాయం మాత్రం 18.38 శాతం క్షీణించి రూ.14,401 కోట్ల నుంచి రూ.11,755 కోట్లకు దిగజారింది.
- క్యూ3లో రుణ వృద్ధి అత్యంత స్వల్పంగా 2.52 శాతం మాత్రమే నమోదైంది. దీంతో డిసెంబర్ చివరికి బ్యాంక్ మొత్తం రుణాల పరిమాణం రూ.19.24 లక్షల కోట్లకు చేరింది. రిటైల్ రుణాల్లో 13.59 శాతం, వ్యవసాయ రుణాల్లో 5.88 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. కార్పొరేట్ రుణాలు మాత్రం 4.22 శాతం తగ్గింది.
- ఇక బ్యాంక్ డిపాజిట్లు కూడా క్యూ3లో నామమాత్రంగా 1.86 శాతం వృద్ధితో రూ.26.51 లక్షల కోట్లకు చేరాయి.
- నికర వడ్డీ మార్జిన్(ఎన్‌ఐఎం) 0.26 శాతం దిగజారి 2.45 శాతానికి చేరింది.
- శుక్రవారం బీఎస్‌ఈలో ఎస్‌బీఐ షేరు ధర 1.68 శాతం నష్టంతో రూ.296 వద్ద ముగిసింది. మార్కెట్లో ట్రేడింగ్ ముగిసిన తర్వాత ఫలితాలు వెలువడ్డాయి.

టాటా స్టీల్ లాభం 5 రెట్లు అప్



21% పెరిగిన మొత్తం ఆదాయం

- ఈ నెల 14–28 మధ్య రూ.12,800 కోట్ల రైట్స్ ఇష్యూ

న్యూఢిల్లీ: టాటా స్టీల్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో ఐదు రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.232 కోట్లుగా ఉన్న నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో రూ.1,136 కోట్లకు పెరిగినట్లు టాటా స్టీల్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.29,255 కోట్ల నుంచి 21 శాతం వృద్ధితో రూ.33,672 కోట్లకు చేరిందని కంపెనీ సీఈఓ, ఎండీ టీవీ. నరేంద్రన్ తెలిపారు. ఇబిటా 57 శాతం వృద్ధితో రూ.5,697 కోట్లకు పెరిగిందని, ఇబిటా మార్జిన్ 3.9 శాతం పెరిగి 17 శాతానికి చేరిందని చెప్పారాయన. ఇతర ఆదాయం 74 శాతం వృద్ధితో రూ.226 కోట్లకు పెరిగింది. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.12,800 కోట్లకు మించకుండా నిధుల సమీకరణకు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని నరేంద్రన్ వెల్లడించారు. రైట్స్ ఇష్యూ ఈ నెల 14న మొదలై 28న ముగుస్తుంది.

ఇదే జోరు కొనసాగుతుంది...!

గత తొమ్మిది నెలల్లో తాము కార్యకలాపాలు నిర్వహిస్తున్న దేశాల్లో మంచి పనితీరు సాధించామని నరేంద్రన్ పేర్కొన్నారు. పరిస్థితులన్నీ సానుకూలంగా ఉండటంతో ఇదే జోరు కొనసాగుతుందనే అంచనాలున్నాయన్నారు. చైనాలో వాణిజ్య పరిస్థితులు మెరుగుపడటంతో అంతర్జాతీయంగా ఉక్కు ధరలు జోరుగా ఉన్నాయని, భారత్‌లో వివిధ రకాల ఉక్కు ఉత్పత్తుల విక్రయాలు పెరిగాయని తెలియజేశారు. కళింగనగర్ ప్లాంట్‌ను విస్తరిస్తున్నామని, వేరే కంపెనీల ప్లాంట్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కళింగనగర్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 5 మిలియన్ టన్నులకు పెంచుతున్నామని, ఈ ప్రాజెక్ట్ కోసం రూ.23,500 కోట్లు పెట్టుబడులు పెడుతున్నామని, ఈ ప్రాజెక్ట్ నాలుగేళ్లలో పూర్తవుతుందని వివరించారు.

రూ. 22,544 కోట్ల నగదు నిల్వలు..

ఈ క్యూ3లో కంపెనీ స్థూల రుణ భారం రూ.1,658 కోట్లు తగ్గిందని కంపెనీ సీఎఫ్‌ఓ కౌశిక్ చటర్జీ చెప్పారు. భారత్‌లో అమ్మకాలు పుంజుకోవడం, కమోడిటీ ధరలు పెరగడంతో వివిధ దేశాల్లో రియలైజేషన్లు మెరుగుపడడం, విదేశీ మారక ద్రవ్య ప్రభావం దీనికి కారణమన్నారు. నగదు, నగదు సమానమైన నిల్వలు రూ.22,544 కోట్లుగా ఉన్నాయన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టాటా స్టీల్ షేర్ 1.8 శాతం లాభంతో రూ.684 వద్ద ముగిసింది.

యమహా కొత్త 'వైజెడ్ఎఫ్-ఆర్3'

ధర రూ.3.48 లక్షలు



గ్రేటర్ నోయిడా: యమహా మోటార్ ఇండియా తాజాగా తన స్పోర్ట్స్ బైక్ 'వైజెడ్ఎఫ్–ఆర్3'లో అప్‌డేటెడ్ వెర్షన్‌ని మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.3.48 లక్షలు (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ). ఇందులో 321 సీసీ ఫ్యూయెల్ ఇంజెక్టెడ్ 4 స్ట్రోక్ ఇంజిన్, డ్యూయెల్ చానల్ యాంటీ–లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) వంటి పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ తెలిపింది. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న 14వ ఎడిషన్ ఆటో ఎక్స్‌పో కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్, యమహా బ్రాండ్ అంబాసిడర్ జాన్ అబ్రహం ఈ 'వైజెడ్ఎఫ్–ఆర్3' బైక్‌ని ఆవిష్కరించారు. కాగా ఈ స్పోర్ట్స్ బైక్స్ ఎంపిక చేసిన యమహా డీలర్‌షిప్స్ వద్ద మాత్రమే వినియోగదారులకు అందుబాటులో ఉండనున్నాయి.

తెలంగాణలో టఫే ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రాక్టర్ల తయారీలో ఉన్న ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) తెలంగాణలో హై ప్రెసిషన్ ఇంప్లిమెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించింది. హై ప్రెసిషన్ ఇంప్లిమెంట్స్‌తో తక్కువ నీటి వినియోగం, తక్కువ ఎరువు వాడకం, విత్తనాలు, మొక్కలు సరైన రీతిలో నాటేందుకు వీలవుతుంది. కంపెనీ విదేశాల్లో ఉన్న ప్లాంట్లలో వీటిని తయారు చేసి విక్రయిస్తోంది. యూనిట్ కార్యరూపంలోకి వస్తే భారత్‌లో టఫేకు ఇది తొలి కేంద్రం అవుతుంది. ఈ యంత్రాల తయారీ యూనిట్ కోసం తొలుత రూ.200 కోట్ల వరకు పెట్టుబడి అవసరం ఉండొచ్చని టఫే ప్రొడక్ట్ స్ట్రాటజీ ప్రెసిడెంట్ టి.ఆర్.కేశవన్ శుక్రవారమిక్కడ మీడియాకు తెలిపారు. విదేశీ కంపెనీల సహకారంతో వీటిని భారత్‌లో తయారు చేస్తామన్నారు.

రైతులకు ఉచిత సేవలు..

తమిళనాడు, రాజస్థాన్‌లో టఫే జేఫామ్స్‌ను నిర్వహిస్తోంది. ఇక్కడ విత్తన పరిశోధన చేస్తారు. తక్కువ రోజులకు పంట చేతికొచ్చే కూరగాయలు, ఔషధ మొక్కల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తారు. అవసరమైన వ్యవసాయ పరికరాలను అభివృద్ధి చేస్తారు. టఫే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జేఫామ్ సేవలన్నీ రైతులకు ఉచితంగా అందిస్తోంది. అస్సాం, తెలంగాణలో సైతం జేఫామ్ ఏర్పాటు చేసేందుకు కంపెనీ ముందుకు వచ్చింది. 50 హెక్టార్ల స్థలం సమకూర్చాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని కంపెనీ కోరింది. 30 సంవత్సరాల తర్వాత ఈ స్థలాన్ని ప్రభుత్వానికి వెనక్కి ఇస్తామని కేశవన్ తెలిపారు. తెలంగాణలో ఎఫ్2ఎఫ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అద్దెకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు కావాల్సిన వారు ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు.

ప్రెసిషన్ ఇంప్లిమెంట్ల తయారీ

- రూ.200 కోట్లదాకా పెట్టుబడి
- 50 హెక్టార్లలో జేఫామ్ ప్రాజెక్టు



ఓఎన్‌జీసీకి అధిక ధరల బాసట

15 శాతం పెరిగిన లాభం, ఆదాయం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.5,015 కోట్ల నికర లాభాన్ని (స్టాండ్ అలోన్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో సాధించిన నికర లాభం రూ.4,352 కోట్లతో పోలిస్తే 15 శాతం వృద్ధి సాధించామని ఓఎన్‌జీసీ తెలిపింది. ఉత్పత్తి తగ్గినా ధరలు అధికంగా ఉండటంతో ఈ స్థాయిలో నికర లాభం సాధించినట్లు తెలియజేసింది. మొత్తం ఆదాయం కూడా 15 శాతం వృద్ధితో రూ.24,122 కోట్లకు పెరిగింది. సీక్వెన్షియల్ ప్రాతిపదికన ఇబిటా 20 శాతం వృద్ధితో రూ.10,919 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఇబిటా మార్జిన్ మాత్రం స్వల్పంగా తగ్గి 47.5 శాతానికి చేరింది.

తగ్గిన చమురు ఉత్పత్తి: గత క్యూ3లో 51.80 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ముడి చమురు ఉత్పత్తి వ్యయం ఈ క్యూ3లో 60.58 డాలర్లకు పెరిగింది. ముడి చమురు ఉత్పత్తి 1% తగ్గి 5.2 మిలియన్ టన్నులకు తగ్గిందని, అయితే గ్యాస్ ఉత్పత్తి మాత్రం 4.5% వృద్ధితో 6 బిలియన్ క్యూబిక్ మీటర్లకు చేరిందని సంస్థ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పది చమురు, గ్యాస్ క్షేత్రాల్లో నిక్షేపాలు కనుగొన్నామని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఓఎన్‌జీసీ షేర్ 0.4% తగ్గి రూ.188 వద్ద ముగిసింది.

ఈ టూర్లు.. మహిళలకే!

టూరిజం సేవలందిస్తున్న వోవోయెజ్

- దేశ, విదేశీ పర్యాటక ప్రాంతాలతో ఒప్పందం
- నెలకు 60 బుకింగ్స్; రూ.6.5 లక్షల ఆదాయం
- విదేశీయుల తొలి సందర్శన తాజ్.. తర్వాతే హంపి, వారణాసి
- 'స్టార్టప్ డైరీ'తో వోవోయెజ్ ఫౌండర్ రష్మీ చద్దా



స్టార్టప్ డైరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్యాటక ప్రాంతాలను సందర్శించడమంటే అందరికీ ఇష్టమే. కానీ, సమస్యల్లా ఏ ప్రాంతానికి ఏ సమయంలో వెళ్లాలి? టికెట్ల బుకింగ్స్.. స్థానిక భోజన వసతుల ఏర్పాట్లెలా? ఇవే. మహిళలకైతే మరీను. వీటి పరిష్కారమే రష్మీ చద్దా చేత వోవోయెజ్‌ను ఆరంభింపజేసింది. మహిళలకు మాత్రమే సేవలందించడం దీని ప్రత్యేకత. మరిన్ని వివరాలు రష్మీ 'స్టార్టప్ డైరీ'తో పంచుకున్నారు.

"గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక.. పలు బహుళ జాతి కంపెనీల్లో పని చేశా. ఉద్యోగ రీత్యా పలు దేశాలకు తిరిగా. వెళ్లిన ప్రతి చోటా ప్రయాణ ఇబ్బందులెదురయ్యేవి. హోటల్ బుకింగ్‌తో మొదలుపెడితే స్థానిక టూరిజం ప్రదేశాలు, గైడ్, ఆహార ఏర్పాట్లు ప్రతిదీ ఇబ్బందే. ఇదే నాకు వ్యాపార అవకాశాన్ని కల్పించింది. 2016 అక్టోబర్‌లో రూ.6 లక్షల పెట్టుబడితో ఢిల్లీ కేంద్రంగా వోవోయెజ్.కామ్ సంస్థను ప్రారంభించా. wovoyage.comలో వో అంటే ఉమెన్ అని, వయాజ్ అంటే యాత్ర అని అర్థం. మొత్తంగా మహిళల జర్నీ అని అర్థం వచ్చేలా దీన్ని ఆరంభించా.

విదేశీయులు తొలుత చూసేది తాజ్ మహలే..

అమెరికా, జపాన్, జర్మనీ దేశాల నుంచి విదేశీ పర్యాటకులు ఎక్కువగా మా సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రథమంగా వీళ్లు సందర్శించేది తాజ్ మహల్. ఆ తర్వాత హంపి, వారణాసి ప్రాంతాలు. ఈ మధ్య కోల్‌కతా, హైదరాబాద్ సందర్శకులూ పెరుగుతున్నారు. ప్రస్తుతం నెలకు 60 ట్రిప్పులు జరుగుతున్నాయి. ఏడాదిలోగా నెలకు 250 టిప్పులు నిర్వహించే స్థాయికి చేరాలని లక్ష్యించాం. ప్రతి బుకింగ్‌పై 20 శాతం కమీషన్ ఉంటుంది. గత నెలలో రూ.6.5 లక్షల లాభాన్ని ఆర్జించాం. ప్రతి నెలా 50 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నాం.

సొంతంగా కార్ల సేవలు..

ప్రస్తుతం ఏడుగురు ఉద్యోగులున్నారు. నెల రోజుల్లో మరో 12 మందిని నియమించుకోనున్నాం. ఛత్తీస్‌గఢ్ పర్యాటక ప్రచారం నిమిత్తం స్థానిక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన (మార్చి 8) సేవలను ప్రారంభిస్తున్నాం. "కస్టమర్లను ఇంటి నుంచి విమానాశ్రయానికి, స్థానిక ప్రదేశాల పర్యటనకు తీసుకెళ్లటానికి సొంతంగా కార్లతో పాటు మహిళా డ్రైవర్లను నియమించుకుంటున్నాం. త్వరలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. పలువురు విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నిధుల సమీకరణకు మరికొంత సమయం పడుతుంది'' అని రష్మీ వివరించారు.

దేశ, విదేశాల్లో వెయ్యి మంది వెండర్లతో ఒప్పందం


మన దేశంతో పాటూ జపాన్, భూటాన్, దుబాయ్, ఇండోనేషియా, సింగపూర్, యూరప్, అమెరికా, జర్మనీ వంటి పలు దేశాల పర్యాటక ప్రాంతాలతో ఒప్పందం చేసుకున్నాం. ఆయా స్థానిక ప్రదేశాల్లోని హోటళ్లు, బస్సు, విమాన, గైడ్స్ కోసం సుమారు వెయ్యి మంది వెండర్లతో అగ్రిగేట్ చేసుకున్నాం. విమాన టికెట్ల కోసం స్పైస్ జెట్, విస్తారా, ఇండిగోలతో ఒప్పందం చేసుకున్నాం. ఇప్పటివరకు 252 ట్రిప్పులు నిర్వహించాం. ట్రిప్పుకు గరిష్టంగా 38 మంది సభ్యులుంటారు. మొత్తం కస్టమర్లలో హైదరాబాద్ నుంచి 20 శాతం వాటా ఉంటుంది. పుణె, ముంబై, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది కస్టమర్లున్నారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.comకు మెయిల్ చేయండి..

మహీంద్రా లాభం 12 శాతం అప్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) నికర లాభం 12% పెరిగి రూ. 1,216 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ3లో ఇది రూ. 1,081 కోట్లు. ఇక కంపెనీ ఆదాయం కూడా రూ. 11,578 కోట్ల నుంచి రూ. 11,844 కోట్లకు పెరిగింది. అయితే, జీఎస్‌టీ పరమైన ప్రభావాల కారణంగా ఈ రెండింటినీ పోల్చి చూడరాదని సంస్థ వివరించింది. క్యూ3లో ట్రాక్టర్ అమ్మకాలు 6% వృద్ధితో 76,943 యూనిట్లుగా నమోదయ్యాయి. జీఎస్‌టీకి ఆర్థిక వ్యవస్థ సర్దుకుంటున్న నేపథ్యంలో భవిష్యత్తు వ్యాపార వృద్ధి అవకాశాలు మెరుగ్గానే ఉండగలవని ఎంఅండ్ఎం తెలిపింది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
-- --	-- --	-- --	-- --	రూ.3,550	3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--












10,500 దిగువకు నిఫ్టీ

మళ్లీ అమెరికా మార్కెట్లో అలజడి

- పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్
- 407 పాయింట్లు క్షీణించి 34,006కు సెన్సెక్స్
- 122 పాయింట్లు పతనమై 10,455కు నిఫ్టీ



ఒక్క రోజు విరామం తర్వాత స్టాక్ సూచీలు మళ్లీ నష్టాల బాట పట్టాయి. ప్రపంచ మార్కెట్ల పతనం ప్రభావంతో స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. నిఫ్టీ 10,500 పాయింట్ల దిగువకు పడిపోగా, సెన్సెక్స్ ఇంట్రాడేలో 34 వేల పాయింట్ల దిగువకు పతనమైంది. బాండ్ ఈల్డ్స్ పెరుగుతుండటంతో వడ్డీరేట్లకు రెక్కలు వస్తాయనే అంచనాలతో బ్యాంక్, ఆర్థిక రంగ షేర్లు కుదేలయ్యాయి. లోహ, విద్యుత్తు, కన్సూమర్ డ్యూరబుల్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 407 పాయింట్ల నష్టంతో 34,006 పాయింట్ల వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు పతనమై 10,455 పాయింట్ల వద్ద ముగిశాయి. స్టాక్ సూచీలు రెండూ ఐదు వారాల కనిష్టానికి పడిపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 563 పాయింట్లు, నిఫ్టీ 179 పాయింట్లు పతనమయ్యాయి. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 1,061 పాయింట్లు, నిఫ్టీ 306 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, ఉద్యోగాలు పెరిగాయని వరుసగా రెండో వారమూ గణాంకాలు వెల్లడించాయి. దీంతో ద్రవ్యోల్బణం మరింతగా పెరుగుతుందని, వడ్డీరేట్లు పెరుగుతాయనే అంచనాలతో అమెరికా స్టాక్ సూచీలు భారీగా నష్టపోయాయి. గురువారం అమెరికా డోజోన్స్ 4 శాతం, ఎస్ అండ్ పీ 500 సూచీ 3.7 శాతం చొప్పున నష్టపోయాయి. డోజోన్స్ సూచీ 1,033 పాయింట్లు క్షీణించి 23,860 పాయింట్లకు పతనమైంది. డోజోన్స్ చరిత్రలో ఇదే రెండో అత్యధిక పతనం. ఇక అక్కడ వడ్డీరేట్లు పెరిగితే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న స్టాక్‌మార్కెట్లోకి విదేశీ నిధుల ప్రవాహానికి గండి పడుతుందనే అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా ప్రపంచమార్కెట్లతో పాటు మన మార్కెట్ కూడా నష్టపోయింది. పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా ఉండటంతో ఈక్విటీల నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయని నిపుణులంటున్నారు. జపాన్ నికాయ్ 2.5 శాతం, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ 1 శాతం చొప్పున నష్టపోగా, చైనా షాంగై సూచీ 0.7 శాతం లాభపడింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,044
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	31,583
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,28,109
ఎఫ్ఐఐ	-1,352
డీఐఐ	588

ప్రమోటర్ సంస్థలకు రుణంగానే ఇచ్చాం: ఫోర్టిస్ హెల్త్‌కేర్

ప్రమోటర్లయిన సింగ్ సోదరులు బోర్డు అనుమతి లేకుండా రూ.473 కోట్ల నిధులను తమ సొంత సంస్థల్లోకి మళ్లించారన్న ఆరోపణలపై ఫోర్టిస్ హెల్త్‌కేర్ వివరణనిచ్చింది. ఆ నిధులను పూర్తి హామీతో కూడిన రుణంగానే ఇచ్చినట్లు తెలియజేసింది. తమ అనుబంధ సంస్థ ఫోర్టిస్ హాస్పిటల్స్ ద్వారా ఇచ్చిన ఈ రుణం రీపేమెంటు కూడా ఇప్పటికే మొదలయిందని వెల్లడించింది.

బీఓబీపై కేటాయింపుల భారం



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 56 శాతం క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.253 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.112 కోట్లకు తగ్గిందని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.12,181 కోట్ల నుంచి 7 శాతం వృద్ధితో రూ.12,976 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ఈడీ పాపియ సేన్‌గుప్తా చెప్పారు. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.1,638 కోట్ల నుంచి 93 శాతం వృద్ధి చెంది రూ.3,155 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. మొత్తం కేటాయింపులు రూ.2,342 కోట్ల నుంచి 51 శాతం వృద్ధి చెంది రూ.3,538 కోట్లకు పెరిగాయని తెలిపారు. ప్రొవిజన్ కవరేజ్ రేషియో మాత్రం 64.50 శాతం నుంచి 68.03 శాతానికి మెరుగుపడిందని పేర్కొన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్ 1.6 శాతం క్షీణించి రూ.296 వద్ద ముగిసింది.

తగ్గిన ఎన్‌సీఎల్ లాభం..

డిసెంబరు క్వార్టరులో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ నికర లాభం క్రితంతో పోలిస్తే రూ.19 కోట్ల నుంచి తగ్గి రూ.13.7 కోట్లను నమోదు చేసింది. టర్నోవరు సైతం రూ.242 కోట్ల నుంచి రూ.223 కోట్లకు వచ్చి చేరింది. ఏప్రిల్–డిసెంబరులో రూ.639 కోట్ల టర్నోవరుపై రూ.39.7 కోట్ల నికరలాభం ఆర్జించడం గమనార్హం. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1 మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించింది.

రామ్‌కీ లాభం రూ.1.1 కోట్లు..


డిసెంబరు త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.27.7 కోట్ల నుంచి రూ.1.1 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.382 కోట్ల నుంచి రూ.368 కోట్లకు పరిమితమయింది. 2017–18 ఏప్రిల్–డిసెంబరు మధ్య తొమ్మిది నెలల కాలంలో రూ.1,062 కోట్ల టర్నోవరుపై రూ.7 కోట్ల నికరలాభాన్ని ఆర్జించటం గమనార్హం.

సగానికి తగ్గిన నాగార్జున ఫెర్టిలైజర్స్ నష్టాలు

డిసెంబరు త్రైమాసికంలో నాగార్జున ఫెర్టిలైజర్స్, కెమికల్స్ రూ.10 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.20 కోట్ల నష్టాన్ని చవిచూసింది. టర్నోవరు రూ.874 కోట్ల నుంచి రూ.1,006 కోట్లకు ఎగసింది. ఏప్రిల్–డిసెంబరు కాలంలో రూ.2,939 కోట్ల టర్నోవరుపై రూ.14 కోట్ల నికర నష్టం రావటం గమనార్హం.

మహిళా సాధకురాలిగా... నౌహెరా!

నెక్స్‌బ్రాండ్ తాజాగా 'పవర్‌ఫుల్ ఉమెన్ అచీవర్' అవార్డును ప్రకటించింది. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో హీరా గ్రూప్ వ్యవస్థాపకురాలు, సీఈవో షేక్ నౌహెరా ఈ అవార్డును అందుకున్నారు. ఆమె 19 ఏళ్ల వయసులో విద్యా రంగంలో కెరీర్‌ను ప్రారంభించారు. తర్వాత మల్టీ డైవర్సిఫైడ్ కంపెనీ 'హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్'ను స్థాపించారు. ఇది జువెలరీ, టెక్స్‌టైల్, ఎడ్యుకేషన్, మినరల్ వాటర్, గ్రానైట్, గోల్డ్, టూర్స్ అండ్ ట్రావెల్స్, రియల్ ఎస్టేట్, ఎలక్ట్రానిక్స్ వంటి వివిధ రకాల వ్యాపారాలను నిర్వహిస్తోంది. నౌహెరా ఇటీవల 'ఆల్ ఇండియా మహిళా సాధికారత పార్టీ'ని స్థాపించడం ద్వారా రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చారు.



ఈ-ప్రగతి ప్రాజెక్టుకు పెగా సాఫ్ట్‌వేర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాఫ్ట్‌వేర్ కంపెనీ పెగాసిస్టమ్స్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కేంద్రీకృత పోర్టల్ 'ఈ–ప్రగతి'కి సాంకేతిక సేవలందించే ప్రాజెక్టును చేజిక్కించుకుంది. ఈ–ప్రగతి పోర్టల్ ద్వారా 33 ప్రభుత్వ విభాగాలు, 315 ఏజెన్సీలు, 745 పౌర సేవల్ని ఒకే గొడుగు కిందికి తేవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,398 కోట్లు. ఒకే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్లో పౌర సేవల్ని అందించటమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ఈ–ప్రగతి సీఈవో ఎన్.బాలసుబ్రమణ్యం చెప్పారు. కేంద్రీకృత వ్యవస్థ కావడంతో ఏపీలో డిజిటైజేషన్‌కు ఇది ఊతమిస్తుందని, అన్ని విభాగాలపై నియంత్రణ ఉంటుందని తెలియజేశారు. కాగా, భారత్‌లో పెగాసిస్టమ్స్‌కు ఇదే తొలి ప్రాజెక్టు కావడం విశేషం. భారత మార్కెట్‌పై ఇప్పుడు ఫోకస్ చేశామని, ఇటీవలే ముంబైలో సేల్స్ కార్యాలయాన్ని ప్రారంభించామని పెగాసిస్టమ్స్ ఇండియా ఎండీ సుమన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 3,000 పైగా కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సర్వీసులందిస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్, బెంగళూరు కార్యాలయాల్లో 1,500 మంది పనిచేస్తున్నారు. నియామకాలు నిరంతర ప్రక్రియ అని ఆయన తెలియజేశారు.

విదేశీ ఎక్స్ఛేంజీల్లో దేశీ సూచీల ట్రేడింగ్ నిలిపివేత



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్ల పెట్టుబడులు విదేశీ మార్కెట్లకు తరలిపోకుండా... ఇకపై అంతర్జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను నిలిపివేయాలని మూడు ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్ణయించుకున్నాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ, మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎంఎస్ఈఐ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎస్‌జీఎక్స్) తాజాగా నిఫ్టీ 50లో భాగమైన కంపెనీల స్టాక్స్ ఫ్యూచర్స్‌లో కూడా ట్రేడింగ్ ప్రారంభించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఎస్‌జీఎక్స్ తదితర ఎక్స్ఛేంజీల ధోరణులతో... దేశ మార్కెట్ల నుంచి లిక్విడిటీ విదేశీ మార్కెట్లకు తరలిపోయే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది. విదేశీ ఎక్స్ఛేంజీలు, ట్రేడింగ్ ప్లాట్‌ఫాంల డెరివేటివ్స్ ట్రేడింగ్‌కి సంబంధించి సూచీలు, స్టాక్స్ ధరల వివరాలను అందించేందుకు కుదుర్చుకున్న లైసెన్సింగ్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకుంటున్నట్లు మూడు ఎక్స్ఛేంజీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

కార్వీ డేటా చేతికి హెచ్‌సీఎల్ సర్వీసెస్!

న్యూఢిల్లీ: 'హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్' తాజాగా తన అనుబంధ సంస్థ 'హెచ్‌సీఎల్ సర్వీసెస్'ను కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు విక్రయించనున్నట్లు ప్రకటించింది. డీల్ విలువ రూ.108 కోట్లు. హెచ్‌సీఎల్ సర్వీసెస్‌కు చెందిన దేశీయ ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్ బిజినెస్ విక్రయానికి బోర్డు ఆమోదం తెలిపిందని హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ బీఎస్ఈకి నివేదించింది. ఈ డీల్ 2018 ఏప్రిల్ 1 నాటికి పూర్తి కావొచ్చని అంచనా.

సెంట్రల్ బ్యాంక్‌కు మొండిబాకీల సెగ

భారీ మొండిబాకీల భారం కొనసాగుతుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నష్టం మరింతగా పెరిగింది. క్యూ3లో రూ. 1,664 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. 2016–17 మూడో త్రైమాసికంలో బ్యాంకు నష్టం రూ. 606 కోట్లు. మరోవైపు, తాజా క్యూ3లో మొత్తం ఆదాయం రూ. 6,788 కోట్లకు నుంచి రూ. 6,589 కోట్లకు తగ్గింది.

హెచ్‌పీసీఎల్‌కు ఇన్వెంటరీ లాభాల దన్ను

హెచ్‌పీసీఎల్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 22 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,590 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.1,950 కోట్లకు పెరిగిందని హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) తెలిపింది. రిఫైనరీ మార్జిన్ పెరగడం, ఇన్వెంటరీ లాభాల కారణంగా లాభం ఈ స్థాయిలో పెరిగిందని కంపెనీ సీఎమ్‌డీ ముకేశ్ కె సురానా తెలిపారు.

అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో) 2017-18	2016-17	వృ/క్షీ(%)	మొత్తం ఆదాయం (కోట్లలో) 2017-18	2016-17	వృ/క్షీ(%)
ఇండియా సింమెట్స్	15	35	--	1,217	1,271	--
డ్రెడ్జింగ్ కార్పొరేషన్	23	14	--	123	154	--
బీపీసీఎల్ (షేరుకు రూ. 14 డివిడెండ్ ప్రకటన)	2,144	2,272	- 6	70,923	64,647	10
సిండికేట్ బ్యాంక్	870	94	--	5,945	6,554	--

బోర్డ్ మీటింగ్స్

కోల్ ఇండియా, అమర రాజా బ్యాటరీస్, పూర్వాంకర, వండర్ లా, ఏషియన్ గ్రానిటో, అతుల్ ఆటో, కేశోరామ్ ఇండస్ట్రీస్

బులియన్ రూ.లలో



ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,130	▲	125
బంగారం (99.5, 10గ్రా)	29,980	▲	125
వెండి (కిలో)	37,920	▲	250
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	- -		
బంగారం (22 క్యారెట్లు)	28,660	▲	80
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,090	▲	80
బంగారం (22 క్యారెట్లు)	28,660	▲	80
వెండి (కిలో)	40,900	▲	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,000		
బంగారం (22 క్యారెట్లు)	28,610		
వెండి (కిలో)	39,100		
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,200		0
బంగారం (22 క్యారెట్లు)	28,600		0
వెండి (కిలో)	41,000		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,100	▲	200
బంగారం (22 క్యారెట్లు)	28,800	▲	250
వెండి(కిలో)	39,000	▼	300
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,990	▲	90
బంగారం (22 క్యారెట్లు)	28,660	▲	80
వెండి (కిలో)	38,900	▲	200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.62 (రాత్రి 11.00కు)	$61.15 (గురువారం ముగింపు)
బ్రెంట్	63.28 (రాత్రి 11.00కు)	$64.81 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 10-2-2018

విశాఖ	345-00
చిత్తూరు	373-00
వరంగల్	352-00
ముంబై	395-00
చెన్నై	380-00
విజయవాడ	338-00
గోదావరి	338-00
నమక్కల్	365-00
09-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	350-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.10
బెంగళూరు	365-00
ఢిల్లీ	365-00
కోల్‌కతా	373-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	399	405.1
AMBUJA C	258.9	261.9
ASIAN PA	1130.75	1124.05
AXIS BAN	557.55	568.45
BAJAJ AU	3099.25	3157.95
BAJAJ FI	1639.4	1662.15
[illegible]		

A B C D

20 MICRO	54	52
3M INDIA	18924.45	18515.1
5PAISA C	290.75	284.75
63 MOONS	104.3	103.1
8K MILES	751.2	760.15
AARTI DR	612.4	612.55
AARTI IN	1139.2	1137.35
ABAN OFF	186.95	188.85
ABBOTT I	5604.55	5463.25
[illegible]		

BATA IND	714.9	710.55
BAYER CR	3898.75	3958.85
BEARDSEL	57.9	60.35
BEML LIM	1256.15	1246
BERGER P	246.65	250.8
BETA DRU	163	161.9
BF INVES	345.6	295.05
BF UTILI	473.5	438.9
BGR ENER	121.9	123.4
BHAGERIA	303	314.3
BHANSALI	178.45	175.9
BHARAT B	1397.1	1347.95
BHARAT F	762.8	761.2
DHUNSERI	421.45	443.6
DIC INDI	525.05	538.9
DILIP BU	933.65	913.6
DISH TV	73.85	73.7
DISHMAN	344.75	348.65
DIXON TE	3458.3	3513.1
DOLLAR I	415.6	422.05
DOLPHIN	97.65	98.3
DONEAR I	63.95	64.45
DR. LAL	898.45	893.2
DYNAMATI	1763.55	1783.8
DYNEMIC	199.6	190.1
GUJ STAT	132.5	129.4
GUJ. APO	229	221.75
GUJARAT	148.45	143.15
GUJARAT	145.95	146.45
GUJARAT	202.5	207.35
GUJARAT	242.3	241.3
GUJARAT	742.95	730.15
GUJARAT	776.95	780.35
GUJARAT	856.85	849.9
GULF OIL	1075.05	1012.7
GULSHAN	83.85	85.05
HARITA S	943.9	938.85
HARRISON	88.35	85.4
JAY BHAR	499.25	487.65
JAYANT A	391.25	386.5
JAYSHREE	111.05	107.5
JBF INDU	177.15	185.6
JBM AUTO	470.6	487.8
JET AIRW	791.7	776.55
JHS SVEN	67.85	68.55
JIND POL	67.65	69.65
JINDAL D	170.8	169.85
JINDAL P	67.95	68.95
JINDAL P	345.45	342.75
JINDAL S	103.9	104.6
JINDAL S	134.05	134.9
MAN INFR	60.45	60.45
MANAKSIA	64.1	65.65
MANAPPUR	104.35	108.6
MANG.CHE	68.5	64.75
MANGALAM	172.6	174.75
MANGALAM	377.75	373.85
MANPASAN	399.95	406.2
MANUGRAP	52.9	53.55
MARATHON	514.1	518.75
MAS FINA	614.85	599.3
MASTEK L	476.65	480.25
MATRIMON	895.8	890.4
MAWANA S	64.55	60.35
PHILIPS	1101.35	1048.95
PI INDUS	810.45	823.05
PIONEER	194.1	194.95
PLASTIBL	200.65	202.1
PNB HOUS	1216.05	1228.8
PNC INFR	172.6	169
PODDAR H	1149.95	1157.7
PODDAR P	298.25	299.75
POKARNA	209.7	212.4
POLY MED	254.7	255.45
POLYPLEX	489.55	481.65
PONNIE S	172.85	172.55
POWER ME	818.85	822.05
SHALBY L	233.75	237
SHALIM P	183.35	178.55
SHANKARA	1771.45	1796.8
SHANTHI	141.55	144.65
SHARDA C	382.9	395.2
SHARDA M	2375.75	2337.35
SHEELA F	1589.85	1599.9
SHEMAROO	525.7	539.05
SHILPA M	520.15	514.5
SHIPPING	77.4	76.25
SHIRPUR	155.75	152.75
SHIVA TE	610.05	591.35
SHIVAM A	81.25	80.4
THE NEW	696.6	691.5
THE PHOE	589.3	619.9
THE RAMC	710.9	725.15
THE RUBY	341.75	342.2
THE STAT	155.55	156.85
THE TINP	241.1	240.6
THEMIS M	575.05	586.85
THERMAX	1183.65	1197.8
THIRUMAL	2064	2000.1
THOMAS C	238.25	238.75
THYROCAR	655.15	667.55
TI FINAN	661.1	671.95
TIDE WAT	6565.8	6693.7
[illegible]		

E F G H · **I J K L** · **M N O P** · **R S T U** · **V W X Z**

[illegible]

బీఎస్ఈలో ఎస్ఎంఈ షేర్లు

[illegible]

వైఎస్సార్ జిల్లాలో పాతనోట్ల ముఠా అరెస్ట్

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కలసపాడు పోలీసులు ఏడుగురు సభ్యులు గల పాతనోట్ల ముఠాను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ. 89.50 లక్షల విలువైన పాత రూ. 500, రూ. 1000 నోట్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఏ శ్రీనివాసరెడ్డి శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఇ. తంబళ్లపల్లె గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి.. పాతనోట్లు మార్పిడి చేస్తానని చెప్పి ఏడుగురు వ్యక్తులనుంచి ఈ నోట్లను తెప్పించుకుని తన పొలంలో దాచిపెట్టాడని ఏఎస్పీ తెలిపారు. సరిగ్గా 10 రోజుల క్రితం తిరుపతిరెడ్డి ప్రమాదానికి గురయ్యాడు. ఆరోగ్యం కుదుట పడ్డాక నోట్లు మార్పిస్తానని ఏడుగురికి తెలపడంతో వాటిని తీసుకుని వెళ్లేందుకు శుక్రవారం వారు తంబళపల్లెకు వెళ్లారు. సమాచారం అందుకున్న మైదుకూరు డీఎస్పీ బీఆర్ శ్రీనివాసులు, పోరుమామిళ్ల సీఐ పద్మనాభన్ లు తమ సిబ్బందితో వెళ్లి వీరిని అరెస్ట్ చేశారన్నారు.

మద్యం మానొద్దు.. ఆదాయం తగ్గొద్దు

- మందు బాబులకు సర్కారు ప్రోత్సాహం
- డీ-అడిక్షన్ సెంటర్ల ఊసే ఎత్తని ప్రభుత్వం
- మద్యం అలవాటు మాన్పిస్తామని మేనిఫెస్టోలో హామీ
- ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలు బుట్టదాఖలు
- బడ్జెట్‌లో కేటాయించిన రూ.1.40 కోట్లు దారి మళ్లింపు
- అటకెక్కిన 'నవోదయం'

"మద్యంపై వచ్చే ఆదాయం ముఖ్యం కాదు. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడబోం. ప్రజల ఆరోగ్యం మాకు ముఖ్యం. ప్రజల్లో మద్యం అలవాటును మాన్పించేందుకు చర్యలు తీసుకుంటాం. మద్యం వ్యసనపరులకు కౌన్సెలింగ్ చేసేందుకు ప్రతి జిల్లాకో డి-అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేస్తాం"
- ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ


విశాఖ జిల్లాలో సారా తయారీ

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-47 ప్రకారం వైద్య ప్రయోజనాలకు తప్ప ఆరోగ్య హాని కలిగించే అన్ని రకాల మత్తు పానీయాలను నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. రాష్ట్రంలో ప్రజలను మద్యపానం నుంచి దూరం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ డి-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. డి-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఏటా గెజిట్‌లో ప్రకటించి, తర్వాత చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. రాష్ట్రంలో ఇప్పటిదాకా ఒక్కటంటే ఒక్క డి-అడిక్షన్ కేంద్రాన్ని కూడా నెలకొల్పలేదు. లిక్కర్ అమ్మకాలపై వస్తున్న రూ.వేల కోట్ల ఆదాయాన్ని వదులుకోవడానికి ప్రభుత్వం ఇష్టపడడంలేదు. జనంలో మద్యం అలవాటును మాన్పించాల్సింది పోయి ఇంకా తాగండి అంటూ ప్రోత్సహిస్తోంది. అన్ని జిల్లాల్లో డి-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు రెండేళ్ల క్రితం ఎక్సైజ్ శాఖ పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. మద్యపానం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు 2016-17 బడ్జెట్‌లో కేటాయించిన రూ.1.40 కోట్ల నిధులను ఇతర అవసరాల కోసం దారి మళ్లించింది.

నాటు సారా జోరు


బహిరంగంగా సారా సేవిస్తున్న ఏజెన్సీ వాసి

రాష్ట్రంలో మారుమూల, అటవీ ప్రాంతాల్లో కాపుసారా దందా మూడు ప్యాకెట్లు, ఆరు సీసాలుగా వర్ధిల్లుతోంది. సారా విక్రయాలు ఊపందుకుంటున్నాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో నాటుసారా తయారీ గ్రామాల సంఖ్య 1,942. ప్రస్తుతం ఈ సంఖ్య 4,000కు చేరినట్లు ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను సారారహిత రాష్ట్రంగా మారుస్తామంటూ ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 1న 'నవోదయం' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో కొంత హడావుడి చేసిన ఎక్సైజ్ యంత్రాంగం ఆ తర్వాత ఈ పథకాన్ని అటకెక్కించింది. తూర్పుగోదావరి, కర్నూలు, గుంటూరు, విశాఖ ఏజెన్సీల్లో కాపుసారా తయారీ కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది. గుంటూరు, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో రోజుకు సగటున 20 లక్షల లీటర్ల సారా తయారవుతున్నట్లు అంచనా. అలాగే, పొరుగున ఉన్న తెలంగాణ జిల్లాల నుంచి యథేచ్ఛగా సరఫరా అవుతోంది. సారా బానిసలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారితో తాగుడు మాన్పించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు.

సమాచారం అందుబాటులో ఉంచాలి

సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ దిలీప్ రెడ్డి



కర్నూలు సిటీ: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని సిల్వర్‌జూబ్లీ అటానమస్ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు 1950 నుంచే ఉందని, అయితే 2005లో చట్టంగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఏ ప్రభుత్వంలోనైనా అన్ని విషయాలూ ప్రజలకు తెలిసే జరగాలని సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చులన్నీ ప్రజలు చెల్లించిన పన్నులేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ సమాచారం అయినా నిర్దేశించిన గడువులోపు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. చదువుల ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, సమస్యకు చావు పరిష్కారం కాదని అన్నారు. విద్యార్థులకు కావాల్సింది పరీక్షల్లో 98 శాతం మార్కులు కాదని.. సబ్జెక్టుపై పట్టు, భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలని సూచించారు.

ఏడాదిలో నష్టాలను అధిగమిస్తాం

- నిర్వహణపరంగా రూ.100 కోట్ల లాభాల్లో ఉన్నాం
- ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి రేటు సాధించాం
- స్టీల్‌ప్లాంట్ సీఎండీ మధుసూదన్


మీడియాతో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ మధుసూదన్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ రానున్న ఏడాదిలో నష్టాలను అధిగమించి లాభాల్లోకి రానుందని ప్లాంట్ సీఎండీ పి.మధుసూదన్ వెల్లడించారు. 2015-16లో ఉన్న రూ.1400 కోట్ల నష్టాలను 2016-17లో రూ.1200 కోట్లకు, 2017-18లో రూ.900 కోట్లకు తగ్గించామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి నష్టాలను అధిగమించి బ్రేక్ ఈవెన్‌కు వస్తామన్నారు. 2018-19లో ఖచ్చితంగా లాభాల్లోకి అడుగుపెడతామనే నమ్మకం ఉందన్నారు. గతంలో ఏడాదికి రూ.250 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు నిర్వహణ నష్టాల్లో ఉండే సంస్థ వీటిని అధిగమించి రూ.100 కోట్ల నిర్వహణ లాభాలను ఆర్జించిందని తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ ఉత్పత్తి పరంగా ముందెన్నడూ లేని 18-20 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. గతంలో ఏటా రూ.10 వేల నుంచి రూ.12 వేల కోట్ల టర్నోవర్ వచ్చేదని, ఈ ఏడాది ఇప్పటికే రూ.12 వేల కోట్ల టర్నోవర్ సాధించామని, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.16 వేల కోట్ల టర్నోవర్ సాధించగలమన్నారు. ఓ పక్క ఐరన్ ఓర్ టన్నుకు రూ.800 నుంచి రూ.వెయ్యిల మేర పెరిగిందని, 180 నుంచి 190 డాలర్లుండే కోల్ ప్రస్తుతం 250 డాలర్లకు చేరుకుందని పేర్కొన్నారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగినప్పటికీ నిర్వహణ లాభాలు సాధించగలిగామన్నారు. డిసెంబర్‌లోనే రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించామని, ఆ ఒక్క నెలలోనే 5.65 లక్షల టన్నుల స్టీల్ విక్రయించామని చెప్పారు. ప్లాంట్ విస్తరణ కోసం రూ.12 వేల కోట్లు, ఆధునికీకరణ కోసం రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 15 శాతం స్టీల్‌ను విశాఖ ప్లాంట్ సరఫరా చేస్తోందని తెలిపారు. ముడి ఇనుము కొరత తీవ్రంగా ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఒడిశాలో 200 మిలియన్ ఐరన్ ఓర్ నిల్వలున్నాయనే రూ.361 కోట్లు పెట్టుబడులు పెట్టామన్నారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా కుకునూరు వద్ద 30 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్ నిల్వలున్న గనులను గుర్తించిన ప్రభుత్వం ప్లాంట్‌కు కేటాయించేందుకు సముఖత వ్యక్తం చేసిందన్నారు. ఉత్పత్తి, రవాణా వ్యయం తగ్గించుకునేందుకు అంతర్గతంగా లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. యూఎస్ఏ, పిలిప్పైన్స్ దేశాలకు స్టీల్‌ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో ప్లాంట్ డైరెక్టర్ పి.మహాపాత్రో, డైరెక్టర్ కమర్షియల్ ప్రణయ్ రాయ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఎస్ దినేష్ కుమార్

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ప్రారంభమయ్యాయి. 3 రోజులపాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్ కుమార్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,475 మంది రెవెన్యూ ఉద్యోగులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొనేందుకు జిల్లాకు చేరుకున్నారు. తొలిరోజున వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మార్చ్‌ఫాస్ట్‌లో విజయనగరం, కర్నూలు, తూర్పు గోదావరి జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి తగిన న్యాయం జరగలేదన్నారు. ఫలితంగా గడిచిన మూడేళ్లలో ఉద్యోగులు ఎంతో ఒత్తిడితో పని చేస్తున్నారని తెలిపారు. అలాగే జీవితంలో క్రీడలు కూడా అంతర్భాగమన్నారు.సమావేశంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎంఏ ప్రసాదరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తదితరులు హాజరయ్యారు.

విశాఖలో దేశంలోనే తొలి స్టోన్ పార్క్!

- గాలి భీమవరంలో 136 ఎకరాలు కేటాయింపు
- భూమి అప్పగిస్తే ఏడాదిలో పూర్తయ్యే అవకాశం


ఉత్తరాంధ్రలో లభ్యమయ్యే ఫారెస్ట్ ఎల్లో గ్రానైట్, కలోనియం క్రీమ్ గ్రానైట్

సాక్షి, విశాఖపట్నం: దేశంలో తొలిసారిగా విశాఖలో స్టోన్ పార్క్ ఏర్పాటు కాబోతోంది. జిల్లాలోని చోడవరం మండలం గాలి భీమవరంలో ఈ పార్క్ ఏర్పాటుకు కోస్టల్ ఆంధ్రప్రదేశ్ స్టోన్ పార్క్ ఇండియా లిమిటెడ్ సన్నద్ధమవుతోంది. ఉత్తరాంధ్రలో నాణ్యమైన గ్రానైట్ ఖనిజ నిక్షేపాలున్నాయి. శ్రీకాకుళం బ్లూ, విశాఖ మూన్‌వైట్, రివర్ వైట్, ఫారెస్ట్ ఎల్లో, కలోనియం క్రీమ్, జాస్మిన్ వైట్ (విజయనగరం) రకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. ఆయా క్వారీల ద్వారా ఏటా లక్షా 50 వేల నుంచి లక్షా 75 వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ ఉత్పత్తి అవుతోంది. అయితే వీటి ప్రాసెసింగ్ యూనిట్లు రాష్ట్రంలో లేవు. దీంతో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులోని హోసూరు, కర్నాటకలోని జిగిని ప్రాంతాలకు ప్రాసెసింగ్ కోసం ముడి గ్రానైట్‌ను తరలిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి వీటిని ఆ ప్రాంతాలకు సుమారు 1500 కి.మీ పైగా రవాణా చేయాల్సి వస్తోంది. ఇలా ముడిసరకు (గ్రానైట్) కంటే రవాణా ఖర్చే ఎక్కువవడంతో క్వారీ యజమానులకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో క్వారీ యజమానులు ముడి గ్రానైట్‌ను తెగనమ్ముకుంటున్నారు. పైగా గ్రానైట్ ప్రాసెసింగ్‌కు వచ్చే పన్నుల ఆదాయం ఆయా రాష్ట్రాలకే వెళుతోంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో పోటీని తట్టుకుని నిలబడాలన్నా, ధర గిట్టుబాటు కావాలన్నా గ్రానైట్ ప్రాసెసింగ్ కోసం స్టోన్ పార్క్ ఏర్పాటు చేయాలని క్వారీ యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో గాలి భీమవరంలో 136 ఎకరాలు కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు స్టోన్ పార్క్ ఏర్పాటుపై గత సీఐఐ సదస్సులో కోస్టల్ ఆంధ్రప్రదేశ్ స్టోన్ పార్క్ ఇండస్ట్రీ లిమిటెడ్ (కాస్పిల్), రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ నెల 24 నుంచి విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో భూకేటాయింపు పత్రాలు అందజేయనున్నారు. భూకేటాయింపు జరిగాక ఏడాదిలో స్టోన్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గ్రానైట్ ఇండస్ట్రీ వైస్ చైర్మన్ రాజేంద్ర చెప్పారు. ఉత్తరాంధ్రలో లభించే గ్రానైట్ కర్ణాటక, తమిళనాడుల్లో కంటే నాణ్యమైందని, అందువల్లే దీనికి అరబ్, యూరప్ దేశాల్లో ఎంతో డిమాండ్ ఉందని తెలిపారు.

ఈ తరహా పార్క్ ప్రథమం

దేశంలో కొన్ని రాష్ట్రాల్లో గ్రానైట్ ప్రాసెసింగ్ యూనిట్లు/ ఫ్యాక్టరీలు ఉన్నాయి కానీ స్టోన్ పార్క్‌లు లేవు. ఇలాంటివి బ్రెజిల్, జర్మనీ, చైనా, తైవాన్ దేశాల్లోనే ఉన్నాయి. విశాఖలో ఏర్పాటైతే దేశంలోకెల్లా ఇదే తొలి స్టోన్ పార్క్ అవుతుంది. ఇందులో కామన్ రోడ్లు, మంచినీటి వసతి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, శిక్షణ కేంద్రం, రిక్రియేషన్ వంటివి ఉంటాయి. ఈ పార్క్‌కు రానున్న కంపెనీలు సుమారు రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. వీటితోపాటు గ్రానైట్ ఆధారిత అనుబంధ యూనిట్లు ఏర్పాటవుతాయి. ఫలితంగా 1000-1500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

కేంద్రం నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధం: కేఈ



అనపర్తి: రాష్ట్ర ప్రయోజనాలు కోసం కేంద్ర ప్రభుత్వంతో వైరానికైనా తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన సందర్భంగా రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విశాఖపట్నం రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ వంటి హామీలను నెరవేరుస్తారని నాలుగేళ్లుగా ప్రజలు ఎదురు చూశారని, అయితే కేంద్రం అన్యాయం చేసిందన్నారు. కేంద్రం ఇలాగే వ్యవహరిస్తే ఎన్‌డీఏ కూటమి నుంచి టీడీపీ బయటకు వచ్చేందుకు సిద్ధమని హెచ్చరించారు.

అరకులో ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

అరకులోయ: విశాఖ జిల్లా అరకులోయలో ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఎల్.సుజిత్ (20), పి.సుప్రియ గుడివాడలోని శ్రీవిద్యా కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారు. వీరిద్దరు కొంతకాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. సుప్రియకు కుటుంబ సభ్యులు గతేడాది వివాహం చేశారు. ఈ పెళ్లి ఇష్టం లేని సుప్రియ, సుజిత్‌తో ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నట్టు సమాచారం. వీరిద్దరు ఇటీవల గుడివాడ నుంచి పరారయ్యారు. 7న అరకులోయకు చేరుకున్న వీరు పద్మాపురం జంక్షన్‌లోని విశిష్ట లాడ్జిలో దిగారు. గురువారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గదిలో సిరంజిలు, ఇతర మందులు ఉన్నాయి. అలాగే చేతులను కత్తితో కోసుకున్నారు. కాగా, సుప్రియ అదృశ్యంపై గుడివాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ప్రేమజంట విశాఖ జిల్లాలో ఉన్నారని సమాచారం రావడంతో గుడివాడ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుజిత్ తన స్నేహితుడికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో అతడు పోలీసులను అప్రమత్తం చేశాడు. దీంతో పోలీసులు గురువారం అర్ధరాత్రి ఆ లాడ్జికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వారిద్దరినీ అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారు. లాడ్జి నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరకు పోలీసులు ప్రేమజంటపై ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారు మాట్లాడేందుకు నిరాకరిస్తుండడంతో పోలీసులు ఎలాంటి సమాచారం సేకరించలేకపోయారు.


అరకులోయలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజిత్

భార్య కాపురానికి రాకపోవడంతో వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: ఉద్యోగం లేదన్న కారణంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మరోవైపు కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామంలో చోటుచేసుకుంది. టంగుటూరుకు చెందిన ఎన్.సుబ్బరాయుడు (40), సుశీల దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం. సుబ్బరాయుడు 2014కు ముందు గోస్పాడు మండలంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక హౌసింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించింది. దీంతో సుబ్బరాయుడు కూడా ఉద్యోగాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో భార్య పిల్లలతో కలసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల కుమారుడు సురేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

మూడు నెలల రేషన్ ఊసెక్కడ?

- ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారికి ఇక్కట్లు
- మూడు నెలలకోసారి రేషన్ తీసుకునే అవకాశం ఇస్తామన్న సీఎం
- పలుమార్లు హామీ ఇచ్చినా అమలు మాత్రం శూన్యం



సాక్షి, అమరావతి: ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారికి రేషన్ ఇక్కట్లు వెంటాడుతున్నాయి. మూడు నెలలకోసారి రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ అమలు కాలేదు. ఇటు అసెంబ్లీ అటు శాసనమండలిలో ఈ విషయమై ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యులు పలుమార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సీఎం మరోసారి హామీ ఇచ్చారుగానీ దానిపై నిర్ణయం తీసుకోలేదు. అయితే ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోర్టబిలిటీతో కాస్త ఊరట..

ప్రజాపంపిణీ వ్యవస్థలో పోర్టబిలిటీ (రాష్ట్రంలో ఏ రేషన్ షాపులోనైనా రేషన్ తీసుకునే వెసులుబాటు) విధానాన్ని తీసుకురావడంతో ఇతర జిల్లాలకు వలస వెళ్లినవారికి కొంత ఊరట కలిగింది. గతంలో వలస వెళ్లిన కుటుంబాల వారు రేషన్ కార్డును పక్కింటి వాళ్లు లేదా వారి బంధువులకు ఇచ్చి రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉండేది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ-పాస్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు తప్పనిసరిగా రేషన్ షాపునకు వెళ్లి వేలి ముద్రలు వేస్తేనే సరుకులు అందే పరిస్థితి కల్పించారు. రాష్ట్రంలో 1.42 కోట్ల తెల్లరేషన్ కార్డులు ఉంటే ఈ-పాస్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా 25 నుంచి 30 లక్షల కుటుంబాలు రేషన్‌కు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు పోర్టబిలిటీని ప్రవేశపెట్టినతర్వాత లబ్ధిదారులకు కోరుకున్న రేషన్ డీలర్ వద్ద సరుకులు తీసుకునే అవకాశం వచ్చింది. పోర్టబిలిటీ విధానం ద్వారా జనవరిలో 21.20 లక్షలు, ఈ నెలలో ఇప్పటి వరకు 3.57 లక్షల కుటుంబాలు సరుకులు తీసుకున్నాయి.

పోర్టబిలిటీతో సరుకులు తీసుకున్న లబ్ధిదారుల వివరాలిలా ఉన్నాయి.

జిల్లా	తెల్ల రేషన్ కార్డులు	జనవరిలో	ఫిబ్రవరిలో (ఇప్పటివరకూ)
చిత్తూరు	10,84,333	73,996	11,528
వైఎస్సార్	7,52,230	82,214	11,886
కృష్ణా	12,43,267	2,88,287	51,332
గుంటూరు	14,27,627	2,78,441	39,270
పశ్చిమ గోదావరి	12,11,119	2,09,111	45,546
అనంతపురం	11,96,163	99,104	12,939
శ్రీకాకుళం	8,24,403	36,260	5,107
విజయనగరం	7,02,087	59,102	6,847
నెల్లూరు	8,66,842	96,448	10,061
ప్రకాశం	9,42,004	1,17,183	25,760
కర్నూలు	11,51,194	2,08,361	35,675
తూర్పు గోదావరి	16,09,218	3,03,040	60,915
విశాఖపట్నం	11,92,404	2,68,729	40,432
మొత్తం	1,42,02,891	21,20,276	3,57,298

వింటర్ ఒలింపిక్స్ ప్రారంభం

దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్ నగరం వేదికగా ప్రతిష్టాత్మక వింటర్ ఒలింపిక్స్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 25 వరకు ఈ క్రీడలు జరగనున్నాయి. 92 దేశాల నుంచి 2,920 మంది క్రీడాకారులు 102 స్వర్ణ పతకాల కోసం పోటీపడనున్నారు. భారత్ తరఫున ఇద్దరు మాత్రమే (శివ కేశవన్, జగదీశ్) బరిలో ఉన్నారు. వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న శివ కేశవన్ ప్రారంభోత్సవంలో భారత పతాకధారిగా వ్యవహరించాడు.



మువ్వన్నెల పతాకంతో శివ కేశవన్

గెలుపు 'గులాబీ' విరబూయాలి!



పాతికేళ్ల లెక్క... దక్షిణాఫ్రికా గడ్డపై భారత పర్యటన ప్రారంభానికి ముందు ప్రసారకర్తలు పదే పదే చూపించి ఈ టూర్ ప్రత్యేకత చెప్పేందుకు చేసిన ప్రకటన. అయితే టెస్టు సిరీస్ పరాజయంతో లెక్క సరిచేయలేకపోగా ప్రకటన కూడా వెనక్కి వెళ్లిపోయింది. దానిని ఇప్పుడు వన్డేలకు అన్వయించుకుంటే భారత్ ఇన్నేళ్ల తర్వాత తొలిసారి సిరీస్ గెలుపు అంచున నిలిచి కొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. చివరి టెస్టు నుంచి మొదలైన విజయయాత్రకు వేదికగా నిలిచిన వాండరర్స్ మైదానంలోనే సిరీస్‌ను ఒడిసి పట్టుకోవాలని జట్టు పట్టుదలగా ఉంది. నాలుగో వన్డేలో గెలిస్తే సిరీస్ సాధించడంతో పాటు నంబర్‌వన్ ర్యాంక్ కూడా సుస్థిరమవుతుంది.

సిరీస్ విజయమే భారత్ లక్ష్యం ● మ్యాచ్ గెలిస్తే కొత్త చరిత్ర

పరువు కోసం దక్షిణాఫ్రికా ● నేడు నాలుగో వన్డే

సాయంత్రం 4.30 గంటల నుంచి సోనీ టెన్-1, 3లో ప్రత్యక్ష ప్రసారం

జొహన్నెస్‌బర్గ్: దాదాపు రెండున్నరేళ్ల క్రితం భారత పర్యటనలో టెస్టు సిరీస్‌లో చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌ను మాత్రం తమ ఖాతాలో వేసుకొని తిరిగి వెళ్లింది. ఇప్పుడు ఆ లెక్క సరి చేయడంతో పాటు సఫారీ గడ్డపై మొదటి సిరీస్ గెలుచుకునేందుకు కోహ్లి సేన ఉత్సాహంగా ఉంది. వరుస విజయాలతో కోహ్లి సేనలో ఆత్మవిశ్వాసం ఆకాశాన్నంటుతుండగా, డివిలియర్స్ రాకతో సఫారీ జట్టు తమ బలం పెరిగినట్లుగా భావిస్తోంది.

రోహిత్ రాణించేనా!: ప్రస్తుత ఫామ్ చూస్తే భారత జట్టు ఎదురే లేనట్లుగా కనిపిస్తోంది. ఇద్దరు లెగ్ స్పిన్నర్లు చహల్, కుల్దీప్ ప్రతీ మ్యాచ్‌లో ప్రత్యర్థి పతనాన్ని శాసిస్తే... పేసర్లు భువనేశ్వర్, బుమ్రా కూడా తమ పాత్రను సమర్థంగా పోషిస్తున్నారు. తిరుగులేని బ్యాటింగ్ ప్రదర్శనతో కోహ్లి చెలరేగుతుండగా, ధావన్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. మూడో వన్డేలో విఫలమైనా రహానేకు వచ్చిన సమస్య ఏమీ లేదు. అయితే వరుస విజయాల్లో కనిపించని కొన్ని లోపాలను టీమిండియా సరిదిద్దుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ఓపెనర్ రోహిత్ శర్మ పేలవ ప్రదర్శన ఇంకా కొనసాగుతోంది. మూడు వన్డేల్లో అతను 20, 15, 0 చొప్పున పరుగులు చేశాడు. కాబట్టి ఈ మ్యాచ్‌లో అతను రాణించడం అవసరం. కేదార్ జాదవ్ తనకు లభించిన ఒక్క అవకాశాన్ని వృథా చేసుకోగా... హార్దిక్ పాండ్యా ముద్ర అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఎక్కడా కనిపించలేదు. వరుస విజయాలు తెచ్చిన జోరును మరో మ్యాచ్‌లో కొనసాగిస్తే టీమిండియా సగర్వంగా కాలరెగరేయవచ్చు.

ఏబీ ఏం చేస్తాడు?: స్పిన్ ఆడగలిగేవాడు వారు బౌలింగ్‌కు రాకముందే పెవిలియన్ చేరిపోతున్నాడు... ఒక్క బ్యాట్స్‌మన్‌లో కూడా కనీస ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. సొంతగడ్డపై దక్షిణాఫ్రికా ఇలాంటి పరిస్థితిని ఎప్పుడు ఊహించి ఉండకపోవచ్చు. సిరీస్ కోల్పోకుండా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆ జట్టు నాలుగో వన్డే బరిలోకి దిగుతోంది. వరుసగా విఫలమవుతున్న ఆమ్లా ఈ మ్యాచ్‌లోనైనా తన స్థాయికి తగినట్లుగా ఆడాల్సి ఉంది. గత మ్యాచ్‌లో రాణించిన డుమిని, మార్క్‌రమ్‌లు స్పిన్‌ను ఎలా ఎదుర్కొంటారనేది కీలకం. వరుసగా విఫలమవుతున్న మిల్లర్ స్థానంలో బెహార్డీన్‌ను ప్రయత్నించాలని జట్టు భావిస్తోంది. అయితే అన్నింటికి మించి డివిలియర్స్ రాకపైనే ఆ జట్టు అమిత ఆశలు పెట్టుకుంటోంది. అతను తమ రాత మార్చగలడని భావిస్తోంది. ఈ మైదానంలో ఆడిన 11 వన్డేల్లో అతని సగటు 100.85 కాగా మూడు సెంచరీలు బాదాడు. వాటిలో 31 బంతుల్లో చేసిన వరల్డ్ ఫాస్టెస్ట్ సెంచరీ కూడా ఉంది. అయితే రెండు వారాల క్రితం ఇక్కడే టెస్టులో విఫలమైన తరహాలో జరిగితే మాత్రం సఫారీలకు గడ్డు కాలమే.

> రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచే కార్యక్రమంలో భాగంగా ఈ మ్యాచ్‌ను 'పింక్ వన్డే'గా పరిగణిస్తున్నారు. సంవత్సరంలో ఒకసారి ఈ మ్యాచ్ కోసం సఫారీ ఆటగాళ్లు గులాబీ దుస్తులతో బరిలోకి దిగడం సాంప్రదాయంగా వస్తోంది. ఈ మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయంలో పది లక్షల సౌతాఫ్రికా ర్యాండ్‌లను స్థానిక చార్లొట్ మ్యాక్సికే అకడమిక్ హాస్పిటల్‌కు అందజేస్తారు. 2011 నుంచి దక్షిణాఫ్రికా ఐదు వన్డేల్లో పింక్ దుస్తులతో బరిలోకి దిగగా ఐదింటిలోనూ విజయం సాధించడం విశేషం.

శ్రీలంకదే పైచేయి

ఢాకా: శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మధ్య జరుగుతున్న రెండో టెస్టులో బౌలర్ల హవా కొనసాగుతోంది. తొలి రోజే 14 వికెట్లు నేలకూలిన ఈ మ్యాచ్‌లో రెండో రోజూ మరో 14 వికెట్లు పడ్డాయి. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్‌ను 110 పరుగులకే కట్టడి చేసిన లంక... రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి మెరుగైన స్థితిలో నిలిచింది. ప్రస్తుతం 2 వికెట్లు చేతిలో ఉన్న లంక ఓవరాల్‌గా 312 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 56/4తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 110 పరుగులకే ఆలౌటైంది.లంక బౌలర్లలో లక్మల్, ధనంజయలకు చెరో 3 వికెట్లు దక్కాయి.

బీసీసీఐ చొరవ చూపాలి

సునీల్ గావస్కర్

డివిలియర్స్ వంటి ఆటగాడు తిరిగి జట్టుతో చేరడం చిన్న విషయమేం కాదు. ఆటను అతడెలా మార్చేయగలడో ప్రపంచానికంతటికీ తెలుసు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'పింక్ డే' మ్యాచ్‌లలో అతడి నమ్మశక్యంకాని ఇన్నింగ్స్‌లు మార్క్‌రమ్ బృందానికి స్ఫూర్తిదాయకమైనవే. దీంతో పాటు 'గులాబీ' రంగు దుస్తుల్లో దక్షిణాఫ్రికా ఇంతవరకు ఓడలేదు. ఓవైపు భారత మణికట్టు స్పిన్ ద్వయాన్ని ఎదుర్కోవడంలో సఫారీల వైఫల్యం కొనసాగుతుండగా... మరోవైపు కోహ్లిని నిలువరించడం పెద్ద ఆందోళనగా మారింది. కోహ్లికి రబడ మాత్రమే సవాల్ విసరగలుగుతున్నాడు. వీరి పోరాటం చూడదగినది.

అత్యంత ధనిక బోర్డుగా పేరుగాంచిన బీసీసీఐ... ఛారిటీ మ్యాచ్‌ల నిర్వహణలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా బోర్డులను చూసి నేర్చుకోవాలి. కాస్త చొరవ చూపించి ప్రతి సీజన్‌లో ఒక అంశాన్ని ఎంచుకుని దానిపై అవగాహన కల్పించే ఆలోచన చేయాలి. ఐపీఎల్‌లోనూ ఇలాంటి అంశాలకు చోటివ్వచ్చు. విద్యకు సంబంధించిన విషయంపై ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఇలానే చేస్తోంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'గ్రీన్ డే' మ్యాచ్ ఆడుతోంది. ఇలా ప్రతి ఫ్రాంచైజీ ఒక మంచి ఉద్దేశంతో ముందుకొస్తే సమాజానికి మేలు చేసినవారవుతారు.

ఆంధ్రను గెలిపించిన రికీ భుయ్



చెన్నై: విజయ్ హజారే టోర్నీలో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర వికెట్ తేడాతో గోవాపై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో రికీ భుయ్ (86 బంతుల్లో 56 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఆంధ్ర బౌలర్లు గిరినాథ్ రెడ్డి (4/32), విహారి (2/18), అయ్యప్ప (2/37)ల ధాటికి గోవా 47.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రికీ ఒంటరి పోరాటం చేయడంతో ఆంధ్ర 49.3 ఓవర్లలో 191 పరుగులు చేసి గెలుపొందింది.

ఇంద్రా నూయికి అరుదైన గౌరవం

ఐసీసీ తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్‌గా నియామకం



దుబాయ్: పెప్సీకో చైర్మన్, సీఈవో ఇంద్రా నూయి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామకం ఖరారైంది. ఆమె ఈ ఏడాది జూన్‌లో బోర్డులో చేరతారు. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ మార్కెట్‌ను విస్తృతం చేసే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో ఐసీసీ నియమావళిలో భారీ సంస్కరణలు చేపట్టారు. దీనిలో భాగంగా బోర్డులో తప్పనిసరిగా ఒక మహిళా స్వతంత్ర డైరెక్టర్ ఉండాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. నూయి నియామకాన్ని ఐసీసీ చైర్మన్ శశాంక్ మనోహర్ స్వాగతించారు. తమ పాలనా వ్యవహారాల పరిధి పెంపొందించుకునేందుకు ఆమె సామర్థ్యం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం తీవ్ర స్థాయిలో పరిశోధించి అన్నివిధాల అర్హురాలైనందున నూయిని ఎంపిక చేశామని ప్రకటించారు. నూయి మాట్లాడుతూ... 'క్రికెట్‌ను నేను అమితంగా ఇష్టపడతా. యుక్త వయసులో కళాశాలలో క్రికెట్ ఆడా. బృంద స్ఫూర్తి, సమగ్రత, గౌరవం, ఆరోగ్యకర పోటీ వంటి లక్షణాలను ఈ ఆటలోనే నేర్చుకున్నా. నా నియామకంతో ఆశ్చర్యానికి గురయ్యా. బోర్డు సహచరులతో పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నా' అని పేర్కొన్నారు. ప్రస్తుతానికి స్వతంత్ర డైరెక్టర్ పదవి రెండేళ్ల పాటు ఉంటుంది. దీనిని వరుసగా రెండు దఫాల్లో ఆరేళ్ల వరకు పొడిగించుకోవచ్చు.

క్వార్టర్స్‌లో భారత జట్లకు నిరాశ

సింగిల్స్‌లో నెగ్గిన సింధు, శ్రీకాంత్



అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల, పురుషుల జట్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో భారత మహిళల జట్టు 1–3తో ఇండోనేసియా చేతిలో... భారత పురుషుల జట్టు 1–3తో చైనా చేతిలో ఓడిపోయాయి. మహిళల తొలి సింగిల్స్‌లో సింధు 21–13, 24–22తో ఫిత్రియానిపై గెలుపొంది భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. అయితే డబుల్స్‌లో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప జంట, సింధు–సంయోగిత జోడీ, సింగిల్స్‌లో శ్రీకృష్ణప్రియ ఓడిపోవడంతో భారత్ ఓటమి ఖాయమైంది.

పురుషుల విభాగం తొలి మ్యాచ్‌లో శ్రీకాంత్ 14–21, 21–16, 21–7తో షి యుకిపై నెగ్గి భారత్‌ను 1–0 ఆధిక్యంలో నిలిపాడు. అయితే రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట, మూడో మ్యాచ్‌లో సాయిప్రణీత్, నాలుగో మ్యాచ్‌లో సుమీత్ రెడ్డి–మనూ అత్రి ద్వయం పరాజయం పొందడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.


NOKIA
pure · up to date · secure · always with Nokia
Now on
Android 8.0 Oreo™
సాటిలేని జోడి
అత్యుత్తమమైన ధర
Nokia 5 (3GB)
~~₹13,499/-~~
₹12,499/-*
Nokia 8
~~₹36,999/-~~
₹28,999/-*
www.nokia.com/phones
Built to last
A sleek, curved aluminium unibody
Performance at heart
3GB RAM for seamless multi-tasking
Real life ready
Sculpted 13.2cm (5.2") HD display brings your videos to life
Dual-Sight mode
Use front and back cameras simultaneously to capture moments worth sharing
OZO AUDIO
Nokia OZO spatial 360° audio
Record 4K video in immersive high fidelity 3D sound
ZEISS
Capture the moment
Super slim, 13 MP dual camera with ZEISS optics
Available on
amazon.in** Flipkart***
MY JIO STORE Jio DIGITAL LIFE
Reliance digital
croma
Big C
LOT
Cell Point
Sangeetha
Also available in stores near you.
© 2017 HMD Global. All rights reserved. HMD Global Oy is the exclusive licensee of the Nokia brand for phones & tablets. Nokia is a registered trademark of Nokia Corporation. Android is a trademark of Google Inc. The Android robot is reproduced or modified from work created and shared by Google and used according to terms described in the Creative Commons 3.0 Attribution License. Variations on offering may apply. Check local availability. Images are for illustrative purposes only. All other product names, logos and brands are property of their respective owners. To know more about the smartphones, log on to www.nokia.com/phones. *Best recommended price (inclusive of all taxes). **Nokia 8 also available on Amazon.in ***Nokia 5 also available on Flipkart.T&C apply.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం, 10-2-2018



పూలూ..
రాళ్లూ...
రెండూ
భరించాల్సిందే

సినిమా పేజీలో...



'సర్దార్ జోగీందర్ సింగ్' చిత్రంలో జోగీందర్ పాత్రధారి గిప్పీ గ్రేవాల్

ఖబడ్దార్ చైనా

భారత్-చైనా సరిహద్దు ప్రాంతం 'దోక్లామ్' నివురుగప్పిన నిప్పులా ఉంది. కొద్ది నెలలుగా అక్కడ చైనా సైనికుల కదలికలు ఎక్కువయ్యాయి. రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను ఉల్లంఘించి, గతంలో మాదిరిగా చైనా ఇప్పుడు కూడా స్నేహద్రోహానికి పాల్పడి భారత్‌పై యుద్ధానికి దిగితే.. గట్టి సమాధానమే ఇచ్చేందుకు భారతీయ సైనికులు కూడా తుపాకులు ఎక్కుపెట్టి ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 'సర్దార్ జోగీందర్ సింగ్' అనే పంజాబీ బయోపిక్ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. దేశంలోని ప్రతి యువకుడూ 'ఖబడ్దార్ చైనా' అంటూ, సైనిక దళాల్లో చేరేందుకు స్ఫూర్తినిచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉన్నాయని టీజర్ చూస్తే అర్థమౌతోంది.

నెహ్రూ ప్రేమమయుడు. శాంతి ప్రియుడు. శత్రువు ఖడ్గం తీస్తే, ఆ ఖడ్గంతో కరచాలనం కోసం మృదువైన తన చేయిని చాస్తాడు! అయితే ఇప్పుడు మనం ఆ కథలోకి వెళ్లడం లేదు. 'పరమ వీర చక్ర సుబేదార్ జోగీందర్ సింగ్' అనే కథలోకి వెళ్తున్నాం. ఇది కేవలం కథ కాదు. నిజ జీవిత కథ. ఏప్రిల్ 6న 'సుబేదార్ జోగీందర్ సింగ్' అని సినిమాగా విడుదల కాబోతున్న సాహస గాథ. చైనాను నెహ్రూ గుడ్డిగా నమ్మకపోతే 1962 ఇండో చైనా యుద్ధమే లేదు. ఆ యుద్ధమే లేకపోతే సుబేదార్ జోగీందర్ సింగ్ అనే సినిమానే ఉండబోయేదే కాదు.

నిబద్ధతలో గెలుపు మనదే!

శత్రువును నమ్మొద్దని ఇండో–చైనా యుద్ధం మనకు నేర్పింది. 'శత్రువును తరిమికొట్టేందుకు.. సైనికుడా.. నువ్వు నీ చివరి ప్రాణపు చుక్క చిందే వరకు పోరాడుతూనే ఉండు' అని జోగీందర్ సింగ్ స్ఫూర్తినిచ్చాడు! యుద్ధంలో భారత్ ఓడిపోయింది. నిబద్ధతలో భారత సైన్యానిదే గెలుపని నిరూపించాడు జోగీందర్.

అక్టోబర్ 20 నుంచి నవంబర్ 21 వరకు నెల రోజుల యుద్ధమది. మనవైపు 1383 మంది సైనికులు చనిపోయారు. 3,968 మంది సైనికులు చైనాకు బందీలయ్యారు. బందీ అయ్యాక కూడా తిరగబడి, వీరమరణం పొందిన సైనికుడు సుబేదారు జోగీందర్ సింగ్! గాయాల నుంచి కారుతున్న రక్తపు చుక్కల్ని బౌండరీలపై రెడ్‌మార్కులుగా పెట్టి, 'దాటితే చస్తావ్' అని శత్రు మూకల్ని హడలుకొట్టి, అరుణాచల్‌ప్రదేశ్‌ను భరతమాత ఒడి జారనివ్వకుండా ఒడిసిపట్టుకున్నాడు జోగీందర్ సింగ్.

అరుణాచల్‌ప్రదేశ్‌కు అప్పటికొక పేరు లేదు. 'నార్త్ ఈస్ట్రన్ ఫ్రాంటియర్ ఏజెన్సీ' (ఎన్.ఇ.ఎఫ్.ఎ) అది. దాని కోసమే చైనా యుద్ధానికొచ్చింది. యుద్ధంలో గెలిచి కూడా ఎన్.ఇ.ఎఫ్.ఎ.ని పొందలేకపోయింది. ఆ ఘనకీర్తి జోగీందర్‌దీ, జోగీందర్ నడిపించిన 'బమ్ లా' దళానిది.

• ❖ •

చైనా నుంచి నెహ్రూ ఏం కోరుకున్నాడో అది దక్కనందుకు యుద్ధం వచ్చింది. చైనా ఏం కోరుకుందో అది దక్కకుండా చేసినందుకు జోగీందర్ హీరో అయ్యాడు.

చైనా నుంచి నెహ్రూ స్నేహాన్ని కోరుకున్నాడు. చైనా విప్లవ నేత మావో జెడాంగ్‌ని తన స్నేహితుడు అనుకున్నాడు. ''మనిద్దరం ఇచ్చిపుచ్చుకుంటే మన మధ్య బంధం బలపడుతుంది'' అన్నాడు నెహ్రూ. ''అలాగైతే అక్సాయ్‌చిన్‌ని, అరుణాచల్‌నీ ఇవ్వు'' అన్నాడు జెడాంగ్. ''భౌగోళికంగా కాదు, బాంధవ్యాలతో పెనవేసుకుందాం'' అన్నాడు నెహ్రూ. జెడాంగ్ మౌనంగా ఉండిపోయాడు. భారత్ సరిహద్దుల్లోకి గుట్టు చప్పుడు కాకుండా చైనా చొరబడింది. నెహ్రూకి యుద్ధం చెయ్యక తప్పలేదు. సరిగ్గా ఇక్కడి నుంచే 'సుబేదార్ జోగీందర్ సింగ్' సినిమా మొదలౌతుంది.

• ❖ •

1962 సెప్టెంబర్ 9.

డిఫెన్స్ మినిస్టర్ కృష్ణ మీనన్ నుంచి వేళకాని వేళలో నెహ్రూకి కాల్!

''వేరే దారి లేదు మిస్టర్ ప్రైమ్ మినిస్టర్. చైనా దళాలు 'తలా రిడ్జ్'లో సౌత్‌కి వచ్చేశాయి'' అంటున్నాడు మీనన్.

స్నేహాన్ని నమ్మినంత కాలం నమ్మాం. ఇప్పుడు సైన్యాన్ని నమ్ముకోవలసిన కాలం వచ్చేసిందని నెహ్రూకి అర్థమైంది. నెహ్రూ అప్పుడు లండన్‌లో ఉన్నాడు. కామన్వెల్త్ ప్రైమ్ మినిస్టర్స్ మీట్‌లో.

సరిగ్గా అర నిమిషం తర్వాత నెహ్రూ నుంచి మీనన్‌కి 'డన్' అని సంకేతం. వెంటనే మన సెవన్త్ ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్.. చైనా సేనలు బలంగా నిలుచుని ఉన్న 'నమ్‌కా ఛు' వైపు కదిలింది. 'సిక్కు రెజిమెంట్' ఆ బ్రిగేడ్‌లోనే ఉంది. జోగీందర్ సింగ్ ఆ రెజిమెంట్‌లోనే ఉన్నాడు. సుబేదార్ అతడు. దళపతి.



సుబేదార్ జోగీందర్ సింగ్ పరమవీరచక్ర
1921-1962
జననం : పంజాబ్

'నమ్‌కా ఛు'ని చేరుకునే దారిలో 'బమ్ లా' పోస్టు దగ్గర మూడు వైపుల్నుంచీ కదిలి వచ్చిన చైనా సేనల్ని సిక్కు రెజిమెంట్ అడ్డుకుంది. వాళ్ల సంఖ్య ఎక్కువగా ఉంది. వీళ్లు తక్కువగా ఉన్నారు. ఎక్కువ తక్కువల్ని చూసుకోలేదు సుబేదార్ జోగీందర్ సింగ్. తన సేనల్లో స్ఫూర్తిని నింపి అన్ని వైపులకు కదిలించాడు. కానీ శత్రువుల బలగం ఎక్కువగా ఉంది. నిమిష నిమిషానికీ మన బ్రిగేడ్ బలం సన్నగిల్లుతోంది. సిక్కు రెజిమెంట్‌లో ఉన్నదే 20 మంది సైనికులు. వారిలోనూ పది మంది నేలకు ఒరిగారు. మిగిలింది జోగీందర్, మరో తొమ్మిది మంది! వారి దగ్గర కూడా బాయ్‌నెట్‌లే మిగిలాయి. వాటితోనే పోరాడుతున్నారు. జోగీందర్ ఒంటినిండా బలమైన గాయాలు. చివరికి ఆ గాయాలు అతడిని చైనా సైనికులకు బందీని చేశాయి! బందీగానే మరణించాడు జోగీందర్ .

తండ్రి మరణ వార్త వినగానే జోగీందర్ సింగ్ పెద్ద కూతురు కుప్పకూలిపోయి అక్కడే మరణించారు. చైనా అతడి చితాభస్మాన్ని సైనిక మర్యాదలతో ఇండియాలోని బెటాలియన్‌కి పంపించింది. భారత ప్రభుత్వం ఆయనకు పరమవీర చక్ర అవార్డును ప్రకటించింది.

• ❖ •

వందల మంది శత్రుదేశ సైనికులతో పోరాడిన ఇరవైమంది సైనికుల వీరోచిత పోరాటానికి దృశ్యరూపం .. 'సుబేదార్ జోగీందర్ సింగ్'. సింగ్‌గా గిప్పీ గ్రేవాల్ నటిస్తున్నారు. టీజర్ చివర్లో.. 'ఫర్ యువర్ కైండ్ ఇన్‌ఫర్మేషన్. దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టు ఇండియా' అంటాడు గ్రేవాల్. అలా అంటున్నప్పుడు అతడిని చూస్తే.. జోగీందర్ సింగ్ ఆత్మ అతడిలో ప్రవేశించిందా అనిపిస్తుంది.

పంజాబీలనే కాదు, మిగతా రాష్ట్రాల యువకులనీ సైన్యంలోకి పట్టి తీసుకుపోయేంత ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది సుబేదార్ జోగీందర్ సింగ్ లైఫ్ హిస్టరీ. అదిప్పుడు తగిన సమయంలో తెరకెక్కబోతోంది.

•

స్మోక్ అండ్ విస్కీ

మామగారి కానుక

అబ్బాయిల్లో అనుష్కా శర్మకు పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. వాళ్లందరిలో ఫ్యాన్ బాయ్ నెంబర్ 1 విరాట్ కోహ్లీ. అమ్మాయిల్లో విరాట్‌కు కూడా అంతే ఫాలోయింగ్ ఉంది. వాళ్లందరిలో ఫ్యాన్ గర్ల్ నెంబర్ 1 అనుష్క. విరాట్ సెంచరీ చేసిన ప్రతిసారీ ఫస్ట్ విజిల్ అనుష్కదే. అనుష్క కొత్త సినిమా వస్తున్న ప్రతిసారీ ఆ మూవీ గురించి ఎక్కువగా మాట్లాడేది కోహ్లీనే. ఈ బ్యూటిఫుల్ కపుల్ ఇప్పుడు భారతదేశానికి యువ ఆదర్శ దంపతులు. ఈ దంపతులకు ఇప్పుడు విరాట్ అత్తమామలు (అనుష్క పేరెంట్స్) అజయ్ కుమార్ శర్మ,





● అనుష్క, విరాట్: పెళ్లినాటి ఫొటో
కింద: కవయిత్రి తేజస్వినీ దివ్య నాయక్

అషిమలు కూడా ఫ్యాన్స్ అయినట్లున్నారు. వర్ధమాన కవయిత్రి తేజస్వినీ దివ్యా నాయక్ రాసిన తొలి పుస్తకం 'స్మోక్ అండ్ విస్కీ' ఆవిష్కరణ సభకు భార్యతో కలిసి వెళ్లిన విరాట్ మామగారు... ఆ సభా ప్రాంగణంలోనే క్యూలో నిలబడి మరీ.. తేజస్విని సంతకం ఉన్న రెండు పుస్తకాలను కొని, వాటిని విరాట్ అనుష్కల కోసం దాచి ఉంచారు! అనుబంధాలపై రాసిన 42 కవితల సంకలనం 'స్మోక్ అండ్ విస్కీ'. ప్రస్తుతం విరాట్ దక్షిణాఫ్రికాలో ఉన్నారు. అనుష్క.. షారుక్ ఖాన్‌తో కలిసి నటిస్తున్న 'జీరో' చిత్రం షూటింగ్‌లతో బిజీగా ఉంది. ఈ జంటను ఒకటిగా చూడడం కోసం రెండు కుటుంబాల వాళ్లు ఎదురు చూస్తున్నట్టే.. కరణ్ జోహార్ కూడా నిరీక్షిస్తూ కూర్చున్నారు. 'కాఫీ విత్ కరణ్ షో'లో వీళ్లను కలిపి చూపాలని టీవీ చానల్స్ కూడా తహతహలాడుతున్నాయి. అంతవరకు మనం విరాట్ క్రికెట్ విన్యాసాలతో, మార్చి 2న విడుదల కాబోతున్న 'పరీ' సినిమాతో సంతృప్తి పడవలసిందే!

బ్యూటిప్



- జలుబు వల్ల ఉదయం నిద్రలేవగానే కళ్ల కింద ఉబ్బుగా కనిపిస్తుంది. ఎండిన చిట్టి చేమంతులను పొడి చేసి, ఆ పొడిని ఒక గుడ్డలో వేసి మూట కట్టాలి. వేడి నీటిలో ఆ మూటను కాసేపు ఉంచి, ఉబ్బుగా ఉన్న కళ్ల కింద మృదువుగా అద్దుతూ (తగినంత మాత్రమే వేడి ఉండేలా జాగ్రత్తపడాలి) ఉండాలి. రోజూ ఉదయాన్నే ఇలా చేస్తే కళ్లకింద ఉబ్బుతో పాటు నల్లని వలయాలు కూడా తగ్గుముఖం పడతాయి.
- చామంతి పొడితో కాచిన తేనీటిని మాడుకు పట్టించి, తర్వాత తలస్నానం చేస్తే ఎంతకీ తగ్గని చుండ్రు సమస్య పరిష్కారం అవుతుంది.

ప్రిన్స్



అమ్మాయిలూ... వలలో పడకండి

బ్రిటన్ రాకుమారుడు ప్రిన్స్ విలియమ్స్‌కి అమ్మాయిల భద్రత గురించి బెంగ పట్టుకుంది. ''గర్ల్స్.. ఎందుకలా మీరు సోషల్ మీడియాలో అస్తమానం రకరకాల పోజుల్లో కనిపిస్తారు? గుట్టుగా ఉండండి. లోకం ఎంత బూటకంగా ఉందో తెలుసా? మీరు ఏదో ఒక గొడవలో చిక్కుకుపోతారు. జాగ్రత్తగా ఉండండి'' అని గురువారం లండన్‌లోని బర్లింగ్‌టన్ డేన్స్ అకాడమీలో మాట్లాడుతూ.. ఆడపిల్లల్ని హెచ్చరించారు ప్రిన్స్. 'సైబర్ బుల్లీయింగ్' గురించి ప్రసంగించేందుకు అకాడమీవాళ్లు ప్రిన్స్‌ని ప్రత్యేకంగా ఆహ్వానించిన సందర్భం అది.

స్మార్ట్‌ఫోన్‌లో చిక్కుకుపోతే ఎవరికైనా సమస్యలు తప్పవు. అయితే అమ్మాయిలు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రిన్స్ ఉద్దేశం. 'అవసరానికి మించి ఆన్‌లైన్‌లో ఉండకండి. బుల్లీయింగ్‌కి (టీజింగ్‌కి) గురికాకండి' అని ప్రిన్స్ చెబుతున్నప్పుడు మీడియా ఆ పాయింట్‌కి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. సభలో ఉన్న మిగతా ప్రముఖులు ప్రిన్స్ ఎంతో అమూల్యమైన సూచన చేశారని అభినందించారు. నిజానికి రాజప్రసాదం కూడా సోషల్ మీడియాకు మొదట్నుంచీ దూరంగానే ఉంటుంది. ప్రిన్స్ విలియమ్స్ తమ్ముడు ప్రిన్స్ హ్యారీతో పెళ్లి ఫిక్స్ కాగానే మేఘన్ మార్కెల్.. సోషల్ మీడియాలోని తన అన్ని అకౌంట్‌లనూ ఇటీవలే క్లోజ్ చేసేశారు. అమ్మాయిలూ విన్నారు కదా! ఆచరించే వారు చెబితే ఎవరు మాత్రం వినకుండా ఉంటారు?

చెట్టు నీడ

విలువ తెలిసినవారు

విలువైనవి ఆనందించడం తెలిసినవాళ్లు అల్పమైన విషయాలను ఖాతరు చేయరు.

ఒకానొక కాలంలో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఆయన ఒక కొండవాలు దగ్గర చిన్న గుడిసె కట్టుకుని నివసిస్తుండేవాడు. ఆయన దగ్గర విలువైన వస్తువులు ఉండివుంటాయని పొరబడిన ఒక దొంగ ఒకరోజు రాత్రి దొంగతనానికి వచ్చాడు. గుడిసెలో కొన్ని ముంతల్లాంటివి తప్ప అపహరించదగినవేవీ కనబడలేదు. కనీసం పాత బట్టలు కూడా లేవు. దొంగ తీవ్ర నిరాశ చెందాడు. అయితే, దొంగతనానికి వచ్చిన మనిషి అలికిడి విని గురువు నిద్ర లేచాడు. దొంగ ఉత్తిచేతుల్తో తిరిగి వెళ్లడం ఆయన్ని బాధించింది.

'మిత్రమా, కావాలంటే నువ్వు నేను వేసుకున్న బట్టలు తీసుకెళ్లు' అన్నాడు.

దొంగ దానికి ఒప్పుకున్నాడు. గురువు వాటిని విడిచి ఇచ్చేశాడు. దొంగ వెళ్లిపోయాడు.

గురువు అలాగే ఆ రాత్రి ఆకాశంలో చందమామను చూస్తూ కూర్చున్నాడు. దివ్యంగా వెలుగుతున్న జాబిలి అందానికి ముగ్ధుడై, 'అయ్యో, అతడికి నేను పాత బట్టలు ఇచ్చిపంపానే; ఈ చందమామను ఇవ్వగలిగివుంటే ఎంత బాగుండేది' అని తలపోశాడు.

ఈ కథ ఏం చెబుతోంది? దొంగతనం చేసినవాడిపట్ల కూడా చూపాల్సిన కరుణ గురించా? అదీ ఒక అంశమే. దానికన్నా కూడా ఇది చాటేది మరొకటుంది. విలువైనవి ఆనందించడం తెలిసినవాళ్లు అల్పమైన విషయాలను ఖాతరు చేయరు. బహుశా, మనలో చాలామందిమి దీనికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నామేమో!

గుడ్‌ఫుడ్

హృదయమున్న ద్రాక్ష!




ద్రాక్షపండు కేవలం రుచి విషయంలోనే కాదు... ఆరోగ్య ప్రయోజనాల విషయంలోనూ తనకు తానే సాటి. ద్రాక్షతో ఒనగూరే లాభాల్లో ఈ కింద పేర్కొన్నవి కొన్ని మాత్రమే.

- మనుషుల్లో యాంజియోటెన్సిన్ అనే ఒక రకం హార్మోన్‌కు రక్తనాళాలను సన్నబార్చే గుణం ఉంది. ద్రాక్షపండు ఆ హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఈ విధంగా కూడా ద్రాక్ష గుండెజబ్బులను నివారిస్తుంది.
- ద్రాక్షలోని కేటెచిన్ అనే యాంటీ యాక్సిడెంట్ కూడా అనేక విధాల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.
- రక్తనాళాలను తెరచుకొని ఉండేలా చేసే నైట్రిక్ ఆక్సైడ్‌ను ద్రాక్షపండ్లు వెలువరిస్తాయి. తద్వారా అవి రక్త ప్రవాహం సాఫీగా జరిగేలా చూస్తాయి. ఇలా కూడా అవి గుండెజబ్బులను దరిచేరకుండా చేస్తాయి. అంటే ద్రాక్షపండు ఇలా అనేక మార్గాల్లో గుండెకు మేలు చేస్తుందన్నమాట.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
శనివారం
10-2-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ లవ్ సార్, హాయ్ నీలూ.. అండ్ హాయ్ బనానా..! నా ప్రేమికే నాలుగేళ్లు. మా లవ్ స్టార్టైన సిక్స్ మంత్స్ తరువాత తనకి వాళ్ల క్లాస్ అబ్బాయి పరిచయం అయ్యాడు. అప్పుడు నువ్వు నాకొద్దు, లవ్ అంటే ఇష్టం లేదు అనేది. కానీ వాడితో మాత్రం బాగా మాట్లాడేది. ఒకరోజు ఆ అబ్బాయి తనకి ప్రపోజ్ చేస్తే ఓకే అందట. ఆ విషయం నా ఫ్రెండ్ వలనే తెలిసింది. ఏంటి విషయమని నిలదీస్తే.. ఆ అబ్బాయి అన్నయ్య అవుతాడంది. ఓకే అనుకున్నా కానీ కొద్ది రోజులకే వాళ్లిద్దర్నీ బ్యాడ్‌గా చూశాను. దాంతో తనకి దూరంగా కాలేజ్ కూడా మానేసి వెళ్లిపోయాను. మెల్లగా ఆ గాయం నుంచి తేరుకునే సమయంలో తను ఫోన్ చేసి "నువ్వు నాకు కావాలి, ఐ లవ్ యూ" అంది. తన మీదున్న ఇష్టంతో ఓకే అన్నాను. తిరిగి తనని కలిశాను. ఇంకెప్పుడు ఆ అబ్బాయితో మాట్లాడొద్దని మాట కూడా తీసుకున్నాను. వన్ వీక్ చాలా బాగున్నాం. మళ్లీ ఫోన్ బిజీ వచ్చేది. ఎవరితో మాట్లాడుతున్నావ్ అని అడిగితే ఆ అబ్బాయితో అని చెప్పింది. మాట్లాడవద్దని ప్రామిస్ చేశావుగా అని అడిగితే నా ఇష్టం అంది. దాంతో తనకి పూర్తిగా దూరమైపోయాను. కానీ ఆ అమ్మాయి గుర్తుకొస్తున్న ప్రతిసారి తను తీసుకున్న నిర్ణయం కరెక్టో, కాదో అర్థం కావడంలేదు..? మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– మధు కుమార్

''మంచిదయ్యింది ఇవ్వాళ ఆ మీసాలోడు లేడక్కా...''

'ఎందుకలా అన్నావు అరటిపండు.. ఆయనుంటే ఏంటి ఇబ్బంది??'

''నన్ను తింటాడు సరే అక్కా, ఆ పెంట ఆన్సర్స్‌తో వాళ్ల బ్రెయిన్ కూడా తింటాడు కదక్కా..!''

'బొగ్గు పెట్టినాడు. రాక మాన్తాడా..?! నిన్ను ఆరగించాక, వాళ్లని తినక మాన్తాడా అరటిపండూ..?!'

''అక్కా... ఛాన్స్ బాగుంది. మీసాలోడొచ్చే లోపు నువ్వే ఆన్సర్ ఇచ్చెయ్.. నువ్వేంటో చూపించెయ్...!''

'ఎందుకు మధు కుమార్ నీ తొట్టిలో తపడు ప్రేమ..? అమ్మాయికి స్టెబిలిటీ లేదు. నీకు మెచ్యూరిటీ లేదు. సన్నాని సన్నాని పుణుకులతో వచ్చేది ప్రేమ కాదు. తొట్టిలో తపడే ఈ ప్రపంచం తొట్టి కంటే పెద్దదని గుర్తించు. అక్కడ చాలా ప్రేమ ఉంది. దాన్ని అన్వేషించు. ఆనందించు. జీవించు..!'

''అక్కా.. సూపర్ అక్క. ఏం ఫిలాసఫీ అక్కా..?! నీకే మీసాలుంటే.....!! లేకపోయినా ఫరవాలేదక్కా.. ఈ ఆన్సర్ చూశాక మీసాలోడికి ఏ మాత్రం పౌరుషం ఉన్నా గీసేసుకోవాలి అక్కా..!!''

'చాల్లే అరటిపండూ...! ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. విషయం ఉన్నా లేకపోయినా మీసాలు బాగుంటాయి అరటిపండూ.'

''నిన్నూ, ఆ మీసాలోడ్నీ, మధుకుమార్నీ ఎవ్వరూ మార్చలేరక్కా!!''

lovedoctorram@sakshi.com

నేను ప్రేమికుణ్ణి... కానీ లవర్ లేదు!

''బాబాయ్ (పవన్ కల్యాణ్) 'తొలిప్రేమ' టైమ్‌కీ ఇప్పటికీ టెక్నాలజీలో చాలా మార్పులొచ్చాయి. అప్పట్లో సెల్‌ఫోన్లు ఉండేవి కావు. అందుకే.. ఆ సినిమాలో హీరోయిన్‌కి ప్రేమలేఖ రాస్తాడు హీరో. కానీ.. ఇప్పుడలా కాదు. సెల్‌ఫోన్స్, సోషల్ మీడియా బాగా విస్తరించింది. నా 'తొలిప్రేమ' చిత్రంలో తొలి షాట్‌లోనే హీరోయిన్‌కి ప్రేమ విషయం చెప్పేస్తా'' అని వరుణ్ తేజ్ అన్నారు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' ఈరోజు విడుదలవుతోంది. వరుణ్ తేజ్ చెప్పిన విశేషాలు.


● వరుణ్‌తేజ్

● వెంకీ నాకు ఐదారేళ్లుగా తెలుసు. నిహారిక షార్ట్ ఫిల్మ్స్‌కి రచనలో సహాయం చేశాడు. ఏ సినిమాకైనా కథే హీరో. తను చెప్పిన కథ నచ్చడం, 'దిల్' రాజుగారు వెంకీ గురించి చెప్పడంతో ఈ మూవీ చేశా. ఫస్ట్ సినిమా అయినా బాగా తీశాడు.

● 'ఫిదా' కంటే ముందే 'తొలిప్రేమ' సైన్ చేశా. అయితే ముందు 'ఫిదా' వస్తే బాగుంటుందనుకున్నాం. ఆ సినిమా తర్వాత వస్తున్న 'తొలిప్రేమ' పై మంచి అంచనాలున్నాయి. ఇదొక ప్యూర్ లవ్‌స్టోరీ. నేను అనుకుంటే ఏదైనా చేయగలను.. నేను చేసేదే కరెక్ట్ అనుకునే పాత్ర నాది. ఏదైనా చేసేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలన్నది హీరోయిన్ పాత్ర. విభిన్న మనస్తత్వాలున్న మేం ప్రేమలో పడితే ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. కల్యాణ్ బాబాయ్ 'తొలిప్రేమ'తో మా సినిమాని పోల్చలేం. మా సినిమా ఈ జనరేషన్‌కి నచ్చుతుంది.

● కాలేజ్ పార్ట్ షూటింగ్ చేసేటప్పుడు నా కాలేజ్ డేస్ గుర్తొచ్చాయి. నిజజీవితంలో నేను టాపర్ కాదు కానీ సినిమాలో ఎకనామిక్స్‌లో టాపర్‌ని కనిపిస్తా. ఈ సినిమా చూశాక ఎక్కడో ఒక్క బొట్టైనా ప్రేక్షకులు ఇది మా లైఫ్‌లో జరిగిందనుకుంటారు.

● చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే ప్రేమ. కాలేజ్ బంక్ కొట్టి మరీ సినిమాలు చూసేవాణ్ని. హాలీవుడ్ లాంటి వైవిధ్యమైన చిత్రాలు తెలుగులో ఎందుకు తీయడం లేదనుకునే వాణ్ని. కొత్త తరహా కథలకి మనమే శ్రీకారం చుడదామనుకుని వైవిధ్యమైన కథలు ఎంచుకుంటున్నా.

● మెగా ఫ్యామిలీలోని హీరోల్లో ఎవరికి నచ్చిన తరహా కథలు వారు ఎంచుకుంటున్నారు. నాకు ప్రయోగాలతో కూడిన వైవిధ్యమైన కథలంటే ఇష్టం. కథ ఎంపికలో 'ఫిదా' నుంచి కాన్ఫిడెన్స్ వచ్చింది. ఆ కథ నాన్నగారికి (నాగబాబు) చెప్పలేదు. 'తొలిప్రేమ' కథ చెప్పా. బాగుందన్నారు. పైగా.. నువ్వు చేయాలనుకుని మైండ్‌లో ఫిక్స్ అయితే చేస్తావుగా.. ఏదో మాట వరసకి నన్ను అడుగుతున్నావ్ అంటారు (నవ్వుతూ).

● హిట్ అవుతుందని చేసిన సినిమా ఫ్లాప్ అయినప్పుడు బాధగా ఉంటుంది. తప్పు ఎక్కడ జరిగిందా అని మళ్లీ జరగకుండా చూసుకుంటా. 'కంచె' లాంటి సినిమాలు ఇండస్ట్రీకి రావాలి. నిర్మాతలకు డబ్బులొస్తేనే అటువంటి సినిమాలు మరిన్ని చేస్తారు. మా అంజనా ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేస్తా. టైమ్ పడుతుంది.

● ఇంత స్టార్‌డమ్, స్టేటస్ వదులుకుని బాబాయ్ (కల్యాణ్) సినిమాలు వదిలి రాజకీయాల్లోకి వెళ్లారంటే అందుకు గట్స్ కావాలి. నేనైతే వెళ్లను.

● రెండు నెలల గ్యాప్ తర్వాత 'ఘాజి' ఫేమ్ సంకల్ప్‌రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నా. అంతరిక్షం నేపథ్యంలో ఆ సినిమా ఉంటుంది. నా కెరీర్‌లో అది ప్రతిష్టాత్మక చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది. అనిల్ రావిపూడి ఓ పాయింట్ చెప్పాడు. కథ డెవలప్ చేయమన్నాం.

● సినిమాల్లో ప్రేమించడం తప్ప రియల్ లైఫ్‌లో లవ్‌లో పడలేదు. 'వేలంటైన్స్ డే'కి ఏమీ లేదు. కాకపోతే ఆ సెలబ్రేషన్స్ ఎలా ఉంటాయో తెలుసుకోడానికి నా ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేషన్స్ జరిగే ప్లేసెస్‌కి వెళ్లేవాణ్ణి. స్కూల్‌డేస్‌లో చిన్న క్రష్ తప్ప వేరే ఏం లేదు.

ఏం వయ్యారం.. ఏం వయ్యారం...


● సమంత

కడవనైనా కాకపోతిని, నెత్తి మీద మోపునైనా కాకపోతిని, సైకిల్ హ్యాండిల్‌బార్ అయినా కాకపోతిని, సబ్బునైనా కాకపోతిని... రామలక్ష్మి అందానికి కుర్రకారు ఇలానే ఫిదా అయిపోతారు. నడుమున కడవతో గోదారి ఒడ్డున రామలక్ష్మి వయ్యారంగా హొయలు పోతుంటే కుర్రాళ్ల గుండె వేగం పెరిగిపోతుంది. మోపుకట్ట మీద అసూయ పుడుతుంది. 'రంగస్థలం'లో సమంత చేస్తోన్న రామలక్ష్మి క్యారెక్టర్ టీజర్ చూసి చాలామంది ఇలానే అనుకున్నారు. ఇక సినిమాలో చిట్టిబాబు గుండెల్లో గోలపెట్టేసింది రామలక్ష్మి. రామ్‌చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మిస్తున్న సినిమా 'రంగస్థలం'. రీసెంట్‌గా టీజర్‌ను, రామ్‌చరణ్ లుక్‌ను రిలీజ్ చేసిన చిత్రబృందం శుక్రవారం సమంత టీజర్‌ను విడుదల చేశారు. ''హో.. హో.. హో.. ఏం వయ్యారం.. ఏం వయ్యారం...'' అంటూ రామ్‌చరణ్ వాయిస్‌తో సాగే రామలక్ష్మి టీజర్ సూపర్‌గా ఉందని సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో స్పందించారు. ''మామూలుగా కథానాయికలకు టీజర్‌లు రిలీజ్ చేయరు. కానీ చరణ్, సుకుమార్ చేశారు. బహుశా.. నాపై అభిమానాన్ని వారు ఇలా చాటుకున్నారేమో అనిపిస్తోంది. వారికి థ్యాంక్స్'' అన్నారు సమంత. ఈ సినిమాలోని తొలి పాటను ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 13న రిలీజ్ చేయనున్నారు. ''పక్కా పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న చిత్రమిది. రామ్‌చరణ్, సమంత లుక్స్‌కి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కంప్లీట్ చేసి సినిమాను మార్చి 30న విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

ప్రేమ యుద్ధం


● ఆకాశ్ పూరి

సరిహద్దు ప్రాంతం. రెండు దేశాల మధ్య యుద్ధం జరుగుతోంది. అటు వాళ్లు ఇటు రాకూడదు. ఇటు వాళ్లు అటు రాకూడదు. కానీ ప్రేమ కోసం ఓ రెండు మనసులు మాత్రం హద్దు దాటాయి. ఇప్పుడు వార్ దేశాల మధ్య మాత్రమే కాదు. ఈ ప్రేమికుల మనసుల్లో మాత్రం ప్రేమ యుద్ధం. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై రూపొందుతున్న సినిమా 'మెహబూబా'. పూరీ తనయుడు ఆకాశ్ పూరి, నేహాశెట్టి జంటగా నటిస్తున్నారు. 1971 ఇండో–పాక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో సాగనున్న ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. 'ఏ వెరీ స్పెషల్ ఫిల్మ్ టు మి' అంటూ టీజర్‌ను షేర్ చేశారు పూరి జగన్నాథ్. టీజర్‌లో ఇండియా, పాక్ ఎంట్రన్స్ గేట్స్‌ను ఓపెన్ చేయడం, వార్ జరుగుతున్నప్పుడే ప్రేమను గెలిపించుకోవడం కోసం హీరో, హీరోయిన్లు బోర్డర్ దాటేందుకు ప్రయత్నించడం వంటివి ఆసక్తి రేకెత్తించే విధంగా ఉన్నాయి. విజువల్స్ రిచ్‌గా ఉన్నాయి. సినిమాలో ఇండియన్ బాయ్‌గా ఆకాశ్ పూరి, పాకిస్తానీ అమ్మాయిగా నేహాశెట్టి కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ సినిమాను సమ్మర్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. విష్ణు రెడ్డి, షాయాజీ షిండే, మురళీ శర్మ, అశ్వని తదితరలు నటిస్తున్న ఈ సినిమాకు సందీప్ చౌతా స్వరకర్త.

గ్యాంగ్‌స్టర్ లవర్!


● కల్యాణి

హే.... అని ఎగిరి గంతేస్తున్నారు కల్యాణి ప్రియదర్శన్. ఎందుకంటే తను ఎప్పటి నుంచో అనుకుంటున్న ఓ కోరిక నెరవేరిందట. ఏంటా కోరిక అనుకుంటున్నారా? గ్యాంగ్‌స్టర్ సినిమాలో నటించాలన్నది తన డ్రీమ్. 'హలో'తో మంచి హిట్ అందుకున్నా ఒక్క సినిమా కూడా సైన్ చేయని కల్యాణి, తన నెక్స్ట్ సినిమాను అనౌన్స్ చేశారు. శర్వానంద్ హీరోగా సుధీర్ వర్మ డైరెక్షన్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో శర్వానంద్ డబుల్ యాక్షన్ చేయనున్నారు. ఒక పాత్రకు జోడీగా కల్యాణి ప్రియదర్శన్‌ని ఎంపిక చేశారు చిత్రబృందం. ఈ సినిమా గురించి మాట్లాడుతూ – ''నేను ఎప్పటి నుంచో ఒక గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్‌లో నటించాలని అనుకునేదాన్ని. ఫైనల్‌గా సుధీర్‌వర్మ – శర్వానంద్ సినిమా ద్వారా ఆ కోరిక తీరిపోతోంది. ఇంత అమేజింగ్ టీమ్‌తో జాయిన్ అవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు కల్యాణి. ''ఈ సినిమాలో ఇద్దరి హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా కల్యాణిని ఎంపిక చేశాం. మార్చి 3వ వారం నుంచి షూటింగ్ చేస్తాం'' అని అన్నారు. ఇందులో శర్వానంద్ ఒక క్యారెక్టర్ కోసం 40 ఏళ్ల పాత్రలో కనిపించనున్నారట. ఈ సినిమాకు కెమేరా:దివాకర్ మణి, సంగీతం: సన్నీ యం.ఆర్.

కాకురో సుడోకు

	5		8			7		
		9	6		7			
7	3		2	5				9
							7	6
6	8	5	1		9	3	2	4
4	7							
2				8	3		5	7
			4		6	1		
		8			5		9	

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	2	1	8	4	7	6	5	9
8	7	5	6	2	9	3	1	4
6	9	4	3	1	5	2	8	7
7	6	8	4	5	1	9	3	2
9	5	2	7	3	8	1	4	6
1	4	3	2	9	6	5	7	8
2	8	7	1	6	3	4	9	5
4	1	9	5	8	2	7	6	3
5	3	6	9	7	4	8	2	1

రాశి ఫలాలు (సౌరమానం)

జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా?
మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (ఫిబ్రవరి 10 నుంచి 16 వరకు) మీ రాశి ఫలితాలు



డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

చర్మవ్యాధి ఉన్నవారి వస్త్రాలను ధరిస్తే ఆ వ్యాధీ, జలుబూ, రొంపా ఉన్న వారికి దగ్గరగా తిరిగితే వచ్చే ఆ వ్యాధీ వైద్యానికి లొంగేవే. అయితే కొందరు చెప్పుకుంటూ పోతుండే వాళ్ల కష్టాలూ కన్నీళ్లూ అవమానాలూ నష్టపోయిన తీరులూ వింటూ కూచుంటే గనక వచ్చే నిరుత్సాహం (డిప్రెషన్) అనే మనోవ్యాధి ఎన్నటికీ తగ్గదు సరికదా, మరొకరికి కూడా మనం పంచే అవకాశాన్నిస్తుంది. అందుకని పై తీరు నిరుత్సాహానికి సంబంధించి ఎవరు ఏది చెప్పబోయినా– గట్టిగా వారించండి వినదలచుకోలేదని. ఎందుకంటే, వారంలో ఇలాంటి అంటువ్యాధి వచ్చే అవకాశం మీకు ఉంది కాబట్టీ– నివారించుకోవలసిన అవసరం ఉంది కాబట్టీను. అంతేకాదు, బుల్లితెర, పెద్దతెరల మీద కూడా ఏడుపులూ పెడబొబ్బలూ ఆసూయాద్వేషాలూ వంటి వాటిని మీ కళ్లకి చూపించుకోకండి. తీవ్రంగా నష్టపోతారు ఈ అంటువ్యాధితో. ఆ పైన మీ ఇష్టం. శత్రువులు రెండు తీరులు. మీ దగ్గరే ఉంటూ మీతో చనువుగా తిరుగుతూ మీ ఆలోచనలన్నీ మీ శత్రువులకి శీఘ్రంగా అందించేవాళ్లూ నిజమైన శత్రువులుగా ఉంటూ మాటామంతీ లేకుండా ఉన్నవాళ్లూను. వీళ్లలో మనకి అనుకూలంగా ఉన్నట్టు కన్పిస్తూ శత్రువులతో సంబంధం ఉండేవాళ్లూ మహాప్రమాదాన్ని తెచ్చిపెడతారు. ఎవరైనా అలాంటివాళ్లు ఉన్నారేమో గమనించుకోండి. ఉంటే మొహం మీదే చెప్పెయ్యండి తప్ప చాటుగానూ వ్యంగ్యంగానూ మొగమాట పడుతూ పరోక్షంగానూ వద్దు. ఏదో లాభకరమైన విషయమంటూ మీ స్నేహితులో బంధువులో ఓ విషయాన్ని చెప్పి– సమయం కూడా ఇయ్యకుండా – ఊరు బయల్దేరుదామన్నట్లైతే– రానని స్పష్టంగా చెప్పండి. లౌక్యం వద్దు.

నిరుద్యోగులు ఉద్యోగులవుతారు. కన్యలకి వివాహాలు నిశ్చయం అవుతాయి. ఒక సమస్యా పరిష్కారంలో మీ శత్రువు మధ్యవర్తిగా మీ వద్దకు రావచ్చు. నిర్ద్వంద్వంగా తిరస్కరించండి అతని రాయబారాన్ని.

లౌకిక పరిష్కారం: మొగమాటం లేకుండా వ్యవహరించండి. మనం చేయబోయే మోసాన్ని ఎదుటివాడు గ్రహించేశాడని ఆ వ్యక్తికి అర్థమయ్యేలా ప్రవర్తించండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు వీలైనన్ని ఎక్కువ పర్యాయాలు శివస్తోత్రాన్ని చదువుకోండి.

మిథునం
(మే 21 - జూన్ 20)

ఎండలు మండించే వేసవిలో చక్కని చెట్లనీడనిచ్చే వనంలో ఓ చెట్టునీడన కూర్చుని చల్లని నీరు తాగుతున్న అనుభవాన్ని పొందుతున్న సమయం ఇది మీకు. జరిగిన కాలాన్నీ ఇబ్బందులనీ గుర్తు చేసుకోవద్దు. మంచి విజయావకాశాలు మెండుగా ఉన్న ఈ కాలంలో మీరు చేస్తున్న ప్రధానమైన వృత్తి ఉద్యోగ వ్యాపారాలకంటే వేరైన ఏ అంశంలో మీకు ప్రాధాన్యం, నైపుణ్యం ఉన్నాయో, ఆ రంగానికి సంబంధించిన ఆలోచనలని కూడా చెయ్యండి. రాణిస్తారు. అదనపు అర్హతగానూ ఉంటుంది. ఆర్థికంగా రాణించగలరు కూడా. పురాణేతిహాసాలు చెప్తాయి– స్వార్థమనేది ఉండడం తప్పు కాదనీ– అయితే అది పరిమితంగా ఉండాలనీనూ. ఆ దృష్టికోణంతో ఆలోచించి, ముందు మీ ఎదుగుదలని చూసుకుని ఆ మీదట మీ కుటుంబంలో ఉన్న మిగిలిన వారిని పైకి తేవడానికి ప్రయత్నించండి. అలాగే మీ ఉద్యోగంలో పనుల్ని సకాలంలో ముగించుకుని, ఆ మీదట ఇతరుల పనికి సహకారమందించండి. ఈ సూచనని తప్పనిసరిగా పాటించండి. భార్య/భర్తల ఐకమత్యం దెబ్బతినకుండా ఏది అనవసరమైన సంభాషణైనా సరే కొంత చేసుకుంటూ ఉండడం అవవసరం. మీ పైనున్న అధికారిగాని, మీ కుటుంబంలో ఒకరి వల్ల గాని తీవ్రమైన ఒత్తిడి ఒక విషయాన్ని గురించి మీకు ఎదురు కావచ్చు. సమాధానాన్ని వాయిదా వెయ్యకుండా, పనిని చేయగలిగితే చేయగలననీ, చేయ(లే)ని పక్షంలో సాధ్యపడదనీ స్పష్టంగా చెప్తూ– మీ మీద ఆశని ఏమాత్రమూ పెట్టుకోకుండా ఉండేలా చేసుకోండి. ప్రస్తుత దశ వాగ్దానాన్ని చేయగలిగినదీ లేదా ఇతరుల కార్యాన్ని పూర్తి చేయగలిగిన శక్తిమంతమైనదీ మీ విషయంలో కానే కాదని గ్రహించండి. మీరు చేయ(లే)ని పక్షంలో మీ అశక్తతని వెల్లడించండి తప్ప, సమర్థుని పేరునీ వివరాలనీ చెప్పడం ఏ మాత్రమూ మీకు సరికాదు. చెవికి సంబంధించిన బాహ్యలోపం కానీ, వినికిడి తగ్గడం వంటి అంతస్సమస్యగానీ ఉంటే వైద్యునికి చూపించుకోవడం మంచిది.

లౌకిక పరిష్కారం: భార్యాభర్తలు నిరంతరం మాట్లాడుకుంటూనే ఉండండి తప్ప అవసరాలకే పలకరించుకునే ధోరణి సరికాదు.

అలౌకిక పరిష్కారం: అర్ధనారీశ్వర స్తోత్రాన్ని ఎక్కడ లభిస్తుందో తెలుసుకుని రోజుకి ఒకసారైనా చేయడం మంచిది.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)

మీకు నాలుగైదు రంగాల్లో విశేషించి వ్యాపారంలో మంచిప్రవేశం ఇష్టం నైపుణ్యం ఉండడంతో ప్రధానమైన వృత్తి ఉద్యోగాలకి ప్రాముఖ్యం ఇవ్వకుండా, దేని నుండి నెలసరి వేతనాన్ని పొందుతున్నారో లేదా కుటుంబాన్ని నడుపుతున్నారో ఆ రంగానికి తక్కువ విలువనిస్తూ మిగిలిన రంగాలకి ప్రాముఖ్యాన్నిస్తారు. దాంతో తోటి ఉద్యోగులకి మీపై ఈర్ష్యాభావం పెంపొందుతుంది. వాళ్లే మీకు మానసిక శత్రువులవుతారు. అవుతున్నారు. గుర్తించండి.

ఎప్పటి వర్షానికి అప్పటికప్పుడు తలకి చేతినో, వస్త్రాన్నో, టోపీనో, చెట్టు కిందనో– ఉపాయంగా భావిస్తూ తడవకుండా వెళ్దామనే ఆలోచన తప్ప, ఓ గొడుగుని వర్షానికి కొనుక్కుందామనే నిర్ణయానికి రానట్టు– ఎప్పటి పరిస్థితికి అప్పటికి సరిపోయేలా వినయమూ విధేయతలతో పెద్దలనుండి సిఫార్సు ఉత్తరమో బెదిరింపో చేయడమే తప్ప, ప్రవర్తనలో మార్పుని తెచ్చుకోవడానికి ఇష్టపడరు. ఇది సరికాదు. అన్ని సమయాలూ మనవి కావని గట్టిగా భావించండి.

న్యాయస్థానంలో ఏవైనా అపరిష్కృత సమస్యలుంటే మధ్యవర్తిద్వారా పరిష్కరించుకోండి తప్ప, సమయాన్నీ, మీకు వ్యక్తిగతంగా ఉండే విలువనీ, సొమ్మునీ వ్యర్థపరచుకుంటూ ఇంకా ఆ సమస్యాభారాన్నీ ఆందోళననీ కొనసాగించుకోవడం ఉత్తమం కాదు. వ్యాపారపరంగా చేసిన కొన్ని పొరపాట్లూ లేదా వంచనలూ ఉంటే పరిష్కరించుకోండి తప్ప, ఇంకా వాటిని సమర్థించుకునే ప్రయత్నమే చేస్తుండడమంటే– ఊళ్లోకి వెళుతున్నామనుకుంటూ అడవి బాటని పడుతున్నట్లే.

మీకు మీరు నిజాయితీ కలవారని ఏమాత్రం సంఘానికి అర్థమైనా, ఈ సంశయాలు మీ మీద తొలగినా, మంచి సంపాదననిచ్చే విదేశీ అవకాశం సిద్ధంగా ఉంది మీకు. కాలం కలిసి రాకపోవడం కాదు. మీ నడకలో కొంతమార్పు తెచ్చుకోకపోవడమే కారణం మీ ఎదుగుదల అంతంతమాత్రంగానే ఉండడానికి.

లౌకిక పరిష్కారం: సమస్యలకి పరిష్కార దిశగా ప్రయత్నించండి మధ్యవర్తిద్వారా.

అలౌకిక పరిష్కారం: మన్యుసూక్తాన్ని రుద్రసూక్త అనుసంపుటితో కలుపుతూ శివాభిషేకాన్ని (పురోహితులకి తెలుసు) చేయించుకోండి.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

ప్రయాణాల్లో వాహనాన్ని ఎక్కబోతూ, దిగబోతూ ఎవరితోనో స్వయంగానో లేక ఫోనుద్వారానో మాట్లాడుతూ ముఖ్యమైన వస్తువుల్ని పోగొట్టుకున్న ఎందరినో మనం వార్తల్లో వింటుంటాం, చూస్తుంటాం. అదుగో! ఆ జాబితాలో కుజగ్రహం కారణంగా మీరు కూడా చేరే అవకాశముంది కాబట్టి అశ్రద్ధ లేకుండానూ, ఎదుటివారు చాదస్తుడని మిమ్మల్ని భావించినా అభిమానపడకుండానూ, ఒకటికి రెండుసార్లు సరి చూసుకుంటూ ఉండండి మీ వస్తువుల్ని.

ఉద్యోగానికో సంస్థకో వ్యాపారానికో సంబంధించిన– అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల కాగితాలనీ సరిచూసుకోండి తప్ప, అన్నీ సక్రమంగా ఉన్నాయని భావించుకోకండి. శనిగ్రహం ఎప్పుడూ గోతిలో పడేంతవరకూ కళ్లని మూసి నడిచేలా చేసి, ఆ మీదట గోతిలో పడ్డావని తెలియజేస్తాడు. ఆ కారణంగా ఒక్కసారి సరిచూసుకుంటే మంచిది కదా! శరీరం లోపల దాగి ఉన్న అనారోగ్యం విషయంలో శ్రద్ధ వహించండి. సహజంగా వర్షం రావచ్చునేది మబ్బులూ తడిగాలీ సన్నని తుంపర ద్వారా ముందుగా తెలుస్తుంది. ఎదుటివ్యక్తిలో మార్పొచ్చిందనేది అతడి మాటలూ ప్రవర్తన ద్వారా ముందుగా తెలుస్తుంది. అయితే మీకు రాబోయే అనారోగ్యం ఏ ముందు సూచనా లేకుండా వచ్చే అవకాశం ఉంది కాబట్టి– ఆహార విహార విషయాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలని పాటించక తప్పదు.

పెళ్లికీ గృహప్రవేశానికీ శంకుస్థాపనకీ.. ఇలా శుభకార్యాలన్నింటికీ ముహూర్తమనే పేరిట ఆ సమయాన్ని నిర్ణయిస్తే, కచ్చితంగా ఆ సమయానికి మనం వెళ్తున్నాం. వెళ్లలేని పక్షంలో రానట్లుగానే లెక్కిస్తారు కదా! అలాగే ఈ వారంలో మీరు సమయాన్ని సరిగా పాటించని పక్షంలో చేసిన శ్రమ మొత్తం వ్యర్థమయ్యే పరిస్థితి ఉంది. తప్పనిసరిగా సమయపాలనతో ఉండండి. ఏ పనినీ వాయిదా వెయ్యకండి.

అదృష్టకరమైన విషయమేమిటంటే– మీకు పెరుగుతున్న ఖర్చులకి సరిపడినంత ఆదాయం మీ ప్రయత్నమేమీ లేకుండా ఈ వారమంతా లభిస్తూ ఉండడమే.

లౌకిక పరిష్కారం: సమయపాలనతో ఉండండి. వాయిదా దృష్టిని విడనాడండి.

అలౌకిక పరిష్కారం: శంకరునికి శివరాత్రినాటి అర్చనకై బిల్వదళాలని సమర్పించుకోండి.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)

పుట్టుకతో– తర్వాత చేద్దాం లే!– అనే మనస్తత్వమున్న మీరు, ఏ పనినైనా నెత్తి మీదికొచ్చాక– ఇక తప్పదు సుమా!– అనే పరిస్థితి వచ్చాక మాత్రమే ఆ పనిని చేపడతారు. అదృష్టవశాత్తూ ఆలస్యానికి జరిమానా పడకపోతే ఆనందపడతారు, అదే ఒకవేళ జరిమానా పడడమే జరిగితే మనసుకి పట్టించుకోరు. 'ఏం చేస్తాం, ఈ సారినుండి జాగ్రత్తగా ఉండాలి' అనుకుంటూ మళ్లీ పాతపద్ధతిలోకే ప్రవేశించి మళ్లీ ఆలస్యం చేసుకుంటూ ఉంటారు.

సకాలంలో ఏ పనినీ సాధించుకోలేకపోవడం, పనుల ఒత్తిడి కారణంగా ముఖ్యమైన పనుల్ని కూడా కొంత ముందు వెనకలుగా చేసుకోవడం తప్పనిసరే కాబట్టి పనులు కూడా మీకోసం వేచి ఉండి (గడువు పెంచడం, ఆలస్యంగా చేసినా పరవాలేకపోవడం...) మీకు అనుకూలతనే కలగచేస్తాయి కొన్ని సందర్భాల్లో.

మీకున్న ఆత్మస్థైర్యం గొప్పది. లోపల ఆందోళన పడుతున్నా పైకి మేరుపర్వతంలా గంభీరంగా ఉంటారు. కుటుంబాన్ని గుంభనగా ఉండడానికీ, రహస్యాన్ని రహస్యంగా ఉంచడానికీ ఇష్టపడతారు. ఇలాంటి మీరు వ్యక్తిగతంగా ఎదగడానికి ఇది అనువైన కాలం. వ్యవసాయంలోగాని వ్యాపారంలోగాని రచనాధోరణిలోగాని ఉద్యోగంలో గాని చక్కగా ముందుకు సాగిపోవాలని మీరు ఒకడుగు వేస్తే, పది అడుగులు మీకు ఆ కార్యం ఎదురుగా అనుకూలిస్తూ వస్తూ సంతోషాన్నిస్తుంది. ప్రయత్నించండి.

ఈ మధ్య మధ్యే మీలో మొహమాటం తగ్గి, చెప్పదలిచిన దాన్ని స్పష్టంగా చెప్పాలనే దృఢనిశ్చయంతో ఉంటున్న కారణంగా పనులు మీరనుకున్నట్లుగా జరుగుతూ ఆనందాన్నిస్తున్నాయి. ఇదే ధోరణిని కొనసాగించండి. సంతానం బాగుంటుంది అన్ని విధాలా అయితే, దాంపత్య అన్యోన్యత అంతంతమాత్రంగా ఉండవచ్చు. వినోద విహార యాత్రలు వారానికోసారి చేయడం మంచిది. అలాగే పదిమందిని సలహాలడగడం ఏదీ చేయకపోవడం సరికాదు. రంగంలోకి దూకండి.

లౌకిక పరిష్కారం: దాంపత్య అనుకూలత కోసం వారానికోసారి వినోద/ విహార యాత్ర చెయ్యండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు భస్మాన్ని శివాభిషేకానికి సమర్పించుకోవాలి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

కడవ నిండుగా బరువున్నా, గాలికి వాలుగా నదికి వాలుగా గాని ప్రయాణిస్తూ, తెరచాపని కూడా ఎత్తితే ఎంత వేగంగా ప్రయాణం సాగుతోందో, అలా మీకున్న నైపుణ్యం కలిసొచ్చే, కాలం మీ భార్య/భర్త సహకారం కారణంగా అన్ని పనులూ దిగ్విజయంగా సాగిపోతూ ఉంటాయి. అహంకరించకండి. ఇదే సమయంలో పదిమంది పనుల్ని నెత్తిన వేసుకోకండి.

ఇప్పటివరకు తెరవని బీరువాలా మీలో దాగున్న ఆధ్యాత్మిక బుద్ధి ఆకస్మాత్తుగా తెరుచుకుంటుంది. అలాగని భక్తి లేదని కాదు, గాని కొంత పెరుగుతుంది ఆ తీరు భావన. దాంతో ఒకటికి రెండుమార్లు పుణ్యక్షేత్ర సందర్శన, దానధర్మ బుద్ధి ఉన్నంతలో ఆధ్యాత్మిక ధోరణిని పెంచుకునేందుకు కృషీ ప్రారంభమవుతాయి. మంచి పరిణామమే కదా!

మీ భార్య/ భర్త మీకు చక్కని సలహాలనిచ్చే అనుభవజ్ఞులూ మిత్రులుగా భావించండి. ఆ అనుకున్న సూచనని అమలు చేస్తున్న దశలో ఏదైనా అవాంతరం వచ్చినా, సమర్థించుకోగలిగిన నైపుణ్యం మీ ఇరువురికీ ఉండే కారణంగా సహజ సువాసనని వెదజల్లే కస్తూరిమృగం తన ఉనికిని ఎవరికీ చెప్పుకోనవసరం లేనట్లు సమస్యలూ విఘ్నాలూ అలా తేలికగా పరిష్కరించబడతాయి.

ఎవరినీ నొప్పించకుండా మీకు రావలసిన బకాయిలని వసూలు చేసుకోగలిగే కారణంగా ధనప్రాప్తి ఉంటుంది. మీరంటే సహజంగా ఉండే గౌరవం కారణంగా పనులన్నీ విజయవంతమౌతుంటాయి. మీకు తగనిది ధనంతో ధనవ్యాపారం (షేర్లు, చిట్‌ఫండ్స్..). ఆ వ్యాపారం చేయవలసిందిగా ఒత్తిడి పెరుగుతుండవచ్చు. మీ గుర్తింపు అలాగే ఉండిపోవాలంటే ఈ వ్యాపారానికి అంగీకరించకండి. విదేశంలో స్థిరపడాలనే ఊహకి విదేశంలో ఉన్న పక్షంలో రావచ్చు. స్వదేశంలో ఉన్నవారైతే విదేశానికి వెళ్లాలనే ఆలోచనతో ఉండచ్చు. ఆలోచించి నిర్ణయాన్ని తీసుకోండి. కొంతకాలంపాటు ఆలోచన దశలోనే ఉండడం మంచిది.

లౌకిక పరిష్కారం: ఆధ్యాత్మిక దృష్టికి రావడం మంచిదే. అతి మాత్రం కాకుండా చూసుకోండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు చెరుకురసాన్ని అభిషేకం నిమిత్తం సమర్పించుకోండి.

పరి పరిశోధన

బరువు తగ్గేందుకు కొత్త ఐడియా..

శరీరం బరువు తగ్గే విషయంలో ఒక ఎంజైమ్ కీలకపాత్ర పోషిస్తున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఎంజైమ్‌ను నియంత్రించడం ద్వారా ఊబకాయులు సులువుగా బరువు తగ్గేలా చేయవచ్చునని శాస్త్రవేత్తల అంచనా. టీబీకే1 అని పిలిచే ఈ ఎంజైమ్ శరీరంలో కొవ్వును వేగంగా కరిగించేందుకు ఉపయోగపడే ఏఎంపీకే అనే ఇంకో ఎంజైమ్‌ను నియంత్రిస్తున్నట్లు తాము తెలుసుకున్నామని అంటున్నారు ఈ



పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త సాలిటెల్. ఏఎంపీకే ఎంజైమ్ పనిచేస్తున్నప్పుడు కణాలన్నీ శక్తి కోసం కొవ్వులను వాడుకుంటాయని.. టీబీకే1 ఎంజైమ్ విడుదలైతే మాత్రం ఈ ప్రక్రియ నిలిచిపోయి.. కణాలు కొవ్వును నిల్వ చేసుకోవడం మొదలుపెడతాయని సాలిటెల్ వివరించారు.

ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఒళ్లు తగ్గించుకోవాలని మనం ఉపవాసం చేస్తే.. ఏఎంపీకే ఎంజైమ్ చైతన్యవంతమవుతుంది. సరే.. కొవ్వు కరుగుతుందనుకునేంతలోపే ఈ ప్రక్రియ కాస్తా టీబీకే1 ఎంజైమ్ రంగంలోకి దిగుతుందని సాలిటెల్ వివరించారు. బరువు తగ్గేందుకు చేసే ఉపవాసాలు కొన్నిసార్లు ఫలితమివ్వకపోయేందుకు ఇదే కారణమని అంచనా. ఈ నేపథ్యంలో టీబీకే1 ఎంజైమ్ ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా ఇంకో ఎంజైమ్ తన పని తాను చేసుకునేలా చేయవచ్చునని.. కొవ్వులు వేగంగా కరిగిపోతే ఒళ్లు సులువుగా తగ్గుతుందని సాలిటెల్ వివరించారు.

పెళ్లికి.. ఆరోగ్యానికి లింక్ ఇదిగో...

ఇంట్లో ఒడిదుడుకుల్లేకపోతే.. ఒంట్లో హాయిగా ఉంటుంది. ఈ విషయం మనకు తెలియంది కాదు.. అయితే వైవాహిక జీవితం గుండెజబ్బులపై కూడా ప్రభావం చూపగలదని యునైటెడ్ కింగ్‌డమ్ శాస్త్రవేత్తలు తొలిసారి అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నారు. కాలంతోపాటు భార్య/భర్తతో తమ అనుబంధం మరింత బలపడిందనుకునే వారందరి ఆరోగ్యంలో గణనీయమైన మార్పులు నమోదయ్యాయని.. బాడీ మాస్ ఇండెక్స్ మొదలుకొని కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలు తగ్గిపోగా.. గుండెజబ్బుల



విషయంలోనూ ఎంతో మెరుగుదల నమోదైందని 1980లో మొదలై ఇటీవలే ముగిసిన ఈ అధ్యయనం చెబుతోంది. దాదాపు 620 మందిపై పాతికేళ్ల పాటు ఈ అధ్యయనం జరగడం విశేషం. గతంలోనూ అనేక అధ్యయనాలు పెళ్లికీ.. ఆరోగ్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా చెప్పినప్పటికీ తాము తొలిసారి గుండెజబ్బులకు.. పెళ్లికీ మధ్య ఉన్న లింకును తెలుసుకున్నామని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త బర్గ్ తెలిపారు. భార్య వంటి దగ్గరి వారి తిరస్కరణకు గురైన వారిలో సైటోకైన్స్ ఎక్కువగా ఉంటాయని. ఇవి శరీరంలో వాపు/మంటకు తద్వారా దీర్ఘకాలంలో అనేక ఇతర వ్యాధులకూ దారితీస్తుందని బర్గ్ వివరించారు.

కీళ్లనొప్పులకు మెరుగైన చికిత్స!

కీళ్లనొప్పులకు మరింత మెరుగైన చికిత్స కల్పించే లక్ష్యంతో యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. కీళ్లలోనే సరికొత్త మృదుకణజాలాన్ని వృద్ధి చేయగల సరికొత్త మందును వీరు కనుక్కోగలిగారు. ఆర్‌సీజీడీ 423 అని పిలుస్తున్న ఈ సరికొత్త రసాయనాన్ని ఇంజెక్షన్ రూపంలో కీళ్లల్లోకి ఎక్కించుకుంటే చాలు.. ఆ ప్రాంతంలో వాపు/మంట తగ్గడమే కాకుండా కొంతకాలానికి అరిగిపో




యిన కణజాలం స్థానంలో కొత్త కణజాలం పుట్టుకొస్తుంది. శరీరంలోని గ్లైకోప్రోటీన్ 130ను ప్రభావితం చేయడం ద్వారా ఇది పనిచేస్తుందని... కణజాలాన్ని అభివృద్ధి చేయాలన్న సందేశాన్ని చేరవేస్తుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఎమ్‌సీన్‌కో చెప్పారు. పరిశోధనశాలలో చేసిన ప్రయోగాల్లో ఆర్‌సీజీడీ 423ని ఉపయోగించినప్పుడు కీళ్లలోని కణాలు వేగంగా ఎదగడంతోపాటు.. మరణాల రేటు గణనీయంగా తగ్గిందని, కణజాలం అరిగిపోయిన ఎలుకల్లోకి దీన్ని జొప్పించినప్పుడు తక్కువ సమయంలనే సమస్య మాయమైపోయిందని తెలిపారు. ఎముకలు గుల్లబారే సమస్యతోపాటు చిన్న వయస్కుల్లో కనిపించే కీళ్లనొప్పులకూ ఈ కొత్త మందును ప్రయోగించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు.

పండేది నేల కింద... ఉండేది నాల్క మీద!

దుంప వంటకాల టేస్టే వేరు.
ఒక్కసారి గానీ వాటి రుచిమరిగితే
మళ్లీ మళ్లీ తినేదాకా దుంపతెంపుతాయవి.
క్యారట్‌తో హల్వా చేసినా
బిట్‌రూట్‌తో కబాబ్ కాల్చినా
ముల్లంగి కోఫ్తా, ఆలూగోబీల ఫీస్టును మరవలేక
మనసు మళ్లీ మళ్లీ ఆ రుచులనే కోరుతుంది.
రుచి మూలాలన్నీ కందమూలాల్లోనే ఉన్నాయన్న
వాస్తవం మనందరికీ తొలి టేస్టులోనే తెలిసొస్తుంది.



స్వీట్ పొటాటో రబ్డీ



కావలసినవి: **చిలగడ దుంప** (కొద్దిగా పెద్దది) – 1 (ఉడికించి తొక్క తీసి మెత్తగా చేయాలి); **పాలు** – కప్పు; **పంచదార** – అర టీ స్పూను; **గోరు వెచ్చని నీరు** – అర కప్పు; **ఏలకుల పొడి** – అర టీ స్పూను; **కుంకుమ పువ్వు** – చిటికెడు; **నేతిలో వేయించిన జీడిపప్పులు + కిస్‌మిస్ + బాదం పప్పులు** – 2 టీ స్పూన్లు.

తయారి:
● ఒక గిన్నెలో పాలు పోసి, స్టౌ మీద ఉంచి మరిగించాలి ● పంచదార, ఉడికించిన చిలగడ దుంప ముద్ద జత చేసి, బాగా కలిపి, చిక్కపడేవరకు ఉడికించాలి ● అర కప్పుడు గోరు వెచ్చని నీటిలో కుంకుమ పువ్వు వేసి, కరిగించి, ఉడుకుతున్న పాల మిశ్రమంలో వేసి కలిపి, మూడు నాలుగు నిమిషాలు ఉడికించాలి ● ఏలకుల పొడి, నేతిలో వేయించిన జీడిపప్పు మిశ్రమాన్ని జత చేసి బాగా కలిపి దించేయాలి ● చల్లారాక ఫ్రిజ్‌లో సుమారు గంట సేపు ఉంచి గ్లాసులలో పోసి, చల్లగా అందించాలి.

గాజర్ హల్వా

కావలసినవి: **గాజర్ తురుము** – కప్పు; **పాలు** – అర లీటరు; **పంచదార** – 3 టేబుల్ స్పూన్లు; **నెయ్యి** – 2 టేబుల్ స్పూన్లు; **ఏలకుల పొడి** – అర టీ స్పూన్; **జీడి పప్పు పలుకులు** – టేబుల్ స్పూన్; **కిస్‌మిస్** – టేబుల్ స్పూన్.

తయారి: ● స్టౌ మీద బాణలిలో పాలు పోసి మరిగించాలి ● బాగా మరిగి సగం అయ్యేవరకూ కలుపుతుండాలి ● వేరొక బాణలిలో కొద్దిగా నెయ్యి వేసి కరిగాక గాజర్ తురుము వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి మరిగిన పాలలో వేయాలి ● బాగా కలుపుతూ, పంచదార జత చేసి సన్నని మంటపై ఉడికించాలి ● బాణలిలో నెయ్యి వేసి, కరిగాక జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి ఉడికిన గాజర్ హల్వాలో వేయాలి ● ఏలకుల పొడి జత చేసి, బాగా కలిపి స్టౌ మీద నుంచి దింపేయాలి.

మూలీ కే కోఫ్తా

కావలసినవి: **తెల్ల ముల్లంగి** – అరకిలో; **పచ్చి కొబ్బరి తురుము** – టేబుల్ స్పూను; **పల్లీలు** – అర టేబుల్ స్పూన్; **వేయించిన సెనగ పప్పు** – 2 టేబుల్ స్పూన్లు; **గరం మసాల** – టీ స్పూను; **ఎండు మిర్చి** – 2; **పచ్చి మిర్చి** – 1 (చిన్న ముక్కలు చేసుకోవాలి); **ఉల్లి పాయ** – 1 (సన్నగా తరగాలి)

సన్నగా తరిగిన కొత్తిమీర – టేబుల్ స్పూను; **ఉప్పు తగినంత; నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా

గ్రేవీ కోసం... ఎండు మిర్చి – 4; **వెల్లుల్లి ముద్ద** – టీ స్పూను; **ధనియాల పొడి** – టీ స్పూను; **పసుపు** – అర టీ స్పూను; **ఉల్లి తరుగు** – అర కప్పు; **ఉల్లిపాయ ముద్ద** – రెండు టేబుల్ స్పూన్లు; **నూనె** – 100 మిలీ; **పెరుగు** – కప్పు; **గరం మసాల** – టీ స్పూను; **ఏలకుల పొడి** – అర టీ స్పూను; **అల్లం తురుము** – అర టీ స్పూను;



తయారి: ● ముల్లంగిని శుభ్రంగా కడిగి, చిన్న ముక్కలుగా తరిగి, తగినన్ని నీళ్ళు జతచేసి మెత్తగా అయ్యే వరకూ ఉడికించి దింపేయాలి ● చల్లారాక నీళ్ళు ఒంపేసి ఉడికిన ముల్లంగిని మిక్సీలో వేసి మెత్తగా చేసి ఒక పాత్రలోకి తీసుకోవాలి ● కొబ్బరి తురుము, పల్లీలు, వేయించిన సెనగపప్పు, గరం మసాల, ఎండు మిర్చిలను మిక్సీలో వేసి మెత్తగా చేసి, చిన్న పాత్రలోకి తీసుకోవాలి. ● మెత్తగా చేసిన ముల్లంగిలో... పచ్చి మిర్చి తరుగు, ఉల్లి తరుగు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మెత్తగా చేసిన కొబ్బరి తురుము మిశ్రమం జత చేసి బాగా కలపాలి ● బాణలిలో నూనె కాగాక, ముల్లంగి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి నూనెలో వేసి దోరగా వేయించి తీసి పక్కన ఉంచుకోవాలి.

గ్రేవీ తయారీ: ● మిక్సీలో ఎండు మిర్చి, ఉప్పు, వెల్లుల్లి, ధనియాల పొడి, పసుపు వేసి మెత్తగా చేయాలి ● బాణలిలో నూనె వేసి కాగాక ఎండు మిర్చి మిశ్రమం వేసి దోరగా వేయించాలి ● ఉల్లి తరుగు, ఉల్లిపాయ పేస్ట్, జత చేసి సుమారు ఐదు నిమిషాలు వేయించాలి ● పెరుగు, గరం మసాల, ఏలకుల పొడి, అల్లం తురుము ఒకదాని తరవాత ఒకటి జత చేసి బాగా కలపాలి. కప్పుడు నీళ్ల జత చేసి సుమారు మూడు నిమిషాలు ఉడికించాలి ● తయారుచేసి ఉంచుకున్న మూలీ కోఫ్తాలు వేసి బాగా ఉడికించి వేడి వేడిగా అందించాలి.

భర్వాన్ ఆలు గోబీ

కావలసినవి: **బంగాళదుంపలు** – 2 (తొక్కు తీసి ముక్కలు చేయాలి); **క్యాలీఫ్లవర్ తరుగు** – కప్పు; **ఉప్పు** – తగినంత; **పసుపు** – కొద్దిగా; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా;

ఫిల్లింగ్ కోసం... చీజ్ తురుము – అర కప్పు; **కిస్‌మిస్** – 15; **దానిమ్మ గింజలు** – 3 టేబుల్‌స్పూన్లు; **సన్నగా తరిగిన జీడిపప్పు** – 3 టేబుల్ స్పూన్లు; **కొత్తిమీర తరుగు** – 2 టేబుల్ స్పూన్లు; **అల్లం తురుము** – 2 టేబుల్ స్పూన్లు; **పచ్చి కోవా** – 4 టేబుల్ స్పూన్లు

పిండి కోసం... సెనగ పిండి – 2 కప్పులు; **వాము** – టేబుల్ స్పూను; **వెల్లుల్లి ముద్ద** – టేబుల్ స్పూను; **ఉప్పు** – తగినంత; **మిరపపొడి** – కొద్దిగా; **నీళ్లు** – తగినన్ని

తయారి: ● ఒక పాత్రలో నీళ్లు, ఉప్పు, క్యాలీఫ్లవర్, బంగాళదుంప ముక్కలు, పసుపు వేసి మెత్తగా అయ్యేవరకు ఉడికించి పక్కన ఉంచాలి ● పిండి కోసం తీసుకున్న పదార్థాలన్నీ ఒక పాత్రలో వేసి, తగినన్ని నీళ్ల జత చేసి, పకోడీల పిండిలా కలుపుకోవాలి ● ఒక పాత్రలో ఫిల్లింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నీ వేసి బాగా కలపాక, ఉడికించిన బంగాళదుంప ముక్కల మిశ్రమం జత చేసి మరోమారు కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసి పక్కన ఉంచాలి ● బాణలిలో నూనె కాగాక సెనగపిండి మిశ్రమంలో ... బజ్జీల మాదిరిగా ఈ ఉండలను ఒక్కక్కటిగా ముంచుతూ కాగిన నూనెలో వేసి ముదురు గోధుమ రంగులోకి వచ్చాక తీసేయాలి ● టొమాటో సాస్‌తో వేడివేడిగా అందించాలి.



బీట్‌రూట్ కబాబ్



కావలసినవి: **బీట్‌రూట్ తురుము** – కప్పు; **పనీర్ తురుము** – అర కప్పు; **వెల్లుల్లి ముద్ద** – అర టేబుల్ స్పూను; **ఆమ్‌చూర్ పొడి** – టేబుల్ స్పూను; **వేయించిన నువ్వుల పొడి** – టేబుల్ స్పూను; **చాట్ మసాలా** – చిటికెడు; **ఉప్పు** – తగినంత; **సన్నగా తరిగిన జీడి పప్పులు** – పావు కప్పు; **పొడి చేసిన ఓట్స్** – అర కప్పు; **నూనె** – తగినంత

తయారి: ● ఒక పాత్రలో బీట్‌రూట్ తురుము, పనీర్ తురుము, వెల్లుల్లి ముద్ద, ఆమ్‌చూర్ పొడి, చాట్ మసాలా, ఉప్పు, నువ్వుల పొడి వేసి బాగా కలపాలి ● చిన్న చిన్న ఉండలు చేసి, చేతిలోకి తీసుకుని ఒక్కో ఉండను చేతితో అదమాలి ● జీడిపప్పు పొడిని మధ్యలో ఉంచి చుట్టూ మూసేయాలి ● ఓట్స్ పొడిలో దొర్లించి పక్కన ఉంచాలి ● పాన్ మీద నూనె వేసి కాగాక తయారుచేసి ఉంచుకున్న కబాబ్‌లను రెండు వైపులా కాల్చి కొత్తిమీర చట్నీతో అందించాలి.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

LIBRA

శత్రుత్వం రెండు విధాలుగా ఉంటుంది. మనం ఏదో ఆశించి ఎదుటివారిని వంచనకి గురిచేసి వారి ద్వారా శత్రుత్వాన్ని కలిగి ఉండటం ఒకటి – ఎదుటి వారి వల్ల ఇబ్బందికి గురై వారిని దూరంగా ఉంచుతూ శత్రుత్వాన్ని కలిగి ఉండటం రెండు. ఈ రెండిటిలో మీది మొదటి తీరు శత్రుత్వం. ఎవరైనా మీకు అపకారాన్నీ వంచననీ చేస్తే సహించగలరా? వారి మనోవేదన మీకు క్షేమకరమా? ఆలోచించి స్వయంగా వెళ్లి సమస్యని పరిష్కరించుకోండి. చక్కగా తెగిపోతుంది సమస్య.

జ్యోతిషం ప్రకారం గ్రహాలన్నీ మీకు చాలా అనుకూలంగానే ఉన్నాయి. ఆ కారణంగా విజయం మీదే – అని శాస్త్రం చెప్తుంది. అయితే అదే శాస్త్రం – దైవం హి పరమా గతిః – దీనిమీద నిర్ణయం దైవానిదే సుమా! అని ఉంది. కాబట్టి మీకు లభించే లౌకిక విజయం ధర్మ విజయం మాత్రం కాబోదు. చక్కగా సమస్యని సానుకూలంగా పరిష్కరించుకున్న పక్షంలో – ఏది నిజమో మీకు తెలుసు కాబట్టి – హృదయం ఆనందకరంగా ఉంటుంది. ఆ మీద మీ ఇష్టం. ఇలా ఈ సూచన కటువుగా ఉందేమిటి? అనుకోకండి. ఔషధం చేదుగానే ఉంటుంది కానీ, రోగాన్ని పూర్తిగా నయం చేస్తుంది. కుటుంబంలో పెద్దల ఆరోగ్యం అంతగా సహకరించ(లే)కపోవచ్చు. ఒక వ్యక్తి అవసరం అక్కడ ఉండవచ్చు. మీరు ఇంటి వద్దే ఏదో ధర్మబద్ధమైన చిన్న వ్యాపారాన్ని ప్రారంభించి ఆదాయ మార్గాన్ని ఎన్నుకుని ఉండచ్చు. అది మంచిదే. కొత్తకొత్త వస్తువుల్ని కొనడం, నూతన వస్త్రాల మోజుండటం, కొనుక్కోవడం జరుగుతుంది. ఏ పనినైనా సరే ఏకాగ్రతతో స్థిర లక్ష్యంతో గాని చేస్తే విజయం మీదే. అవమానాలు తాత్కాలికంగా ఉన్నా బంధువుల్లో కొంత తేలిక చూపు మీ మీద ఉన్నా, సంఘంలో మీ గుర్తింపు మీకు ఉండనే ఉంటుంది వన్నె తగ్గకుండా.

లౌకిక పరిష్కారం: అధర్మం చేశానా? అని ఆలోచించుకుని మీకు మీరుగా సమస్యా పరిష్కారానికి కృషి చెయ్యండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు పంచాక్షరీ మంత్ర జపాన్ని (ఉపదేశముంటేనే) చెయ్యండి. లేదా భజనలో పాల్గొనండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

SAGITTARIUS

మీకున్న ధైర్య సాహసాలని మెచ్చుకుని అజ్ఞాతవాసంలో పాండవులు విరాటరాజు కొలువులో ఉన్నప్పుడు తమ పేర్లని కూడా బయటపెట్ట(లే)కుండా అజ్ఞాతంగానే కాలాన్ని నెట్టినట్లు, మీరు కూడా ప్రస్తుతం నడుస్తున్న దశ కారణంగా సాహస నిర్ణయాలనీ వాగ్వివాదాలనీ ధైర్యంగా ముందుకు దూసుకుపోవడాన్నీ తగ్గించుకుని తీరాలి.

కోడె దూడ గర్వాన్నీ మదాన్నీ తగ్గించడం కోసం ముసలెద్దుని అరకదున్నడానికి కట్టేటట్టుగా, మీకు శని తోడుగా ఉంటూ మీ ఆవేశాన్ని అదుపు చేస్తూ ప్రతి పనిలోనూ వ్యతిరేకిస్తూ ఉండచ్చు. అంత మాత్రాన నిరుత్సాహపడద్దు. మరింత జాగ్రత్తతో కార్యాన్ని నిర్వహించాలనే సూచన(ల)నిస్తూ మిమ్మల్ని కొంత నియంత్రిస్తున్నాడని భావించి, పనుల్ని నిదానంగానే చేస్తూ ఉండండి.

సొంత ఇంటికోసం ఎన్నెన్నో ప్రయత్నాలని చేసి ఉండచ్చు. అది సాకార రూపాన్ని పొంది ఉండచ్చు. మంచిదే. అయితే – ఒక్కసారి ఆశ్చర్యాన్ని కలగజేయాలనే ఉద్దేశ్యంతో ఇంటిని కొన్న మీ ఆలోచన, ముందుగా మీ జీవిత భాగస్వామి/ని కూడా తెలియ(జేయ)ని కారణంగా మీకు తగినంత అభినందన లభించకపోవచ్చు. జరిగిందేదో జరిగింది. ఈసారి ఇదే విధానాన్ని కొనసాగనీయకండి.

మీ ఉద్యోగ జీవితం అద్భుతంగా సాగుతూ గుర్తింపుకీ, వేతనాభివృద్ధికీ కూడా సహకరిస్తూ ఉండచ్చు. సంతానంలో ఒకరు తమకున్న మీ పట్ల వ్యతిరేకతని సరికాదనుకుంటూ చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉండచ్చు. చక్కగా ఆహ్వానించండి. ఒకే జాతి విత్తనమే మరోచోట చెట్టుగా ఎదిగినంత మాత్రాన ఆ ఈ వృక్షాల జాతులు వేరు కావుగా! లక్షణాలన్నీ ఒకటే కదా! కేవలం కీర్తి ప్రతిష్ఠల కోసం మాత్రమే ప్రయత్నం చేయద్దు. మీ ఉద్యోగంలో భాగంగా అవి లభిస్తే సంతోషమే కదా!

లౌకిక పరిష్కారం: జీవిత భాగస్వామితో అనుకూల భావంతో ఉండండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రి నాడు శివ కల్యాణాన్ని చూడండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

AQUARIUS

మెట్ల మీదుగా ఎత్తైన ప్రదేశానికి వెళ్లిన వ్యక్తికే పడే అవకాశం హెచ్చుగా ఉంటుంది. కింది మెట్టు మీద నిలబడ్డవానికి భయం అవసరం లేదు. రోజులన్నీ అనుకూలంగా ఉన్న కారణంగానూ, కుటుంబసభ్యుల ఐకమత్యం, వృత్తి ఉద్యోగ వ్యాపారాలు కలుగుబాటుతనం కారణంగానూ మెల్లగా మీలో కొంత అహంకారం గర్వం పెరిగే అవకాశాలున్నాయి. అవి చాలు వ్యక్తిత్వాన్ని మార్చేడానికి. జాగ్రత్తపడండి.

ఇటు మిత్రులతోనూ వారి శత్రువులతోనూ కూడా కలుపుగోలుతనంతో ఉండే మీ నైపుణ్యం నిజంగా చెప్పుకోదగిందే! అలాగని ఎవరికి సరిపడిన మాటని – ఏ రోటికి ఆ పాట అన్నట్టు కాకుండా దోషాన్ని వివరించి, గుణాన్ని శ్లాఘించి చెప్పగల శక్తి మీకుంది. రాగిలోహం ఇటు బంగారంలోనూ అటు వెండిలోనూ కూడా కలిసి వస్తువుగా మార్పు కలిగిస్తోంది కదా! ఈ విధానాన్ని ఇలాగే కొనసాగించుకోండి.

ఎంత వద్దనుకున్నా ఆదాయంలో కొంత మీ జీవితభాగస్వామి కారణంగా అనవసర వ్యయంగా మారుతుంది. ఇది తప్పని విషయం. ఆ కారణంగా అనవసర – ఆడంబర –అట్టహాస వ్యయంగా కొంత పరిమితిని విధించి నిదానంగా అర్థమయ్యేలా చెప్పి, వ్యయంలో హద్దు మీరద్దని కోరండి. ఆవేశంతో ఈ విషయాన్ని గనుక చెప్తే పరిస్థితి తీవ్రం అవుతుంది. గుర్తుంచుకోండి.

తెలిసి తెలిసి అనారోగ్యాన్ని పెంచుకుంటున్నారేమో ఓ మారు ఆ దృష్టితో మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. అనారోగ్యం వల్ల ధనం మాత్రమే నష్టపోరు. విలువైన కాలాన్ని వైద్యుని వద్ద వేచి ఉండడంలో, దూరప్రయాణాలు చేయవలసి రావడం కారణంగా శారీరక శ్రమని పడటంలో, మానసికంగా తాను రోగిని అనే ఆలోచనని చేస్తూండడంలో .. ఇలా నష్టపోతారు కూడా. సకాల పరిశీలన దుష్కాలాన్ని రానీయకుండా చేస్తుంది కదా!

లౌకిక పరిష్కారం: గర్వం అహంకారం దరిచేరకుండా చూసుకోండి. ఆత్మ శ్లాఘన వద్దు.

అలౌకిక పరిష్కారం: శివరాత్రి నాడు యధాశక్తి కొబ్బరి బోండాల నీటిని స్వామికి సమర్పించండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

SCORPIO

పాము తనదైన స్వభావానికి అనుగుణంగా కాటేసి వెళ్తుంటే – 'సుబ్రహ్మణ్య స్వామి' అనుకుంటూ దాన్ని చంపకపోవడం మన సంస్కారం. అయితే పాము లక్షణంతో మీకు జీవితంలో ఇబ్బందిని కల్గించి ఇప్పుడు క్షమాభిక్షకి ప్రార్థిస్తే – విడిచి వెయ్యడం – సరికాదు. నేరగానికి క్షమాభిక్ష ప్రసాదించినంత మాత్రాన మనసు మారిపోదు. కాటేసి పారిపోతున్న పాము, తనని పదిమంది చంపడానికొస్తుంటే ప్రాణ భయంతో పరిగెడుతూ – ఎవరినీ కాటేయకూడ–దనుకుంటుంది. అయితే పొదలో దూరి తనని తాను రక్షించుకున్నాక, బుస్సుమని పడగెత్తి ఎవరినైనా సరే కాటేస్తానన్నట్టు రోషంతో చూస్తూనే ఉంటుంది. అది స్వ–భావం. జాగ్రత్త! ఈ మధ్య జీవితమంతా యాతనలే అవమానాలే అధిక దూర భార ప్రయాణాలే వ్యయ ప్రయాసలే – అనుకోకండి. కోట్ల ప్రజలని రక్షించిన ధర్మరాజు అధర్మబద్ధంగా ఓడి, తనతోపాటు తమ్ముళ్లనీ భార్యనీ కూడా కష్టాలకి అనుకోకుండా గురిచేశాడు. రాజై ఉండి కూడా భిక్షాన్నాన్ని యాచించి తిన్నాడు. కాలం అలా ఎత్తు పల్లాలని చూపిస్తుంది ఎంతటివారికైనా. తట్టుకోండి. అయినా చివరికొచ్చేశారు విజయ ధ్వజాన్ని ఎగురవేసేందుకు. భయాన్ని విడనాడండి.

కురుక్షేత్ర యుద్ధానికంటూ రెండు వైపులా సిద్ధమయ్యాక కృష్ణుడు రాయబారానికి రాలేదనే విషయాన్ని గుర్తుచేసుకుని, ఈ దశలో సమస్యా పరిష్కారానికంటూ ఎవరైనా మధ్యవర్తిగా వస్తే మౌనంగా తిరస్కరించి పంపెయ్యండి. వాగ్వివాదం అసలు వద్దే వద్దు. నోరు తెరవద్దు.

చేయవలసిందంతా ద్రౌపదీ వస్త్రాపహరణ సూచనతో పాటు అన్నిటినీ చేశాక, తన రథచక్రం భూమిలో దిగబడ్డాక అర్జునుని బాణాలని చూస్తూ – నీతి వాక్యాలని ప్రారంభించాడు కర్ణుడు. అలా మీ శత్రువులు వినయ విధేయతలతో సంప్రదించ వస్తే అంగీకరించకండి. తల్లిదండ్రుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తపడండి. మనో ధైర్యంతో ఉండి విజయాన్ని సాధించండి.

లౌకిక పరిష్కారం: కాటేసి వెళ్లిపోతున్న పాముని – సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనకండి!

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు ఎంతసేపు శివధ్యానంలో ఉండగలరో అంతసేపూ ధ్యానానికి అంకితం కండి!

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

CAPRICORN

వ్యాపారంలో వచ్చిన లాభాన్ని కుటుంబాన్ని నడుపుకోవడం కోసం వినియోగించుకోవడమనేది సరైన పనే అయినా, ఆ లాభంలో కొంతని వ్యాపారాభివృద్ధి కోసం పెట్టుబడిగా వినియోగించడం ప్రస్తుత దశలో మీకు అనుకూల ఫలితాన్నిస్తుంది. శత్రుబాధ లేని కారణంగానూ, పోటీదారులు ఉండని కారణంగానూ వ్యాపారం బాగా నడుస్తుంది. అయితే అధిక లాభాన్ని ఆశించి దురాశకి మాత్రం పోవద్దు. నమ్మకాన్ని పోగొట్టుకోవద్దు.

ఒక చిన్న సూదినిస్తే దాన్ని పెద్ద పలుగు (గునపం)గా మలుచుకోగల నైపుణ్యం మీకుంది. మంచిదే. అయితే అకస్మాత్తుగా మేఘం లేని వర్షంలా – ఉరుము లేని పిడుగులా వచ్చే మీ ఆవేశం దాని వెంట వచ్చే కోపం కారణంగా మీ ఆశయాన్ని అప్పుడప్పుడు ఇసుకతో కట్టిన పిచ్చిక గూళ్లలాగా మీకు మీరే ధ్వంసం చేసుకుంటూ ఉంటారు. ఆత్మ నియంత్రణ (మిమ్మల్ని మీరు అదుపులో ఉంచుకోవడం) అవసరం.

సోదరులు కలిసి రాకపోవచ్చు. ఉన్నదున్నట్టుగా అనుకుంటే దాంట్లో మీ జీవిత భాగస్వామి/ని ప్రవర్తన కూడా ఒక కారణం కావచ్చు. ఎప్పుడూ మిత్రులూ ఆప్తులూ మాత్రం రక్తసంబంధం కల సోదరులతో సమానం కానే కారనే విషయం ముందు నాటికి మీకు బోధపడుతుంది కాబట్టి, సోదరుల్లో పొరపొచ్చాలుంటే ఏకాంతంగా కూర్చుని లౌక్యం విడిచి వ్యంగ్యం మాని సూటిగా, మెత్తగా, స్పష్టంగా విషయాన్ని వివరించి చెప్పండి. ఈ రోజుకీరోజున మార్పు రాలేదేమిటని భయపడకండి. నేడు వేసిన విత్తనం అంకురించడానికి కొంత సమయం పడుతుంది కదా! చిన్న విత్తనం గట్టి భూమిని చీల్చుకుని మరీ పైకి రావడం లేదూ! గమనించుకోండి!

సంతానపు చదువూ, కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్నీ నిర్లక్ష్యం చేయద్దు. వ్యాపారం, ఉద్యోగం ముఖ్యమే అయినా వీళ్లు కూడా ముఖ్యమే. రెండు రెక్కలూ సుఖంగా ఉన్నప్పుడే పక్షి ఎగరగలుగుతుంది.

లౌకిక పరిష్కారం: సంతానాన్నీ కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్నీ పట్టించుకుంటూ ఉండండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు శివునికి అభిషేకం నిమిత్తం చందనపు పొడిని సమర్పించుకోండి.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

PISCES

'కాకి బావా! కాకి బావా! నీ రూపం ఎంత గొప్పది! రూపమే ఇంత బాగుంటే నువ్వు అరిస్తే ఆ కంఠస్వరం ఎంత బాగుంటుంది!' అని నక్క మాయోపాయంతో కాకిని పొగిడితే, కాకి దాన్ని నిజమనుకుని అరవగానే నోట్లో మాంసం ముక్క కాస్తా నేల పడింది. నక్క గుటుక్కుమనిపించి పారిపోయింది. ఈ కథని అమ్మ చెప్పింది కదూ! సరిగ్గా మీ పరిస్థితి ఇదే. మీ అభివృద్ధిని గమనించి మిమ్మల్ని తీవ్రంగా పొగిడి మచ్చిక చేసుకుని అవసర సహాయాల్లో ఆదుకున్నట్లుగా నటించి మిమ్మల్ని వంచనకి గురిచేసే ఉద్దేశంతో ఎవరో కొందరుండవచ్చు. గమనించుకుని మెలగండి. పొగుడుతున్నారని తెలియగానే, మరింత చనువుతో ప్రవర్తిస్తున్నారని అన్పించగానే దూరం జరిగిపోతూ ఉండడమే దీనికి సరైన ఔషధం.

మీరు తీర్చవలసిన రుణాలు గనుక ఉంటే, ఓ ప్రణాళికాబద్ధంగా వాటిని తీర్చివేస్తూ ఉండడమనేది, మీ వ్యాపారానికీ అభివృద్ధికీ చక్కని సోపానంగా పనిచేస్తుంది. ఒక్కసారైనా సరై మిమ్మల్ని వంచనకి గురి చేసినవాణ్ణి ఎంత ప్రాధేయపడ్డా దరిచేర్చుకోకండి. తేలుకొండిలో విషం మాత్రమే ఉంటుంది తప్ప అమృతం ఉండదు.

వాగ్దానాలూ హామీలూ చేసే సమయం కాదిది. కుటుంబ సభ్యుల్లో లేదా బాంధవ్యంలో తప్పని సరి పరిస్థితి కారణంగా హామీ లేదా వాగ్దానం చేయవలసిన పరిస్థితి రావచ్చు. పొరపాటున కూడా హామీ లేదా వాగ్దానం వద్దు. లౌక్యంగా ఆ సందర్భాన్ని పరిష్కరించుకోండి. నష్టం జరగదు.

ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వద్దు. సంతానం మిమ్మల్ని ఎదిరిస్తున్నారేమో పరిశీలించుకుంటూ ఉండండి. మొక్కదశలో వంచకపోతే మానుగా ఎదిగాక వంచ దలచడం అసాధ్యం, అనూహ్యం. సంతానమనేవాళ్లు పంటని అందించగల శక్తి ఉన్నా పొలంలోని సస్యం వంటివాళ్లు శ్రద్ధగా పెంచుకోండి. మంచీ చెడులను చెప్పండి.

లౌకిక పరిష్కారం: సంతానం చదువునీ, ఆరోగ్యాన్నీ తరచూ పరీక్షించుకుంటూ ఉండండి.

అలౌకిక పరిష్కారం: శివరాత్రినాడు హోమానిక్కావలసిన సమిధలని సమర్పించుకోండి.



● తమన్నా

పూలూ.. రాళ్లూ... రెండూ భరించాల్సిందే

.. **అం**టున్నారు తమన్నా. ఈ మధ్య హీరోయిన్స్ పబ్లిక్ అప్పియరెన్సెస్ ఇస్తే చాలు అనుకోని ఇబ్బందులకు గురవుతున్నారు. ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించటం లేదా కామెంట్స్ చేయటం జరుగుతోంది. కొంతమంది సంస్కారం మరచిపోయి పాదరక్షలు కూడా విసిరేస్తున్నారు. తమన్నాకు ఈ మధ్య అలాంటి అనుభవమే ఎదురైంది. ఓ షోరూమ్ ఓపెనింగ్‌కు వెళ్లిన తమన్నాపై ఓ ఆకతాయి చెప్పు విసిరిన విషయం తెలిసే ఉంటుంది. అది ఆమెకు కొంచెం దూరంలో పడింది. ఆ సందర్భంలో ఏమీ స్పందించకుండా వెళ్లిపోయారు తమన్నా. ఇప్పుడా సంఘటన గురించి స్పందించారామె ''అలా రియాక్ట్ అయినవాళ్లను ఏమీ చేయలేం. మేం యాక్టర్స్, మా మీద ప్రేమతో వేసే పువ్వులను, ద్వేషంతో విసిరే రాళ్లను ఒకేలా స్వీకరించాలి'' అని పేర్కొన్నారు తమన్నా. ''తమన్నా అంటే నాకు చాలా ఇష్టం. తను ఈ మధ్య సినిమాలు చేయటం తగ్గించేశారు. ఆవిడను కలుద్దాం అంటే బౌన్సర్స్ ఆమె దగ్గరకు వెళ్లనీకుండా చేశారు. ఆ కోపంతో ఆమె వైపు షూ విసిరేశాను'' అని పేర్కొన్నాడు ఆకతాయి.

వాయిస్ ఓవర్ ఇచ్చేటప్పుడు మహేశ్ ఇంప్రెస్ అయ్యాడు - మంజుల



● పి.కిరణ్, సాయిమాధవ్, సంజయ్, మంజుల, సందీప్ కిషన్, అమైరా దస్తూర్

''**నే**ను డైరెక్షన్ చేస్తున్నానంటే మహేశ్ నమ్మలేదు. టీజర్స్, సాంగ్స్ చూసి షాక్ అయ్యాడు. వాయిస్ ఓవర్ ఇచ్చేటప్పుడు ఈ సినిమా చూసి ఇంప్రెస్ అయ్యాడు'' అన్నారు మంజుల. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరో హీరోయిన్లుగా మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించిన సినిమా 'మనసుకు నచ్చింది'. పి.కిరణ్, సంజయ్ స్వరూప్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ–''ఏదో ఓ సినిమా డైరెక్ట్ చేయాలని ఈ సినిమా డైరెక్ట్ చేయలేదు. మంచి విషయం ఉండబట్టే చేశాను. బేసిక్‌గా నేను రొమాంటిక్ పర్సన్‌ను. అందుకే ఓ స్వీట్ లవ్‌స్టోరీ రాసుకున్నాను. ఈ సినిమా చూసి కెమెరామేన్ ఛోటాగారు బెస్ట్ లవ్ స్టోరీ అన్నారు. కథను ముందు కిరణ్‌గారికి చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. ఆ సాయంత్రమే సాయిమాధవ్ బుర్రాకి చెప్పాను. ఆయనకూ బాగా నచ్చింది. ఈ సినిమాలో మా ఆయన (సంజయ్) స్పెషల్ రోల్ చేశారు. ఆయన లక్కీ యాక్టర్. ఆయన చేసిన సినిమాలన్నీ హిట్టయ్యాయి. మా అమ్మాయి కూడా మంచి రోల్ ప్లే చేసింది. సందీప్, అమైరా బాగా చేశారు. నా దగ్గర పవన్ కల్యాణ్ కోసం మంచి కథ ఉంది. ఆయనకు పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుంది. ఆ ఒక్క సినిమా చేసి రాజకీయాల్లోకి వెళ్లొచ్చు'' అన్నారు.''ప్రతి ఒక్కరి లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తు చేసే అందమైన చిత్రం. ఇందులో ఎవ్వరూ ఎక్స్‌పెక్ట్ చేయని ఒక ఇంట్రస్టింగ్ మెసేజ్ ఉంటుంది. ఇది ఏ జానర్ సినిమా అని ఒక ఫ్రెండ్ అడిగాడు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. కానీ ఒక మంచి కాఫీలాంటి సినిమా అవుతుంది అనిపించింది. నా కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రం అవుతుంది'' అన్నారు సందీప్ కిషన్. ''మంజుల కథ చెప్పగానే నాకు బాగా నచ్చింది. బేసిక్‌గా నాకు లవ్‌స్టోరీస్ అంటే చాలా ఇష్టం. అందరికీ నచ్చుతుందని ఈ సినిమా తీశాం. ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నాం'' అన్నారు పి.కిరణ్. ''ప్రేక్షకులందరికీ నచ్చే కథ. అందరికీ నచ్చే డైలాగ్స్ రాశాను. మంజులగారు క్లారిటీతో, మనసుకు హత్తుకునేలా రాయించుకున్నారు'' అన్నారు బుర్రా సాయిమాధవ్. ''సినిమా చూశాం. చాలా హ్యాపీగా ఉన్నాం. అందరికీ నచ్చేలా ఓ మంచి సినిమా తీసిన మంజులకు నా కంగ్రాట్స్. కిరణ్‌గారు లేకపోతే ఈ సినిమా లేదు'' అన్నారు సంజయ్ స్వరూప్. ఈ సినిమాకు సంగీతం: రధన్, కెమెరా: రవి యాదవ్, మాటలు: సాయి మాధవ్ బుర్రా.

ఫాదర్ అండ్ సన్ లవ్‌స్టోరీ


'102 నాటౌట్'.. ప్రస్తుతం బాలీవుడ్‌లో మోస్ట్ అవెయిటెడ్ మూవీ. ఎందుకింత మోస్ట్ ఎగ్జైటెడ్ మూవీ అంటే ఆల్మోస్ట్ 27 ఏళ్ల తర్వాత అమితాబ్ బచ్చన్, రిషీ కపూర్ కలిసి నటిస్తుండటం



● అమితాబ్, రిషి


విశేషం. 'అమర్ అక్బర్ ఆంటోనీ, కూలీ, అజూబా' వంటి సూపర్ హిట్ సినిమాల్లో కనిపించారు అమితాబ్, రిషీ. 1977లో రిలీజ్ అయిన 'అమర్ అక్బర్ ఆంటోనీ'లో అన్నదమ్ములుగా కనిపించారు అమితాబ్ బచ్చన్, రిషీ కపూర్. 40 ఇయర్స్ తర్వాత, లేటెస్ట్ సినిమా '102 నాటౌట్'లో తండ్రీకొడుకులుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో 102 ఏళ్ల వృద్ధుడిగా కనిపించనున్నారు అమితాబ్. 'ఓ మై గాడ్' ఫేమ్ ఉమేశ్ శుక్లా ఈ సినిమాకు దర్శకుడు. ఇదో లవ్ స్టోరీ. ఫాదర్ అండ్ సన్ మధ్య లవ్‌స్టోరీ. చురుకైన వృద్ధుడిగా అమితాబ్, వయసైపోయిన కుమారుడిగా రిషీ కపూర్ కనిపించనున్నారు. తెల్లటి గడ్డంతో అమితాబ్ మరింత హుషారుగా కనిపిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ఇటీవల విడుదలైంది. ''ప్రపంచంలో కొడుకుని వృద్ధాశ్రమంలో చేర్చిన ఫస్ట్ తండ్రిని నేనే అవుతానేమో'' అని టీజర్‌లో ఉన్న డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమా మే 4న విడుదల కానుంది.

నలుగురిలో నవాబ్ ఎవరు?



● శింబు

నవాబ్.. అనుకున్నంత ఈజీ కాదు అవ్వడం. ఆరాటపడేవారు, పోరాడేవారు, లాక్కోవాలనుకునేవారు, కష్టపడి దక్కించుకునేవారు... అందరూ లిస్ట్‌లో ఉంటారు. ప్రస్తుతం ఆ లిస్ట్ డైరెక్టర్ మణిరత్నం దగ్గర ఉంది. సినిమాలో నవాబ్ ఎవరన్నది తెరపై చూడాల్సిందే అంటున్నారాయన. అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి, శింబు, అరుణ్ విజయ్, జ్యోతిక, అదితీరావ్ హైదరి, ఐశ్వర్య రాజేష్, ప్రకాశ్‌రాజ్ ముఖ్యతారలుగా మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ చేయనున్నారు. తమిళ్‌లో 'చెక్కవంద వానమ్' (ఎర్రని ఆకాశం తెలుగులో)అని, తెలుగులో



● అరుణ్ విజయ్



● అరవింద్



● విజయ్ సేతుపతి

'నవాబ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మరి.. ఎవరు నవాబ్? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఈ సినిమాలో ఓ ఇద్దరు హీరోలు అన్నదమ్ముల పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో న్యూ లుక్‌లో కనిపించడానికి హీరో శింబు ఆల్రెడీ వర్కౌట్స్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. మదరాస్ టాకీస్ పతాకం, లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

నో డూప్

'**పులి**' ఫేమ్ నికిషా పటేల్ గుర్తున్నారా? ఆ తర్వాత ఒకట్రెండు తెలుగు సినిమాలు చేసినా పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయారు. తమిళ చిత్రాలు చేయడం మొదలుపెట్టి, అక్కడ బిజీ అయ్యారు నికిషా. చాలా గ్యాప్ తర్వాత ఆమె తెలుగు తెరపై కనిపించనున్నారు. నికిషా టైటిల్ రోల్‌లో జానీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రౌడీ పోలీస్'. ఇందులో నికిషా పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తారు. రిస్కీ ఫైట్స్‌ని ధైర్యంగా చేశారట. దర్శక–నిర్మాతలు డూప్‌తో చేయిద్దామన్నా వినకుండా నికిషా చేయడం చిత్రబృందాన్ని ఆశ్చర్యపరిచింది. రోప్ యాక్షన్ సీన్స్‌ని సైతం నికిషా అద్భుతంగా చేశారట. ఇంతకీ ఈ బ్యూటీ అవలీలగా ఫైట్స్ చేయడానికి కారణం ఉంది. సినిమాల్లోకి రాక ముందు ఆమె మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. అది ఈ సినిమాకి ఉపయోగపడింది. ఆర్.ఎ ప్రొడక్షన్స్ పతాకంపై వేణు నిర్మిస్తున్న ఈ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ జరుపు కుంటోంది. ముకుల్‌దేవ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో భానుచందర్ ప్రధాన పాత్ర చేస్తున్నారు. అమిద్, 'గబ్బర్ సింగ్' విలన్ బ్యాచ్ నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: బాజీ, కెమెరా: ముజీర్.



● నికిషా పటేల్

మైండ్ గేమ్



● సోఫియా

'**శ్రీ**మన్నారాయణ, సామాన్యుడు, దగ్గరగా దూరంగా, విక్టరీ, ప్యార్ మే పడిపోయానే' వంటి చిత్రాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవికుమార్ చావలి. మైండ్ గేమ్ కాన్సెప్ట్‌తో తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'సూపర్ స్కెచ్'. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగీలతో పాటు విదేశీ నటులు సోఫియా, గ్యారీ టాన్ టోనీ (ఇంగ్లండ్) ప్రధాన పాత్రల్లో నటించారు. యారో సినిమాస్ సమర్పణలో యు అండ్ ఐ ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ సహకారంతో శ్రీ శుక్ర క్రియేషన్స్ ప్రొడక్షన్స్ పతాకంపై బలరామ్ మక్కల ఈ సినిమా నిర్మించారు. రవికుమార్ చావలి మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందిన చిత్రమిది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగు వాళ్లతో పాటు విదేశీ నటులు సోఫియా, గ్యారీ టాన్ టోని పాత్రలు కూడా మెప్పిస్తాయి. సురేందర్ రెడ్డి ఛాయాగ్రహణం కనువిందుగా ఉంటుంది. కార్తీక్ కొడకండ్ల సంగీతం అలరిస్తుంది. అందరికీ నచ్చే సినిమా అవుతుంది'' అన్నారు.

భయపెట్టనున్న అక్షయ్

... **మీ**రు చదివింది నిజమే.. బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ భయపెట్టనున్నారు. '2.0'లో క్రౌమ్యాన్ క్యారెక్టర్ గురించి చెప్పడంలేదు. ఇది వేరే సినిమా. అసలు విషయానికొస్తే.. నృత్య దర్శకునిగా, దర్శకునిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న లారెన్స్‌ని నటుడిగా ప్రేక్షకులందరికీ బాగా గుర్తుండిపోయేలా చేసిన చిత్రం 'కాంచన'. హారర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో తన నటనతో ప్రేక్షకులను భయపెట్టారు లారెన్స్. అటు తమిళంలో, ఇటు తెలుగులో 'కాంచన' ఎంత హిట్ అయిందో తెలిసిందే. 'కాంచన'కి సీక్వెల్‌గా 'కాంచన 2' వచ్చింది. ప్రస్తుతం లారెన్స్ 'కాంచన 3' షూటింగ్‌లో ఉన్నారు. అంతలా సౌత్ ప్రేక్షకులను భయపెట్టిన ఈ చిత్రం బాలీవుడ్‌లో రీమేక్ కానుంది. అక్షయ్ కుమార్ హీరోగా 'కాంచన 2' సినిమాని రీమేక్ చేయనున్నారు. లారెన్స్ పాత్రలో అక్షయ్ బాలీవుడ్ ప్రేక్షకులను భయపెట్టనున్నారు. ప్రేరణా అరోరా, అర్జున్ కపూర్ నిర్మించనున్న ఈ సినిమా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వెళుతుందని సమాచారం.



● అక్షయ్‌కుమార్

సిన్సియర్ ప్రేమ

''**శీ**నుగాడి ప్రేమ' సినిమా పాటలు, టీజర్ బాగున్నాయి. నటీనటులు కొత్తవారైనా అనుభవం ఉన్నవారిలా నటించారు. ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి'' అని తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. ఆర్.కేని దర్శకునిగా పరిచయం చేస్తూ శ్రీనివాసరావు హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'శీనుగాడి ప్రేమ'. 'సిన్సియర్ రా మామా' అన్నది ట్యాగ్ లైన్. ప్రణవి, కావేరి, చాందిని కథానాయికలు. రమణ సాకే స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''నాకు యాక్టింగ్ అంటే ఇష్టం. నేను డైలాగ్స్ చెప్పే విధానం చూసిన డైరెక్టర్ హీరోగా నటించమన్నారు. కథ కూడా బాగుండటంతో నటించి, నేనే నిర్మించాను'' అన్నారు. ''శీను పేరున్న వారికి కనెక్టయ్యే కథాంశంతో ఈ సినిమా చేశాం. లవ్, కామెడీ, ఎమోషన్.. ఇలా ఆడియన్స్‌కు కావాల్సిన అన్ని అంశాలుంటాయి'' అన్నారు ఆర్.కె.



● శ్రీనివాసరావు